ఈనాడు

కరీంనగర్ 2-1-2019 బుధవారం సిటీ సంపుటి 45 సంచిక 143

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఆఖరి వారం.. రూ. 600 కోట్లు



- సంవత్సరాంతాన మద్యం విక్రయాల జోరు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం

6 లో

ప్రజలు ఉన్నది మావైపే



- మా నిర్ణయాలన్నీ మధ్య తరగతికి మేలు చేసేవే
- కేసీఆర్ కూటమి గురించి నాకు తెలియదు
- 'ఏఎన్ఐ' వార్తాసంస్థ ముఖాముఖిలో ప్రధాని మోదీ

ఈనాడు, దిల్లీ: కేంద్ర సర్కారు పనితీరుపై విపక్షాలన్నీ ఎన్ని రకాలుగా ప్రచారం చేస్తున్నా ప్రజలు ఉన్నది మాత్రం తమవైపేనని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. తమ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన చర్యలన్నీ పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం కల్పించేవేనని ఆయన పేర్కొన్నారు. నల్లధనం వెనక్కి రప్పించడం, వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) అమలు వంటి విషయాల్లో తాము కచ్చితంగా విజయం సాధించామని, ఏ రకంగా చూసినా వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతు లభించేది తమకేనని ధీమా వ్యక్తం చేశారు. ఏఎన్ఐ వార్తాసంస్థకు మంగళవారం ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖిలో ప్రధాని మోదీ అనేక అంశాలకు సమాధానమిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, నెరవేర్చిన తీరు, నోట్ల రద్దు, నల్లధనం, రామాలయ నిర్మాణం, తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తున్న కూటమి... ఇలా అనేక అంశాలకు ఆయన సవివరంగా సమాధానమిచ్చారు.

...వివరాలు 11లో

తెలంగాణ సీఎం కేసీఆర్ ఒక కూటమిని ఏర్పాటు చేసినట్లు గానీ, చేస్తున్నట్లు గానీ నాకు తెలియదు. నేను అజ్ఞానినైతే అది తెలిసే అవకాశం లేదు.

ఆహార ప్రచారంలో అబద్ధాలొద్దు..



- వినియోగదారులకు సమాచారమంతా ఇవ్వాల్సిందే
- కేలరీలు, పోషకవిలువల వివరాలు ముద్రించాలి
- 'సహజ, తాజా, ఫైనెస్ట్, బెస్ట్, జెన్యూన్, ప్రీమియం..' పదాలు వాడాలంటే నిబంధనలు పాటించాలి
- వ్యాపార సంస్థలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాల నిర్దేశం

14 లో



తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్‌తో మంగళవారం ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ నరసింహన్. వేదికపై ముఖ్యమంత్రి కేసీఆర్

తెలంగాణ హైకోర్టు ఆవిర్భావం

- చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్ సహా 13 మంది న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం
- హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్, సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి

5 లో

పూర్తయిన ఉద్యోగుల విభజన

- తెలంగాణలోనే అత్యధికంగా ఐచ్ఛికాలు
- ఏపీకి ఐచ్ఛికాలు ఇచ్చినవారు అక్కడికే
- తెలంగాణలో ఖాళీల్లేక డిప్యుటేషన్‌పై ఏపీకి

కాళేశ్వరంతో ఖరీఫ్ పండాలి

- మార్చి నెలాఖరుకల్లా సివిల్ పనులు అయిపోవాలి
- సీఎం కేసీఆర్ ఆదేశాలు
- మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌ల పరిశీలన



కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద మోటార్ల పనితీరుపై ఆరా తీస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు, వరంగల్, హైదరాబాద్ - మహదేవ్‌పూర్, కాళేశ్వరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో మరింత వేగం పెంచాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ జూన్‌లోగా పూర్తి చేసి.. ఖరీఫ్ సీజన్‌కు పంటలకు నీరందేలా చూడాలన్నారు. మంగళవారం ఆయన కాళేశ్వరం ఎత్తిపోతల్లోని వివిధ పనులను పరిశీలించారు. మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి నేరుగా హెలిక్టాపర్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. రెండు గంటలపాటు పనులను పరిశీలించారు. నిర్మాణాల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ సివిల్ పనులు ఇప్పటి వరకు ఎంత మేర జరిగాయి, ఇంకా ఎంత మిగిలి ఉన్నాయి, ఎప్పటిలోగా పూర్తి చేసేదీ ఇంజినీర్లు, గుత్తేదారులు వివరించారు. అన్ని అంశాలను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి మార్చి ఆఖరుకల్లా కాంక్రీటు పనులతో సహా సివిల్ పనులన్నీ అయిపోవాలని, ఏప్రిల్ 15 కల్లా గేట్లు అమర్చడం పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు బిగించిన గేట్లు, తయారై సిద్ధంగా ఉన్న

(మిగతా 2లో)

వేగం.. సురక్షిత ప్రయాణం



- ప్రయాణికుల భద్రతకు తొలి ప్రాధాన్యం
- అంతర్జాతీయ ప్రమాణాలతో భారతీయ రైల్వే అభివృద్ధి
- 'ఈనాడు' ముఖాముఖిలో రైల్వే బోర్డు నూతన ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్

14 లో

పంచాయతీ నగారా

జనవరి 21, 25, 30 తేదీల్లో ఎన్నికలు




హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పంచాయతీ నోటిఫికేషన్ వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి

- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- పాలన గడువు తీరని 17 పంచాయతీలకు మినహాయింపు
- కోర్టు కేసుల వల్ల మరో రెండు చోట్ల నిలుపుదల
- ఓటర్లు 1.49 కోట్లు, బ్యాలెట్ పత్రాలు 3.36 కోట్లు
- అమలులోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తన నియమావళి
- ఎన్నికలు జరుగుతున్న పంచాయతీలు 12,732

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు విడతలుగా జనవరి 21, 25, 30 తేదీల్లో పోలింగ్‌ను నిర్వహించనున్నారు. ఈనెల 7, 11, 16 తేదీల్లో ఆయా ప్రాంతాల రిటర్నింగ్ అధికారులు ఇచ్చే నోటీసులతో నామినేషన్ల పర్వం ప్రారంభమవుతుంది. పోలింగ్ ముగిసిన రోజునే ఫలితాలను వెల్లడించి, చేతులెత్తే పద్ధతిలో ఉప సర్పంచి ఎన్నికలను సైతం పూర్తి చేస్తారు. ఎన్నికల ప్రక్రియను వివరిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) మంగళవారం

(మిగతా 2లో)



కొత్తగా ఇంజినీరింగ్ కళాశాలలు వద్దు



- బీటెక్‌లో నూతన కోర్సులు ప్రవేశపెట్టాలి
- ఏఐసీటీఈకి మోహన్‌రెడ్డి కమిటీ నివేదిక

6 లో

టెక్కు టమారాలు అరచేతిలో

కొత్త సంవత్సరం వచ్చేసింది. మరి మన చేతిలోని స్మార్ట్ ఫోన్‌లో కూడా మార్పులు చోటు చేసుకుంటాయా? టెక్నాలజీ అప్‌డేట్స్ ఏమిటి? చూడండి ఈనాడు లో

ఇదీ సంగతి!



ఇప్పటికిప్పుడే కాదు సార్, అవసరం వచ్చినప్పుడు రెడీగా ఉండటానికట...



స్త్రీ-పురుషుల మధ్య వ్యత్యాసం, మత హింసకు వ్యతిరేకంగా కేరళ రాష్ట్రం కొచ్చిలో మానవహారం నిర్వహించి ప్రతిన చేస్తున్న మహిళలు, బాలికలు

16 లో

చలితో జరభద్రం

- గుండెపోటు తీవ్రత అధికం
- రక్తంలోనూ చక్కెర స్థాయిల్లో హెచ్చుతగ్గులు
- చర్మం పొడిబారడంతో ఇన్‌ఫెక్షన్లు
- పిల్లలు, వృద్ధులకు మరీ ప్రమాదం
- అప్రమత్తత అవసరమంటున్న నిపుణులు

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో చలి పులి పంజా విసురుతోంది. కొద్ది రోజులుగా పగలు, రాత్రిపూట ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పడిపోతున్నాయి. రాష్ట్రంలోని ఆదిలాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు కనీసం రెండంకెలు కూడా చేరడం లేదు. ఉదయం పది దాటి తేగాని ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేక పోతున్నారు. రాత్రి కాకముందే ఇళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తేమ ఎక్కువగా

(మిగతా 2లో)



నేడూరేపూ చలి తీవ్రం

ఆదిలాబాద్‌లో 5, మెదక్‌లో 6 డిగ్రీలు నమోదు

ఈనాడు, హైదరాబాద్: ఉత్తర భారతం నుంచి వస్తున్న శీతల గాలుల ఉద్ధృతితో తెలంగాణలో చలి తీవ్రత తగ్గడం లేదు. బుధ, గురువారాల్లో వీటి ప్రభావం మరింత తీవ్రంగా

(మిగతా 2లో)

TG

చలితో జరభద్రం

(మొదటి పేజీ తరువాయి)

ఉండే వాతావరణంలో బ్యాక్టీరియా, వైరస్‌లు స్వైర విహారం చేస్తున్నాయి. చలి తీవ్రత పెరగడంతో ఫ్లూ జ్వరాలతో ఆసుపత్రులకెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. మున్ముందు చలి తీవ్రత మరింతగా పెరిగే అవకాశాలుండడంతో.. పొంచి ఉన్న చలి ముప్పును తప్పించుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ఎవరిలో ఎక్కువ ప్రమాదం?

- ఐదేళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు
- అవయవ మార్పిడి శస్త్రచికిత్స పొందినవారు
- మధుమేహులు
- క్యాన్సర్, గుండెజబ్బు, ఆస్థమా, సీఓపీడీ వంటి సమస్యలతో బాధపడుతున్నవారు

ముందస్తు జాగ్రత్తలు

- చలి తీవ్రంగా ఉన్న సమయంలో నడక మంచిది కాదు. తగ్గాక అయినా వ్యాయామం చేస్తేనే మంచిది.
- చలి సమయంలో బయటకు వెళ్తే.. శరీరమంతటినీ కప్పి ఉంచేలా దళసరి వస్త్రాలు ధరించాలి.
- చర్మం పొడిబారకుండా తేమను పెంచే లేపనాలు, కొబ్బరినూనె, ఆలీవ్ నూనె వంటి వాటిని చర్మానికి పట్టించాలి.
- చలి తీవ్రంగా ఉన్నప్పుడు చేతులు పట్టుతప్పుతాయి. అందువల్ల రాత్రిళ్లు వాహనాలు నడపకపోవడమే మంచిది.
- చలిగా ఉందనే కారణంతో తాగునీటిని తగ్గిస్తుంటారు. ఇది సరికాదు. నీటిని తగు మోతాదులో తీసుకోవాల్సిందే.

మధుమేహులు అప్రమత్తంగా ఉండాలి

–డాక్టర్ పీవీ రావు, ప్రముఖ మధుమేహ నిపుణులు



చలి తీవ్రతకు మధుమేహుల్లో వైరల్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి. ముఖ్యంగా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు విజృంభిస్తాయి. మహిళల్లో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు వేధిస్తుంటాయి. చలి ఎక్కువగా ఉంటే మన శరీరంలో ఉష్ణోగ్రతను సమస్థితిలో ఉంచడానికి జీవక్రియలో మార్పులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఆకలి ఎక్కువవుతుంది. ఒకవైపు చలి కారణంగా వ్యాయామాన్ని తగ్గించడం మరోవైపు ఎక్కువగా తినడం వల్ల బరువూ పెరుగుతారు. ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకునేవారిలో రక్తంలో చక్కెర స్థాయుల్లో తరచూ హెచ్చుతగ్గులుంటాయి. ఈ విషయాన్ని గుర్తించి నియంత్రణలో ఉంచుకోవాలి.

గుండెకు ముప్పు

–డాక్టర్ రమేశ్ గూడపాటి, గుండె వ్యాధినిపుణులు



చలి తీవ్రతకు గుండెలోని రక్తనాళాలు కుచించుకుపోతాయి. గుండెకు రక్తం సరఫరా సరిగా జరగదు. రక్తంలో 'కెటాకెలోమిన్స్' హార్మోన్ స్థాయి పెరుగుతుంది. దీంతో గుండె రక్తనాళాల్లో అప్పటికే పూడికలుంటే.. ఆ పూడికలపై రక్తం గడ్డకట్టి గుండెపోటుకు దారితీసే ప్రమాదముంది. చలిని తట్టుకునేందుకు కొందరు ధూమపానం, మద్యపానం మోతాదుకు మించి తీసుకుంటుంటారు. దీనివల్ల గుండె స్పందనల్లో లయ తప్పుతుంది. అత్యంత వేగంగా కొట్టుకుంటుంది. దీన్ని 'అరిథ్‌మియా' అంటారు. ఈ పరిస్థితుల్లో చాలామంది తెలియకుండానే నిద్రలోనే చనిపోతుంటారు. చలికాలంలో కొలెస్ట్రాల్ స్థాయి కూడా పెరుగుతుంది. అందుకే ధూమపానం ఆపేయాలి. మద్యపానాన్ని మోతాదుకు మించి తీసుకోవద్దు.

చర్మ సమస్యలు

–డాక్టర్ పార్థసారథి, చర్మవ్యాధి నిపుణులు



ఈ కాలంలో వాతావరణంలో తేమ తగ్గిపోతుంది. ఫలితంగా శరీరం నుంచి నీరు ఆవిరవుతుంది. ఒంట్లో నీటి శాతం తగ్గడంతో చర్మం పూర్తిగా పొడిబారిపోతుంది. కాళ్లలో పగుళ్లు వచ్చి దురదలొస్తాయి. నొప్పులుంటాయి. ఇన్‌ఫెక్షన్లకు దారితీస్తుంది. మధుమేహుల్లో ఇది ప్రమాదకరంగా మారుతుంది. దీన్ని నివారించడానికి చర్మంపై తేమను పెంచే లేపనాలు ఉపయోగించాలి. కొబ్బరినూనె, ఆలీవ్ నూనె వంటి వాటిని చర్మానికి పట్టించాలి. ఈ కాలంలో చుండ్రు కూడా వేధిస్తుంది. చుండ్రును తగ్గించే ఔషధ షాంపులను వైద్యుల సలహాతో వాడాలి.

నేడూ రేపూ చలి తీవ్రం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున ఆదిలాబాద్‌లో 5, మెదక్‌లో 6, రామగుండం, హన్మకొండ, హైదరాబాద్‌లలో 9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రిపూట సాధారణం కన్నా 8 డిగ్రీల వరకు తక్కువగా ఉంటుండటంతో ప్రజలు చలితో గజగజలాడుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటున్నా రాత్రి సమయంలో మంచుతో వాతావరణం బాగా చల్లబడుతోంది. పగలు పొడివాతావరణం వల్ల గాలిలో తేమ తగ్గుతోంది.

చలి తీవ్రతకు ఇద్దరు మృతి

జైనథ్, న్యూస్‌టుడే: చలి తీవ్రత తట్టుకోలేక మంగళవారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గూడ గ్రామంలో ఇద్దరు వృద్ధులు మృతిచెందారు. సోమవారం జైనథ్ మండలంలో 4.11 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. చలిగాలులకు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడడంతో సదల లస్మన్న(80), జక్కుల గంగమ్మ(72) మృతిచెందారు.

ఏపీని వణికిస్తున్న చలిగాలులు

ఈనాడు, విశాఖపట్నం: ఉత్తరకోస్తాను తీవ్రంగా వణికించిన చలిగాలులు సోమవారం రాత్రి, మంగళవారం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలపైనా ప్రభావం చూపించాయి. సోమవారం రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. కోస్తా జిల్లాల్లో సాధారణంకన్నా 3 నుంచి 6 డిగ్రీలు, రాయలసీమలో 3 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యాయి. చింతపల్లిలో మంగళవారం 2.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తాలో అత్యల్పంగా జంగమహేశ్వరపురంలో 10.2 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోయింది. గత పదేళ్లలో ఇంత తక్కువగా నమోదు కాలేదు. రాయలసీమలో అత్యల్పంగా ఆరోగ్యవరంలో 12 డిగ్రీలు నమోదైంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తీవ్రంగానూ... దక్షిణకోస్తా, రాయలసీమలో ఓ మోస్తరుగానూ చలిగాలుల ప్రభావం కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.



మేడిగడ్డ బ్యారేజీ పనుల గురించి వివరాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్



★ కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పరిశీలనలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దకు వెళ్తున్న సీఎం

కాళేశ్వరంతో ఖరీఫ్ పండాలి

(మొదటి పేజీ తరువాయి)

వాటిని కూడా పరిశీలించారు. సాయంత్రం కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దకు వెళ్లారు. గంటకుపైగా అప్రోచ్ కెనాల్, పంపుహౌస్ పనులను ప్రత్యక్షంగా చూశారు. రెండు చోట్ల పనులు కొంత నెమ్మదించడంపై ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. నీటి ప్రవాహం ఉన్నందున కొన్ని బ్లాక్‌ల పనులు చేయడంలో ఇబ్బందులు ఉన్నట్లు వారు వివరించారు. మార్చి ఆఖరుకల్లా పంపుహౌస్ పనులు పూర్తి కావాలని, మోటార్లు, పంపులు త్వరగా తెప్పించుకోవాలని సీఎం సూచించారు. ఇందులో ఏమన్నా సమస్యలుంటే చెప్పండని అడిగారు. కన్నెపల్లి వద్ద అవసరమైతే కాఫర్ డ్యామ్ నిర్మించి జూన్‌లోపు మూడు పంపులు కచ్చితంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోటి ఎకరాల మాగాణి కోసం భారీగా వ్యయం చేస్తున్నామని.. గడువులోగా నిర్మాణాలు పూర్తి చేసి సాగు, తాగు నీరు అందించాలన్నారు.

రెండు రాష్ట్రాల్లో సమాంతరంగా పని జరగాలి

తెలంగాణ-మహారాష్ట్రలోని పోచంపల్లి ప్రాంతాలను సమన్వయం చేస్తూ జరుగుతున్న బ్యారేజీ పనులు ఇరువైపులా సమాంతరంగా జరగాలని కేసీఆర్ ఆదేశించారు. బ్లాక్-4లోని సంక్లిష్ట పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి ప్రవాహం మళ్లించి చేపడుతున్న నిర్మాణాలను వీక్షించారు. సీసీ బ్లాక్‌లలో సాంకేతికంగా ఆలోచించి ముందుకు సాగాలన్నారు. బ్యారేజీకి కుడి, ఎడమ వైపున కరకట్టల పనులను వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. బ్యారేజీ నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి మూడు నెలల వ్యవధిలో ఏ విధంగా పనులు జరిగాయో మ్యాపులు, చిత్రాల ద్వారా ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. కేసీఆర్ వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్, సీఎంవో ఓఎస్డీ దేశ్‌పాండే, ఎల్‌అండ్‌టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుభాష్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు. కేసీఆర్‌కు మంథని, భూపాలపల్లి ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ వివేక్ తదితరులు స్వాగతం పలికారు.

శ్రీధర్‌బాబు–పోలీసుల మధ్య వాగ్వాదం

బ్యారేజీ వ్యూ పాయింట్ వద్ద మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధురాలు సీఎం పనులను వీక్షించే పాయింట్ వద్దకి రాగా. . పోలీసులు అభ్యంతరం చెప్పారు. స్థానిక నేతలను ఉండనివ్వరా అంటూ శ్రీధర్‌బాబు పోలీసులతో అనడంతో వాగ్వాదం జరిగింది.

నేడు మరోమారు రాక

కన్నెపల్లి పంపుహౌస్ వద్ద గ్రావిటీ కాలువను కూడా మంగళవారమే సీఎం పరిశీలించాల్సి ఉన్నా అక్కడికి వెళ్లలేదు. ఆరంభంలో ఉన్న గ్రావిటీ కాలువ పని కీలకం కావడంతో దాన్ని బుధవారం క్షుణ్నంగా పరిశీలించాలని నిర్ణయించారు. కన్నెపల్లి నుంచి నేరుగా కరీంనగర్ జిల్లా తీగలగుట్టకు వెళ్లారు. రాత్రి అక్కడ బస చేసి బుధవారం ఉదయం 9.30 గంటలకు పంపుహౌస్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి అన్నారం వరకు 13.2 కిలోమీటర్ల పొడవున వాహనంలో వెళ్తూ పనులను చూస్తారు. తర్వాత బ్యారేజీ వద్ద నిర్మాణాలను పరిశీలిస్తారు.

మమతే ప్రధాని అభ్యర్థి.. టీఎంసీ ఎంపీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఆవిర్భవించి 21వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భాన్ని ముఖ్యమంత్రి మమతా బెనర్జీని భావి ప్రధాని అభ్యర్థిగా చూపేందుకు పార్టీ ఉపయోగించుకుంది. ఏ మహాకూటమికైనా సరే ఆమే ప్రధాని అభ్యర్థి అని పార్టీ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఓ సమావేశంలో నొక్కి చెప్పారు.

నెరవేరిన సుదూర స్వప్నం

- సౌర కుటుంబ అంచుల్లోని శిలకు దగ్గరగా వెళ్లిన 'న్యూ హొరైజన్స్'
- గ్రహాల పుట్టుకపై కొత్త వివరాలు వెలుగులోకి?

వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా)కు చెందిన 'న్యూ హొరైజన్స్' వ్యోమనౌక కొత్త సంవత్సరంలో కొత్త చరిత్ర సృష్టించింది. సౌర కుటుంబంలోని అత్యంత సుదూర, పురాతన ఖగోళ వస్తువు అయిన 'అల్టిమా తూలీ'కి చేరువగా వచ్చి వెళ్లింది. హిమమయంగా ఉండే ఈ శిలను తన కెమెరా కళ్లతో క్లిక్‌మనిపించింది. మన సౌర కుటుంబానికి సంబంధించిన పురాతన రహస్యాలు ఇందులో నిక్షిప్తమై ఉన్నాయని భావిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం న్యూ హొరైజన్స్ ఫ్లైబై (చేరువగా వచ్చి వెళ్లడం)మంగళవారం ఉదయం 11 గంటలకు పూర్తయింది. ఈ వ్యోమనౌకను 2006లో ప్రయోగించారు. 2015లో ఇది ప్లూటోకు, దాని రెండు చందమామలకు దగ్గరగా వచ్చి వెళ్లింది. ప్లూటో సందర్శన తర్వాత ఈ వ్యోమనౌకను ఎక్కడికి పంపాలన్నదానిపై శాస్త్రవేత్తలు 2014లో హబుల్ టెలిస్కోపు సాయంతో గాలింపు చేపట్టారు. సౌర కుటుంబ చివరి భాగంలో అనేక గ్రహశకలాలతో కూడిన 'కైపర్ వలయం'లోని సుదూర శిలను ఎంపిక చేశారు. దానికి '2014 ఎంయూ69' అని పేరు పెట్టారు. ప్రజల ఓటింగ్ ఆధారంగా 'అల్టిమా తూలీ' (లాటిన్ భాషలో 'మనకు తెలిసిన ప్రపంచానికి వెలుపల' అని అర్థం) పేరును ఖరారు చేశారు.

చాలా విలువైంది

అల్టిమా తూలీ సూర్యుడికి దాదాపు 650 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉంది. తాజాగా 'న్యూ హొరైజన్స్' ఈ ఖగోళ శిలకు 3500 కిలోమీటర్ల దూరంలో వచ్చి వెళ్లింది. సూర్యుడికి ఇంత దూరంలోని ఖగోళవస్తువుకు ఇంత చేరువగా వచ్చి వెళ్లడం ఇదే మొదటిసారి. శాస్త్రీయ కోణంలో ఈ శిల చాలా విలువైంది. సూర్యుడికి చాలా దూరంలో ఉండటం, దాదాపు మైనస్ 270 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను కలిగి ఉండటం వంటి కారణాల వల్ల సౌర కుటుంబం పుట్టుకకు సంబంధించిన అనేక అంశాలు అందులో పదిలంగా ఉండొచ్చని భావిస్తున్నారు. తాజాగా న్యూ హొరైజన్స్ దీని ప్రాథమిక వివరాలను వెలుగులోకి తెస్తుంది.

అల్టిమా తూలీ వివరాలివీ

వెడల్పు: 30 కిలోమీటర్లు

సూర్యుడి నుంచి దూరం: 650 కోట్ల కిలోమీటర్లు.

భూమితో పోలిస్తే అందుకునే సూర్య కాంతి: 0.05 శాతం

పుట్టుక: 450 నుంచి 460 కోట్ల సంవత్సరాలు

పంచాయతీ నగారా

(మొదటి పేజీ తరువాయి)

నోటిఫికేషన్‌ను వెలువరించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. రాష్ట్రంలో మొత్తం 12,751 పంచాయతీలు ఉండగా వాటిలో ఇప్పుడు 12,732 పంచాయతీల్లో ఎన్నికలను చేపట్టనున్నారు. ఇంకా గడువు ముగియక పోవడం వల్ల 17 పంచాయతీల్లోను, కోర్టు కేసుల కారణంగా మరో రెండుచోట్ల ఎన్నికలను నిర్వహించడంలేదు. మొత్తం 1,13,170 వార్డుల్లో ఎన్నికలను చేపడతారు. ఎన్నికల షెడ్యూల్‌తో కూడిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వెలువరించారు. 2018, మే నాటికి గ్రామీణ ఓటర్లు 1.37 కోట్లు ఉండగా.. ఆ తర్వాత చేరికలతో వారి సంఖ్య 1.49 కోట్లకు చేరిందని చెప్పారు. సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసే అభ్యర్థులకు ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉండటంతో పాటు ఓటరు గుర్తింపు కార్డు లేదా ఎస్ఈసీ నిర్దేశించిన 18 రకాల కార్డుల్లో ఏదో ఒకటి కలిగి ఉండాలన్నారు. తాము నిర్దేశించిన మొత్తాలకు మించి ఖర్చు పెట్టిన వారు పదవులను కోల్పోయే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే 3.36 కోట్ల బ్యాలెట్ పత్రాలను ముద్రించామని, పోలింగ్‌కు 92,223 బ్యాలెట్ పెట్టెలను ఉపయోగిస్తున్నామని చెప్పారు. ఆయా రోజుల్లో పోలింగ్ ఉదయం 7 గంటలకు మొదలై మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినట్లు కమిషనర్ వెల్లడించారు.

నియమావళి అమలులోకి

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. మూడు విడతల్లో ఎన్నికలు పూర్తయ్యే వరకూ రాష్ట్రప్రభుత్వం కొత్త పథకాలు ప్రకటించకూడదు. ఇప్పుడు నిర్వహించే అన్ని సమావేశాలు ఎన్నికల సమావేశాలుగానే లెక్కలోకి వస్తాయి. అందువల్ల వాటికి ప్రభుత్వ సొమ్మును వినియోగించరాదు. శాంతిభద్రతల పర్యవేక్షకులు లేదా భద్రత విధులను నిర్వహించేవారు తప్ప.. ఇతర ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ ఇలాంటి సమావేశాలకు హాజరు కాకూడదు. రాష్ట్ర ఎన్నికల సంఘం వెలువరించిన ప్రవర్తన నియమావళి ప్రకారం...

- ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార సంస్థలు, ప్రభుత్వ గ్రాంట్లను పొందుతున్న ఏదైనా ఇతర సంస్థలకు చెందిన వాహనాలను.. ఎన్నికల ప్రచారం కోసం మంత్రికి, ఎంపీలకు, ఎమ్మెల్యేలకు సమకూర్చకూడదు.
- మంత్రులు ఎన్నికల ప్రచారంతో పాటు అధికారిక పనులను జత చేసి పర్యటించకూడదు. ప్రభుత్వ వాహనాలతో పాటు అధికారిక యంత్రాంగాన్ని, వ్యక్తిగత లేదా ఇతర ప్రభుత్వ వనరులను మంత్రులు తమ పర్యటనల్లో ఉపయోగించకూడదు.
- రాష్ట్ర నిధుల నుంచి లేదా విచక్షణ పూర్వకమైన నిధుల నుంచి గ్రాంట్లు, చెల్లింపులను చేపట్టకూడదు. ఏ విధమైన ఆర్థిక గ్రాంట్లు లేదా కొత్త పథకాలు లేదా ప్రాజెక్టులను లేదా అందుకు సంబంధించిన హామీలను ప్రకటించకూడదు.
- కొత్త పథకాలను లేదా ప్రాజెక్టులను లేదా పనులను మంజూరు చేయకూడదు. ఎలాంటి శంకుస్థాపనలు, ఇతర కార్యక్రమాలను నిర్వహించరాదు.
- అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలు తదితరాల్లో తాత్కాలిక నియామకాలను చేపట్టకూడదు. రోడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పన వంటి హామీలనూ ఇవ్వరాదు.
- ఎన్నికల సమావేశాల కోసం.. హెలిప్యాడ్ల వినియోగానికి మైదానాలు తదితర బహిరంగ ప్రదేశాల్లో అధికారంలో ఉన్న పార్టీ గుత్తాధిపత్యాన్ని చూపకూడదు. అధికారంలో ఉన్న పార్టీ అలాంటి ప్రదేశాలు, సౌకర్యాలను ఉపయోగిస్తున్నట్లైతే.. అవే నియమ నిబంధనలపై ఆ ప్రదేశాలు, సౌకర్యాలను ఉపయోగించుకొనేందుకు ఇతర పార్టీలకు, అభ్యర్థులకూ అనుమతించాలి.

ఎన్నికల వ్యయ పరిమితి (రూ. లక్షల్లో)

సర్పంచి అభ్యర్థికి

జనాభా 5వేలు దాటిన చోట:	2.50
జనాభా 5వేలలోపు ఉన్నచోట:	1.50

వార్డు అభ్యర్థికి

జనాభా 5వేలు దాటిన చోట:	50,000
జనాభా 5వేలు లోపు ఉన్నచోట:	30,000

ధరావతు మొత్తాలు (రూ.ల్లో)

సర్పంచి అభ్యర్థి

జనరల్:	2000
ఎస్టీ,ఎస్సీ,బీసీ:	1,000

వార్డు సభ్యులకు

జనరల్:	500
ఎస్సీ,ఎస్టీ,బీసీలకు:	250

(ఎస్సీ,ఎస్టీ,బీసీలు జనరల్ స్థానాల్లో పోటీ చేసినప్పుడు సగం మొత్తాలనే చెల్లించాలి.)

ఎన్నికలు జరగని పంచాయతీలివే

రంగారెడ్డి జిల్లా: కొత్తూరు, తిమ్మాపూర్

ఆదిలాబాద్: కోభాయ్, మంగ్‌రూర్ (ఎన్‌సీ)

మహబూబ్‌నగర్ జిల్లా: శంకరయ్యపల్లి తండా, మండమేడిపల్లి

నల్గొండ: చందంపల్లి, చందుపట్ల, కడపర్తి, నెల్లిబండ, నోముల, తాటికల్, గొల్లగూడెం

మంచిర్యాల: లక్ష్మీపూర్, పెద్దపేట, చమనపల్లి

వరంగల్ అర్బన్ జిల్లా: ఒంటిమామిడిపల్లి

హైకోర్టు స్టే కారణంగా ఎన్నికలు ఆగినవి: 2

1) రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బద్దెనపల్లి
2) మహబూబాబాద్ జిల్లాలోని నాయినాల

ఇదీ షెడ్యూలు

కార్యక్రమం	మొదటి విడత	రెండో విడత	మూడో విడత
ఆర్వోచే ఎన్నికల నోటీసు జారీ నామినేషన్ల స్వీకరణ:	7.1.2019	11.1.2019	16.1.2019
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ:	9.1.2019	13.1.2019	18.1.2019
నామినేషన్ల పరిశీలన, అర్హుల జాబితాల తయారీ:	10.1.2019	14.1.2019	19.1.2019
అప్పీలుకు చివరి తేదీ:	11.1.2019	15.1.2019	20.1.2019
అప్పీలు పరిష్కారం:	12.1.2019	16.1.2019	21.01.2019
నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు, పోటీలో ఉన్నవారి జాబితాల ప్రచురణ:	13.1.2019	17.1.2019	22.1.2019
పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి, ఉపసర్పంచి ఎన్నిక	21.1.2019	25.1.2019	30.1.2019

ఏ విడతలో ఎన్ని స్థానాలకు

వర్గీకరణ	మొదటి విడత	రెండో విడత	మూడో విడత
గ్రామ పంచాయతీలు	4,480	4,137	4,115
వార్డులు	39,832	36,620	36,718
మండలాలు	197	172	166
పోలింగ్ కేంద్రాల సంఖ్య:	1,13,190		
పోలింగ్ సిబ్బంది:	1,48,033		
బందోబస్తు సిబ్బంది:	26,340		
రిటర్నింగ్ అధికారులు: స్టేజ్ వన్:	5,097, స్టేజ్ టు: 13,965		
సిద్ధమైన బ్యాలెట్ పత్రాలు:	3,36,34,279		
2013 ఎన్నికల్లో వ్యయ వివరాలు ఇవ్వనందున ప్రస్తుత ఎన్నికలకు అనర్హులు:	12,745		

ప్రధాని ముఖాముఖి మాటల గారడే: కాంగ్రెస్

దిల్లీ: ప్రధాని మోదీ మంగళవారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ముఖాముఖిలో చెప్పిన విషయాలు వాస్తవ దూరమని, మాటల గారడి అని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అసత్య ప్రచారం చేస్తున్నారని, కుర్చీ నుంచి దిగిపోయేందుకు కౌంట్‌డౌన్ మొదలైందని పేర్కొంది. ఇది ముందస్తుగా రూపొందించుకున్న ముఖాముఖి అని వ్యాఖ్యానించింది. అందులో క్షేత్రస్థాయి వాస్తవాలు లేవన్నారు.

పంచాయతీ రిజర్వేషన్‌ల సవరణను రద్దు చేయండి

- హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య పిటిషన్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టంలో కొత్త చాప్టర్‌ను చేర్చుతూ గతేడాది డిసెంబరు 15న తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను సవాలు చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, మరొకరు హైకోర్టులో మంగళవారం అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. మంత్రివర్గం సిఫారసు లేకుండానే ఆర్డినెన్స్ జారీ అయిందన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రి సిఫారసులకు అనుగుణంగా ఆర్డినెన్స్ జారీ అయిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్‌లు 50 శాతం మించకుండా ఉండేలా ఈ సవరణను తీసుకురావడం చట్టవిరుద్ధమన్నారు. ఈ సవరణ వల్ల బీసీల కోటా తగ్గిపోతోందన్నారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఆసరాగా తీసుకుని ఈ ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. బీసీల రిజర్వేషన్‌లను 34 నుంచి 22 శాతానికి కుదించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. బీసీల కంటే తక్కువ జనాభా ఉన్నవారికి రిజర్వేషన్‌లు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టే అవకాశాలున్నాయి.

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ మార్చాలి

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ రెండో విడత పోలింగ్ ఈనెల 25న జరుపుతామని సీఈసీ ప్రకటించిందని, దానివల్ల విద్యాసంస్థల్లో జనవరి 26న గణతంత్ర దినోత్సవం జరుపుకోవడానికి ఇబ్బందవుతుందని టీటీఎఫ్ (తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్) తెలిపింది. అందువల్ల పోలింగ్‌ను ఈనెల 28 లేదా 29న నిర్వహించేలా ఎన్నికల తేదీలను సవరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇ.రఘునందన్, ప్రధాన కార్యదర్శి కె.రమణలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అఫ్గానిస్థాన్‌లో 27 మంది ఉగ్రవాదుల హతం

- ముష్కరుల దాడిలో 15 మంది పోలీసుల మృతి

కాబుల్: అఫ్గానిస్థాన్‌లోని తూర్పు నాన్‌గర్హర్ ప్రావిన్స్ అచిన్ జిల్లాలో గల ఐసిస్ స్థావరంపై భద్రతాదళాలు మంగళవారం మెరుపుదాడి చేశాయి. అమెరికా సైనిక హెలికాప్టర్లతో అఫ్గాన్ దళాలు జరిపిన ఈ సంయుక్త దాడిలో 27మంది ఉగ్రవాదులు హతమయ్యారు. మరోవైపు ఉత్తర అఫ్గానిస్థాన్‌లోని సారేపుల్ ప్రావిన్స్‌లో గల రెండు పోలీసుల శిబిరాలపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 15మంది పోలీసులు దుర్మరణం పాలయ్యారు. మరో 21మంది గాయపడ్డారు.

ప్రశాంతంగా 'కొరెగావ్ భీమా' వార్షికోత్సవం

పుణె: దళితుల ఆత్మాభిమానానికి ప్రతీకగా భావించే పెర్నె గ్రామంలోని 'జై స్తంభం' వద్ద మంగళవారం సుమారు ఐదు లక్షలమంది ఘన నివాళులర్పించారు. వధు బుద్రుక్‌గ్రామంలో 17వ శతాబ్దంలో తనువు చాలించిన గోవింద్ మహర్ సమాధిని 40వేల మందికిపైగా సందర్శించారు. కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే, మహారాష్ట్ర హోంమంత్రి దీపక్ కేసర్కార్ తదితరులు వీరిలో ఉన్నారు. జనవరి 1, 1818న కొరెగావ్ భీమా యుద్ధంలో చనిపోయిన దళితుల స్మృత్యర్థం బ్రిటీషువారు పెర్నె గ్రామంలో జైస్తంభాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా జనవరి 1న ఈ గ్రామంలో వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు.



ఆదర్శానికి అర్హత

మనకొక ఉన్నతమైన ఆదర్శం ఉండటం వేరు, దానికి తగినట్లుగా జీవించటం వేరు. మనకు ఆదర్శం ఉందని చెప్పే అర్హత.. దాన్ని ఆచరణలోకి తేవటానికి మనస్ఫూర్తిగా ప్రయత్నం చేస్తున్నప్పుడే వస్తుంది!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

2–1–2019 బుధవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; మార్గశిర మాసం; బహుళ పక్షం
ద్వాదశి: రా. 3.38 తదుపరి త్రయోదశి
విశాఖ నక్షత్రం: మ. 12.00 తదుపరి అనూరాధ
అమృత ఘడియలు: రా.1.54 నుంచి 3.33 వరకు
వర్జ్యం: సా.4.05 నుంచి 5.43 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11.42 నుంచి 12.26 వరకు
రాహుకాలం: మ. 12.00 నుంచి 1.30 వరకు
సూర్యోదయం: ఉ.6-35; సూర్యాస్తమయం: సా.5-33



నూతన సంవత్సరం పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్, ఆయన కుటుంబసభ్యులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న తితిదే, యాదాద్రి ఆలయాల వేద పండితులు

తెలుగు రాష్ట్రాలు ప్రగతి పథంలో సాగాలి

- ఇందులో ప్రజలంతా భాగస్వాములే
- నూతన సంవత్సర ముఖాముఖిలో గవర్నర్ నరసింహన్

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ప్రగతి పథంలో మరింత ముందుకు సాగాలని.. ప్రజలంతా ఇందులో భాగస్వాములు కావాలని గవర్నర్ నరసింహన్ పిలుపు నిచ్చారు. ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని మంగళవారం రాజ్‌భవన్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. గవర్నర్ నరసింహన్ దంపతులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలూ కొత్త సంవత్సరంలో సుఖశాంతులతో జీవించాలన్నారు. మంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్, ఇతర ప్రముఖులతోపాటు పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. గవర్నర్ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ హరితమాల పేరిట 'హరితహారం'పై రాసిన పుస్తకాన్ని ఈ సందర్భంగా గవర్నర్ ఆవిష్కరించారు.

'ఉపాధ్యాయులు మరింత శ్రమిస్తే మేలు'

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు మరింత శ్రమించాలని గవర్నర్ నరసింహన్ సూచించారు. మంగళవారం ఆయన తన సతీమణి విమలతో కలిసి స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, నాణ్యమైన విద్యను అందించేందుకు సర్కారు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు, ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్‌లు మాట్లాడుతూ..బడుల్లో వసతులు పెంచాలని, ఏకీకృత సర్వీసు సమస్యను పరిష్కరించి అర్హతగల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సుధాకర్, ప్రభాకర్‌రావు, బ్రహ్మచారి, కరుణాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలోనూ చరిత్ర సృష్టించాలి

- పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు
- తెలంగాణ భవన్‌కు వెల్లువెత్తిన నేతలు, కార్యకర్తలు



తెలంగాణ భవన్‌లో మంగళవారం తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థినులు

ఈనాడు, హైదరాబాద్: కొత్త సంవత్సరం 2019లోనూ తెలంగాణలో చరిత్ర సృష్టించేలా తెరాస శ్రేణులు పనిచేయాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని తెలంగాణ భవన్‌లో మంగళవారం తెరాస ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. కేటీఆర్ ఈ సందర్భంగా కేక్ కోసి అందరికీ అందజేశారు. అనంతరం ఆయన నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. "2018 మనకు మరుపురాని సంవత్సరం. కేసీఆర్ నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేసి తెరాస విజయానికి కృషి చేశారు. ప్రజలు నిండు మనసుతో మనను ఆశీర్వదించి.. తెలంగాణ స్వాభిమానాన్ని దేశానికి చాటారు. 2019లోనూ మనకు బృహత్తర లక్ష్యాలున్నాయి. పంచాయతీ ఎన్నికలు, పార్లమెంటు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, పురపాలక ఎన్నికలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ తెరాస ఘన విజయం సాధించాలి. పార్లమెంటు ఎన్నికల్లో 16 స్థానాలు గెలిచి దిల్లీలో సత్తా చాటాలి. కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వాన్ని శాసించే స్థితికి చేరాలి. కేసీఆర్ రూపొందించిన పథకాలను ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. రేపు దేశానికి మనం మార్గదర్శనం చేసే స్థాయికి ఎదగాలి. పార్టీని బలోపేతం చేసే కృషిలో మీరు భాగస్వాములు కావాలి. నేతలు, కార్యకర్తలను అన్ని విధాలా ప్రోత్సహిస్తాం" అని కేటీఆర్ చెప్పారు.

అభినందనల పరంపర

తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు నూతన సంవత్సర అభినందనలు వెల్లువెత్తాయి. పార్టీ నేతలు, కార్యకర్తలతో మంగళవారం తెలంగాణభవన్ కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు, కండువాలు, పూల మొక్కలను అందజేశారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. టీజీవో ఛైర్మన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో అధ్యక్షురాలు మమత, సత్యనారాయణ ఇతర అధికారులు కేటీఆర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారెం రవీందర్‌రెడ్డి, రాజేందర్, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, ఒప్పంద, పొరుగుసేవల సంఘం నేత జె.ప్రవీణ్, తెరాస రాష్ట్ర నేతలు బండి రమేశ్, కోలేటి దామోదర్‌గుప్త, నందకిశోర్ వ్యాస్ బిలాల్, తెరాస మహిళా విభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి, బేవరేజస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విఠల్ తదితరులు కేటీఆర్‌కు అభినందనలు తెలిపారు.

కేటీఆర్‌పై పాట విడుదల

బీసీ కళామండలి అధ్యక్షుడు సిర్సవాడ రామలింగం తనపై రాసిన పాటను కేటీఆర్ విడుదల చేశారు. దీనికి కోటి సంగీతం అందించగా.. మనో, బేబీలు ఆలపించారు. పాటను విన్న కేటీఆర్.. రామలింగం, కోటిలను అభినందించారు.

తెరాస తిట్ల పురాణం ఆపాలి: తెదేపా

ఈనాడు, హైదరాబాద్: కొత్త సంవత్సరంలో తెరాస నేతలు చంద్రబాబుపై తిట్ల పురాణం ఆపి ప్రజలకు మంచి చేసే పనులపై దృష్టి పెట్టాలని తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి అన్నారు. మంగళవారం ఎన్టీఆర్‌భవన్‌లో ఆమె మాట్లాడుతూ.. తమ కష్టాలను పట్టించుకోవాలని ప్రజలు తెరాసకు రెండోసారి పాలనా బాధ్యతలిస్తే సీఎం కేసీఆర్ మొదలుకుని ఎమ్మెల్యేలు, పార్టీ నేతలంతా చంద్రబాబును తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.

పాక్‌లో 537 మంది భారత ఖైదీలు

దిల్లీ: పాకిస్థాన్ జైళ్లలో ప్రస్తుతం 537 మంది భారతీయులు బందీలుగా ఉన్నారు. వారిలో 54 మంది సాధారణ వ్యక్తులు కాగా, మిగిలిన 483 మంది జాలర్లు. మనదేశ కారాగారాల్లో 347 మంది పాకిస్థానీలు ఉన్నారు. వారిలో 249 మంది సాధారణ పౌరులు. మిగిలినవారు జాలర్లు. ఈ మేరకు ఖైదీల జాబితాను ఇరుదేశాలు మంగళవారం పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నాయి. భారతీయుల విడుదలను వేగవంతం చేయాల్సిందిగా పాక్‌ను విదేశాంగశాఖ కోరింది. శిక్ష పూర్తిచేసుకున్న 80 మంది పాకిస్థానీ ఖైదీలను త్వరగా స్వదేశానికి తీసుకెళ్లాలని సూచించింది.

ఉత్తర్‌ప్రదేశ్ చందౌలి సమీపంలోని మాలా గ్రామంలో ఆవులను తీసుకెళ్తున్న ఓ ట్రక్కు గుడిసెలోకి దూసుకెళ్లడంతో ఏడుగురు దుర్మరణం చెందారు. ఇందులో నలుగురు మూడు నుంచి ఎనిమిదేళ్ల వయసు మధ్య పిల్లలు ఉన్నారు.

ఈ వారంలో 'క్యాట్' ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లలో ప్రవేశానికి నవంబరు 25న నిర్వహించిన కామన్ అడ్మిషన్ టెస్టు(క్యాట్)-2018 ఫలితాలు ఈ వారంలో విడుదల కానున్నాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ పరీక్షకు 2.41 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 2 లక్షలమంది హాజరయ్యారు. వచ్చిన స్కోర్ ఆధారంగా విశాఖతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 20 ఐఐఎంలలో సీట్లు కేటాయిస్తారు. క్యాట్ మార్కుల ఆధారంగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎంబీఏ సీట్లను భర్తీచేస్తుంది.

సంవత్సరాదిన విశేష పూజలు



యాదాద్రి స్వామికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధి మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరాదిన పలు ప్రాంతాలవారు ఆయనను దర్శించుకున్నారు. కొత్త ఏడాది తొలి రోజునే స్వామి జన్మనక్షత్రం స్వాతి, ఏకాదశి పర్వదినం కలిసిరావడంతో విశేష పూజలు నిర్వహించారు. బాలాలయ మహామండపంలో లక్ష పుష్పార్చన చేపట్టారు. క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామిని తమలపాకులతో అర్చించారు.



పుష్పగుచ్ఛం బదులు రగ్గు తెచ్చిన చిన్నారితో దివ్య దేవరాజన్ కరచాలనం

ఆదిలాబాద్‌లో వినూత్న ఒరవడి

ఆదిలాబాద్ పాలనా ప్రాంగణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాది వేళ ఆదిలాబాద్ జిల్లా పాలనాధికారి దివ్య దేవరాజన్ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. శుభాకాంక్షలు తెలిపేందుకు తన వద్దకు వచ్చేవారు పుష్పగుచ్ఛాలకు మారుగా... చలి తీవ్రత నుంచి పేదలను రక్షించే బట్టలను తీసుకురావాలని ఒకరోజు ముందే కోరారు. ఆమె పిలుపునకు స్పందించిన అధికారులు, ఇతరులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో వస్త్రాలతో బారులు తీరారు. స్వీకరించిన ఆమె ఆ వందలాది దుప్పట్లు, శాలువాలు, రగ్గులు, స్వెట్టర్లను నిరాశ్రయులకు, వృద్ధాశ్రమాల్లో ఉంటున్నవారికి ఇస్తామని చెప్పారు.

కనులారా తిరుమలేశుని దర్శనం

తిరుమల, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరం తొలిరోజైన జనవరి ఒకటిన శ్రీవారి దర్శనం భక్తకోటికి సంతృప్తికరంగా లభించింది. సామాన్య భక్తులకే తితిదే అధిక ప్రాధాన్యమిస్తూ.. వచ్చిన వారందరికీ స్వామివారి దర్శనాన్ని కల్పించింది. మంగళవారం వేకువజామున తిరుప్పావై నివేదన అనంతరం ధనుర్మాసం కైంకర్యాలు జరిగాయి. అర్ధరాత్రి 1.30 నుంచి 2.50 గంటల వరకు ప్రముఖులకు కేటాయించారు. ఆ తర్వాత సర్వదర్శనాన్ని ప్రారంభించి అర్ధరాత్రి ఏకాంత సేవ వరకు కొనసాగించారు. నిర్దేశించుకున్న సమయం కంటే గంటన్నర ముందుగానే ధర్మదర్శనం ప్రారంభమైంది. జనవరి ఒకటిన శ్రీవారి ఆశీస్సులు అందుకోవాలని విచ్చేసిన యాత్రికులు అందరికీ స్వామి దర్శనం లభించింది. సాయంత్రం 6 గంటల సమయానికి 70 వేల మంది దర్శించుకున్నారు. శీఘ్రంగా స్వామి దర్శనం లభిస్తుందన్న సమాచారంతో.. మధ్యాహ్నం తర్వాత స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మరోవైపు, శ్రీవారి ఆర్జిత సేవలను బుధవారం నుంచి తితిదే పునరుద్ధరించనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డలతో పాటు తల్లిదండ్రులకు కల్పించే ప్రత్యేక సౌకర్యాలను కూడా అందుబాటులోకి తేనుంది.

ఐదేళ్లలో 49మంది నవోదయ విద్యార్థుల ఆత్మహత్య

ఈనాడు, దిల్లీ: జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థుల్లో 2013 నుంచి 2017 వరకు 49మంది ఆత్మహత్యలకు పాల్పడటంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. మీడియాలో వచ్చిన కథనాలను ఉటంకిస్తూ దీనిపై ఆరు వారాల్లోగా వివరాలు సమర్పించాలని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖకి నోటీసులు జారీచేసింది. 'ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇవ్వడానికి సుశిక్షితులైన కౌన్సిలర్లు ఉన్నారా?' అని అందులో ప్రశ్నించింది. "ఆత్మహత్యకు పాల్పడ్డ 49మందిలో ఏడుగురు తప్ప, మిగిలినవారంతా ఉరి వేసుకుని చనిపోయారు. మృతుల్లో సగంమంది దళితులు, గిరిజన విద్యార్థులే. ఇందులోనూ బాలురే ఎక్కువ" అని ఎన్‌హెచ్‌ఆర్‌సీ చెప్పింది.

మీకు రెండు... మాకు ఒకటి!

- కర్ణాటకలో లోక్‌సభ సీట్ల సర్దుబాటు
- ఒప్పందం దిశగా కాంగ్రెస్-జేడీ(ఎస్) కసరత్తు

ఈనాడు-డిజిటల్, బెంగళూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కర్ణాటకలో లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్-జనతాదళ్ (సెక్యులర్) పార్టీలు 2:1 నిష్పత్తిలో పంచుకోవాలని దాదాపుగా ఒక అవగాహనకు వస్తున్నాయి. దీని ప్రకారం 28 స్థానాలకుగాను 18 చోట్ల కాంగ్రెస్, 10 చోట్ల జేడీ(ఎస్) పోటీ చేస్తాయి. జేడీ(ఎస్)కు భాగస్వామిగా ఉన్న బీఎస్పీకి మాత్రం ఒక్క స్థానాన్నీ కేటాయించలేదు. స్నేహపూర్వక పోటీ అనేది చిట్టచివరి అవకాశమేనని, పోటీ చేయబోయే స్థానాలపై రెండు పార్టీలూ స్పష్టతతో ముందడుగు వేస్తాయని జేడీ(ఎస్) సీనియర్ నేత ఒకరు మంగళవారం తెలిపారు. నిజానికి కాంగ్రెస్ పార్టీ తమపై పెత్తనం చెలాయిస్తోందనే భావన జేడీ(ఎస్)లో ఉంది. ఒక్క సీటునూ ఆ పార్టీకి వదలిపెట్టకుండా అన్నిచోట్లా పోటీ చేయాలనే ఒత్తిళ్లూ మొదలయ్యాయి.

కాంగ్రెస్‌పై దేవెగౌడ గుస్సా

'కన్నడనాట ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సమయంలో షరతులు లేని మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ నేతలు ఆ తర్వాత మాట మీద నిలబడలేదు. మంత్రి పదవుల్లో ఎక్కువ వారే తీసుకున్నారు.' అంటూ మాజీ ప్రధాని, జేడీ(ఎస్) అధిపతి హెచ్.డి.దేవెగౌడ రుసరుసలాడారు. దిల్లీ పర్యటన సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'గతంలో భాజపాతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా సగం వాటా దక్కించుకున్నాం. ఈసారి కాంగ్రెస్ మాతో పొత్తు పెట్టుకుంది. ఆ సమయంలో షరతుల్లేని మద్దతు అంటూనే ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించింది. మేమైతే ఎటువంటి షరతులూ విధించలేదు. ప్రభుత్వ పాలనలో అన్నింటా సహకరిస్తామని కాంగ్రెస్ నేతలంతా హామీ ఇచ్చినా అది అచరణలో సాధ్యం కాలేదు. అత్యధిక మంత్రి పదవులను వారే పొందారు' అంటూ మనసులో మాట వెళ్లగక్కారు. మంత్రి స్థానాలను వదులుకున్నా లోక్‌సభ స్థానాల పంపకాల్లో మైత్రి ఒప్పందం అమలు కావాల్సిందేనని తెగేసి చెప్పారు. ఈ విషయంపై త్వరలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. భాజపాకు అధికారంపై వ్యామోహం ఉండటం వాస్తవమే కదా అంటూ.. ప్రభుత్వాన్ని కూల్చటం అనుకున్నంత సులువు కాదని హెచ్చరించారు. కర్ణాటకలో కేవలం 800 మంది రైతులే రుణమాఫీ లబ్ధిదారులంటూ ప్రధాని వ్యాఖ్యానించటం సరికాదని, ప్రస్తుతం 60 వేల మంది రైతులకు రుణమాఫీ పత్రాలు అందాయని చెప్పారు.

సీట్ల సర్దుబాటుపై అవగాహన కుదరకపోతే తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, శరద్‌పవార్ (ఎన్సీపీ), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్)ల సాయాన్ని కోరాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ముగ్గురు నేతలూ ఈ నెల మధ్యలో కీలకమైన భేటీ నిర్వహించుకోనున్నారు.

పంతం నెగ్గించుకున్న మాయావతి!

- భారత్ బంద్ కేసుల ఎత్తివేతకు దిగొచ్చిన కాంగ్రెస్
- అంగీకరించిన మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు

భోపాల్: బీఎస్పీ అధినాయకురాలు మాయావతి పంతం నెగ్గించుకున్నారు! గత ఏప్రిల్‌లో భారత్ బంద్ సందర్భంగా దళితులపై నమోదైన కేసులను మాఫీ చేయాలని, లేకుంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో మద్దతు కొనసాగించే విషయాన్ని పరిశీలిస్తామని ఆమె చేసిన హెచ్చరికలకు కాంగ్రెస్ దిగొచ్చింది. చర్యలు తీసుకుంటున్నట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, రాజస్థాన్ సీఎం అశోక్ గహ్లోత్‌లు మంగళవారం ప్రకటించారు. బంద్ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌తో పాటు రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో నాటి భాజపా ప్రభుత్వాలు రాజకీయ దురుద్దేశంతో అమాయకులపై కేసులు పెట్టాయంటూ బీఎస్పీ ఆరోపిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కొలువుదీరాయి. అయితే, అధికారం చేపట్టేందుకు అవసరమైనంత మెజార్టీ కాంగ్రెస్‌కు లేకపోవడంతో, ఆయా రాష్ట్రాల్లో బీఎస్పీ మద్దతు ఇస్తోంది. బంద్ కేసులను ఎత్తివేయకుంటే... కాంగ్రెస్‌కు తమ మద్దతును కొనసాగించే విషయాన్ని పునరాలోచిస్తామంటూ మాయావతి ప్రకటించడం సంచలనం సృష్టించింది. ఈ క్రమంలో ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో బెహన్‌జీని ప్రసన్నం చేసుకునేందుకు హస్తం పార్టీ దీన్నొక అవకాశంగా భావిస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం: చాడ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను తగ్గించి తెరాస ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మంగళవారం విమర్శించారు. రిజర్వేషన్లను తగ్గించడం బీసీల హక్కులను హరించడమేనన్నారు. రిజర్వేషన్లు 50శాతం మించకూడదని 2013లో చెప్పిన సుప్రీంకోర్టు, బీసీ జనాభా లెక్కిస్తే రిజర్వేషన్లు పెంచుకోవచ్చని నాడు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీసీ గణన చేయకుండా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు న్యాయస్థానం ఆదేశాల మేరకే ఎన్నికలు నిర్వహిస్తున్నామని సర్కారు చెప్పడం సిగ్గుచేటన్నారు.

'వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చాల్సిందే'

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చాలని సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ ఎంపీ నంది ఎల్లయ్య విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలంటూ మంగళవారం ఓ లేఖ రాశారు. ఉభయ రాష్ట్రాలలోనూ ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించేలా 341 నిబంధన సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రి గెహ్లోత్‌కు లేఖ పంపారు. జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ నివేదిక ఇచ్చి తొమ్మిదేళ్లు అయిందని గుర్తుచేస్తూ, ఇకనైనా ఏపీ, తెలంగాణలలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

15 మంది దుర్మరణం

జకార్తా: జావాలోని సిర్నరేస్మి గ్రామంలో కొండచరియలు విరిగిపడిన సంఘటనలో 15 మంది మరణించారు. 20 మంది గల్లంతయ్యారు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనతో గ్రామంలోని పలు ఇళ్లు మట్టిలో కూరుకుపోయాయి.

ఈనాడు


బ్యాంకుల స్థిరత్వానికి...

రిజర్వ్ బ్యాంక్ నూతన సారథిగా నియమితులైన మూడు వారాలకే, బ్యాంకింగ్ రంగం తెరిపిన పడుతున్నదని శక్తికాంతదాస్- జాతికి భరోసా ఇస్తున్నారు. నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు)గా వ్యవహరించే మొండిబకాయిల పద్దు తగ్గుముఖం పట్టిందని తన జమానాలో మొట్టమొదటి 'ఆర్థిక స్థిరత్వ నివేదిక'లో తాజాగా ఆయన కితాబిచ్చారు. మూడేళ్లలో తొలిసారి- బ్యాంకుల ఆస్తుల్లో ఎన్‌పీఏలు తగ్గాయంటున్నారు. అవి 2018 మార్చినాటి 11.5 శాతంనుంచి తరవాతి ఆరు నెలల్లో 10.8 శాతానికి దిగివచ్చాయని, రేపు మార్చి నెలాఖరుకల్లా 10.3 శాతానికి పరిమితం కావచ్చునని ఆర్థిక స్థిరత్వ నివేదిక వెల్లడిస్తోంది. కొన్నాళ్లక్రితం వరకు ఇది ఊహకైనా అందని మార్పు! భారత్‌లో ఏడు శాతానికి పైబడిన వార్షిక వృద్ధిరేటు కళ్లు జిగేల్మనిపిస్తుండగా, బ్యాంకుల పారుబాకీలు పట్టపగ్గాల్లేకుండా విస్తరిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి ఏడాదిన్నరక్రితం తీవ్ర ఆందోళన వ్యక్తపరచింది. ఆ తరవాతా విస్తరణ వేగం కొనసాగిన ఎన్‌పీఏలు ఇప్పుడు అదుపులోకి వస్తున్నాయన్న శక్తికాంతదాస్ ధ్రువీకరణ సంభ్రమాశ్చర్యపరుస్తోంది. ఈ అంశాన్ని నిర్ధారించిన నివేదిక ముందుమాటలోనే- ప్రభుత్వరంగ బ్యాంకుల పాలన ప్రమాణాల మెరుగుదలకు, మరిన్ని సంస్కరణల ఆవశ్యకతను ఆర్‌బీఐ సారథి ప్రస్తావించారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే గడచిన ఆర్థిక సంవత్సరంలో 72శాతం మేర పెరిగిన మోసాల కారణంగా బ్యాంకులు రూ.41వేల కోట్లకుపైగా నష్టపోయాయనీ ఉటంకించారు. చిల్లి పేరే తూటు. మొండిబకాయిల సమస్య కొంతలో కొంత ఉపశమించిందంటున్నా, మోసాల రూపేణా వేలకోట్ల రూపాయలు నష్టపోతున్న బ్యాంకింగ్ రంగ ముఖచిత్రం దిగులు పుట్టిస్తోంది. ఏ రకంగా కొల్లబోయినా, అదంతా జనం సొమ్మే కదా? ప్రజాధనంలో ఏ ఒక్క రూపాయీ వృథా కానివ్వని రీతిగా బ్యాంకులకు సమగ్ర చికిత్స చేపడితేనే- రిజర్వ్ బ్యాంక్ పర్యవేక్షణకు అర్థం, పరమార్థం!

బ్యాంకుల మొండిబాకీలు కొండల్లా పేరుకుపోవడానికి మూల కారకులు మీరేనంటూ ఎన్‌డీఏ, అత్యవసర చర్యల్ని ఉపేక్షించిన అలసత్వం ఎవరిదంటూ యూపీఏ శ్రేణులు రెండు నెలల క్రితం పరస్పరం కత్తులు దూసుకోవడం తెలిసిందే. 2008-14 సంవత్సరాల మధ్య బ్యాంకుల అడ్డగోలు రుణ పందేరాన్ని ఆర్‌బీఐ చేష్టలు దక్కి- చూస్తుండిపోయిందని అప్పట్లో దుమ్మెత్తిపోసిన విత్తమంత్రి అరుణ్ జైట్లీ సరికొత్త ఆరోపణ దిగ్భ్రాంతపరచేదే. 2015నాటికి రూ.2.5 లక్షల కోట్ల మొండి బకాయిలు పోగుపడినట్లు కాంగ్రెస్ నేతాగణం లెక్కచెప్పినా, వాస్తవానికి ఆ మొత్తం రూ.8.5 లక్షల కోట్లని జైట్లీ స్పష్టీకరిస్తున్నారు. దరిమిలా అది పదిలక్షల కోట్ల రూపాయలకు ఎగబాకడానికి ఆర్‌బీఐ పర్యవేక్షణ లోపాలే పుణ్యం కట్టుకున్నాయన్న తీవ్ర విమర్శల నేపథ్యంలోనే- రిజర్వ్ బ్యాంక్ సారథ్య బాధ్యతలు చేతులు మారాయి. ఉన్న అధికారాలతో ప్రభుత్వ రంగ బ్యాంకుల్ని నియంత్రించడం అసాధ్యమని మొయిలీ కమిటీ ఎదుట ఉర్జిత్ పటేల్ వాపోగా- మరిన్ని సంస్కరణలు చేపట్టడంతోపాటు బలహీన ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన పునర్ వ్యవస్థీకరణ ద్వారా మద్దతు ఇవ్వాలని ఇప్పుడు శక్తికాంతదాస్ కోరుతున్నారు. వచ్చే మూడు నెలల కాలంలో ఇవ్వదలచిన రూ.83వేల కోట్లు కలిపి లెక్కిస్తే ఏడాది మొత్తానికి ముట్టజెబుతున్న మూలధన నిధులు లక్ష కోట్ల రూపాయలకు పైబడుతున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల పునర్ మూలధనీకరణ నిమిత్తం ఇలా ఇంత భారీ మొత్తం ధారపోస్తున్న కేంద్రం- వాటి పనిపోకడల్లో పారదర్శకతకు, యంత్రాంగంలో ఇతోధిక జవాబుదారీతనం నెలకొల్పడానికి ఏం చేయదలచింది? ఎన్‌పీఏల భారం పరిమితంగా సడలడం కాదు- బ్యాంకింగ్ రంగం తలరాతను మార్చి, స్థితిగతుల్ని సాకల్యంగా ప్రక్షాళించేలా పటిష్ఠ వ్యూహం చురుగ్గా పట్టాలకు ఎక్కాలి!

నిధుల సమీకరణ ప్రక్రియను ఆర్‌బీఐ సంక్లిష్టభరితం చేసేసిన కారణంగా దేశంలో నూట యాభైకిపైగా ప్రాజెక్టులకు సంబంధించి సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు వివిధ దశల్లో చిక్కుకుపోయాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అయిదు వారాల క్రితం ఆక్షేపించారు. తమవంతుగా వివిధ జాతీయ రహదారి పథకాల్లో మంత్రిమండలి నిర్ణయాల్ని వేగిరపరచడం ద్వారా రమారమి మూడు లక్షల కోట్ల రూపాయలదాకా ఎన్‌పీఏలు కాకుండా నివారించగలిగామని పక్షం రోజులనాడు ఆయనే ప్రకటించారు. పలు మౌలిక రంగ ప్రాజెక్టుల్లో భారీ పెట్టుబడులు 'నిరర్థక' ఖాతాలోకి జారిపోకుండా కాచుకోవడంలో సత్వర విధాన నిర్ణయాలు పోషించగల కీలక భూమిక ప్రాముఖ్యాన్ని కేంద్రం గుర్తెరగాలి! గుజరాత్‌వంటి రాష్ట్రాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఆర్థిక అస్వస్థత ఎన్‌పీఏల్లో 25శాతం మేర వృద్ధికి కారణమవుతున్నట్లు గణాంకాలు నిర్ధారిస్తున్నాయి. రాష్ట్రాలవారీగా అటువంటి చిరు సంస్థలకు వ్యవస్థాగత తోడ్పాటు ఇనుమడిస్తే ఆ మేరకు బ్యాంకులూ పుంజుకొంటాయి. ఈ మధ్య పార్లమెంటుకు నివేదించిన సమాచారం ప్రకారం, పారు బాకీలుగా ఖర్చురాసేసిన వాటిలో రూ.2.33 లక్షల కోట్లను నాలుగేళ్ల వ్యవధిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు తిరిగి రాబట్టుకోగలిగాయి. దివాలా స్మృతి నిబంధనల్ని పకడ్బందీగా అమలుపరిస్తే వసూళ్లు ఇంకా పెరిగే అవకాశం కొట్టిపారేయలేనిది! ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు లోపాయికారీ సహకారం అందించే ఇంటిదొంగలపై కొరడా ఝుళిపించి, ప్రతి నాలుగు గంటలకొక కుంభకోణం రెక్క విచ్చుకోవడానికి కారణమవుతున్న సిబ్బంది చేతివాటానికి తాటతీసే రీతిలో- రిజర్వ్ బ్యాంక్ బలసంపన్నం కావాలి. శక్తికాంతదాస్ పేర్కొన్న ఆర్థిక స్థిరత్వానికి అదీ మేలైన దారి!

కరవుకు విరుగుడు



దేశంలో 14 కోట్ల హెక్టార్లలో మూడొంతుల సాగుకు వర్షాలే ఆధారం. గత పదేళ్లుగా వర్షాభావ పరిస్థితులు అధికమయ్యాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో ఏదో ఒక పంట కాలం కరవు బారిన పడుతోంది. వర్షాల మధ్య విరామం పెరిగింది. పైరు నిలదొక్కుకునే వీలుకలగడం లేదు. మరోవైపు అధిక ఉష్ణోగ్రతలవల్ల దిగుబడులు క్షీణిస్తున్నాయి. 34 శాతం భూములకు నీటి సౌకర్యం ఉన్నా వర్షాలులేక, ప్రాజెక్టుల నీరు అందక, భూగర్భజలాలు అడుగంటి సాగునీటి సమస్య తీవ్రమై అన్నదాతలు నష్టాలపాలవుతున్నారు. పంటల ఎదుగుదల, దిగుబడులపై వాతావరణ మార్పుల ప్రభావం పడి, ఆశించిన ఫలసాయం పొందడం కష్టమవుతోంది. వాతావరణ సవాళ్ల కారణంగా రకరకాల తెగుళ్లు, చీడపీడలు విజృంభిస్తున్నాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఆహార, ఉద్యాన, వాణిజ్య పంటలను సాగుచేయడం, పంట తీయడం కష్టమవుతోంది. ఈ సాగు విపత్తులకు సరైన ప్రత్యామ్నాయ మార్గం చిరుధాన్యాలే. ముఖ్యంగా తెలుగురాష్ట్రాల్లోని 56 శాతం వర్షాధార మెట్ట ప్రాంతాలకు వెలుగు రేకలు. రెండు గట్టి వానలతో పండే పంటలు చిరుధాన్యాలు. క్షామ పరిస్థితులు ఎదుర్కొనే మెట్ట ప్రాంతాల్లో సరైన తరుణోపాయ పంటలివే. చౌడు, ఇసుక, బంజరు, నిస్సార నేలల్లోనైనా 300-500 మి.మీ. కనీస వర్షపాతంతో సాగుచేసుకొని దిగుబడులు పొందే శక్తి వీటికి మాత్రమే ఉంది. రసాయన ఎరువులు, పురుగుమందుల అవసరం అసలే లేదు. తెగుళ్ల పంటను తినేస్తాయన్న బెంగ పెద్దగా ఉండదు. వర్షం కురవక పంట పండకపోయినా నష్టపోయేది మూడు నాలుగు వేల రూపాయలే. వేరుశనగ, మొక్కజొన్న, పెసర, మినుము మాదిరిగా 10-20 వేలు నష్టపోయే అవకాశాలు లేవు. ఒక్క ఆరికలు మినహా మిగతా పంటల కాలవ్యవధి 75 నుంచి 110 రోజులలోపే. కాబట్టి కూలీల అవసరమూ తక్కువే. ఈ పాత పంటల సాగుతో నేల సైతం సారవంతమవుతుంది. జొన్నలు, సజ్జలు తదితర పంటల చొప్ప, దంట్లు 50 శాతం పశువుల మేత అవసరాలు తీరుస్తాయి. సాగునీరు, విద్యుత్ సరఫరా, కరవు నివారణకోసం వేలకోట్లు ఖర్చుచేయాల్సిన అగత్యం ఉండదు. గాలి, నీరు కలుషితం కావు. పశువుల వ్యర్థం, వర్మీ కంపోస్టు, జీవామృతం వంటి సహజ ఎరువుల వినియోగం వల్ల జీవవైవిధ్య పరిరక్షణ సాధ్యపడుతుంది.

చిరుధాన్యమే మహాభాగ్యం!

మన దేశంలో హరిత విప్లవం ఆహార భద్రతకు బాటలుపరచింది. ఆరు, ఏడు దశకాల్లో అది సాగు రంగం గతిని మార్చింది. మేలైన విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుమందులు, మెరుగైన సాగు నీటి వనరులు, యాంత్రీకరణతో కూడిన హరిత విప్లవం వల్ల ఆహారం, వాణిజ్య పంటల అధికోత్పత్తికి మార్గం సుగమమైంది. విప్లవాత్మక సాగు విధానాలకు రైతులూ అలవాటుపడ్డారు. నీటి సౌకర్యాలు, అధిక దిగుబడినిచ్చే వంగడాలు, కృత్రిమ ఎరువులు ఉపయోగించుకొని మంచి ఫలసాయం సాధించారు. ఇవన్నీ సానుకూలాంశాలు. అయితే ఇదే సమయంలో పర్యావరణం, పౌష్టికాహార సమస్యలు తలెత్తాయి. పంటల సాగు సరళి మారిపోయింది. సంప్రదాయ పంటలు కనుమరుగయ్యాయి. చిరు ధాన్యాలకు ఆదరణ మందగించింది. రైతులూ ఆహార, వాణిజ్య పంటలవైపు పరుగుతీశారు. తృణధాన్యాల సాగును విస్మరించారు. దరిమిలా 1960 నుంచి నేటి వరకు సాగు విస్తీర్ణం సగానికి సగం తగ్గిపోయింది. కాలుష్య, రసాయనపూరిత ఆహార పంటల వల్ల వ్యాధుల సమస్య పెచ్చరిల్లడంతో ఇన్నేళ్లకు ప్రజల చూపు చిరుధాన్యాలవైపు మళ్లింది. ఇటీవలి కాలంలో సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమయ్యే విధానాలపై అవగాహన విస్తరిస్తోంది. ఆ పంటలకు గిరాకీ ముమ్మరిస్తోంది. అయినా వాటిని కొనాలంటే రైతుల వద్ద, దుకాణాల్లో ఆ ఉత్పత్తులు దొరకడంలేదు. తెలుగు రాష్ట్రాల్లో వీటి సాగు తక్కువగా ఉన్నందువల్ల ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

వేల ఏళ్ల చరిత్ర

చిరుధాన్య పంటలు ప్రకృతి ప్రసాదిత వరాలు. నాగరికత ప్రారంభమైన కాలం నుంచే వీటిని సాగు చేసేవారు. ఆరో దశకం వరకూ చిరుధాన్యాలే మన ప్రధాన ఆహార పంటలు. ప్రతి రైతూ ఏదో ఒక చిరుధాన్యం పండించేవారు. కుటుంబ సమేతంగా ఆ పంట వంటలే తినేవారు. పశువుల వ్యర్థాలే ఎరువులు. అందువల్ల ఖర్చులూ పెద్దగా అయ్యేవి కాదు. విత్తనాలు దాచుకొని పంట వేసేవారు. పెట్టుబడులు భారంగా అనిపించేవి కాదు. హరిత విప్లవ ఆగమనం తరవాత క్రమంగా వీటి సాగు, ఆహార వినియోగం తగ్గింది. రైతు జీవన ప్రయాణంలో నెమ్మదిగా కుదుపులు మొదలయ్యాయి. ప్రభుత్వాల విధానాలు, చిరుధాన్యాల సాగులోని సమస్యలు రైతులను పాత పంటలకు దూరం చేశాయి. రుణసౌకర్యం, బీమా సదుపాయం లేనందువల్ల అవి ప్రాధాన్యం కోల్పోయాయి. కాలక్రమంలో కనీస దిగుబడులు రాకపోవడం, దిగుబడి పెంచే విత్తనాలు అందకపోవడం సాగుదారులను మరింతగా నిరాశపరచాయి. అంతేకాకుండా చిరుధాన్యాలను విసిరి, దంచి, పొట్టు తీసి వంటకు అనువుగా చేయడం కష్టంతో కూడుకున్న పని. అందువల్ల కర్షకుల్లో వీటి సాగుపట్ల ఆసక్తి తగ్గిపోయింది. కేంద్ర, రాష్ట్ర సర్కార్లు వరి, గోధుమలకు మద్దతు ధరలు ప్రకటించి, ప్రజా పంపిణీ వ్యవస్థలో తక్కువ ధరలకే వాటిని సరఫరా చేయడమూ పోషక విలువలు దండిగా ఉన్న ఈ ధాన్యాల సాగు తగ్గడానికి పరోక్షంగా కారణమైంది. జొన్న, రాగి, సజ్జలు మినహాయిస్తే,



సాగు సులభం... ప్రయోజనాలు అపారం

మిగతా చిరుధాన్యాలైన కొర్రలు, వరిగలు, ఊదలు, సామలు తదితర పంటలకు కనీస మద్దతు ధరల జాబితాలో చోటులేకపోవడం, పెట్టుబడి రాయితీలు కల్పించకపోవడం రైతులకు శాపమైంది. 1966లో 3.66 కోట్ల హెక్టార్లలో సాగైన చిరుధాన్యాల పంటలు, 2016నాటికి 1.45 కోట్ల హెక్టార్లకు పడిపోయింది. జొన్నలు, రాగులు, సజ్జల కంటే కొర్రలు, సామలు, వరిగలు, ఊదలు వంటివాటి విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ఇదే సమయంలో వరి కోటిన్నర హెక్టార్లు, గోధుమలు కోటి 70 లక్షల హెక్టార్లకు పెరిగింది. చిరుధాన్యాల విస్తీర్ణాన్ని వరి, గోధుమ, మొక్కజొన్న, చెరకు తదితర పంటలు ఆక్రమించినా- తృణధాన్యాల సాగు, వినియోగంలో ఇప్పటికీ మన దేశానిదే ప్రథమస్థానం!

అపార పోషక విలువలు

పాలిష్ పట్టిన బియ్యం, శుద్ధి చేసిన గోధుమ వంటకాలు రోగాలకు కారణమవుతున్నాయన్నది పరిశోధనల సారాంశం. చిరుధాన్యాల ఆహారం ఈ సమస్యను తప్పిస్తుంది. చక్కెర వ్యాధి అవకాశాన్ని తగ్గిస్తుంది. మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి కావాల్సిన మాంసకృత్తులు, పిండిపదార్థాలు, ఖనిజ లవణాలు, మాంగనీస్, ఫాస్ఫరస్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి సూక్ష్మ పోషకాలు అధికంగా లభిస్తాయి. ఇటీవలి కాలంలో చిరుధాన్యాల గొప్పదనాన్ని అంతా గుర్తిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వమూ 2014 నుంచి జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. ఏపీ, తెలంగాణ సహా 13 రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు అమలవుతున్నాయి. చిరుధాన్యాల విప్లవంకోసం 'మిల్లెట్ మిషన్'ను ప్రారంభించింది. 2018ను జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా అనుసరించింది. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా యునెస్కో ప్రకటించింది.

ఆహార ఆరోగ్య భద్రత

భూతాపం, వాతావరణ మార్పులు, నీటి కొరత ప్రపంచానికి సవాళ్లుగా మారాయి. ఏటికేడు ఎండలు పెరగడంతోపాటు తాగు, సాగు నీటి లభ్యత తగ్గిపోతోంది. ఉష్ణోగ్రతలు మరో రెండు డిగ్రీలు పెరిగితే వరి, గోధుమ పంటల దిగుబడి పడిపోవడమే కాకుండా వాటి ఉనికే ప్రమాదంలో పడే అవకాశాలున్నాయని అనేక అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. అధిక నీరు అవసరమయ్యే వరి, పర్యావరణంలో మీథేన్ వాయువు పెంచే పంట. కేజీ ధాన్యం పండించడానికి అయిదు వేల లీటర్ల నీరు కావాలి. అదే ఒక చిరుధాన్యం పంట పండించడానికి 600 లీటర్ల నీరు చాలు. అందుకే నీటి అవసరం ఎక్కువగా ఉండే వరి, గోధుమ, చెరకు పంటల సాగును నెమ్మదిగా తగ్గింపజేయాలి. వీటికి బదులు అతి తక్కువ నీరు, వనరులతో స్వల్పకాలంలో పండే చిరుధాన్యాలను ప్రోత్సహించాలి. భవిష్యత్ సాగు ఆశాకిరణాలు ఈ చిన్న పంటలే. సుస్థిర సాగుకు పునాది వేసే చిరుధాన్య పంటలు ఉభయ తారకాలు. ఇటు రైతులకు ఆదాయ, పోషకాహారం, పశుగ్రాసం భద్రత; అటు ప్రజలకు ఆరోగ్య భద్రత ఇస్తాయనడంలో సందేహం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాలపై దృష్టిపెట్టి సాగు విస్తీర్ణం రెట్టింపు చేసేందుకు బహుళ రూపాల్లో ప్రోత్సాహకాలు అందించాలి. ఇందుకోసం వివిధ సంస్థలు, నిపుణుల సూచనలు అమలు చేయాలి. ప్రతి రైతుకు మేలైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు అందించాలి. కొత్తగా అందుబాటులోకి వచ్చిన రకాలపై అవగాహన కల్పించి చిరుసంచుల పంపిణీ కార్యక్రమం పెద్దయెత్తున చేపట్టాలి. వాతావరణ మండలం, క్లస్టర్ ఆధారిత ప్రణాళికల ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలి. మెట్ట ప్రాంతాల్లో ఒకటి రెండు తడులు అందించడం కోసం నీటిసౌకర్యాలు, చెక్‌డ్యాములు నిర్మించాలి. ప్రతి రైతు సొంతంగా లేదా సంఘాలుగా ఏర్పడి ప్రాసెసింగ్ చేసుకునే యంత్రాలు అందుబాటులోకి తేవాలి. చిరుధాన్యాల ఉపయోగం, ప్రయోజనాలపై గ్రామీణ ప్రజల నుంచి పట్టణ, నగరవాసులవరకు అందరికీ అవగాహన పెంచాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చిరుధాన్యాలను విధిగా పంపిణీ చేయాలి. ఈ విషయంలో కర్ణాటకను ఆదర్శంగా తీసుకోవాలి. ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ, వసతి గృహాల్లో చిరుధాన్య పంటల వంటకాలు, ఆహారం తప్పనిసరిగా అందించాలి. అలాగే రాగి, జొన్న, సజ్జలకు మాదిరిగా అన్నిరకాల చిరుధాన్యాలకు మద్దతు ధరలు కల్పించాలి. కర్ణాటక ఇస్తున్న ప్రోత్సాహ ధరలను ఇతర రాష్ట్రాల్లోని రైతులకు అందజేయాలి. ఇవన్నీ పట్టాలకు ఎక్కిననాడు చిరుధాన్యాల సాగు పునర్వైభవం సంతరించుకుంటుంది!

- పావులూరి కిశోర్‌బాబు

అనూహ్య పదవీ ప్రాప్తం

'ఎన్నికల ముందు ఎన్ని ప్రశ్నార్థకాలు!
ఎన్నికలయ్యాక అన్నీ ఆశ్చర్యార్థకాలే!'
అన్నాడో రచయిత.

తిరుగులేని నాయకుడి (రింగ్‌లీడర్)దే రాజ్యం అనుకుంటే, తటస్థ నాయకుడి(హంగ్ లీడర్) చేతికే అధికారం దక్కవచ్చు. ఏ నిముషానికి ఏమి జరుగునో, ఎవరూహించెదరూ అనేది వట్టి వేదాంతమేకాదు, రాజకీయంగా కూడా గట్టి సిద్ధాంతమే.

అన్నీ అనుకున్నట్లే జరిగితే, ప్రజాస్వామ్యంలో మజా ఏముంది? తాను అనుకున్న వ్యక్తే ప్రధానమంత్రో, ముఖ్యమంత్రో అవుతాడని ఓటరు అనుకున్నా, దానికి భిన్నంగా జరిగి అతడు బిత్తరపోయిన సందర్భాలు ఎన్ని లేవు?

రాజకీయ నేపథ్యం లేకపోయినప్పటికీ, కనీసం నోరు విప్పి పెద్దగా మాట్లాడకపోయినప్పటికీ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి అవుతారని, (ఆయనతో సహా) ఎవరు కలగన్నారు, పదేళ్లపాటు అదే పదవిలో కొనసాగుతారని ఎవరనుకున్నారు? అందుకే మన్మోహన్ సింగ్ మీద అనుకోని ప్రధాని (యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్) అనే ముద్రపడింది. ఇది ఎప్పటికథో అయితే, దేవెగౌడ కుమారుడు కుమారస్వామి కర్ణాటక ముఖ్యమంత్రి కావడం ఈమధ్య జరిగిన కథ. ప్రజాస్వామ్యాన్ని అలంకరించిన ఈ 'హంగ్'లు ఎంతో ఆకర్షిస్తున్నాయి. సిద్ధరామయ్యో, యడ్యూరప్పో మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనుకున్నవాళ్ల అంచనాలు ఎంత ఠంచనుగా తప్పిపోయాయి?

'గెలిచివస్తాడు ఈరోజు మానేత, తానే ఎక్కేను గద్దె నేరుగా' అని కార్యకర్తలు చేసిన ప్రచారాలన్నీ దెబ్బతింటున్నాయి. 'రాకోయి అనుకోని అతిథీ' అన్నా కుదరడంలేదు. ఊహించని వ్యక్తి మెడలోనే గజమాల పడుతుంది. అతడికి ఇష్టమైనవాళ్లే మంత్రులై అష్టదిగ్గజాలు అవుతున్నారు.

'ఓటు ఒకరికి... సీటు ఒకరికి, సాగదింక తెలుసుకో' అన్న పాటలే వినబడటంలేదు. జనం ఎవరికి ఓట్లు వేశారన్నది ముఖ్యం కాదు- అందలం ఎవ్వరికి దక్కిందన్నదే ముఖ్యం. ఇలా కీలక పదవి ఎవరికి దక్కినా వారి వాలకాన్ని ప్రశ్నించడానికి వీల్లేదు. ఎందుకంటే ఎన్నికలముందు నేను ప్రధాని అయితే, నేను ముఖ్యమంత్రి అయితే అది చేస్తా... ఇది చేస్తా... అది ఇస్తా... ఇది ఇస్తా... అన్న హామీలు ఏమీ ఇచ్చి ఉండరు. 'జవాబుదారీ దారిలో నడవండి' అని జనం వారిని నిలదీయడమూ కష్టమే. మీరే మన్నా నేను కీలక పదవిలో ఉండాలని గెలిపించారా అని సదరు నేత ప్రశ్నిస్తే జనానికి దిక్కు తోచకపోవచ్చు. మీరొకందుకు ఓటు వేస్తే నేనొకందుకు అధికారం చేపట్టానని ఆ నాయకుడు అనుకోవచ్చు. అనవచ్చు కూడా! 'ఎవరో ఒకరు పాలించడానికి ఉన్నారు అదే చాలులే' అనుకునే అల్పసంతోషులూ ఉన్నారు.

'ఓటర్ల దయ... నాయకుల ప్రాప్తం' అన్న సిద్ధాంతం పలచబడిపోతోంది. 'అదృష్టం ఉండాలి... అందలమెక్కాలి' అన్న నమ్మకం నానాటికి బలపడుతోంది. రకరకాల సర్వేలు. రకరకాల జోస్యాలు. ఏ పార్టీ పంచాంగం ఆ పార్టీయే గెలుస్తుందని చెబుతుంది. తమ నాయకుడికి ఏయే గ్రహాలు అనుకూలంగా ఉన్నాయో 'జ్యోతిష హేతువాదరీత్యా' కూడా చెప్పగానే కార్యాలయాల్లో చప్పట్లు మార్మోగుతాయి. ప్రమాణ స్వీకారాలకు ముహూర్తాలూ పెడతారు. అందరూ ఆహో ఓహో అంటారు. ఆత్మానందం పొందుతారు.



సర్వేల సంబడాలూ సరేసరి! ఏ పార్టీ సర్వే చేయిస్తే ఆ పార్టీయే 'గెలుస్తుంది'! 'అనుకోని నేతకు' అవకాశమే ఉండదు. సర్వే ఫలితాలు చూడగానే, అలాంటి ఫలితమే వస్తుందన్న నమ్మకం కుదరదు. ఫలానా పార్టీయే ఈ సర్వే చేయించి ఉంటుందన్న 'మూఢనమ్మకం' గాఢంగా ఉంటుంది. దీనికి తిరుగుండదు. ఇక ఎగ్జిట్ పోల్స్ ఫలితాలూ గాడి తప్పుతున్నాయి. అన్నీ శాస్త్రీయంగా సర్వే చేశామనే చెబుతుంటాయి. అసలు శాస్త్రీయం అది కాదు. ఏ పార్టీ ఏ ఓటరుకు ఎంతెంత డబ్బు ఇచ్చింది, ఎవరెవరికి మద్యం పంచింది, దాని కిక్కు ఎంత తెలుసుకోవాలి. డబ్బు మత్తులోనో మద్యం మత్తులోనో ఉన్నప్పుడు సర్వే చేస్తే ఫలితం కచ్చితంగా వస్తుంది. 'అదే నిజమైన, శాస్త్రీయమైన సర్వే' అని పళ్లికిలిస్తున్న వాళ్లూ ఉన్నారు.

అయితే 'నీవే తప్ప ఇతఃపరం బెరుగ' అని భక్తుడు అంటే... 'నీ సర్వే తప్ప ఇతఃపరం బెరుగ' అని 'సర్వే'శ్వరుణ్ని తలచుకుని అధికారం ఆశించిన నాయకుడు అంటాడు. అసలు ఫలితాలు వచ్చేవరకు గుండెమీద చేయి వేసుకుని నిద్రపోవడానికి మాత్రం కొన్ని సర్వేలు ఉపయోగపడుతున్నాయి. ఏమైతేనేం ఒక్కోసారి ఏ సర్వే చేయించని, ఏ పంచాంగమూ రాయించుకోని 'అనుకోని' నాయకుడు 'ప్రజల భాగ్యవిధాత' అవుతున్నాడు. ఇది న్యాయమా అనడానికీ వీల్లేదు!

'అతిపరిచయాత్ అవజ్ఞ' అన్నారు. దీని ప్రకారం ఎక్కువ పరిచయం ఉంటే ఎవరి మీదైనా చిన్నచూపు కలుగుతుంది. పెద్ద పదవి ఇచ్చేటప్పుడు 'చిన్నచూపు'వాళ్లు ఎందుకు? పరిచయం లేనివాళ్లకే పెద్ద పదవిని పరిచయం చేస్తే బాగుంటుంది కదా అన్నదీ ఓ లాజిక్కేస్మీ! ఎంతో ఆశించి విరగబడినట్లు ఓట్లేసి గద్దెనెక్కించినవాళ్లు జనాన్ని నిరాశపరచిన సందర్భాలు ఉన్నప్పుడు ఎవరూ ఊహించకుండా గద్దెనెక్కిన వ్యక్తి ఊహించకుండానే గొప్ప ప్రజాసేవ చేయొచ్చు. అది అలా జరగదని ఎవరు చెప్పగలరు?

అనుకోని వ్యక్తులకు అధికారం ఇంకోరకంగానూ రావచ్చు. ఫలానా రాష్ట్రంలో ఫలానా పార్టీయే అధికారంలోకి వస్తుందని బల్లగుద్ది చెప్పవచ్చు. నిజంగా ఆ పార్టీకి పూర్తి మెజారిటీయే అక్షరాలా, అంకెలారా కూడా రావచ్చు. అయితే ఆ పార్టీలో ఫలానా వ్యక్తే ముఖ్యమంత్రి అవుతాడని మాత్రం ఎవరూ చెప్పలేరు. అది అతిరహస్యం. ఆ పార్టీ శాసనసభాపక్షం సమావేశంలో కొత్తదిల్లీ నుంచి వచ్చిన కొత్త కవరులో కొత్తనేత పేరుంటుంది. అతడు ముఖ్యమంత్రి అవుతాడు. ఇది సీల్డు కవరుస్వామ్యం! దీన్ని స్వతంత్ర భారతంలో అధికకాలం అధికారం అనుభవించిన కాంగ్రెస్ ఈ సంస్కృతిని పుట్టించి, పెంచి పోషిస్తోంది. తాము గెలిస్తే కాబోయే ప్రధానమంత్రి ఎవరో, కాబోయే ముఖ్యమంత్రి ఎవరో ప్రకటించకపోవడంలో ఓ సౌలభ్యమూ ఉంది. ఫలితాలు ప్రకటించాక ఆ ఎన్నికల్లో ఆ నాయకులు తాము పోటీ చేసిన స్థానాల్లో ఓడిపోవచ్చు. అప్పుడు వాళ్లూ అభాసుపాలవుతారు. వాళ్ల పార్టీ ప్రతిష్ఠా మసకబారుతుంది. ముందు ప్రకటించకపోతే ఈ దుస్థితీ తప్పిపోతుంది. ఏమైనా... అనుకోనిస్వామ్యంలో కొత్త వ్యక్తులకు పట్టం కట్టవచ్చు. కొత్తొక వింత... పాతొక రోత అన్నారుగా!

- శంకరనారాయణ

ఈనాడు లేఖలు

ఆర్టీసీ సిబ్బందికి పోస్టల్ ఓటు

తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆర్టీసీ సిబ్బందిని ఉపయోగించుకున్న ఎన్నికల సంఘం అధికారులు వారిని ఓటుకు దూరంగా ఉంచడం అన్యాయం. పోలింగ్ ముందు రోజు నుంచే ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని తరలించడం లాంటి పనులను ఆర్టీసీ సిబ్బంది చేపడుతుంటారు. ఇక ఎన్నికల రోజు సొంతవూళ్లకు ప్రయాణమయ్యే సామాన్య ప్రజలను గమ్యస్థానాలకు చేరవేయడానికి కూడా ఆర్టీసీ బస్సులు తిప్పారు. ఆ రోజు ఎవరికీ వ్యక్తిగత సెలవును సైతం మంజూరు చేయరు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడానికి సహకరిస్తున్న ఆర్టీసీ సిబ్బంది మాత్రం ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో వారికి పోస్టల్ బ్యాలట్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- గూరుడు అశోక్,
గోదూర్, జగిత్యాల జిల్లా

తగని రాజకీయం

రాష్ట్రాలకు కేంద్రం నిధులు విడుదల చేయడంలో రాజకీయం ప్రముఖ పాత్ర పోషించడం అనారోగ్య సంప్రదాయానికి తెరతీస్తోంది. రాష్ట్రాల సముదాయమే దేశమనే కనీస పరిజ్ఞానం లేకుండా కేంద్రంలో ఉన్న పాలకపక్షం పక్షపాతంతో వ్యవహరించడం పూర్తిగా అహేతుకం. ఆయా రాష్ట్రాల నుంచి వసూలైన నిధులే తమకు చేరుతున్నాయన్న అంశాన్ని కేంద్రం గుర్తుంచుకోవాలి. నిధుల కేటాయింపులో పక్షపాత ధోరణితో, రాజకీయ కక్షతో వ్యవహరించడం, సరైన సమయంలో నిధులు అందజేయకపోవడం వంటి చర్యలకు పాల్పడటం గర్హనీయం. ఇలాంటి పెడధోరణులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి హానికరం!

- ప్రభాకర్ తల్లాప్రగడ,
మదీనాగూడ, హైదరాబాద్

ఆదిత్య హృదయం

రామరావణ యుద్ధం జరుగుతోంది. గొప్ప తపశ్శక్తితో పరమశివుడి అనుగ్రహం పొందిన రావణుడు ధైర్యంగా శ్రీరాముణ్ని ఎదుర్కొంటున్నాడు. రావణుణ్ని ఎలా సంహరించడమా అని శ్రీరాముడు తీవ్రంగా యోచిస్తున్నాడు. ఈ యుద్ధాన్ని అంతరిక్షం నుంచి దేవతలు, గంధర్వులు, మహర్షులు మొదలైనవారంతా తిలకిస్తున్నారు. వారిలో అగస్త్య మహర్షి కూడా ఉన్నాడు. రావణుడి యుద్ధ తీవ్రత చూసి దిగులుతో ఉన్న శ్రీరాముడి సమీపానికి అగస్త్యుడు వచ్చి అతడి దైవత్వాన్ని గుర్తుచేసి ఆదిత్య హృదయ మంత్రం బోధిస్తాడు.

సూర్యుడికి గల విశేష నామాలు ఆదిత్య హృదయంలో ప్రస్తావితమయ్యాయి. ప్రాణికోటిని పూజించేవాడు గనుక 'పూష'. కిరణాలతో శోభిల్లేవాడు గనుక 'గభస్తిమంతుడు'. గర్భంలో పుష్కలంగా హిరణ్యం దాచుకున్న హిరణ్యగర్భుడు. ఇట్లా ఎన్నో పేర్లతో సార్థక నామధేయుడు సూర్యుడు.

బ్రహ్మ సృష్టికి మూలం. సమస్త జీవజాలానికి ఉదయ గుణం ఇచ్చేవాడు బ్రహ్మ. ఉదయం వివేకోదయానికి చిహ్నం. జ్ఞాన వివేచనలకు ఉదయకాలం బ్రహ్మ జ్ఞానంతో సమానమంటారు విజ్ఞులు. సకల లోకాలకు శుభాలు కూర్చేవాడు శంకరుడు మధ్యాహ్నకాలానికి ప్రతీక. జీవనదులకు, పంట పొలాలకు, మానవాళికి శక్తి ప్రదాత మార్తాండుడు. సాయంకాలం విష్ణురూపం. విష్ణువు సర్వ వ్యాపకుడు. సాయంకాలం విష్ణువులా జగత్తుకు తేజస్సును ఇచ్చే లోకబాంధవుడిగా సూర్యుణ్ని కొలుస్తాం. వేదాల్లో సూర్యదేవతా సూక్తం ఉంది. సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు.

వాల్మీకి రామాయణంలోని 'ఆదిత్య హృదయం' నిత్య పారాయణ యోగ్యం. యుద్ధకాండలో 107వ సర్గలో 31 శ్లోకాల్లో ఉంది. ఇది కేవలం స్తోత్రం కాదు. సకల తేజస్సును, ఓజస్సును, శక్తిని, సామర్థ్యాన్ని తనలో మిళితం చేసుకొని తనను ఆరాధించేవారిని తగిన రీతిలో తరింపజేసే స్తోత్రరాజం ఆదిత్య హృదయం. ఆదిత్యులు పన్నెండు మంది. వీరిలో విష్ణువు కూడా ఒకడు. ఆదిత్యుల్లో ప్రధానస్థానం వహించిన విష్ణువును ఉద్దేశించి చెప్పిన స్తోత్రం ఇది. శాంతిని, కాంతిని, స్థిరత్వాన్ని, స్థాయిని ప్రసాదించే సామర్థ్యం ఆదిత్య హృదయంలో ఉంది. రామచంద్రుడికి రణరంగంలో సహకరించినట్లుగానే ఆదిత్య హృదయం ప్రాణికోటికి జీవితంలో ఉపకరిస్తుంది. కృష్ణార్జునుల మధ్య గీతామృతం ప్రవహించినట్లుగానే అగస్త్య రామచంద్రులు ఆలంబనంగా ఆదిత్య హృదయం ఆవిర్భవించింది. రెండూ రణరంగంలోనే వెలువడటం విశేషం.



అంతర్యామి

ఆదిత్య హృదయంలోని మొదటి తొమ్మిది శ్లోకాలు స్తోత్రానికి పూర్వ రంగాన్ని సమకూరుస్తాయి. చివరి తొమ్మిదీ స్తోత్ర ప్రాశస్త్యాన్ని, ఫలశ్రుతిని అందిస్తాయి. మధ్య పన్నెండు శ్లోకాలు ద్వాదశాదిత్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కనిపిస్తుంది. స్తుతి మధ్య భాగంలో 'ద్వాదశాత్మన్నమోస్తుతే' అనే నమోవాకం ఉంది.

అగస్త్యుడు శ్రీరాముని 'రామరామ మహాబాహో' అని సంబోధిస్తాడు. ఆదిత్య హృదయం పరమ పవిత్రమని, సర్వశత్రు వినాశనమని నిత్యం, అక్షయం, పరమ కల్యాణదాయకమైన స్తోత్రమని వివరిస్తాడు. భాస్కరుడిలో సకల దేవతలు మూర్తీభవించి ఉన్నారని అగస్త్యుడు వివరిస్తాడు. ఇంద్రుడు, కుబేరుడు, యముడు, సోముడు, వరుణుడు, పితృ దేవతలు, అష్ట వసువులు, అశ్వినీ దేవతలు, మరుద్గణాలు- అందరూ భాస్కరుడి ప్రతిరూపాలే. గాలి, అగ్ని, ఊపిరి, రుతువులు- వీటన్నింటికీ ఆధారం సూర్యుడు. సమస్త ప్రాణులందు అంతర్యామి రూపంలో ఉంటూ వారు నిద్రపోయినా తాను మేల్కొంటాడు. సర్వకాల సర్వావస్థల్లోనూ మనకు తోడునీడగా మనలో వెలుగుతున్న ఆదిత్య రూపం సర్వదా ఆరాధ్యం. ఆదిత్య స్తోత్రాన్ని మూడుసార్లు పఠిస్తే యుద్ధంలో విజయం లభిస్తుందని అగస్త్యుడు బోధిస్తాడు. ఆ తరవాత శ్రీరాముడు ఆనందంతో, నిష్ఠతో ఆదిత్య హృదయం జపించి రావణ సంహారం గావిస్తాడు.

- డాక్టర్ దామెర వేంకట సూర్యారావు




హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఉన్నతాధికారులు, హైకోర్టు న్యాయవాదులు, ఉద్యోగులు ★ ముఖ్యమంత్రి కేసీఆర్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్‌రెడ్డి, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.ఎం. ఖాద్రీ, ఉత్తరాఖండ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ (కుడి నుంచి ఎడమకు వరుసగా)

తెలంగాణ హైకోర్టు ఆవిర్భావం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణవాసుల ఆకాంక్షలకు అనుగుణంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఏర్పాటైంది. తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఉదయం 8.30 గంటలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం హైకోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తి హోదాలో జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ మిగిలిన 12 మంది న్యాయమూర్తులతో ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్, జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ చల్లా కోదండరాం చౌదరి, జస్టిస్ బి.శివశంకరరావు, జస్టిస్ షమీమ్ అక్తర్, జస్టిస్ పి.కేశవరావు, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్ ప్రమాణం చేశారు. ఉమ్మడి హైకోర్టు విభజనకు రాష్ట్రపతి జారీ చేసిన నోటిఫికేషన్, న్యాయమూర్తుల కేటాయింపులకు సంబంధించిన నోటిఫికేషన్లను, ప్రధాన న్యాయమూర్తి ఇతర న్యాయమూర్తులతో ప్రమాణం చేయించడానికిగాను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వెంకటేశ్వరరెడ్డి చదివి వినిపించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారాల అనంతరం ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులతో కలిసి తేనీటి విందులో పాల్గొని, అందరికీ అభినందనలు తెలిపారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, ఉత్తరాఖండ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌లతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్, అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు, మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్లు సయ్యద్ అక్బర్ హుస్సేన్, వాసుదేవరెడ్డి టీఎస్‌పీఎస్సీ, బీసీ కమిషన్ల ఛైర్మన్లు ఘంటా చక్రపాణి, బీఎస్ రాములు, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు, తదితరులు హాజరయ్యారు. గవర్నర్ కార్యాలయంలో ప్రధాన న్యాయమూర్తి దంపతులకు గవర్నర్ దంపతులు అభినందనలు తెలిపారు.



తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, ముఖ్యమంత్రి కేసీఆర్‌లతో న్యాయమూర్తులు

బాణసంచా.. నినాదాలు

న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం పూర్తయిన వెంటనే హైకోర్టు భవనాలవద్ద బాణసంచా పేల్చారు. న్యాయమూర్తులు వేదిక దిగగానే న్యాయవాదులు 'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేశారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు పరస్పర అభినందనలతో హర్షం వ్యక్తం చేశారు.

కొత్త బెంచ్‌లు.. బాధ్యతలు

తెలంగాణ హైకోర్టు ఏర్పాటుతో పని విభజనలో భాగంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ కొత్త బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ప్రధాన న్యాయమూర్తి సహా మొదటి ముగ్గురు సీనియర్ న్యాయమూర్తుల నేతృత్వంలో ధర్మాసనాలు ఏర్పాటయ్యాయి. మిగిలిన న్యాయమూర్తులు ఏకసభ్య ధర్మాసనాలుగా కేసుల విచారణ చేపడతారు. ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనంలో జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, రెండో ధర్మాసనంలో జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్, మూడో ధర్మాసనంలో జస్టిస్ ఆర్.సుబ్రమణియన్, జస్టిస్ పి.కేశవరావులు కేసుల విచారణ చేపడతారు. బాధ్యతల విభజనలో భాగంగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ అప్పీళ్లు, కోర్టు ధిక్కరణ అప్పీళ్లు, హెబియస్ కార్పస్ పిటిషన్లు, సుమోటో పిటిషన్లు, పర్యావరణ, వినియోగదారుల వివాదాలతో కూడిన కేసులపై ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం, క్రిమినల్, కుటుంబ న్యాయస్థానాల అప్పీళ్లు, భూసేకరణ అప్పీళ్లు, తదితర కేసులపై రెండో ధర్మాసనం, పన్నులకు సంబంధించిన ట్రైబ్యునళ్ల అప్పీళ్లు, చట్టాలు, చట్ట నిబంధనలు, మనీలాండరింగ్ కేసులపై మూడో ధర్మాసనం విచారణ చేపడతాయి. జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్‌కు రెవెన్యూ, యూఎల్సీ, భూసంస్కరణలు, హౌసింగ్, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలు, జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావుకు సివిల్ రివిజన్ పిటిషన్లు, ఒరిజనల్ పిటిషన్లు, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డికి వాహన ప్రమాదాలకు చెందిన తుది విచారణలు, జస్టిస్ పి.నవీన్‌రావుకు హోం, విద్య, వైద్య ఆరోగ్య, బీసీ, సాంఘిక సంక్షేమశాఖలు, కేంద్ర ప్రభుత్వ శాఖలను, జస్టిస్ చల్లా కోదండరాంకు పురపాలక పట్టణాభివృద్ధి, పౌరసరఫరాలు, టీటీడీ, సాధారణ పరిపాలన భూసేకరణ, గనులు, రవాణా, దేవాదాయ, ఎక్సైజ్, అటవీశాఖలు, జస్టిస్ బి.శివశంకరరావుకు క్రిమినల్ రివిజన్ పిటిషన్లు, జస్టిస్ షమీమ్ అక్తర్‌కు బెయిళ్లు, క్రిమినల్ అప్పీళ్లు, సర్వీసు వివాదాలకు సంబంధించిన కేసులు, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలికి సర్వీసు పిటిషన్లు, పరిపాలనా ట్రైబ్యునల్ నుంచి బదిలీ అయిన కేసులు, తదితరాలను కేటాయించారు.

కొత్త వెబ్‌సైట్లు

జనవరి 1 నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వేర్వేరుగా హైకోర్టులు ఏర్పాటుకావడంతో.. గతంలో ఉమ్మడి హైకోర్టు వెబ్‌సైట్ స్థానంలో రెండు హైకోర్టులకు వేర్వేరుగా కొత్త వెబ్‌సైట్లను రూపొందించారు.

జస్టిస్ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం

- తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేయించిన గవర్నర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆయనతో ప్రమాణంచేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. ఉదయం 8.30 గంటలకు ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం గవర్నర్, సీఎం కేసీఆర్.. జస్టిస్ రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలిపారు. ఆయన సతీమణికి గవర్నర్ సతీమణి విమలానరసింహన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేసీఆర్ తెలంగాణ హైకోర్టు కొత్త న్యాయమూర్తులను కలిసి అభినందనలు తెలిపారు. అక్కడే ఉన్న తెలంగాణ సీనియర్, యువ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో కేసీఆర్‌ను కలిసి ఆనందం వ్యక్తంచేశారు. ఆయన కృషి వల్లే తెలంగాణ వచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ హైకోర్టు ఆవిర్భావంపై సీఎం వారితో సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చిన తేనీటి విందులో సీఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, కార్పొరేషన్ల ఛైర్మన్లు సయ్యద్ అక్బర్ హుస్సేన్, వాసుదేవరెడ్డి, టీఎస్‌పీఎస్సీ, బీసీ కమిషన్ల ఛైర్మన్లు ఘంటా చక్రపాణి, బీఎస్ రాములు, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఏసీబీ డీజీ పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్

ఏపీలో కొలువుదీరిన కొత్త హైకోర్టు

- 14 మంది న్యాయమూర్తుల ప్రమాణం
- తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్ కుమార్..


ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుడుతూ మంగళవారం నూతన హైకోర్టు కొలువుదీరింది. భారీగా తరలివచ్చిన న్యాయాధికారులు, న్యాయవాదులు, సిబ్బంది, ఇతరుల సాక్షిగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ సహా 14 మంది న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గవర్నరు నరసింహన్ వారి చేత ప్రమాణం చేయించారు. తొలుత తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్ ప్రమాణం చేశారు. ఆ తర్వాత జస్టిస్ సరస వెంకట నారాయణ భట్టి, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ మంధాత సీతారామమూర్తి, జస్టిస్ ఉప్మాక దుర్గా ప్రసాదరావు, జస్టిస్ తాళ్లూరి సునీల్ చౌదరి, జస్టిస్ మల్లవోలు సత్యనారాయణ మూర్తి, జస్టిస్ గుడిసేవ శ్యాంప్రసాద్, జస్టిస్ జవలాకర్ ఉమాదేవి, జస్టిస్ నక్కా బాలయోగి, జస్టిస్ తేలప్రోలు రజని, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ కొంగర విజయలక్ష్మి, జస్టిస్ మంతోజ్ గంగారావు వరుసగా ప్రమాణం చేశారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ప్రమాణ స్వీకార మహోత్సవం 11:30 గంటలకు ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ చల్లా కోదండరాం చౌదరి, జస్టిస్ బి.శివశంకరరావు, జస్టిస్ షమీమ్ అక్తర్, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ టి.అమర్‌నాథ్ గౌడ్‌లతో ప్రమాణం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ నరసింహన్. వేదికపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణం చేస్తున్న జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ పి.కేశవరావు, జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్, జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు

పూర్తయిన ఉద్యోగుల విభజన

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టులో పనిచేస్తున్న ఉద్యోగుల విభజనను సోమవారం చేపట్టిన హైకోర్టు.. రాత్రి పొద్దుపోయే వరకూ నిర్వహించి మొత్తం ప్రక్రియను పూర్తి చేసింది. హైకోర్టు ఇప్పటికే ఉద్యోగుల నుంచి ఐచ్ఛికాలను సీల్డ్‌కవర్‌లో తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు ఐచ్ఛికాలు ఇచ్చినవారిని ఆ రాష్ట్రానికి కేటాయిస్తూ ఉమ్మడి హైకోర్టు (పరిపాలన) రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. వారు ఈనెల 4లోగా అమరావతిలోని ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వద్ద రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అయితే ఎక్కువ మంది తెలంగాణకే ఐచ్ఛికాలు ఇచ్చారు. వారి హోదాకు తగ్గ పోస్టులు ఇక్కడ ఖాళీగా లేకపోవడంతో ఏపీకి డిప్యుటేషన్‌పై పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ హోదా పోస్టులు ఇక్కడ ఖాళీ అయితే సీనియారిటీ ప్రకారం ఏపీ నుంచి తెలంగాణకు రావచ్చు. మరికొంత మందిని తెలంగాణలోని దిగువ కోర్టులకు డిప్యుటేషన్‌పై కేటాయించారు. జాయింట్ రిజిస్ట్రార్ పి.శ్రీధర్‌రావు తెలంగణకు ఐచ్ఛికంఇచ్చినా ఇక్కడ పోస్టులేకపోవడంతో ఏపీకి డిప్యుటేషన్‌పై పంపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేడర్‌లో 12 మందిని, సెక్షన్ ఆఫీసర్ కేడర్‌లో 51మందిని, డిప్యూటీ సెక్షన్ ఆఫీసర్ కేడర్‌లో 13 మందిని, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కేడర్‌లో 36 మందిని, ఎగ్జామినర్ కేడర్‌లో 67 మందిని, ఆఫీస్ సబార్డినేట్ కేడర్‌లో 151 మందిని దిగువ కోర్టులకు పంపారు. ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తుది ఉత్తర్వులుగా ఇవి నిలిచాయి.

ఏపీకి తెలంగాణ ఉద్యోగుల ఐచ్ఛికాలు

ఏపీ రాష్ట్రానికి కొంతమంది తెలంగాణ ఉద్యోగులు ఐచ్ఛికాలు ఇవ్వడం విశేషం. అక్కడ పదవీ విరమణ వయసు 60 ఏళ్లుగా ఉండటంతో పదవీ విరమణకు దగ్గరగా ఉన్న తెలంగాణ ఉద్యోగులు ఏపీకి ఐచ్ఛికాలు ఇచ్చారు. అయితే ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం కూడా పదవీ విరమణ వయసును పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ, అప్పటికే ఐచ్ఛికాలు ఇచ్చినందున వాటిని మార్చుకోలేకపోయారు.

ఉద్యోగుల విభజన ఇలా..

హోదా	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్
జాయింట్ రిజిస్ట్రార్‌లు	3	1
డిప్యూటీ రిజిస్ట్రార్‌లు	5	7
అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు	15	9
సెక్షన్ ఆఫీసర్లు	67	38
కోర్టు మాస్టర్లు	75	46
డిప్యూటీ సెక్షన్ ఆఫీసర్లు	20	15
అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు	43	21
అసిస్టెంట్‌లు	94	38
ఎగ్జామినర్లు	29	9
టైపిస్టులు	31	6
కాపీయిస్టులు	31	20
డ్రైవర్లు	58	4
రికార్డ్ అసిస్టెంట్లు	77	7
ఆఫీస్ సబార్డినేట్లు	213	50

విభజన పూర్తయినట్లే!

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: హైదరాబాద్ నుంచి ఏపీకి హైకోర్టు తరలిరావడంతో రాష్ట్ర విభజన పూర్తయినట్లేనని అనుకుంటున్నానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అక్కడి నుంచి రావాల్సినవి ఇంకేమీ లేవని, డబ్బులు, ఇతరత్రా మాత్రమే రావాల్సి ఉందన్నారు. ఈ గడ్డ నుంచి న్యాయ పరిపాలనకు 62 ఏళ్ల తర్వాత మళ్లీ శ్రీకారం చుట్టామని చంద్రబాబు పేర్కొన్నారు. తక్కువ సమయంలోనే హైకోర్టు తరలివచ్చినందున ప్రాథమికంగా కొన్ని ఇబ్బందులుంటాయని, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని వెల్లడించారు. విజయవాడలో మంగళవారం హైకోర్టు తాత్కాలిక సముదాయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. అందరం ముందే మానసికంగా సిద్ధమై ఇక్కడికి వస్తున్నామని, ఎలాంటి ఇబ్బంది ఉన్నా సహృదయంతో తీసుకుంటామని తాత్కాలిక సీజే తనతో అన్నారని చంద్రబాబు చెప్పారు.

దేశంలో ఆదర్శ హైకోర్టుగా ఎదగాలి

- ఏపీ హైకోర్టు తాత్కాలిక వసతి సముదాయ ప్రారంభోత్సవంలో జస్టిస్ ఎన్వీ రమణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహైకోర్టు ఏర్పాటు చేయాలన్న ప్రజల చిరకాల కోరిక వాస్తవరూపం దాల్చిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. దేశంలోనే ఆదర్శంగా ఉండేలా ఏపీ హైకోర్టు ఎదగాలని ఆకాంక్షించారు. విజయవాడలో మంగళవారం హైకోర్టు తాత్కాలిక భవనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జస్టిస్ ఎన్వీ రమణ ప్రారంభించారు. కోర్టు గదులను ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడారు. నవ్యాంధ్ర రాజధానిలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేకహైకోర్టు ఏర్పడిందన్నారు. గత 62 ఏళ్లల్లో మూడు ప్రాంతాలకు మారిన హైకోర్టు.. అమరావతికి రావడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. మాతృభూమికి, సొంత ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన న్యాయవాదులు, న్యాయమూర్తులందరికీ ఈ ప్రాంత వాసిగా ప్రజల తరపున స్వాగతం పలుకుతున్నానని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తాత్కాలిక హైకోర్టు భవన నిర్మాణాలను ఏపీ హైకోర్టు న్యాయమూర్తుల బృందం మంగళవారం సాయంత్రం పరిశీలించింది.

జిల్లాల మధ్య 'సులభతర' పోటీ!

- అన్ని చోట్లా పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం
- 'ఈవోడీబీ కార్యాచరణ'కు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక
- ఈ నెల నుంచే అమలు

ఈనాడు, హైదరాబాద్: పరిశ్రమల సాధనకు ఇప్పటి వరకు ఇతర రాష్ట్రాలతో పోటీ పడ్డ తెలంగాణ ప్రభుత్వం. . ఆ తరహా పోటీని జిల్లాల మధ్య ప్రోత్సహించాలని నిర్ణయించింది. ప్రపంచ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే సులభతర వాణిజ్య నిర్వహణ(ఈవోడీబీ) ర్యాంకుల తరహా విధానాన్ని జిల్లాల స్థాయికి విస్తరించేందుకు కార్యాచరణ చేపట్టింది. పోటీలో ముందంజలో నిలిచేందుకు జిల్లాలకు ప్రత్యేక లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. పారిశ్రామిక అభివృద్ధిలో పురోగమించే జిల్లాలకు ఈవోడీబీ ర్యాంకుల ఆధారంగా ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించింది. తద్వారా అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు విస్తరించడంతోపాటు రాష్ట్రం కూడా అత్యున్నత ర్యాంకును పొందేందుకు దోహదపడుతుందని భావిస్తోంది. ఈ కార్యాచరణను ఈ నెల నుంచే అమలు చేయనున్నారు.

తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి విశేష ప్రాధాన్యం ఇచ్చింది. పారిశ్రామిక అనుమతులు, స్వీయ ధ్రువీకరణ విధానాన్ని(టీఎస్ఐపాస్) సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అప్పటి పరిశ్రమల మంత్రి కేటీఆర్ ఈ విధానం అమలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. దీంతో ఈవోడీబీలో 2017లో దేశంలో ప్రథమ స్థానం పొందిన తెలంగాణ.. 2018లో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. 2019లో ఈవోడీబీలో మళ్లీ ప్రథమ స్థానం సాధించాలనే లక్ష్యంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు జిల్లాలను కూడా సన్నద్ధం చేయాలని నిర్ణయించింది. తెలంగాణలో ప్రస్తుతం 31 జిల్లాలున్నాయి. త్వరలో మరో రెండు జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్‌లు మాత్రమే పారిశ్రామికాభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. మహబూబ్‌నగర్, కొత్తగూడెం, వరంగల్ నగర జిల్లాల్లో కొంత మేరకు పరిశ్రమలున్నాయి. తాజా లక్ష్యం మేరకు అన్ని జిల్లాల్లో పరిశ్రమలను పెద్దఎత్తున అభివృద్ధి చేసేందుకు వీలుగా ఈవోడీబీ విధానాన్ని వాడుకోనున్నారు.

కార్యాచరణ ఇలా..

★ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి జిల్లా కలెక్టర్లకు తాజాగా మార్గనిర్దేశం చేశారు. దీని ప్రకారం అన్ని జిల్లాల్లోనూ పారిశ్రామికాభివృద్ధిని పెద్దఎత్తున ప్రోత్సహించి ఈవోడీబీ ర్యాంకుల సాధన లక్ష్యంతో పనిచేయాలి. ఇందు కోసం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీల ఏర్పాటు.

★ రాష్ట్రస్థాయిలో మాదిరే జిల్లాల్లోనూ సేవలను నవీకరించాలి. సత్వర అనుమతులతో సౌకర్యాలను మెరుగుపరచాలి. పారిశ్రామికవేత్తలతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనలు తీసుకోవాలి.

★ జిల్లాల్లో భారీ పరిశ్రమలతోపాటు చిన్న, మధ్య తరహా, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటునుప్రోత్సహించాలి.

★ ఇప్పటికే జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాల భూమిని పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం గుర్తించింది. భూములు అందుబాటులో ఉన్నందున వాటి కేటాయింపులు, ఇతర అంశాలపై దృష్టి సారించాలి.

★ ఈవోడీబీలో ప్రభుత్వాల విధానాలు, పరిశ్రమలు, వ్యాపారాల ఏర్పాటుకు అనుమతులు వంటి దాదాపు 370 అంశాల్లో స్థితిగతులను అధ్యయనం చేస్తారు. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల్లో అధ్యయనం జరుపుతుంది.

పురస్కారాలు..

పారిశ్రామిక అభివృద్ధిలో పురోగమించే జిల్లాలకు ఈవోడీబీ ర్యాంకుల ఆధారంగా ప్రోత్సాహకాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించే జిల్లాలకు పురస్కారాలను అందించాలని యోచిస్తోంది.

సీఎంకు ఇక కొత్త ఓఎస్డీ



శ్రీధర్‌రావు దేశ్‌పాండే

ఈనాడు, హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేకాధికారి (ఓఎస్డీ)గా నీటిపారుదలశాఖ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ శ్రీధర్‌రావు దేశ్‌పాండేను నియమించనున్నారు. ఆ దస్త్రంపై మంగళవారం కేసీఆర్ సంతకం చేశారు. ఉత్తర్వులు బుధవారం జారీ అయ్యే అవకాశం ఉంది. ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన దేశ్‌పాండే తెలంగాణ ఉద్యోగుల సంఘం, విద్యావంతుల వేదిక, ఇంజినీర్ల ఐకాస, రాష్ట్ర ఐకాస వ్యవస్థాపక నేతల్లో ఒకరు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత ఆయన నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు పేషీలో ఓఎస్డీగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ శాఖను సీఎం నిర్వహిస్తుండటంతో, ఇరిగేషన్ రంగంలో ఎంతో అనుభవం గల దేశ్‌పాండేను ప్రత్యేకాధికారి పదవి వరిస్తోంది. కాళేశ్వరం పర్యటనలోనూ మంగళవారం సీఎం వెంట ఆయన ఉన్నారు.

తన వల్ల దూడ చనిపోయిందనే ఆవేదనతో యువకుడి ఆత్మహత్య



బాలునాయక్ (పాత చిత్రం)

తిరుమలగిరి(సాగర్), న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం సుంకిశాల తండాకు చెందిన రమావత్ గ్యామాకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు బాలునాయక్(19) చిన్నతనం నుంచి గొర్రెలు, ఆవులను మేపేవాడు. యథావిధిగా గత శుక్రవారం వాటిని మేతకు తోలుకెళ్లాడు. మంద నుంచి వేరుపడుతోందన్న కోపంతో ఓ దూడపై రాయి విసిరాడు. రాయి తలకు బలంగా తగలడంతో అది అక్కడికక్కడే మరణించింది. అప్పటినుంచి బాలునాయక్ ఇంటికి రాలేదు. మూడు రోజుల నుంచి కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. మంగళవారం అతని మృతదేహం చేపల వలలో చిక్కింది. దీంతో అతను ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులు నిర్ధారణకు వచ్చారు. 'తన చేతిలో దూడ చనిపోవడం, దాన్ని తట్టుకోలేక తల్లి ఆవు తల్లడిల్లడం వంటి పరిణామాలతో అతను మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని గ్రామస్థులు పేర్కొన్నారు. దూడ చనిపోయిందనే కారణంతో కుమారుడు ఆత్మహత్య చేసుకోవడాన్ని జీర్ణించుకోలేని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రత్యేక హైకోర్టుతో సంపూర్ణ రాష్ట్రం ఏర్పాటు

ఎంపీ వినోద్ కుమార్


ఈనాడు, దిల్లీ: ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుతో సంపూర్ణ తెలంగాణ ఏర్పడినట్లు రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. దిల్లీలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైకోర్టు ఏర్పాటుతో ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. పార్లమెంట్ లోపల, బయట తాము చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని ఆయన పేర్కొన్నారు. హైకోర్టు ఏర్పాటుతో తెలంగాణలో న్యాయ వ్యవస్థ మరింత పటిష్ఠం అవుతుందన్నారు. కొత్త జిల్లాల్లోనూ జిల్లా కోర్టులు, క్షేత్ర స్థాయిలో న్యాయ సేవలు వేగంగా అందేలా అనుబంధ కోర్టులు ఏర్పాటు కానున్నాయని ఆయన తెలిపారు.

సారూ.. నేను మందు తాగలేదు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనం నడిపినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వ్యక్తి తాను మద్యం తాగలేదంటూ చెప్పినా వినలేదు. చివరికి ఆసుపత్రి నుంచి తాను మద్యం తాగలేదని నివేదిక తీసుకువచ్చినా వారు అంగీకరించలేదు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి తాడ్‌బంద్ చౌరస్తాలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన నాగభూషణ్‌రెడ్డి(32) తాడ్‌బంద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో విధులు నిర్వర్తిస్తున్నాడు. నెలాఖరు కావడంతో సోమవారం అర్ధరాత్రి వరకు విధులను నిర్వర్తించి రాత్రి 12గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. తాడ్‌బంద్ చౌరస్తా సమీపంలో 'డ్రంక్ అండ్ డ్రైవ్' సోదాలు నిర్వహిస్తున్న తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు అతడికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయడంతో భారీగా మద్యాన్ని సేవించినట్లు చూపింది. పోలీసులు అతని వాహనాన్ని సీజ్ చేశారు. బాధితుడు స్వయంగా అప్పటికప్పుడు గాంధీ ఆసుపత్రికి వెళ్లి ఒంటి గంట ప్రాంతంలో పరీక్షలు చేయించుకుంటే అక్కడి వైద్యులు అతడికి 'క్లీన్ చిట్' ఇస్తూ ఎమ్మెల్సీ నివేదికను జారీ చేశారు. మంగళవారం ఆ నివేదికతో వెళ్లినా తనకు వాహనాన్ని ఇవ్వడానికి పోలీసులు అంగీకరించలేదని బాధితుడు ఆరోపించాడు. ఈ విషయమై తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవిని వివరణ కోరగా.. బ్రీత్ అనలైజర్ పరీక్షలో అతడు మద్యం సేవించినట్లు నిర్ధారణ అయిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని తెలిపారు.



మద్యం సేవించినట్లు పోలీసులు జారీ చేసిన రసీదు



మద్యం తాగలేదని గాంధీ వైద్యులిచ్చిన పత్రం



బాధితుడు నాగభూషణ్‌రెడ్డి

తెలంగాణ ప్రభుత్వము

రెవెన్యూ(భూసేకరణ)-శాఖ, మెదక్ జిల్లా

సత్యమేవ జయతే

ఫారం-సి

ప్రకటన

(భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు(తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టము నం. 21/2017) ద్వారా సవరించబడిన భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) ప్రకారం మరియు 10 మినహాయింపు అనుసరించి)

(రూల్ 6/12చూడుము)

కలెక్టర్ ఫైల్ నం. G1/346/2018 తేది:29/11/2018

రెవెన్యూ డివిజనల్ అధికారి/ భూ సేకరణ అధికారి, ఫైల్ నం. సి/377/2018 తేది:13/11/2018

గెజిట్ నం. 40 తేది:/12/2018

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, మెదక్ గారు దిగువ నిర్దిష్ట పరిచిన మెదక్ జిల్లాలోని చేగుంట మండలంలోని మక్కరాజ్‌పేట్ గ్రామంలో ఉన్న భూమి సుమారు విస్తీర్ణం ఎ.07.07 గుంటలు ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా కాళేశ్వరము ప్రాజెక్ట్ (ప్యాకేజ్-17) ప్రధాన కాలువ నిర్మాణము కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించనైనది.

కావున మెదక్ జిల్లా చేగుంట మండలములోని మక్కరాజ్ పేట్ గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణం ఎ.7.07 గుంటలు గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం, ప్రాథమిక నోటిఫికేషన్ జారి చేయనైనది.

జిల్లా: మెదక్ మండలం: చేగుంట గ్రామము: మక్కరాజ్‌పేట్

షెడ్యూలు

గ్రామము: మక్కరాజ్‌పేట్ మండలం: చేగుంట జిల్లా: మెదక్

క్రమ సంఖ్య	సర్వే నెం.	పట్టా రకం	భూమి రకం	భూసేకరణ చేయు విస్తీర్ణం	భూమి పట్టాదారు /అనుభవదారు ఆసక్తిదారు పేరు/ తండ్రి పేరు మరియు చిరునామా	సరిహద్దులు (సర్వే నెంబర్లు) తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు రకం	సంఖ్య	నిర్మాణములు రకం	సంఖ్య
1	2	3	4	5	6	7	8	9	10	11		12	
1	114/1/9	గైరాన్	ఖుష్కి	00-17	చంద లలిత భర్త రాములు	గొడుగు వల్లి శివారు	114	114	118	వేప మునగ మామిడి తునికి ఇప్ప ఎగి	1 1 1 1 1 4	గుడుసే పైపులైన్ డ్రిప్ బోర్‌వెల్	1 3 1 3
2	114/1/8	గైరాన్	ఖుష్కి	00-17	చంద రేణమ్మ లక్ష్మయ్య	గొడుగు వల్లి శివారు	114	114	118	-	-	-	-
3	114	గైరాన్	ఖుష్కి	00-14	ప్రభుత్వ భూమి	114	116	114	114	-	-	-	-
4	114	గైరాన్	ఖుష్కి	00-06	ప్రభుత్వ భూమి	114	114	114	114	-	-	-	-
5	114	గైరాన్	ఖుష్కి	00-06	ప్రభుత్వ భూమి	114	114	114	118	-	-	-	-
6	114	గైరాన్	ఖుష్కి	00-06	ప్రభుత్వ భూమి	114	114	114	118	-	-	-	-
7	114	గైరాన్	ఖుష్కి	00-12	ప్రభుత్వ భూమి	114	116	114	114	-	-	-	-
8	114	గైరాన్	ఖుష్కి	00-03	ప్రభుత్వ భూమి	116	114	114	114	-	-	-	-
9	114/20	గైరాన్	ఖుష్కి	00-11	మొట్ట నర్సయ్య తండ్రి పోచయ్య	114	114	114	114	-	-	-	-
10	114/12	గైరాన్	ఖుష్కి	00-12	మొట్ట తులసమ్మ భర్త భీమయ్య	114	114	114	114	-	-	-	-
11	114/10	గైరాన్	ఖుష్కి	00-33	చాకలి రాములు తండ్రి దుబ్బయ్య	114	[illegible]	[illegible]	115	వేప సుబాబు శనంగి గుంపెన	2 2 1 1	బోర్‌వెల్	1
12	114/20	గైరాన్	ఖుష్కి	00-10	మొట్ట నర్సయ్య తండ్రి పోచయ్య	114	116	116	114	-	-	-	-
13	116	పట్టా	ఖుష్కి	00-19	మెడ ప్రేమలత భర్త రాఘవరెడ్డి కంజర్ల వీరమని భర్త కుమారస్వామి (మోక ప్రకారం)	114	116	116	114	వేప తుమ్మ	7 1	-	-
14	116	పట్టా	ఖుష్కి	00-19	మెడ ప్రేమలత భర్త రాఘవరెడ్డి (కంజర్ల సిద్దప్ప తండ్రి చంద్రప్ప) (మోక ప్రకారం)	116	114	116	115	-	-	-	-
15	116	పట్టా	ఖుష్కి	00-21	ఎర్రగొల్ల నర్సయ్య తండ్రి బాల్ రాజయ్య (యం.డి. జావీద్ తండ్రి గులాం ముర్తాజ) (మోక ప్రకారం)	116	114	116	115	వేప	2	-	-
16	116	పట్టా	ఖుష్కి	00-10	ఆరోల్ల పోచయ్య తండ్రి సతయ్య (మోక ప్రకారం)	114	116	116	114	-	-	-	-
17	118/ఎఎ	పట్టా	ఖుష్కి	00-12½	సేరల్లి రవీందర్ తండ్రి రాజయ్య	114	114	119	118	గుంపెన పపాయ ఈత టేకు	1 1 5 5	-	-
18	118/ఎ	పట్టా	ఖుష్కి	00-12½	సేరల్లి గోపాల్ తండ్రి రాజయ్య	114	114	119	118	-	-	-	-
19	119/1	ఇ.నా.	ఖుష్కి	00-2250	చంద లలిత భర్త రాములు	119	119	119	119	-	-	-	-
20	119/2	ఇ.నా.	ఖుష్కి	00-2250	చంద రేసమ్మ భర్త లక్ష్మయ్య	119	119	119	119	-	-	-	-
					ఏ.07.07 గుంటలు								

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు(తెలంగాణ సవరణ) చట్టము 2016 (చట్టము నెం. 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013, సెక్షన్ 11(1) (కేంద్ర చట్టము నెం.30/2013) ప్రకారము సంబంధం కలిగిన వ్యక్తులు అందరికి తెలియజేయుటకు గాను ఈ నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్, మరియు వివరములు జిల్లా కలెక్టరు, మెదక్ మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, చేగుంట వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ మెదక్ గారు, రెవిన్యూ డివిజనల్ అధికారిచే గుంటగారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో యేదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూ కమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతి పాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, మెదక్ గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేది నుండి ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన భూములకు సంబధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు/ అమ్మకాలు / తాకట్లకు సంబంధించిన చర్యలు చేపట్టరాదు.

సెక్షన్ (15) ప్రకారం, ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ తరువాత పైన చూపించిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణపై అభ్యంతరములు ఉన్నచో అట్టి వ్యక్తులు, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలో జిల్లా కలెక్టర్/భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

తహశీల్దారు, చేగుంట మండలము | రెవెన్యూ డివిజినల్ అధికారి, చేగుంట డివిజన్, మెదక్ జిల్లా. | జాయింట్ కలెక్టరు, మెదక్ జిల్లా | జిల్లా కలెక్టరు మెదక్ జిల్లా

DIPR No.820/LA/PP/2018-19

ఆఖరి వారం.. ఆరొందల కోట్లు

- సంవత్సరాంతాన మద్యం విక్రయాల జోరు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మద్యం విక్రయాలు కిక్కెంచాయి. డిసెంబరు చివరి వారంలో ఏకంగా రూ.600 కోట్లకు పైనే మద్యం అమ్మకాలు జరిగాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయాన్ని సమకూర్చాయి. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల మద్యం అమ్మకాలు ఉంటాయి. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే డిసెంబరు 31న ఏటా అమ్మకాలు భారీగా పెరుగుతుంటాయి. దీంతో సోమవారం ఒక్కరోజే సుమారు రూ.133 కోట్ల మద్యం అమ్ముడుపోయింది. హైదరాబాద్ జిల్లాలో రూ.19.5 కోట్లు, రంగారెడ్డి రూ.15.30 కోట్లు, ఉమ్మడి వరంగల్ రూ.18 కోట్లు, మేడ్చల్ జిల్లాలో రూ.11.90 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. మొత్తంగా 2018లో సుమారు రూ.20 వేల కోట్ల మద్యం అమ్ముడవ్వగా.. ఒక్క డిసెంబరులోనే దాదాపు రూ.1,962 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్బులు, పబ్‌ల యజమానులు, ఈవెంట్ల నిర్వాహకులు పెద్ద ఎత్తున మద్యాన్ని ముందుగా సమకూర్చుకున్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భాగ్యనగరంలో జరిగిన కొన్ని ఈవెంట్లలో 'అన్ లిమిటెడ్' (తాగినోళ్లకు తాగినంత) ఆఫర్లు ప్రకటించారు. దీంతో చాలామంది మద్యం ప్రియులు నిర్ణీత రుసుము చెల్లించి ఆయా వేడుకల్లో పూటుగా మద్యం పుచ్చుకున్నారు.

డిసెంబరు చివరి వారం అమ్మకాలిలా..

తేదీ	రూ.కోట్లు
26	82
27	100
28	106
29	132
30	83
31	133

అమిత్‌షాను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుట్ర

సొహ్రాబుద్దీన్ కేసును వాడుకున్నారని స్మృతి ఇరానీ ఆరోపణ

దిల్లీ: సొహ్రాబుద్దీన్‌షేక్ ఎన్‌కౌంటర్ కేసులో అమిత్‌షాను రాజకీయంగా నాశనం చేసేందుకు కాంగ్రెస్ నాయకత్వం సీబీఐని ఉపయోగించుకొని ఆధారాల్ని సృష్టించిందని కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఆరోపించారు. అయినా విచారణలో అమిత్‌షా మచ్చ లేకుండా బయటపడ్డారని అన్నారు. ఎనిమిదేళ్లపాటు వేధించినా కేసు నుంచి అమిత్‌షా బయటపడటంతో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఉక్రోషంతో ట్వీట్ చేశారని పేర్కొన్నారు. తన ట్వీట్‌లో ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చారని ఆరోపించారు. 2005-06 సంవత్సరాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లలో సొహ్రాబుద్దీన్‌తోపాటు, భార్య కౌసర్‌బీ, అనుచరుడు తులసి ప్రజాపతి మరణించారు. అప్పుడు గుజరాత్ హోంమంత్రిగా అమిత్‌షా ఉన్నారు.

ప్రచార వ్యూహం ఫలించలేదు

- మంచి అజెండా రూపొందించినా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయాం
- ఎన్నికల నిర్వహణలో లోపాలూ కారణమే
- ప్రజాకూటమి ఓటమిపై రాజకీయ విశ్లేషణ జరగాలి
- పాత్రికేయుల ఇష్టాగోష్ఠిలో తెజస అధినేత కోదండరాం వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ప్రజాకూటమి తరఫున మంచి అజెండానే రూపొందించినా ప్రజలకు ఆ అజెండాను చేరువ చేయలేకపోయామని, ఆశించినరీతిలో ప్రచార వ్యూహం ఫలించలేదని తెజస అధినేత కోదండరాం అన్నారు. ఎన్నికల్లో ప్రజాకూటమి ఓటమిపై రాజకీయ విశ్లేషణ జరగాల్సిన అవసరముందన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమి చెందినంత మాత్రాన తాము విశ్వాసం కోల్పోమని ఆయన వెల్లడించారు. నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని తెజస రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధికార ప్రతినిధి వెదిరె యోగేశ్వరరెడ్డితో కలిసి కోదండరాం పాత్రికేయులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "ఎన్నికల ఫలితాలు మాకు ప్రతికూలంగా రావడంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో లోపాలూ ఓ కారణం. అయితే వీటికి మాత్రమే అధిక ప్రాధాన్యమిస్తూ మిగిలిన వాటిని విస్మరించడం తగదు. ఎన్నికల ప్రణాళికను విస్తృతంగా ప్రచారం చేయడంలో కూటమి పరంగా విఫలమయ్యాం. ఇంటింటికీ వెళ్లి మా ప్రణాళికను వినిపించలేకపోవడంతోపాటు ప్రచారానికి తగినంత సమయాన్ని కేటాయించలేకపోయాం. నిరుద్యోగులనూ ప్రచారంలో ఆశించిన మేరకు వినియోగించుకోలేకపోయాం. ఏయే శక్తులను ప్రచారంలో ఎక్కడెక్కడ ఎలా ఉపయోగించుకోవాలనే విషయంలో స్పష్టత కొరవడింది. ప్రణాళికబద్ధంగా ప్రచార పర్వం సాగకపోవడం ఎన్నికల ఫలితాలపై దుష్ప్రభావం చూపింది. అయితే ప్రతిపక్షాలు బలహీనమయ్యాయనే వాదన సరికాదు. ఎన్నికల ఫలితాల్లో తెరాసకు 98 లక్షల ఓట్లు వస్తే.. ప్రజాకూటమికి 76 లక్షల ఓట్లు వచ్చాయి. ఇది పెద్ద తేడా ఏమీ కాదు. కూటమి బలాన్ని పునరుత్తేజం చేయడానికి చాలా అవకాశాలున్నాయి. ఓటమి గెలుపునకు నాందిగా నిలుస్తుంది. రాజకీయాల్లో దీర్ఘకాలిక ప్రయోజనాలపై దృష్టి ఉండాలి" అని కోదండరాం అన్నారు. లోక్‌సభకు పోటీ చేసే విషయంపై తాను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన చెప్పారు. గ్రామ, మండల స్థాయి నుంచి తెజసను బలోపేతం చేయడానికి అవసరమైన కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించడం దారుణమని, 12,500 సర్పంచ్ పదవుల్లో కేవలం 18.5 శాతం మాత్రమే బీసీలకు వస్తున్నాయన్నారు. దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటయ్యే పరిస్థితి లేదన్నారు. రైతు రుణమాఫీ, గిట్టుబాటు ధర, నిరుద్యోగ సమస్య, జీఎస్టీ వంటి అంశాలు జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపుతాయని కోదండరాం చెప్పారు.



ఇష్టాగోష్ఠిలో మాట్లాడుతున్న కోదండరాం, పక్కన పార్టీ అధికార ప్రతినిధి వెదిరె యోగేశ్వరరెడ్డి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాములు, రవి
- ఖమ్మంలో ఘనంగా ముగిసిన రాష్ట్ర మహాసభలు



చావా రవి ★ సీహెచ్ రాములు

ఖమ్మం విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాములు, చావా రవి ప్రకటించారు. యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో భాగంగా మంగళవారం మూడోరోజు ఖమ్మంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమస్యల పరిష్కారంపై త్వరితగతిన కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. మహాసభ నూతన కార్యవర్గానికి నిర్దేశించిన భవిష్యత్ కార్యాచరణను విజయవంతంగా అమలు చేస్తామని ప్రకటించారు. నల్గొండ నియోజకవర్గం ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి నర్సింహారెడ్డిని, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కొండల్‌రెడ్డిని గెలిపించుకోనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై స్వతంత్ర, ఐక్య ఉద్యమాలను కొనసాగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీగా పోటీచేస్తా: ప్రకాశ్‌రాజ్



ఈనాడు డిజిటల్, బెంగళూరు: 'కొత్త ఏడాది అదనపు బాధ్యతను ప్రారంభిస్తా.. రానున్న సాధారణ ఎన్నికల్లో పోటీ చేస్తా.. ప్రజల సహకారంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ప్రస్తుతం కొనసాగిస్తున్న 'జస్ట్ ఆస్కింగ్' ఉద్యమాన్ని పార్లమెంట్‌లోనూ కొనసాగిస్తా' అని ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ ట్విటర్ వేదికగా మంగళవారం ప్రకటించారు. 'సిటిజన్ వాయిస్' స్వచ్ఛంద సంస్థ ద్వారా సామాజిక దృక్పథాన్ని చాటుతున్న ప్రకాశ్‌రాజ్ తన ఆప్తులతో పోటీ విషయంపై చర్చలు జరుపుతున్నారు. కర్ణాటకతో పాటు తెలంగాణ, తమిళనాడుల్లో గ్రామాలను దత్తత తీసుకున్న ఈ బహుభాషా నటుడు ఏ రాష్ట్రంలో పోటీ చేస్తారన్నది మాత్రం ఇంకా వెల్లడించలేదు. సామాజిక మాధ్యమాల్లో భాజపాను లక్ష్యంగా చేసుకుని పదునైన విమర్శలు గుప్పించి వార్తల్లో నిలిచారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని 'జస్ట్ ఆస్కింగ్' ద్వారా ప్రశ్నిస్తూ తన పోరాటాన్ని కొనసాగించారు. గత కర్ణాటక విధానసభ ఎన్నికల సందర్భంలోనూ గుజరాత్ దళిత నాయకుడు జిగ్నేశ్‌తో కలిసి భాజపాకు వ్యతిరేకంగా కార్యక్రమాలు రూపొందించారు.

'పాలమూరు'ను పరిశీలించిన విశ్రాంత ఇంజినీర్ల బృందం

నాగర్‌కర్నూల్, ఈనాడు డిజిటల్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజల తాగు, సాగునీటి అవసరాలను తీర్చే పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తయ్యే అవకాశాలున్నాయని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల బృందం పేర్కొంది. మంగళవారం అయిదుగురు సభ్యులతో కూడిన ఈ బృందం నాగర్‌కర్నూలు జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి పనులను స్థానిక ఇంజినీర్లతో కలిసి పరిశీలించింది. ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. నార్లాపూర్ సమీపంలోని అంజనగిరి జలాశయానికి మట్టి సమస్య ఏర్పడిందని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారన్నారు. కోడేరు మండలం ఏదుల సమీపంలో చేపడుతున్న వీరాంజనేయ జలాశయ నిర్మాణం, సొరంగం, కాల్వల తవ్వకాలను సైతం బృంద సభ్యులు పరిశీలించారు. మరో రూ.300 కోట్లు కేటాయిస్తే భూసేకరణకు సంబంధించిన సమస్యలు పరిష్కారం అవుతాయని సభ్యులు చెప్పారు. 4వ తేదీ వరకు ఈ బృందం ప్రాజెక్టులను పరిశీలించనుంది. అనంతరం ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వనున్నట్లు శ్యాంప్రసాద్‌రెడ్డి చెప్పారు.

'పార్లమెంటు ఎన్నికల్లో మాదే గెలుపు'

హుజూర్‌నగర్, మేళ్లచెరువు, న్యూస్‌టుడే: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన, ఆ తర్వాత తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ 2019లో కేంద్రంలో రాహుల్‌గాంధీ నేతృత్వాన అధికారం చేపడుతుందన్నారు. రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల కోటాను తగ్గించడం శోచనీయమన్నారు. రిజర్వేషన్ల విషయంలో న్యాయపోరాటం తప్పదని చెప్పారు.

కొత్తగా ఇంజినీరింగ్ కళాశాలలు వద్దు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వచ్చే సంవత్సరం(2020) నుంచి కొత్తగా ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని బీవీఆర్ మోహన్‌రెడ్డి కమిటీ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ)కి సిఫారసు చేసింది. అదనపు సీట్లు కూడా మంజూరు చేయవద్దని సూచించింది. ఇంజినీరింగ్ కళాశాలల పరిస్థితిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలంటూ ఐఐటీ హైదరాబాద్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా ఉన్న బీవీఆర్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో గత అక్టోబరు 24న కమిటీని ఏఐసీటీఈ ఏర్పాటు చేసింది. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని కోరింది. కమిటీలో నాస్కామ్, ఫిక్కీ, సీఐఐ తదితర సంస్థల ప్రతినిధులు ఉన్నారు. దేశంలోని ఇంజినీరింగ్ విద్య, కళాశాలలు, సీట్లపై అధ్యయనం చేసిన కమిటీ డిసెంబరు 26న ఏఐసీటీఈ ఛైర్మన్ అనిల్ సహస్రబుద్ధేకు 41 పుటలున్న నివేదికను సమర్పించింది. ప్రస్తుతం దాదాపు సగం సీట్లు మిగిలి పోతున్నందున 2020 నుంచి కొత్త కళాశాలలతోపాటు అదనపు సీట్లను పెంచుకోవడానికి ఏఐసీటీఈ అనుమతులు ఇవ్వొద్దని కమిటీ సిఫారసు చేసింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి సీట్ల సంఖ్యపై సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని బీటెక్ స్థాయిలో బ్లాక్ చైన్, కృత్రిమ మేధ, డేటా సైన్స్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ తదితర కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించింది. దీనిపై మోహన్‌రెడ్డి 'ఈనాడు'తో మాట్లాడుతూ.. నివేదిక సమర్పించిన విషయం వాస్తవమేనని, ఇంజినీరింగ్ విద్యలో నాణ్యత పెంచేందుకు పలు సూచనలు చేశామన్నారు. ఏఐసీటీఈ అధికారులు నివేదికను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

పాస్‌పోర్టు పరిశీలనకు వేలిముద్రలు

- పాత నేరస్థుల నమూనాలతో విశ్లేషణ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పాస్‌పోర్టు జారీ ప్రక్రియ మరింత కట్టుదిట్టం కాబోతోంది. ఇప్పటివరకు పాస్‌పోర్టు కార్యాలయం అందించిన సమాచారం ప్రకారం పోలీసులు దరఖాస్తుదారుని వివరాలు పరిశీలించి నివేదిక ఇస్తున్నారు. దీని ప్రకారమే పాస్‌పోర్టు జారీ అవుతోంది. ఇకపై దరఖాస్తుదారుని వేలిముద్రలు సేకరించి వాటిని అక్కడికక్కడే పోలీసు డేటాబేస్‌లో ఉన్న పాత నేరస్థుల లక్షలాది నమూనాలతో పరిశీలిస్తారు. తద్వారా నేర చరిత్ర ఉన్నవారిని మరింత కచ్చితంగా గుర్తించి వారికి పాస్‌పోర్టు జారీ కాకుండా చూడటానికి అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో త్వరలోనే ఈ తరహా పరిశీలన మొదలుకాబోతోంది. నేర చరిత్ర ఉన్నవారికి పాస్‌పోర్టు రాకుండా చేయగలిగితే ఇక వీరు విదేశాలకెళ్లే అవకాశమే ఉండదు. అందుకే తెలంగాణ పోలీసులు పాస్‌పోర్టు జారీ సమయంలోనే దరఖాస్తుదారులను కట్టదిట్టంగా వడపోయబోతున్నారు. రాష్ట్రంలో పోలీసులు ఏటా దాదాపు 4 లక్షల పాస్‌పోర్టులు పరిశీలిస్తున్నారు. ప్యాపిలోన్ సాఫ్ట్‌వేర్ పద్ధతిలో దర్యాప్తు అధికారులకు చేతిలో ఇమిడేంత చిన్న ఉపకరణాలు ఇస్తారు. అది సీఐడీ డేటాబేస్‌లోని పాత నేరస్థుల 8.28 లక్షల వేలిముద్రలతో విశ్లేషిస్తుంది. నేరస్థులు పాస్‌పోర్టులు పొందకుండా తొలిదశలోనే వడపోయడానికి ఈ విధానం ద్వారా అవకాశం ఉంటుంది.

నిధుల బదిలీతోనే పంచాయతీలు పరిపుష్టం

పార్లమెంటు స్థాయీసంఘం

ఈనాడు, దిల్లీ: పంచాయతీరాజ్ సంస్థలకు సకాలంలో నిధులు, విధులు బదిలీ అయినప్పుడే అవి ఆర్థికాభివృద్ధి సాధిస్తాయని, సామాజిక న్యాయ పథకాలను రూపొందించుకోగలుగుతాయని పార్లమెంటరీ స్థాయీసంఘం స్పష్టం చేసింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించింది. పి.వేణుగోపాల్ నేతృత్వంలోని గ్రామీణాభివృద్ధి శాఖ స్థాయీసంఘం 'పంచాయతీరాజ్ సంస్థల పనితీరు మెరుగుకు తీసుకున్న చర్యల'పై పార్లమెంటుకు నివేదిక సమర్పించింది.

ఈనాడు
its@eenadu.in
ఈనాడు 7
బుధవారం జనవరి 2, 2019
కరీంనగర్

బుల్లి ప్రింటర్లు

జ్ఞాపకం ఏదైనా...



ఏడాది పొడవునా ఎన్నో జ్ఞాపకాలు. ఫోన్ కెమెరాతో బంధిస్తాం. అన్ని ఇంటర్నల్ మెమొరీలో భద్రంగా ఉంటాయ్. కానీ, కొన్నింటిని మాత్రం పదే పదే చూస్తుంటాం. అలాంటి ఫొటోలను క్షణాల్లో పోస్టు కార్డు పరిమాణంలో ప్రింట్ తీసుకుంటే? అదెలాగంటే.. HP Sprocket Plus Printer పోర్టబుల్ ప్రింటర్‌తో తీసుకోవచ్చు. ఇది ప్రపంచంలోనే అత్యంత పల్చటి నాజూకైన ప్రింటర్. బ్లూటూత్ ద్వారా ఫోన్‌కి కనెక్టు అవుతుంది. Sprocket యాప్ ఫోన్‌కి ప్రింటర్‌కి మధ్య వారధిలా పని చేస్తుంది. యాప్‌లో ఫొటోలను కావాల్సినట్టుగా ఎడిట్ చేసుకుని ప్రింట్ తీసుకోవచ్చు. ఐఓఎస్, ఆండ్రాయిడ్‌లను సపోర్టు చేస్తుంది. ధర రూ. 8,999

10 సెకన్లలోనే..



ఫోన్‌తో జతకట్టి పని చేసే మరో పోర్టబుల్ ప్రింటర్ instax SHARE SP-2. బ్లూటూత్ ద్వారా ఫోన్‌కి అనుసంధానమై పని చేస్తుంది. 800x600 పిక్సల్ రిజల్యూషన్‌తో ఫొటోలను ప్రింట్ తీసుకోవచ్చు. ప్రత్యేక యాప్‌ని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని ఫొటోలకు ఫిల్టర్లు వాడి ఆకట్టుకునేలా మార్చుకున్నాకే ప్రింట్ ఇచ్చే వీలుంది. యాప్‌లో పలు రకాల టెంప్లెట్స్ ఉన్నాయి. ఒక ఫొటోని రెండుగా విభజించి ప్రింట్ తీసుకునే వీలుంది. 'కొల్లాజ్'లోనూ ఫొటోలను పెట్టుకునే వీలుంది. 'రీప్రింట్' బటన్‌తో ఒకే ఫొటోని ఎన్ని సార్లు అయినా ప్రింట్ తీసుకోవచ్చు. ధర రూ. 13,499



స్మార్ట్‌ఫోన్ ఓఎస్ అప్‌డేట్ మాదిరే... కాల గమనంలో మరో కొత్త వెర్షన్.. టైమ్‌మిషిన్‌కి మరో అప్‌డేట్.. 2019 దీంతో ఫోన్‌లో తేదీ ఒక్కటే కాదు.. మరెన్నో మార్పులు చోటు చేసుకోనున్నాయ్.. ఏంటవి? తెలుసుకుందాం!!

టెక్కుటమారాలు

అరచేతిలో..!

కెమెరాలే కెమెరాలు!



9ప్యూర్‌వ్యూ

గత ఏడాదిలో మూడు కెమెరాలున్న ఫోన్‌లు చూశాం. వాడాం. ఇకపై 4, 6, 9 కెమెరాలున్న ఫోన్‌లకు ఈ ఏడాది వేదిక అవుతుంది. డీఎస్ఎల్ఆర్ కెమెరాలకు దీటుగా స్మార్ట్‌ఫోన్‌లు మారతాయనటంలో అతిశయోక్తి లేదు. ఇప్పటికే శామ్‌సంగ్ కంపెనీ 'గెలాక్సీ ఏ9' నాలుగు కెమెరాలతో ముందుకొచ్చింది. మరోవైపు నోకియా ఏకంగా తొమ్మిది కెమెరాలతో '9ప్యూర్‌వ్యూ'ని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరుకల్లా మార్కెట్‌లో ప్రవేశపెట్టనుంది. ఇంకా చెప్పాలంటే.. ఫోన్‌లూ, డీఎస్ఎల్ఆర్ కెమెరాలు కలగలిసి పని చేయడాన్ని మనం చూడొచ్చు. ఫోన్ నుంచే అన్ని కమాండ్స్‌ని కెమెరాలకు ఇవ్వొచ్చు.

గేమింగ్‌కి మరో గేరు



షామీ బ్లాక్ షార్క్

ఫోన్ చేతిలో ఉందంటే టైమ్‌పాస్‌కి గేమ్స్ ఆడేస్తాం. చైనా లాంటి దేశాల్లో గేమింగ్‌కి ఉన్న ఆదరణే వేరు. ఈ నేపథ్యంలో మొబైల్ గేమింగ్‌కి తగిన ఫోన్‌లు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. రేజర్ ఫోన్, ఆసుస్ ఆర్ఓజీ, షామీ బ్లాక్ షార్క్.. ఈ కోవలోకి వస్తాయి. అయితే, వీటిని మించిన హై ఎండ్ కాన్ఫిగరేషన్‌తో గేమింగ్ ఫోన్‌లు ముందుకు రావచ్చు. 'స్నాప్‌డ్రాగన్ 855' ప్రాసెసర్ ఒక్కటే కాదు... మెరుగైన కూలింగ్ సిస్టమ్స్‌తో పరిచయం కానున్నాయ్. మరో అడుగు ముందుకేసి ఫోన్‌లను ప్లేస్టేషన్‌లుగా మార్చేస్తూ 'స్క్రీన్ రీఫ్రెష్ రేట్'ని పెంచుకోనున్నాయి. గతంలో సోనీ కంపెనీ తయారు చేసిన 'ఎక్స్‌పీరియా ప్లే' గుర్తుందా? అలాంటి మరో హై ఎండ్ గేమింగ్ ఫోన్‌తో గేమింగ్ ప్రియుల ఎదురు చూపులు నిజమవ్వొచ్చు.

హలో!! అంటూ 'హోల్ డిస్‌ప్లే'



ఆనర్ వ్యూ20

బజెల్లెస్, నాచ్ డిస్‌ప్లేలకు మంగళం పాడేస్తూ వాటి స్థానంలో 'డిస్‌ప్లే హోల్స్'తో సరికొత్త ట్రెండు గ్యాడ్జెట్ లవర్స్‌ని అలరించేందుకు సిద్ధం అవుతోంది. శామ్‌సంగ్ ఇప్పటికే 'ఇన్ఫినిటీ-ఓ డిస్‌ప్లే' పేరుతో స్మార్ట్‌ఫోన్‌లను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తెర పైభాగంలో ముందు కెమెరాని 'హోల్'లా (బొట్టుబిళ్ల పరిమాణంలో..) నిక్షిప్తం చేయనుంది. వచ్చే మార్చికల్లా 'ఎస్10' మోడళ్లలో ఈ తరహా డిస్‌ప్లేని పరిచయం చేయొచ్చు. అయితే, ఇప్పటికే ఆనర్ కంపెనీ డిస్‌ప్లే హోల్స్‌తో కూడిన మోడల్ ఫస్ట్‌లుక్‌ని నెట్టింట్లో విడుదల చేసింది. పేరు 'ఆనర్ వ్యూ20'. చిత్రంలో మాదిరిగా తెరపై రంధ్రంలా (హోల్) ముందు కెమెరాని నిక్షిప్తం చేశారు. ఈ ఏడాది మార్కెట్‌లోకి రానున్న ఫోన్‌ల్లో ఎక్కువ శాతం తాకేతెరల కిందే పలు సెన్సర్ల రూపంలో కెమెరాలు, ఫింగర్‌ప్రింట్ సెన్సర్లు పరిచయం అవ్వొచ్చు. అంతేకాదు.. తాకేతెరలు మడిచి జేబులో పెట్టుకునేలా మారిపోతాయ్. మడిచి వాడుకునేలా ముందుకొస్తున్న ఫోన్‌లే అందుకు సాక్ష్యం.

రయ్!! మంటూ ర్యామ్




జెడ్5 ప్రో జీటీ

ఒకప్పుడు పర్సనల్ కంప్యూటర్‌లో ర్యామ్ 4జీబీ అంటే సూపర్ అనుకునే వాళ్లు. మరి, ఇప్పుడు ఫోన్‌ల్లోనే చూస్తున్నాం.. వాడేస్తున్నాం. గత ఏడాది 8జీబీ ఫోన్‌లూ మార్కెట్‌లో సందడి చేశాయి. ఈ ఏడాది ఏకంగా 16జీబీ ర్యామ్‌తో ఫోన్‌లు పరిచయం కానున్నాయ్. ఇప్పటికే 'వన్‌ప్లస్ 6టీ మెక్లార్న్, షామీ మీ మ్యాక్స్ 3, బ్లాక్ షార్క్ హాలో, నుబియా రెడ్ మ్యాజిక్.. ఫోన్‌లు అధిక ర్యామ్‌తో మొబైల్ ప్రియుల దృష్టిని ఆకర్షించాయి. లెనోవో మరో అడుగు ముందుకేసి 12జీబీ ర్యామ్‌తో 'జెడ్5 ప్రో జీటీ' మోడల్‌ని డిజైన్ చేసింది. ఈ నెలాఖరుకల్లా ప్రపంచ విపణిలోకి తీసుకురానుంది.



కోటిరెడ్డి సరిపల్లి
ఐటీ నిపుణుడు

క్రేజీగా '5జీ'



4జీతోనే నెట్టింట్లో మెరుపు తీగాల్లా దూసుకెళ్తున్నాం. మరి, 5జీ అందుబాటులోకి వస్తే. ఆ దిశగానే మొబైల్ తయారీ కంపెనీలు అడుగులేస్తున్నాయ్. 5జీ నెట్‌వర్క్ సపోర్టుతో పని చేసే ఫోన్‌లను ఈ ఏడాది పరిచయం చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. గెలాక్సీ ఎస్10, హువాయ్ పీ30, వన్‌ప్లస్ 7టీ, షామీ మీ మ్యాక్స్ 3లతో పాటు మరిన్ని ప్రముఖ కంపెనీల ఫోన్‌లు ఈ ఏడాది యూజర్ల చేతుల్లోకి రానున్నాయి. అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, హాలోగ్రాఫిక్ డిస్‌ప్లేలు, ఇతర క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసులకు ఫోన్‌లే వేదికలవుతున్న నేపథ్యంలో 5జీ నెట్‌వర్క్ అవసరం ఎంతైనా అనివార్యం. అంతేకాదు.. మనిషి దైనందిన జీవనంలో 'ఐఓటీ' (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) పరికరాలు భాగమవుతున్న నేపథ్యంలో 5జీ నెట్‌వర్క్ కీలకం కానుంది. డ్రైవర్ లెస్ కార్లకు ఇంధనంగా మారనుంది.

అయినా... లైక్‌లు కొట్టారు!



గత ఏడాదంతా ఫేస్‌బుక్‌కి గడ్డు కాలం అని చెప్పొచ్చు. యూజర్ల డేటాకి రక్షణ కల్పించడంలో పలుమార్లు ఫెయిల్ అయ్యింది. కోట్లల్లో యూజర్ల ఎకౌంట్‌లు హ్యాక్ అయ్యి ఫొటోలు, ఇతర వ్యక్తిగత సమాచారం బట్టబయలు అయ్యింది. అయినప్పటికీ యూజర్లు ఎఫ్‌బీ విహారానికి గుడ్‌బై చెప్పలేదంటే.. ఎంతలా నెటిజన్ల రోజువారీ జీవితంలో ఎఫ్‌బీ భాగమైందో ఊహించొచ్చు. ప్రైవసీ కంట్రోల్స్‌ని కట్టుదిట్టంగా పెట్టుకుని యూజర్లు సోషల్‌లైఫ్‌ని కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే, కొత్త ఏడాదిలో కచ్చితంగా సంకల్పించుకునే వాటిల్లో ఒకటి మాత్రం కచ్చితంగా ఉండాలి. అదే... 'సోషల్ లైఫ్'లో వ్యక్తిగత సమాచారాన్ని ఇతరుల కంటపడకుండా చూసుకోవడం. ఈ రోజు మొదలుకుని నిర్దిష్టమైన పరిమితులకు లోబడే సోషల్ మీడియా వేదికలపై డేటాని షేర్ చేయండి. మీరెందుకు అమూల్యమైన మీ వ్యక్తిగత డేటాని మార్క్ జుకర్‌బర్గ్ చేతుల్లో పెట్టాలి? కాస్త ఆలోచించండి.

అప్‌డేట్స్ మాటేంటో?



ఏదైనా ఫోన్ లేదా కంప్యూటర్ కొనేముందు ఓఎస్ వెర్షన్ ఎంతో చూస్తాం. కొంటాం. యాపిల్ ఫోన్‌ల్లో అయితే ఓఎస్ కొత్త వెర్షన్ విడుదలైతే అన్ని ఫోన్‌ల్లో అప్‌డేట్ అవుతుంది. కానీ, ఆండ్రాయిడ్ ఓఎస్‌కి అప్‌డేట్ అంటే క్లిష్టమైన ప్రక్రియే. ఇప్పుడిప్పుడు మార్కెట్‌లోకి వస్తున్న స్మార్ట్‌ఫోన్‌ల్లో అరకొరగా కొత్త వెర్షన్‌కి అప్‌డేట్ అవుతున్నాయ్. ఆండ్రాయిడ్ పై ఓఎస్ అప్‌డేట్ కోసం వేచి చూసే యూజర్లు ఎందరో. ఇక ఆండ్రాయిడ్ ఓరియోతో పని చేసే జమానా ఫోన్‌ల్లోకి అప్‌డేట్ నిమిత్తం పరిచయం చేసిన 'ప్రాజెక్టు ట్రిబుల్' ప్లాట్‌ఫామ్ ఎంతమేరకు యూజర్లని గట్టెక్కిస్తుందో చూడాలి. ఈ ఏడాదైనా ఆండ్రాయిడ్ ఓఎస్ అప్‌డేట్స్‌లో విప్లవాత్మకమైన మార్పుల్ని ఆశిద్దాం.

ఓ కన్నేయండి

ఇప్పుడందరికీ ఎఫ్‌బీ ఎకౌంట్ అనివార్యమైపోయింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పాలన్నా.. రానున్న సంక్రాంతి సందడైనా.. సోషల్ వాల్‌పై పోస్ట్ అవ్వాల్సిందే. పంచుకోవడంలో కలిగే కిక్కే వేరని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదుగానీ.. వాడకం మాటేంటి? ఎఫ్‌బీ సెక్యూరిటీ చిట్కాల్ని ఫాలో అవుతున్నారా?

మరెవరైనా వాడుతున్నారా?

ఫేస్‌బుక్ ఖాతాని మరెవరైనా వాడుతున్నారా? అనే సందేహం రాక మానదు. అప్పుడు సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'సెక్యూరిటీ అండ్ లాగిన్' ట్యాబ్‌ని చూడండి. దాంట్లో మీరు ఏయే డివైజ్‌ల్లో ఎఫ్‌బీ ఎకౌంట్‌ని వాడుతున్నారో చూపిస్తుంది. ఒకవేళ మీరు వాడేది కాకుండా మరేవైనా కనిపిస్తే అప్రమత్తం అవ్వాల్సిందే. జాబితాలో గుర్తు తెలియని డివైజ్‌లు ఉంటే వెంటనే లాగవుట్ చేయండి.



మీరే అలర్ట్ అవ్వాలి

మన ఎకౌంట్‌ని ఎవరైనా హ్యాక్ చేస్తే వెంటనే లాగిన్ వివరాలు మారిపోతాయ్. ఎప్పుడైనా ఎకౌంట్ హ్యాక్ అయ్యిందని గమనిస్తే సెట్టింగ్స్‌లోని సెక్యూరిటీ అండ్ లాగిన్ ట్యాబ్‌లోని 'చేంజ్ పాస్‌వర్డ్'తో కొత్త పాస్‌వర్డ్‌ని పెట్టుకోవచ్చు. తర్వాత 'లాగ్ అవుట్ ఆఫ్ ఆల్ సెషన్స్' ఆప్షన్‌ని సెలెక్ట్ చేసి ఫ్రెష్‌గా మళ్లీ ఎఫ్‌బీలో లాగిన్ అవ్వండి. ఒకవేళ ఎవరైనా మీ పాస్‌వర్డ్‌ను మార్చేశారు అనుకుందాం. అప్పుడేం చేస్తారంటే.. ఫేస్‌బుక్ హోం పేజీలో లాగిన్ ఆప్షన్ కిందున్న 'ఫర్‌గాట్ పాస్ వర్డ్' సెలెక్ట్ చేయాలి. ఎకౌంట్‌కి అనుసంధానించిన ఫోన్ నెంబరుతో కొత్త పాస్‌వర్డ్‌ను జనరేట్ చేసుకోవచ్చు.

ఫిర్యాదు చేయండి

ఎవరో హ్యాక్ చేశారు. అనుచిత సందేశాలు, వీడియోలు, ఫొటోలు పోస్టు చేశారు. ఆ విషయం మీకు తెలిసింది. వెంటనే ఫేస్‌బుక్‌కు రిపోర్టు చేయొచ్చు. అందుకోసం సెట్టింగ్స్ ఆప్షన్‌లో 'హెల్ప్'పై క్లిక్ చేయాలి. తర్వాత వచ్చిన పేజీలో 'పాలసీ అండ్ రిపోర్టింగ్' ట్యాబ్‌పై క్లిక్ చేస్తే డ్రాప్‌డౌన్ మెనూలో 'హ్యాక్డ్ అండ్ ఫేక్ అకౌంట్స్' ఆప్షన్ కనిపిస్తుంది. సెలెక్ట్ చేసి ఎదురైన సమస్యకు పరిష్కారాన్ని పొందొచ్చు.

అలర్ట్!

వాట్సాప్ మాయం అవ్వొచ్చు

అవును.. మీరు చదివింది కరెక్టే. ఈ ఏడాదిలో కొన్ని ఫోన్‌ల్లో వాట్సాప్ పని చేయకపోవచ్చు. లేదంటే.. కొన్ని ఆప్షన్లు డిసేబుల్ అవ్వొచ్చు. ముఖ్యంగా నోకియా సిరీస్ 40 (ఎస్40) ఓఎస్‌తో పని చేసే ఫోన్‌ల్లో వాట్సాప్ సర్వీసుని ఇకపై యాక్సెస్ చేయలేకపోవచ్చు. ఐఓఎస్ 7, ఆండ్రాయిడ్ 2.3.7 ఓఎస్‌లతో పని చేసే ఫోన్‌ల్లోనూ రానున్న రోజుల్లో కొత్త వాట్సాప్ ఎకౌంట్‌లు క్రియేట్ చేయడానికి వీలుండకపోవచ్చు.



అలాగే, కొన్ని ఆధునిక సౌకర్యాలు డిసేబుల్ అవ్వొచ్చు. గతంలో వాట్సాప్ ప్రకటించినట్టుగా 2020కల్లా చాలా వరకూ పాత ఓఎస్ వెర్షన్లకు యాప్ సపోర్టుని నిలిపివేయొచ్చు. కారణం.. ఆయా ఓఎస్‌ల్లో సెక్యూరిటీ లోపాలే!

నెట్టింట్లో సంకల్పం

గట్టిగా అనుకోవాల్సిందే!

కొత్త ఏడాదంటే.. ఏవేవో సంకల్పించుకుంటాం. మరి, నెటిజన్‌గా మీరు తీసుకోవాల్సిన రిజల్యూషన్స్ గురించి ఆలోచించారా? ఇవిగోండి కొన్ని.. గట్టిగా అనుకోండి..

కచ్చితంగా ఫాలో అవ్వండి! నెట్టింటి విహారాన్ని సురక్షితం చేసుకోండి!!

'క్లిక్కే'కదా అనుకోవద్దు

వాట్సాప్ లాంటి మెసెంజర్లలో... మెయిల్స్‌లో... సోషల్ మీడియా వాల్స్‌పై కనిపించే లింక్‌లపై క్లిక్ చేయడం మానుకోవాలి. ముఖ్యంగా ఆఫర్ల పేరుతోనో... గేమ్‌లు లేదంటే సర్వేల రూపంలోనో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వాటిని ముట్టొద్దు. ఏం కాదులే నొక్కి చూద్దాం అనుకుంటే అంతే సంగతులు. ఒక్కసారి క్లిక్ చేశాక మీ చేతుల్లో ఏం ఉండదన్న విషయాన్ని గ్రహించాలి.



'ప్రైవసీ' చూసుకోండి

సోషల్ మీడియా అంటే అన్నీ బహిర్గతం చేసుకోవడం కాదు. అన్నింటికీ పరిధి ఉన్నట్టుగానే సోషల్ మీడియా వాడకంలోనూ కొన్ని నియమాలు పెట్టుకోవాలి. మీ వివరాలన్నీ అందరికీ కనిపించాల్సిన పని లేదు. అందుకు ప్రైవసీ సెట్టింగ్స్‌ని కట్టుదిట్టంగా పెట్టుకోవాలి. అంతేకాదు.. ఫేస్‌బుక్ లాగిన్ వివరాలతో ఇతర వెబ్‌సైట్‌ల్లోకి సైన్‌ఇన్ అవ్వొద్దు. మీ సోషల్ లైఫ్‌కి ఏ మాత్రం సురక్షితం కాదు. ఇతర సోషల్ మీడియా ఎకౌంట్‌ల విషయంలోనూ అంతే జాగ్రత్త వహించాలి.

రెండు తాళాలు

నెట్టింట్లో ఏదైనా సర్వీసులోకి లాగిన్ అవ్వాలంటే ఒక్కసారి పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తే సరిపోతుంది. టెక్నాలజీ పరిభాషలో దీన్ని 'సింగిల్ ఫ్యాక్టర్ అథెంటికేషన్'గా పిలుస్తున్నారు. కానీ, రోజు రోజుకీ పెరుగుతున్న సైబర్ దాడులతో 'టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్' ముందుకొచ్చింది. దీంతో రెండు రకాల సెక్యూరిటీ వలయాల్ని దాటుకుని ఎకౌంట్‌లోకి లాగిన్ అవ్వొచ్చు. అంటే.. పాస్‌వర్డ్‌తో పాటు మరో లాగిన్ తాళాన్ని ఎంటర్ చేస్తే తప్ప వీలుండదు. మీరు వాడే పరికరం లేదా ఆన్‌లైన్ సర్వీసు ఏదైనా 'టూ ఫ్యాక్టర్..'లోనే సెట్ చేసుకుంటే మంచిది. ఉదాహరణకు జీమెయిల్‌ని వాడుతున్నట్లయితే 'టూ స్టెప్ వెరిఫికేషన్'ని పెట్టుకోవచ్చు. వాడుతున్న పాస్‌వర్డ్ మాత్రమే కాకుండా మీ ఫోన్‌కి ప్రత్యేక కోడ్‌ని వచ్చేలా చేసుకోవచ్చు. దీంతో మీరు ఏ సిస్టంలో లాగిన్ అయినా పాస్‌వర్డ్‌తో పాటు ఫోన్‌కి వచ్చే కోడ్‌ని ఎంటర్ చేస్తేనే జీమెయిల్‌లోకి లాగిన్ అవడం సాధ్యం అవుతుంది. ఎవర్‌నోట్, డ్రాప్‌బాక్స్... లాంటి ఇతర నెట్టింటి సర్వీసులు 'టూ స్టెప్ వెరిఫికేషన్' సదుపాయాన్ని అందిస్తున్నాయి.



'ఎన్టీఆర్ కథానాయకుడు'లో దగ్గుబాటి రాజా, బాలకృష్ణ, ఆర్యవీర్, విద్యాబాలన్

ఈనాడు సినిమా

సినిమాల్ని ప్రేక్షకులకు చేరువ చేయడంలో ప్రచారమే కీలకం. విడుదలకి ముందు తమ సినిమాల గురించి ఎంత చర్చ జరిగితే అంతగా ప్రారంభ వసూళ్లు లభిస్తాయని దర్శకనిర్మాతలు బలంగా నమ్ముతుంటారు. అందుకే కొబ్బరికాయ కొట్టినప్పట్నుంచే ఏదో రకంగా ప్రచారానికి శ్రీకారం చుడుతుంటారు. ఇక ప్రచారానికి అనువైన సందర్భమే దొరికిందంటే దాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధమైపోతుంటాయి. ఆ రోజు కొత్త విశేషాల్ని వెల్లడించడమో లేదంటే, కొత్త పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్లని విడుదల చేస్తూనో ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తుంటారు. జనవరి 1ని కూడా తెలుగు చిత్రసీమ బాగా సద్వినియోగం చేసుకొంది. ప్రచార పండగలా మార్చేసింది. డిసెంబరు 31 నుంచే కొత్త విశేషాలు, పోస్టర్లని బయటపెడుతూ ప్రేక్షకుల్ని ఆకర్షించే ప్రయత్నం చేసింది. 1వ తేదీ కూడా ప్రచార చిత్రాలు, కొత్త కబుర్ల సందడి కొనసాగింది.

ప్రచారానికి పండగ

చిన్నప్పటి బాలకృష్ణ

నందమూరి తారక రామారావు జీవితం ఆధారంగా రూపొందిన చిత్రాల్లో తొలి భాగం 'ఎన్టీఆర్ కథానాయకుడు' ఈ నెల 9న విడుదల కాబోతోంది. క్రిష్ దర్శకుడిగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్‌గా ఆయన తనయుడు బాలకృష్ణ నటించారు. ఇందులో బాలకృష్ణగా ఎవరు కనిపిస్తారనే విషయం గురించి మొదటి నుంచీ ఆసక్తికరమైన చర్చ సాగింది. పెద్ద బాలకృష్ణగా ఎవరు కనిపిస్తారో తెలియదు కానీ... చిన్నప్పటి బాలకృష్ణగా ఆయన మనవడు (రెండో కూతురు తేజస్విని- శ్రీభరత్‌ల కుమారుడు) ఆర్యవీర్ నటించారు. అప్పట్లో 'సీతారామకళ్యాణం' విడుదల తర్వాత ఎన్టీఆర్ ఇంట్లో బాలకృష్ణ నామకరణం వేడుక జరిగిందట. ఆ సన్నివేశాలకి సంబంధించిన ప్రచార చిత్రాన్నే కొత్త ఏడాది సందర్భంగా విడుదల చేశారు. ఆ చిత్రంలో ఎన్టీఆర్‌గా నటించిన బాలకృష్ణతో పాటు బసవతారకం పాత్రలోని విద్యాబాలన్, త్రివిక్రమరావు పాత్రలోని దగ్గుబాటి రాజా, చిన్నప్పటి బాలకృష్ణగా నటించిన ఆర్యవీర్ కనిపిస్తున్నారు.

వినయ రామ

సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 11న రామ్‌చరణ్ 'వినయ విధేయ రామ' ప్రేక్షకుల ముందుకొస్తోంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. పేరు ఎంతో పద్ధతిగా ఉన్నా ఇప్పటి వరకు ప్రచార చిత్రాల్లో ఎక్కువగా విధ్వంస రాముడే కనిపించాడు. కానీ కొత్త ఏడాది సందర్భంగా విడుదల చేసిన ప్రచార చిత్రాలు మాత్రం పేరుకు సార్థకం చేకూర్చేలా ఉన్నాయి. కథానాయిక కియారా అడ్వాణీని తన చేతిపై నుంచోబెట్టుకొని ఎత్తుకున్న రామ్‌చరణ్ చిత్రం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఇందులో యాక్షన్‌తోపాటు, కుటుంబ ప్రేక్షకుల్ని మెప్పించే అంశాలు కూడా పుష్కలంగా ఉంటాయని ఈ చిత్రాలు చాటి చెబుతున్నాయి.



కియారా అడ్వాణీ, రామ్‌చరణ్



అఖిల్

మజ్ను స్టెప్పేస్తే

'ఏమైనదో ఏమైనదో... పలుకు మరచినట్టు పెదవికేమైనదో...' అంటూ 'మిస్టర్ మజ్ను'గా ప్రేమ గీతాల్ని పాడుకుంటున్నారు అఖిల్ అక్కినేని. కొత్త యేడాది సందర్భంగా ఆయన బుధవారం టీజర్‌తో సందడి చేయబోతున్నారు. మంగళవారమే ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. అందులో అఖిల్ డ్యాన్స్ వేస్తూ కనిపించారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ఈ చిత్రంలో అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ నటించారు. జనవరి 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది తదితరులు నటిస్తున్నారు.



వెంకటేష్, తమన్నా, వరుణ్‌తేజ్, మెహరీన్

అల్లుళ్ల హంగామా

సంక్రాంతి అల్లుళ్లుగా మేం వస్తున్నాం అంటూ వెంకటేష్, వరుణ్‌తేజ్‌లు ఇప్పటికే ప్రకటించారు. ఆ ఇద్దరూ కథానాయకులుగా నటించిన 'ఎఫ్2' ఈ నెల 12న విడుదలవుతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఫన్, ఫ్రస్టేషన్ మేళవింపు అందరికీ పసందైన వినోదాన్ని పంచుతుందని నిర్మాత దిల్‌రాజు అంటున్నారు. ఇందులో తోడల్లుళ్లుగా వెంకటేష్, వరుణ్‌తేజ్‌లు నటించగా, తమన్నా, మెహరీన్ అక్కాచెల్లెళ్లుగా సందడి చేయబోతున్నారు. ప్రస్తుతం సినిమా ప్రచారం జోరుగా సాగుతోంది. అందులో భాగంగానే కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రబృందం.



రాజశేఖర్

కల్కి.. చీకటి నుంచి వెలుగులోకి

రాజశేఖర్ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కల్కి'. 1983 నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని సి.కల్యాణ్, శివానీ, శివాత్మిక నిర్మిస్తున్నారు. ఆదాశర్మ, నందిత శ్వేత, స్కార్లెట్ విల్సన్ కథానాయికలుగా నటిస్తున్నారు. కొత్త ఏడాది ప్రత్యేకంగా మంగళవారం 'చీకటి నుంచి వెలుగులోకి..' అంటూ చిత్రబృందం మోషన్ పోస్టర్‌ని విడుదల చేసింది. అందులో రాజశేఖర్ స్టైలిష్‌గా కనిపిస్తున్నారు.


రవిబాబు 'ఆవిరి'

సినిమాల పేర్లు, ప్రచార చిత్రాల నుంచే కొత్త దనాన్ని పంచాలని తపించే దర్శకుడు రవిబాబు. ఫ్లయింగ్ ఫ్రాగ్స్ పతాకంపై స్వీయ నిర్మాణంలో 'ఆవిరి' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్టు ఆయన కొత్త ఏడాది సందర్భంగా మంగళవారం ప్రకటించారు. కాన్సెప్ట్ పోస్టర్‌నీ విడుదల చేశారు. "ఇదొక ఆఫ్‌బీట్ చిత్రం. త్వరలోనే నటీనటులు, సాంకేతిక బృందం వివరాల్ని ప్రకటిస్తాం" అన్నారు రవిబాబు.



రవిబాబు

బాలీవుడ్ విలక్షణ నటుడు ఖాదర్‌ఖాన్ ఇకలేరు



బాలీవుడ్ సీనియర్ నటుడు, రచయిత ఖాదర్ ఖాన్ (81) తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కెనడాలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ విషయాన్ని ఆయన తనయుడు సర్ఫరాజ్ వెల్లడించారు. "నాన్న మమ్మల్ని వదిలి వెళ్లిపోయారు. ఆయన కొన్ని వారాలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు అందరూ కెనడాలోనే ఉన్నాం. అంత్యక్రియలు ఇక్కడే నిర్వహిస్తాం" అని తెలిపారు సర్ఫరాజ్. ఖాదర్ 1937 అక్టోబరు 22న కాబూల్‌లో జన్మించారు. సివిల్ ఇంజినీర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ఆయన 1973లో రాజేష్ ఖన్నా నటించిన 'దాగ్'తో వెండితెరకు పరిచయమై 300పైగా చిత్రాల్లో నటించారు. 'జుద్వా', 'జుడాయి', 'సుహాగ్', 'ముజ్ సే షాదీ కరోగీ', 'లక్కీ: నో టైమ్ ఫర్ లవ్' తదితర చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు బాలీవుడ్ ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకున్నాయి. 1980- 90ల్లో బాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన ప్రతి చిత్రంలోనూ ఖాదర్ ఏదో ఒక పాత్రలో నటించారు. మన్మోహన్ దేశాయ్, ప్రకాష్ మెహ్రాలతో కలసి రచయితగా ఎక్కువ చిత్రాలకు పనిచేశారు ఖాదర్. తాతినేని రామారావు, కె.రాఘవేంద్రరావు, దాసరి నారాయణరావు లాంటి ప్రముఖ తెలుగు దర్శకులు హిందీలో రూపొందించిన పలు చిత్రాల్లోనూ ఖాదర్ నటించారు. హాస్య ప్రధాన పాత్రలతో ప్రాచుర్యం పొందిన ఖాదర్... డేవిడ్ ధావన్ సినిమాల్లో గోవిందాతో కలసి నటించిన 'దుల్హే రాజా', 'కూలీ నెం 1', 'బడే మియాన్ ఛోటే మియాన్', 'రాజా బాబు' తదితర చిత్రాల్లో తనదైన శైలి హాస్యంతో అలరించారు. రాజేష్ ఖన్నా, జితేంద్ర, అమితాబ్ బచ్చన్, ఫిరోజ్‌ఖాన్, అనిల్‌కపూర్, గోవిందా తదితరులతో కలసి పలు చిత్రాల్లో నటించారాయన. 'పర్వారిష్', 'దాన్ దౌలత్', 'లూట్ మార్', 'ఖుర్బానీ', 'సనమ్ తేరీ కసమ్' తదితర చిత్రాల్లో ప్రతి నాయకుడిగానూ నటించారు ఖాదర్. పలు కామెడీ టీవీ సిరీస్‌ల్లోనూ ఖాదర్ నటించారు. 2017లో వచ్చిన 'మస్తీ నహీ సస్తీ' ఖాదర్ నటించిన చివరి చిత్రం.

కలానికి పదునెక్కువే: 'జవానీ దివానీ'తో మాటల రచయితగా మారిన ఆయన 250 చిత్రాలకు సంభాషణలు రాశారు. 'రోటీ', 'మిస్టర్ నట్వర్‌లాల్', 'సత్తే పే సత్తా'. 'ఇంక్విలాబ్', 'గిర్ఫ్తార్', 'హమ్', 'అగ్నిపథ్' తదితర చిత్రాల్లో రాసిన సంభాషణలు ఆయనకు మంచి గుర్తింపును తీసుకొచ్చాయి. అమితాబ్ బచ్చన్ కెరీర్‌లో నిలిచిపోయిన 'షారాబీ', 'లావారీస్', 'నసీబ్' తదితర చిత్రాల్లో ఖాదర్ రాసిన సంభాషణలు ప్రేక్షకుల్ని అలరించాయి. అమితాబ్‌ను తొలిసారి జాతీయ ఉత్తమ నటుడిగా నిలబెట్టిన 'అగ్నిపథ్'కు ఖాదర్ సంభాషణలు అందించారు.

తీరని లోటు: ఖాదర్ మృతి పట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్విటర్‌లో తమ సంతాపం తెలిపారు. "హాస్యం...విలనిజం..ఇలా ఎన్నో రకాల విలక్షణ పాత్రలతో అలరించించారు ఖాదర్ ఖాన్. ఆయన మృతి చెందడం విచారకరం. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను''అని కోవింద్ ట్వీట్ చేశారు. ప్రధాని స్పందిస్తూ "తన నటనతో వెండితెరను ప్రకాశవంతం చేశారు ఖాదర్. హాస్య పాత్రలతో అలరించారు. ఎన్నో చిత్రాలకు రచయితగా తన సత్తా చాటారు. ఆయన కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తున్నాను''అని తెలిపారు. "ఖాదర్ జీ మృతి వార్త విచారం కలిగించింది. ఓ గొప్ప నటుణ్ని కోల్పోయాం'' అంటూ సంతాపం వ్యక్తం చేశారు రాహుల్ గాంధీ. ఖాదర్ ఆస్పత్రిలో ఉన్నప్పుడే త్వరగా కోలుకోవాలంటూ ఆకాంక్షిస్తూ ట్వీట్ చేశారు అమితాబ్. ఖాదర్ మృతి చెందిన విషయం తెలిసి అమితాబ్ విచారం వ్యక్తం చేశారు. "ఓ గొప్ప నటుడు, మంచి సంభాషణల రచయిత, గొప్ప గణిత వేత్త ఖాదర్. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి''అని తెలిపారు అమితాబ్. ఖాదర్‌ఖాన్ మృతి పట్ల పలువురు బాలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలియజేశారు.



సుమన్ రానా, హరి గిల్స్

వీరప్పన్ బతికి వస్తే..?

హరి గిల్స్, సుమన్ రానా జంటగా నటిస్తున్న చిత్రం 'మిరాకిల్'. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో వేణుగోపాల్ రుద్రపట్ల దర్శకత్వంలో రూపొందుతోంది. సి.వి.ఆర్. గణేష్, హరి విష్ణు నిర్మాతలు. హైదరాబాద్‌లో మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "కిల్లర్ వీరప్పన్ ఓ ఐపీఎస్ అధికారి రూపంలో బతికి ఉంటే ఎలా ఉంటుంది? ప్రముఖుల సమక్షంలో ఓ వ్యక్తిని కాల్చి చంపిన ఐపీఎస్ ఆఫీసర్‌ని ఓ న్యాయవాది ఎలా కాపాడాడు? ఒకే మనిషి తన జీవితంలో రెండు సార్లు ఎలా మరణిస్తాడు? అనే ఆసక్తికరమైన అంశాలుంటాయ"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "పది రోజుల్లో టాకీ పూర్తవుతుంద"న్నారు. జయకుమార్, వేణు మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నవ్విస్తోంది..



సత్యదేవ్, గోపీ గణేష్, నందిత శ్వేత, కృష్ణప్రసాద్, మారుతి

"మంచి కాన్సెప్టుతో రూపొందిన 'బ్లఫ్ మాస్టర్' చక్కటి వినోదాన్ని పంచుతోంద''ని దర్శకుడు మారుతి చెప్పారు. ఈ సినిమా ఇటీవలే విడుదలైన సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విజయోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సత్యదేవ్ కథానాయకుడిగా, గోపీ గణేష్ తెరకెక్కించిన చిత్రమిది. సత్యదేవ్ మాట్లాడుతూ "హాస్యం, భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన చిత్రమిది. ప్రేక్షకుల్ని నవ్విస్తోంద''న్నారు. నందిత శ్వేత మాట్లాడుతూ "ఇందులో నేను పోషించిన అవని పాత్ర నా కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోతుంద''న్నారు. కార్యక్రమంలో శివలెంక కృష్ణప్రసాద్, పృథ్వీ, సునీల్‌కశ్యప్, బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్స్ ఉద్ఘర్ష



ధన్సిక, ఠాకుర్ అనూప్, సునీల్‌కుమార్, దేవరాజ్

ఠాకుర్ అనూప్ సింగ్, ధన్సిక నాయకానాయికలుగా నటించిన త్రిభాషా చిత్రం 'ఉద్ఘర్ష'. సునీల్ కుమార్ దేసాయి దర్శకుడు. దేవరాజ్.ఆర్ నిర్మాత. దర్శకుడు మాట్లాడుతూ "ఇదో సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్. ఓ ప్రేమ జంటకు ఎదురయ్యే అనూహ్య పరిస్థితులతో ఉత్కంఠభరితంగా నడుస్తుంది. 'ఉద్ఘర్ష' అంటే ఓ రకమైన శబ్దభేరి. ఇందులో ఆ శబ్దాలు అనూహ్యంగా వినిపిస్తుంటాయ'న్నారు. నిర్మాత మాట్లాడుతూ "పోరాటాలకి పెద్దపీట వేశాం. త్వరలోనే తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదల చేస్తామ''న్నారు. స్వరకర్త సంజోయ్ చౌదరి, రాజన్, సహ నిర్మాత మంజునాథ్, హనుమాన్, ఫైట్‌మాస్టర్స్ వెంకట్, నాబా, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
వసుంధర
9 కరీంనగర్ బుధవారం జనవరి 2, 2019

వాళ్ల ఆర్థిక స్థితి అంతంత మాత్రం. ఇంటిపెద్దది చిరుద్యోగం. ఇలాంటి పరిస్థితుల్లో ఆ ఇంట మహాలక్ష్మిలు పుట్టారు.కానీ ఇద్దరికీ పుట్టుకతోనే చూపు దాదాపుగా లేదు. ఆ తల్లి నిరుత్సాహపడలేదు సరికదా... ఆత్మవిశ్వాసంతో వాళ్లను పెంచి పెద్దచేసింది. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలు తెచ్చుకునేలా చేసింది. ఆమే గుంటూరుకు చెందిన మాధవి.



పిల్లలకోసం వంటమనిషిగా మారి...

జీవితంలో వెలుగులు చూడలేమని బాధపడే తన బిడ్డలకు చీకటిలోనే లక్ష్యాన్ని నిర్దేశించింది. బిడ్డల ప్రయాణంలో బాటసారిగా ఉంటూ... చదువుతో పాటు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగం సంపాదించుకునే స్థాయికి తీర్చిదిద్దింది. పదిమంది గర్వించ దగ్గ స్థాయికి చేర్చిన మాధవి విజయం వెనుక ఎన్నో సవాళ్లున్నాయి. మాధవిది గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని చుండూరుపల్లి. ఒక సాధారణ మధ్యతరగతి నేపథ్యం. భర్త మన్నె శ్రీనివాసరావు సెక్యూరిటీ గార్డు ఉద్యోగం చేసేవారు. మొదటి సంతానంలో ఒక బాబు. రెండో కాన్పులో ఇద్దరు కవల ఆడపిల్లలు పుట్టారు. వారికి రజిత, లలిత అని పేర్లు పెట్టుకుని మురిసిపోయింది. వాళ్లు పుట్టిన మూడు నెలలు గడిచాక కానీ మాధవికి అర్థం కాలేదు వాళ్లలో ఏదో లోపం ఉందని. మూడు నెలలవుతున్నా వాళ్లు పూర్తిగా కళ్లు తెరవలేకపోతున్నారు. దీంతో ఒక రోజు వైద్యుల దగ్గరకు తీసుకెళ్లింది. అక్కడ డాక్టర్లు చెప్పిన మాటలకు మాధవి కుంగిపోయింది. వాళ్లకు చూపు దాదాపుగా లేదని చెప్పారు. అది తెలిశాక ఇద్దరినీ కంటికి రెప్పలా కాపాడుకోవాలనుకుంది. ఆ రోజే అందరిలానే చదివించి ప్రయోజకుల్ని చేయాలని సంకల్పించుకుంది.

ఎన్నో అవమానాలు భరించి..

వీళ్ల గురించి తెలిశాక ఎన్నో అవమానాలు తప్పలేదు. ఎక్కడైనా అనాథాశ్రమంలో వదిలేసి మరోసారి పిల్లల కోసం ప్రయత్నించమని చెప్పిన వారూ లేకపోలేదు. ఇలాంటి మాటలను లెక్కచేయలేదు మాధవి. కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నా. . పిల్లల్ని బాగా చదివించాలనుకుంది. బాపట్లలోని స్నేహమయీ కాన్వెంట్‌లో అక్కడి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు సహాయంతో ఇద్దరూ ప్రాథమిక విద్య పూర్తిచేసేలా చూసింది. ఆ తరువాత గుంటూరులో ఉన్న ఓ అంధుల వసతి గృహంలో ఉంచి, పక్కనే ఉన్న అలాంటి స్కూల్లో ఆరో తరగతిలో చేర్చింది. వారంలో నాలుగైదు సార్లు పిల్లల్ని చూడటానికి వెళ్లేది. కానీ కొన్నిరోజులకే తల్లిమనసు ఒప్పుకోలేదు. ఇంటికి దూరంగా వసతి గృహంలో ఉంటున్న తన పిల్లలు ఇబ్బందులు పడతారని భావించింది. అందుకే ఆ సంస్థ సభ్యులను అడిగి అక్కడ వంటమనిషిగా పనిచేసేందుకు సిద్ధమైంది. దానివల్ల తన బిడ్డల్ని దగ్గరుండి చూసుకోవచ్చు అనేది మాధవి ఉద్దేశం. అలానే చేరింది కూడా. తనకు మధ్యలో అనారోగ్య సమస్యలొచ్చినా, శరీరం సహకరించకపోయినా పిల్లలకోసం అక్కడే ఐదేళ్లు పనిచేసింది.

లక్ష్యం దిశగా...

కష్టాలు పడి... పెద్ద అమ్మాయి రజిత 2014లో బీకామ్ పూర్తిచేయించింది. డిగ్రీలో ఉన్నప్పుడే రజిత కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేది. 2012లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన వీఆర్‌వో పరీక్షలో 76 మార్కులు తెచ్చుకుని తృటిలో ఉద్యోగం కోల్పోయింది. ఇలా చాలా పరీక్షల్లో ఒకటి రెండు మార్కులు తక్కువ రావడంతో ఉద్యోగం కోల్పోయిన సందర్భాలున్నాయి. ఆ సమయంలోనే ఓ సంబంధం రావడంతో రెండేళ్ల క్రితం వివాహం చేసింది. అయినా రజిత తన ఉద్యోగ ప్రయత్నాలు ఆపలేదు. ఆ ప్రయత్నాల్లో భాగంగా గత ఆగస్టులో గుంటూరులోని గోరంట్ల ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం తెచ్చుకుంది. ఈ ఉద్యోగానికి సంబంధించి కంప్యూటర్ కోర్సు కూడా పూర్తి చేసింది రజిత. లలిత కూడా చదువుల్లో మొదటి నుంచి చురుకే. ఇంటర్‌లో 70 శాతం మార్కులు సాధించడంతో మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థలు వారు ఉచితంగా చార్టెడ్ అకౌంటెన్సీ కోర్సుకు సంబంధించిన సీపీటీ శిక్షణ ఇచ్చారు. ఆ తరువాత ఐపీసీసీ కోర్సుకి కొత్త ప్రదేశానికి వెళ్లింది. అయితే అక్కడి వాతావరణం, హాస్టళ్లలోని భోజనం పడక అనారోగ్య సమస్యలు వచ్చాయి. అలా బీకామ్‌లో చేరి 75 శాతం మార్కులతో పూర్తిచేసింది. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల బీమా సంస్థ' లో క్లర్క్‌గా ఉద్యోగం తెచ్చుకుంది. గ్రూప్-2 ఉద్యోగం సంపాదించడమే తన లక్ష్యమని చెప్తుంది లలిత.

-బాలరాజు తెలికా
ఈనాడు జర్నలిజం స్కూల్

అమ్మే మాకు తోడు!

మేం ఇతరుల సహాయం లేకుండా ఏ పని సొంతంగా చేసుకోలేం. చదువుకోవాలన్నా... ఎక్కడికైనా వెళ్లాలన్నా అమ్మే తోడు. చదువుల్లో ఇబ్బందులు వచ్చినా మా వెంటే ఉంటూ మమ్మల్ని ప్రోత్సహించేది. ఎంత కష్టపడైనా సరే అమ్మ ఆశయాన్ని తీర్చాలనుకున్నాం. మాకోసం ఎన్నో త్యాగాలు చేసింది. చిన్నా చితకా పనులు చేస్తూనే డబ్బు సంపాదించి మాకోసం దాచేది. మీకు చదువు అవసరమా అని అన్నవారూ ఉన్నారు. అలాంటప్పుడు అమ్మే మాలో స్థైర్యం నింపేది. అమ్మ లేకపోతే ఈ స్థాయికి చేరుకునేవాళ్లం కాదు..' అని చెబుతారు వీళ్లు.

నీళ్లల్లో పెంచేద్దాం

మీరు విన్నది కరెక్టే. చాలా రకాల ఇండోర్ ప్లాంట్స్ మట్టిలోనే కాదు... నీళ్లల్లోనూ ఆరోగ్యంగా పెరుగుతాయి. అవేంటో వాటిని ఎలా పెంచొచ్చో తెలుసుకుందామా!


తక్కువ స్థలం ఉన్నప్పుడు, కొంత నిర్వహణతోనే మొక్కల్ని పెంచాలనుకున్నప్పుడు చక్కని ప్రత్యామ్నాయం నీళ్లల్లో మొక్కల్ని పెంచడం. అందుకోసం వాటర్ మింట్, రోజ్‌మెరీ వంటి కొన్ని రకాల్నీ, చైనీస్ ఎవర్‌గ్రీన్, ఇంగ్లిష్ ఐవీ, జేడ్, పీస్ లిల్లీ, మనీ ప్లాంట్స్, ఫిలడెండ్రాన్, క్రోటన్ వంటి మొక్కల్ని ఎంచుకోవచ్చు. అయితే



వీటిని పెంచడానికి రాగి, ఇత్తడి, సీసం వంటి లోహపాత్రల్ని కాకుండా దళసరిగా ఉండే గాజు సీసాలు మేలు. ఎందుకంటే వీటి వేర్లకూ కాంతి అంది ఆరోగ్యంగా పెరుగుతాయి. నాచు పట్టకుండా ఉంటుంది. అయితే పాత్రను ఎంపికచేసుకున్నాక దాని అడుగున చిన్న చిన్న చిప్స్, రాళ్లు, బీడ్స్ వంటివాటితో పాటు చిన్న బొగ్గుముక్క కూడా వేస్తే నీళ్లు శుభ్రపడతాయి. నాచు పట్టకుండా, వాసన రాకుండా ఉంటుంది. మొక్క ఆరోగ్యంగా ఎదగాలంటే నైట్రోజన్ ఎక్కువగా ఉన్న ఎరువుని నీళ్లలో కరిగే రకాన్ని ఎంచుకోవాలి.

రంగవల్లిక

19 చుక్కలు,
9 వరుసలు
9 వచ్చేవరకు.



రాఘువుల గీత
హైదరాబాద్



మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
✦ email: vasundhara@eenadu.net

నజరానా

గ్రేవీ కూరల్లో క్రీమ్ అందుబాటులో లేకపోతే కొబ్బరి పాలు కలిపి చూడండి. గ్రేవీ రుచిగా ఉండటమే కాదు... చిక్కగానూ మారుతుంది.

విడాకులు ఇవ్వనంటున్నాడు... భయంగా ఉంది!

? నాకు పెళ్లయి తొమ్మిదేళ్లు. నాకో బాబు. నేనూ, నా భర్త గత ఐదేళ్లుగా విడివిడిగా ఉంటున్నాం. అతనొక శాడిస్ట్. అతని వేధింపులు భరించలేక 2016లో విడాకులకు దరఖాస్తు చేశా. అయితే నా దగ్గర అతడు హింసించినట్లు సరైన సాక్ష్యాధారాలు లేవని కేసు కొట్టేశారు. కానీ అతడు పెట్టిన టార్చర్ నాకు మాత్రమే తెలుసు. దాంతో అతనంటే అసహ్యం, భయం ఏర్పడ్డాయి. కానీ అతడేమో నాకు విడాకులు ఇవ్వనంటున్నాడు. కేవలం నా నుంచి సుఖం మాత్రమే అతడికి కావాలి. నేనిక నా మనసు చంపుకుని కాపురం చేయలేను. అతడు, అతడి కుటుంబం మీద కేసు పెట్టాలని వెళ్తే ...వాళ్ల పెద్ద మనుషుల పలుకుబడితో పోలీస్ కేసు నమోదు చేయనివ్వకుండా అడ్డుకున్నారు. మనోవర్తి కోరుతూ కోర్టులో వేశా. అతను ఒప్పుకుంటే తప్ప నాకు విడాకులు వచ్చే మార్గం లేదా?

- ఓ సోదరి

✔ మీరు విడాకులు కోరుతూ పిటిషన్ వేసినప్పుడు కేవలం క్రూరత్వం ఒక్కటే కారణంగా చూపించారా? భార్యాభర్తలుగా మీరిద్దరూ 5 ఏళ్లుగా విడిగా ఉంటున్నారని ఆధారాలు చూపించాల్సింది. క్రూరత్వానికి కచ్చితంగా ఇదే నిర్వచనం అనేమీ లేదు. మానసికంగా, శారీరకంగా వేధించడం రెండూ క్రూరత్వం కిందకే వస్తాయని చాలా కోర్టు తీర్పులు చెబుతున్నాయి. భార్యాభర్తల్లో ఎవరైనా సరే... మరొకరికి తెలియకుండా సంతాన నిరోధక ఆపరేషన్ చేయించుకున్నా కూడా క్రూరత్వం కిందే లెక్కేయాల్సి వస్తుందని ఓ కోర్టు తీర్పు చెబుతోంది. భార్య శారీరక సంబంధానికి అంగీకరించకపోవడం, ఇద్దరి మధ్య సయోధ్యలేకపోవడం, భాగస్వామికి అక్రమ సంబంధం అంటకట్టడం, అనుమానించడం, అకారణంగా వదిలివేయడం, ఇంట్లోకి రానీయకపోవడం, ఇలాంటి సమస్యలెన్నో క్రూరత్వం కిందకు వస్తాయి. మీరు చేసిన ఆరోపణకు సరైన సాక్ష్యాధారాలు చూపలేకపోవడం వల్ల కేసు కొట్టేశారని చెబుతున్నారు. మీరు అప్పుడే దాని మీద హైకోర్టులో అప్పీలుకు వెళ్లి ఉండాల్సింది. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13 ప్రకారం పెళ్లయిన తరువాత వేరొకరితో అక్రమ సంబంధం కలిగి ఉండటం, రెండేళ్లపాటు వదిలిపెట్టి దూరంగా వెళ్లడం, మతం మార్చుకోవడం, మతిస్థిమితం లేకపోవడం వంటి కారణాలతో కూడా విడాకులు పొందవచ్చు. ఇవికాక అదనంగా మరో నాలుగు కారణాలను కూడా దానిలో చేర్చారు. మీరు ఇప్పటికయినా ఇన్నాళ్లు జరిగిన ఆలస్యానికి కారణాలు చెబుతూ హైకోర్టులో అప్పీలు దాఖలు చేయండి. అలానే గత ఐదేళ్లుగా ఇద్దరూ విడిగా ఉంటున్నారన్న విషయాన్ని కూడా స్పష్టం చేయడం అవసరం. మనోవర్తి కేసు వేసిన తరువాత దాన్ని అతను చెల్లించాడా లేదా అన్న విషయం కూడా వారికి తెలియచేయండి. మీకు తప్పకుండా న్యాయం జరగవచ్చు. సాధారణంగా కోర్టుకు కావలసినవి సాక్ష్యాలు. కానీ మానసిక వేదనకు అవేవీ కనిపించవు. మీ మాటలే ఆ సాక్ష్యానికి మూలం. మరి మీరు వాటిని ఎందుకు నిరూపించలేపోయారో అర్థం కావడం లేదు. తొందరగా అప్పీలు చేస్తే న్యాయం జరగడానికి అవకాశం ఉంది.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

– మీ సందేహాలను, సమస్యల్ని vasulegal@eenadu.net కు పంపించగలరు.



నాన్న స్ఫూర్తితోనే... దత్తత తీసుకున్నా!

ప్రణీతా సుభాష్... పరిచయం అక్కర్లేని పేరు. నటిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న ఆమె... సినిమాలు చేస్తూనే ఓ పాఠశాలను దత్తత తీసుకుంది. ఆ ప్రయత్నంతో అరుదైన అవకాశాన్ని అందుకుంది. యంగ్ ఇండియన్ లీడర్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా... ఇజ్రాయెల్‌కి వెళ్లే ఆహ్వానాన్ని అందుకుంది. ఆ కార్యక్రమాన్ని ముగించుకుని వచ్చిన ఆమెతో వసుంధర మాట్లాడింది.

? బడిని దత్తత తీసుకోవాలనే ఆలోచన మీకు ఎలా వచ్చింది. ఏదయినా కారణం ఉందా?

నేనే కాదు మంచు లక్ష్మి, రకుల్, రెజీనా ఇలా కొందరం టీచ్ ఫర్ ఛేంజ్ ప్రోగ్రాంలో సభ్యులం. అందులో భాగంగా కర్ణాటకలో కిందటేడాది ఓ కార్యక్రమం జరిగింది. అలా నేను కూడా బెంగళూరులోని ఓ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పిల్లలకు పాఠాలు చెప్పా. ఆ పిల్లలకు ఏమీ రాదని, అక్కడ కనీస సౌకర్యాలు కూడా లేవని, చదువుల్లో చాలా వెనుకబడి ఉన్నారని అక్కడికి వెళ్లాకే తెలిసింది. పిల్లలకు పాఠాలు చెప్పడం అయ్యాక బడిని పూర్తిగా మార్చాలంటే ఏం చేయాలని ఆ ప్రిన్సిపల్‌ని అడిగా. దత్తత తీసుకుంటే ఎన్నో చేయొచ్చు అని చెప్పారు. అలా 2018 అక్టోబరులో నా పుట్టిన రోజున బెంగళూరు హసన్ పట్టణంలోని ఆ బడిని దత్తత తీసుకున్నా.

? ఆ తరువాత ఎలాంటి మార్పులు చేశారు?

ముందుగా బడికి రంగులు వేయించాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ టీచర్లు తక్కువ. ఇక్కడా లేరు. అందుకే ఈ సంవత్సరంలో అయినా ఓ టీచర్‌ని నియమించే పనుల్లో ఉన్నాం. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఇక్కడా ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని ఉంది. ఖర్చు లక్షల్లోనే. అయితే అన్ని రకాల సౌకర్యాలు ఉండే పోర్టబుల్ ల్యాబ్‌లను రెండు మూడు లక్షల్లో ఏర్పాటు చేసే ప్రయత్నంలో ఉన్నాం. పైగా ఒక తరగతి నుంచి మరో తరగతికి కూడా తీసుకెళ్లొచ్చు.

? సినిమా, సేవ రెండూ కష్టమే... మరి ఎలా సమన్వయం చేసుకుంటున్నారు?

నేను పిల్లల్ని కలిసింది ఒకటి రెండుసార్లు మాత్రమే. మా లక్ష్యం బడిని మార్చడం కాబట్టి... ప్రిన్సిపల్, టీచర్లు, స్థానిక పంచాయతీ, మా బృందం ఇలా వీళ్లందరితో ఎక్కువగా కలిసి పనిచేయాల్సి ఉంటుంది. నటిగా ఇప్పుడు నా వంతుగా సమాజానికి ఎంతో కొంత చేస్తున్నాననే సంతృప్తి ఉంది. అందుకే రెండింటికీ సమయం పెట్టుకుంటున్నా. నేను లేకపోయినా మా బృందం వాళ్లకు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటుంది. తరచూ వాళ్లతో మాట్లాడుతుంటా కాబట్టి ఏ ఇబ్బందీ ఉండదు. మా బృందంలో ఇరవైమంది సభ్యులున్నారు.



? ఇజ్రాయెల్‌కి వెళ్లే అవకాశం ఎలా వచ్చింది.

బడిని దత్తత తీసుకోవడం వెనుక ప్రధాన ఆశయం 'ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలి' అనేదే. నా గురించి ప్రభుత్వానికి తెలిసి ఆహ్వానం పంపారు. దీన్ని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించింది. దానిపేరు యంగ్ ఇండియన్ లీడర్స్ డెలిగేషన్ ప్రోగ్రాం. సినిమా రంగం నుంచి నేనొక్కదాన్నే ఉన్నా కానీ ఐపీఎస్, ఐఏఎస్, ఐఆర్‌ఎస్ అధికారులు చాలామందే ఉన్నారు.

? అక్కడ ఏం తెలుసుకున్నారు?

ఇది ఐదు రోజుల కార్యక్రమం. ప్రతిరోజు సమావేశాలు జరిగాయి. అక్కడి పార్లమెంట్‌కి కూడా వెళ్లాం. ప్రభుత్వం పనితీరు, వ్యవసాయం చేసే పద్ధతులు.. ఇలా ఎన్నో తెలుసుకున్నాం. అక్కడ వృథానీటిని పరిరక్షించి, మళ్లీ వాడుకునేలా చేస్తారు. పైగా అక్కడ స్టార్టప్‌లు కూడా ఎక్కువే. ఇలా ఎన్నో తెలుసుకున్నాం. ఎన్నో నేర్చుకుని వచ్చాం.

? సేవ విషయంలో మీకు స్ఫూర్తి ఎవరు?

నాన్నే. అమ్మానాన్నలిద్దరూ వైద్యులు. బెంగళూరులో ఆసుపత్రి ఉంది. నాన్న మొదటినుంచి ఉచిత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసేవారు. ఆయన సేవను కర్ణాటక ప్రభుత్వం కూడా గుర్తించింది. అమ్మ కూడా ఆ సేవా కార్యక్రమాల్లో భాగం అవుతుంది. ఆ స్ఫూర్తితోనే నేనూ సేవ చేస్తున్నా.



01 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	32,600	32,700	32,550	32,500
ఆర్నమెంట్	30,480	30,540	30,200	30,150
వెండి (కిలో)	39,500	39,525	39,600	39,600

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	------	32,540	32,630	32,710
ఆర్నమెంట్	------	30,110	30,210	30,170
వెండి (కిలో)	------	39,400	39,600	39,500

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	32,480	32,410	------	------
ఆర్నమెంట్	30,210	30,140	3,021	3,017 గ్రా
వెండి (కిలో)	39,500	39,500	41.50	41.50 గ్రా

చర్మం మెరవాలంటే!

చలికాలంలో మన చర్మానికి జరిగే హాని అంతా ఇంతా కాదు. చల్లటి గాలులు, వాతావరణం మన చర్మంలోని తేమను పీల్చేస్తాయి. ఫలితంగా అది నిర్జీవంగా, కాంతివిహీనంగా మారుతుంది. అలా కాకుండా ఉండాలంటే... ఓ పద్ధతి ప్రకారం ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి.



క్లెన్సింగ్: ముందుగా ముఖాన్ని తడి వస్త్రంతో తుడవాలి. ఇప్పుడు గాఢత తక్కువగా ఉండే ఫేస్‌వాష్‌తో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. తరువాత మెత్తని వస్త్రంతో తుడవాలి. అదయ్యాక...

టోనర్: మీ ముఖంపై ఉండే చర్మం ఆరోగ్యంగా, నవయౌవనంగా కనిపించాలంటే టోనింగ్ తప్పనిసరి. దూదిపై టోనర్ వేసుకుని ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇది మీ ముఖంపై మిగిలిపోయిన మురికిని తొలగిస్తుంది. అంతేకాదు ముఖంపై ఉన్న రంధ్రాలను కూడా శుభ్రం చేస్తుంది. చర్మం మృదువుగా మారేలా చేస్తుంది.

పూత: ఇంట్లో సహజసిద్ధంగా తయారుచేసుకున్న ఏదయినా పూతను ముఖానికి వేసుకుని పదిహేను నిమిషాలయ్యాక కడిగేసుకోవాలి. తరువాత నాణ్యమైన మాయిశ్చరైజర్‌ని పట్టించాలి. దీనివల్ల చర్మానికి కావాల్సిన తేమ అందుతుంది.

చదువు



నేర్పిస్తాం.. డబ్బులిస్తాం!

ప్రముఖ కంపెనీల భారీ ఆఫర్లు

ఇంటర్న్‌షిప్..! గ్రాడ్యుయేషన్‌లోకి చేరిన విద్యార్థుల చూపు దీనివైపు సాగుతోంది. ఇంజినీరింగ్ విద్యార్థులకు అయితే ఇది తప్పనిసరి కూడా అయింది. రెజ్యూమేకు అదనపు విలువ చేకూర్చడంతోపాటు చాలాసార్లు ఉద్యోగాన్నీ ఖాయం చేస్తుండటంతో విద్యార్థులు దీనిపై మొగ్గు చూపుతున్నారు. అయితే ఇచ్చే స్టైపెండ్ తక్కువే కదా అని అసంతృప్తీ, నిరాశా పడనక్కర్లేదు. కొన్ని బడా సంస్థలు పెద్దమొత్తంలోనే స్టైపెండ్‌ను ఇస్తున్నాయి. దరఖాస్తు చేసుకుని, ఎంపికైతే ఆకర్షణీయమైన మొత్తం అందుకుంటూ ఇంటర్న్‌షిప్ కొనసాగించవచ్చు!

దరఖాస్తు ఎలా?



1 **ఆన్‌లైన్:** పెద్ద సంస్థల అధికారిక వెబ్‌సైట్లు అన్నింటిలో 'కెరియర్' పేజీ తప్పనిసరిగా ఉంటుంది. దీనిలో ఓపెనింగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటుంది. దీనికి వెళ్లి పూర్తి సమాచారం తెలుసుకోవడంతోపాటు నమోదూ చేసుకోవచ్చు.

2 **రెఫరెన్స్:** సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఎవరైనా తెలిసుంటే వారి సాయం కోరవచ్చు. లింక్‌డిన్‌లో పరిచయాలను ఏర్పరచుకుని, వారిని రెఫరెన్స్ ఇవ్వమని అడగొచ్చు.

3 **మెయిల్:** విద్యార్థులు నేరుగా సంస్థల హెచ్ఆర్‌లకు ఫలానా సంస్థలో ఇంటర్న్‌షిప్‌ను చేయాలన్న తమ ఆసక్తిని తెలియజేస్తూ మెయిల్ పంపొచ్చు. అయితే కవర్‌లెటర్, రెజ్యూమేనూ జత చేయాల్సి ఉంటుంది. సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో మెయిల్ ఐడీని సంపాదించొచ్చు.

4 **ఇంటర్న్‌షిప్ పోర్టళ్లు:** ఇప్పుడు ఇంటర్న్‌షిప్‌లకే ప్రత్యేకంగా ఎన్నో వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయి. ఉదా: ఇంటర్న్‌శాల, లెట్స్ ఇంటర్న్. ఆయా వెబ్‌సైట్లలోకి వెళ్లి నచ్చిన సంస్థలో తగిన ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉద్యోగానికి రాచమార్గం వేయడంలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు సాయపడుతున్నాయి. తరగతి గదిలో తాము నేర్చుకున్నది పనిచేసే చోట ప్రయోగాత్మకంగా ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకోవటంలో గొప్పగా సాయపడుతున్నాయి. ఉద్యోగాలకు ఇలా ముందస్తుగా సిద్ధమయ్యే అవకాశం లభిస్తోంది. అందుకే విద్యార్థులు వీటిపై దృష్టి సారిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో తప్పనిసరి చేయడానికి వెనుక ఉన్న ఉద్దేశం- పరిశ్రమపరంగా విద్యార్థులు ఎంతమేరకు సంసిద్ధంగా ఉన్నారో వారికి వారు అంచనా వేసుకోవడానికి వీలు కల్పించడమే!

ఇంటర్న్‌షిప్‌లో భాగంగా చొరవ చూపి మంచి ప్రదర్శన చేసినవారిని సంస్థలు వారి చదువు పూర్తయ్యాక సంస్థల్లోకి ఆహ్వానిస్తున్నాయి. ఈ రకంగా సంస్థలకూ మేలు జరుగుతోంది. మామూలుగా అయితే... ఒక అభ్యర్థిని తమకనుగుణంగా మలచుకోవడానికి సంస్థలు వారికి శిక్షణనివ్వడం, దానివల్ల సమయం, డబ్బు, మానవ వనరులను వెచ్చించాల్సిరావటం.. .జరుగుతుంది. వీటికి ప్రత్యామ్నాయ మార్గంగా సంస్థలకు ఇంటర్న్‌షిప్‌లు కనిపిస్తున్నాయి. చాలా సంస్థలు ప్రత్యేకంగా ఇంటర్న్‌షిప్‌లకు సంబంధించి ప్రత్యేకంగా ప్రకటనలు ఇవ్వడం, నియామకాలను చేపట్టడమే ఇందుకు ఉదాహరణ.

అయితే ఇంటర్న్‌షిప్‌ల్లో చాలావరకూ స్టైపెండ్ చెల్లించనివే విద్యార్థులకు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల ఇంటర్న్‌షిప్‌ను పొందడానికి అభ్యర్థులే కొంత మొత్తం చెల్లించాల్సి వస్తోంది. దీంతో వీటిపై అనాసక్తి ప్రదర్శిస్తున్నవారూ ఉన్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే.. సంస్థల గురించిన ముందస్తు అవగాహన కల్పించుకోవడం ప్రధానం. ఎందుకంటే.. దేశవ్యాప్తంగా ఎన్నో సంస్థలు ఇంటర్న్స్‌కు పెద్ద మొత్తంలో చెల్లిస్తున్నాయి.

పే పాల్ (నెలకు రూ.50,000)

పెద్దనోట్ల రద్దు తరువాత ఆన్‌లైన్ లావాదేవీలకు ఎంత ప్రాముఖ్యం పెరిగిందో అందరికీ తెలిసిందే. ఈ రకమైన డబ్బు లావాదేవీల్లో ఈ సంస్థ అగ్రశ్రేణిలో ఉంది. ఈ రంగంలో ఆసక్తి ఉండి, కెరియర్‌ను మలచుకోవాలనుకునేవారికి ఈ సంస్థలో ఇంటర్న్‌షిప్ మంచి అవకాశం. సాధారణంగా ఇంజినీరింగ్, మార్కెటింగ్ గ్రాడ్యుయేట్లకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నారు. అయితే ఎక్కువగా బెంగళూరులోనే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా అధిక మొత్తంలో వేతనం చెల్లిస్తున్నవాటిలో ముందంజలో ఉంది. దాదాపుగా రూ. 50,000 వరకూ చెల్లిస్తున్నారు. ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఇంటర్న్‌షిప్ కాలవ్యవధి- 10-12 వారాలు. **వెబ్‌సైట్:** www.paypal.com/

అమెరికన్ ఎక్స్‌ప్రెస్ (నెలకు రూ.60,000)



క్రెడిట్ కార్డుల ప్రపంచంలో అగ్రగామి సంస్థ. భారతీయ సంస్థ కానప్పటికీ దేశంలో ప్రాధాన్యం ఉంది. 'వింగ్స్' ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటర్న్‌షిప్‌లను నిర్వహిస్తారు. స్టైపెండ్ నెలకు రూ. 60,000 వరకూ ఉంటుంది. ఫైనాన్స్ రంగంలో కెరియర్ మలచుకోవాలనుకునే ఫ్రెషర్లకు దీన్ని అనువైన ప్రదేశాల్లో ఒకదానిగా చెబుతారు. ఆఫ్‌లైన్ ఇంటర్న్‌షిప్. గ్రూప్ డిస్కషన్/ ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహించి, దానిలో అర్హత సాధించినవారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. దానిలోనూ ఉత్తీర్ణులైనవారికి ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని కల్పిస్తారు. కాకపోతే గుడ్‌గావ్, బెంగళూరు సంస్థల్లోనే ఇంటర్న్‌షిప్ అవకాశం ఉంది. **వెబ్‌సైట్:** www.americanexpress.com/

మైక్రోసాఫ్ట్ (నెలకు రూ.40,000)

కంప్యూటర్ రంగంలోనే పేరెన్నికగన్న సంస్థ ఇది. ఈ విభాగంలో చదివే ప్రతి విద్యార్థీ పనిచేయాలని కలగనే సంస్థగా చెప్పొచ్చు. వీరు చెల్లించే స్టైపెండ్ మొత్తం దాదాపుగా రూ. 40,000. దీనిలో చేరినవారికి కొత్త టెక్నాలజీల పరిచయంతోపాటు అవి ఎలా పనిచేస్తాయో దగ్గర్నుంచి చూసే అవకాశమూ లభిస్తుంది. తద్వారా నేర్చుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

సమ్మర్ ఇంటర్న్‌షిప్స్‌ను అందిస్తున్నారు. కంప్యూటర్స్ గ్రాడ్యుయేట్లకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. నిర్ణీత సీజీపీఏ ఉన్నవారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. రాతపరీక్ష, టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూల ఆధారంగా తీసుకుంటున్నారు. **వెబ్‌సైట్:** www.microsoft.com/

క్యాడ్‌బరీ (నెలకు రూ.40,000)

దేశంలోని మిఠాయి రంగంలో మరో అతిపెద్ద సంస్థ. ప్రపంచవ్యాప్తంగా రెండో స్థానంలో ఉంది. ఇక్కడ పనికి సంబంధించిన మెలకువలను ప్రాథమిక స్థాయి నుంచి క్లిష్టమైన స్థాయి వరకు నేర్పిస్తారు. ఎంచుకున్న విభాగాన్ని బట్టి ఇంటర్న్‌షిప్‌లు మూడు నుంచి ఆరు నెలల కాలవ్యవధి వరకూ ఉంటాయి. సేల్స్, మార్కెటింగ్‌కు సంబంధించిన ఇంటర్న్‌షిప్‌లు ఎక్కువగా ఉన్నాయి. అందిస్తున్న స్టైపెండ్ మొత్తం రూ. 40,000. **వెబ్‌సైట్:** www.cadbury.co.za/

గోల్డ్‌మన్ సాక్స్ (నెలకు రూ.37, 000)

ప్రపంచవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో పేరున్న సంస్థ ఇది. దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలన్నింటిలో ఈ సంస్థ సేవలను అందిస్తోంది. రెండు రకాల ఇంటర్న్‌షిప్‌లను అందిస్తోంది. బెంగళూరులోనే అందుబాటులో ఉన్నాయి. ఆఫ్‌లైన్ ఇంటర్న్‌షిప్‌లు. 1. సమ్మర్ అనలిస్ట్ ఇంటర్న్‌షిప్: దీనికి డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫైనాన్షియల్ మార్కెట్లపై ఆసక్తి ఉన్నవారికి ఇది ఉపయోగకరం. అకడమిక్ స్కోరు ఆధారంగా రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్‌లకు అనుమతిస్తారు. వీటిలో ఎంపికైనవారికి వ్యక్తిగత ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్న్‌షిప్ వ్యవధి- పది వారాలు. 2. విమెన్ ఇంజినీర్స్ క్యాంపస్ హైరింగ్ ప్రోగ్రాం: డిగ్రీ, పీజీ అమ్మాయిల కోసం ఉద్దేశించినది. డిగ్రీ రెండో ఏడాది, పీజీ మొదటి ఏడాది చదువుతూ 12 నెలల కంటే తక్కువ పని అనుభవం ఉన్నవారికి ఇంటర్న్‌షిప్ అందుబాటులో ఉంది. గంటన్నర వ్యవధి గల పరీక్ష నిర్వహిస్తారు. సాధారణంగా పరీక్ష జూన్‌లో నిర్వహిస్తారు. ఎంపికైనవారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. స్టైపెండ్ నెలకు రూ. 37,000.

వెబ్‌సైట్: www.goldmansachs.com/

ఇవే కాకుండా...

మోర్గాన్ స్టాన్లీ, ఫ్లిప్ కార్ట్ నెలకు రూ. 25,000-35,000, ఇంటెల్ రూ. 20,000-35,000, ఏర్‌బీఎన్‌బీ, పెప్సికో, మింత్రా, అమేజాన్, ఉబర్ ఇండియా, పేటీఎం, ఓలా, రిలయన్స్ జియో వంటి సంస్థలు రూ. 20,000, అంతకు మించి స్టైపెండ్‌ను అందిస్తున్నాయి. డెలాయిట్ నెలకు కనీసం రూ. 15,000 ఇస్తోంది. ఎక్కువ శాతం ఆఫ్‌లైన్ ఇంటర్న్‌షిప్‌లు; చాలావరకూ ఏడాది పొడవునా అందుబాటులో ఉన్నాయి. ఇంటర్న్‌షిప్‌ల కాలవ్యవధి 2 నెలల నుంచి 6 నెలల వరకూ ఉంది.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1, గ్రూప్-2 సర్వీసులు, ఇతర పోస్టులకు మొత్తం 21 ఉద్యోగ నియామక ప్రకటనలను విడుదల చేసింది. మొత్తం 3255 పోస్టులు. వీటిలో గ్రూప్-1లో 169, గ్రూప్-2లో 446 ఉన్నాయి, అర్హతలూ, ఉన్న సమయం బట్టి వీటిలో తగినవి ఎంచుకుని, అభ్యర్థులు పూర్తిసాయిలో సంసిద్ధం కావాలి. ఈ పోటీ పరీక్షలన్నిటికీ ఉన్న ఉమ్మడి సిలబస్‌ను అవగాహన చేసుకోవటం తొలి మెట్టు. అందుకు ముందడుగు ఎలా వేయాలో తెలుసుకుందాం!

గ్రూపులు కొట్టండి

ఏపీపీఎస్సీ నుంచి మొత్తం 3255 ఖాళీలు

గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ మొదలైనవీ, గ్రూప్-2లో అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ మొదలైన 446 పోస్టులూ, వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఇతర పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నుంచి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. చాలామంది ఒకటికి మించిన పరీక్షలు రాసి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు. ఉమ్మడి సిలబస్ ప్రవేశపెట్టక ముందు దాదాపు అన్ని ప్రిలిమినరీ పరీక్షల్లో ఒకే రకమైన సిలబస్ ఉండేది. దానితో స్క్రీనింగ్ వరకూ ఇబ్బందులూ లేకుండా తయారయ్యే అవకాశం ఉండేది.



కొడాలి భవానీ శంకర్

అయితే 'స్క్రీనింగ్, మెయిన్స్ మధ్య అంత రాన్ని తొలగించటం' అనే ఏపీపీఎస్సీ తాజా ధోరణి వల్ల దాదాపుగా అన్ని పరీక్షల స్క్రీనింగ్ లోనూ చాలా తేడాలొచ్చాయి. అందువల్ల ఒకేసారి ఒకటికి మించిన పరీక్షలకు సిద్ధపడేందుకు అదనపు ప్రణాళికను అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ స్క్రీనింగ్ పరీక్షలో చూసినా జనరల్ స్టడీస్ విభాగం ఉమ్మడిగా ఉంది. అదనంగా మరికొంత సమాచారాన్ని జోడించారు. ఫలితంగా ప్రతి స్క్రీనింగ్ పరీక్షకూ జనరల్ స్టడీస్‌కి అదనంగా మరికొంత సమాచారం చదవాల్సి వస్తోందిప్పుడు. ఈ రకంగా ఒకటి లేదా రెండు పరీక్షల మీదే దృష్టి పెట్టాల్సిన పరిస్థితి.

ప్రస్తుతం ఏపీపీఎస్సీ అనుసరిస్తున్న విధానాన్ని బట్టి గ్రూప్ 1, 2, 3 పరీక్షల్లో స్క్రీనింగ్, మెయిన్స్‌లకు విభిన్నమైన సిలబస్ ఉండదు. అందువల్ల 'మెయిన్స్'లో ఉన్న సిలబస్‌నే స్క్రీనింగ్ సిలబస్‌లో కూడా చేర్చారు. స్క్రీనింగ్‌కీ, మెయిన్స్‌కూ ఏయే స్థాయుల్లో చదవటం అవసరమో గ్రహించటం ముఖ్యం. స్క్రీనింగ్‌కి తక్కువ మార్కులే ఉన్నాయి. కాబట్టి తక్కువ చదివితే చాలు అనే పరిధిని నిర్ణయించుకోవద్దు. మెయిన్స్ కోసం విస్తృతంగా చదువుదాంలే' అనే ఆలోచన కూడా సరైనది కాదు.

సాధారణంగా సివిల్స్ మొదలైన పరీక్షలకు తయారవుతున్నవారికి ఆంధ్రప్రదేశ్ సంబంధిత అంశాలపై పెద్దగా పట్టు ఉండదు. ముఖ్యంగా ఇప్పటి సిలబస్ అధ్యయనం చేస్తే ఆంధ్రప్రదేశ్ జాగ్రఫీ, ఆంధ్రప్రదేశ్ ఎకానమీ, విభజనానంతర ఆంధ్రప్రదేశ్ స్థితిగతులు, ఆంధ్రప్రదేశ్ చరిత్ర- సంస్కృతి చాలా కీలకంగా మారనున్నాయి. కనీసం ఈ విభాగాల్లో 25 నుంచి 30 ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల ఆంధ్రప్రదేశ్ సంబంధిత అంశాలపై ప్రామాణికమైన పుస్తకాలు చదవాల్సిన అవసరముంది. ఒకేసారి ఒకటికి మించిన పరీక్షలు రాయాలా వద్దా అనేది స్క్రీనింగ్, మెయిన్స్ పరీక్షల తేదీల ఆధారంగా నిర్ణయించుకోవాలి.

రెండూ రాయాలనుకుంటే?

ఇలా గ్రూప్-1, 2 రెండు పరీక్షలూ రాయాలనుకున్నపుడు అదనంగా ఏమున్నాయో గమనించాలి. గ్రూప్-1లో పరీక్షలో అదనంగా ఉన్న సమాచారం: 1. ప్రాచీన భారతదేశ చరిత్ర 2. మధ్య భారతదేశ చరిత్ర 3. గాంధీ, అంబేడ్కర్ తాత్విక చింతన 4. ప్రపంచ భౌగోళిక అంశాలు 5. పాలనలో ఎథిక్స్- విలువలు 6. శాస్త్ర సాంకేతిక అంశాల్లో లోతైన అధ్యయనం 7. మనోవైజ్ఞానిక సంబంధిత నిర్వహణ అంశాలు 8. మానసిక సామర్థ్యాల కింద అంకగణితం, లాజికల్ సామర్థ్యాలతో పాటు శుద్ధ గణిత శాస్త్ర అంశాలు

మిగతా స్క్రీనింగ్ పరీక్షల్లో లేనివీ- గ్రూప్-2లో మాత్రమే ఉన్నవి: 1. ఆంధ్రప్రదేశ్ చరిత్ర 2. ఆంధ్రప్రదేశ్ ఆరిక వ్యవస్థ 3. జనరల్ ఎకానమీతో కలవని ప్రత్యేక ఆర్థిక అంశాలు 4. జాతీయ అంతర్జాతీయ సంఘటనలు

ఎలా చదవాలి?

అభ్యర్థులు మెయిన్స్‌కి ప్రిపేర్ అవుతున్న తరహాలోనే విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షకు కూడా సిద్ధమైతే ఇబ్బంది ఉండదు. మౌలిక అంశాలపై దాదాపుగా 30 శాతం వరకు ప్రశ్నలు వస్తాయి. అందువల్ల పాఠశాల స్థాయి పుస్తకాలపై ఆధారపడితే స్క్రీనింగ్‌లో ఎక్కువ మార్కులు స్కోర్ చేసుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్యంగా కొత్తగా పరీక్ష రాస్తున్నవారు ప్రతి విషయాన్నీ కాన్సెప్ట్ ఆధారంగా నేర్చుకుంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చు. జనరల్ సైన్స్, శాస్త్ర సాంకేతికత, ఆర్థిక అంశాలు, రాజకీయ అంశాలను కరెంట్ అఫైర్స్‌తో అనుసంధానం చేసుకుని చదివితే అధిక ప్రయోజనం ఉంటుంది. బిట్లు బిట్లు మాదిరిగా చదివితే నష్టం ఎక్కువ ఉంటుంది. ముఖ్యంగా కొత్తవారు అకడమిక్ ధోరణి నుంచి బయటపడటం ముఖ్యం. వీరు విస్తృత అవగాహనపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఏ ఒక్క పుస్తకం నుంచో ప్రశ్నలు అడగరు. ఇది గుర్తించి సిలబస్‌ను దృష్టిలో పెట్టుకుని వివిధ వనరుల నుంచి సమాచారాన్ని సేకరించుకోవాలి. తోటివారు చెప్పారని గుడ్డిగా అనుసరిస్తే నష్టమే ఎక్కువ!



పంచాయతీ కార్యదర్శుల పరీక్ష స్క్రీనింగ్ పరీక్షకు ప్రత్యేకంగా ఉన్న అదనపు సిలబస్ అంశాలు: 1. పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్మాణం 2. ఖాతాల నిర్వహణ 3. గ్రామీణాభివృద్ధి పథకాలు 4. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలోని మానవ అభివృద్ధి అంశాలు మొదలైన 12 చాప్టర్లు. ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ కూడా అన్ని స్క్రీనింగ్ పరీక్షల్లో ఉమ్మడి సిలబస్ అంశాలు చాలావరకు ఉన్నాయి. అవి-

◆ ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం ◆ భారతదేశ భౌగోళిక అంశాలు, భారతదేశ ఆర్థిక వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ ◆ ఇండియన్ పాలిటీ ◆ మెంటల్ ఎబిలిటీ ◆ వర్తమాన అంశాలు ◆ విపత్తు నిర్వహణ ◆ పర్యావరణ సంబంధిత అంశాలు ◆ డాటా ఇంటర్‌ప్రెటేషన్, విశ్లేషణ ◆ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, సవాళ్లు, నవ నిర్మాణం.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఏపీలో గ్రూప్స్, అధ్యాపక పోస్టులు

ఆంధ్రప్రదేశ్ సివిల్, పోలీస్, ట్యాక్స్, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, మునిసిపల్ కమిషనర్ సబార్డినేట్, రెవెన్యూ సబార్డినేట్ సర్వీసులు, సాంకేతిక/ కళాశాల విద్య తదితర శాఖల్లో వివిధ పోస్టుల భర్తీకి డిసెంబరు 31న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏడు నోటిఫికేషన్లను విడుదల చేసింది. **పోస్టులు-ఖాళీలు:** గ్రూప్ 1 సర్వీసులు- 169, గ్రూప్ 2 ఆఫీసర్- 446, పాలిటెక్నిక్ లెక్చరర్- 405, డిగ్రీ కళాశాల అధ్యాపకులు- 308, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్- 43, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్- 10, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్- 05. మొత్తం పోస్టులు- 1,386.

అర్హతలు: పోస్టును అనుసరించి ఏదైనా డిగ్రీ లేదా సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, డిప్లొమా, పీజీ, నెట్/ స్లెట్, పీహెచ్‌డీ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. **పోస్టుల వారీ ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేదీలు:** గ్రూప్ 1 సర్వీసులు- జనవరి 28, గ్రూప్ 2 ఆఫీసర్- జనవరి 31, డిగ్రీ కళాశాల అధ్యాపకులు- ఫిబ్రవరి 26, పాలిటెక్నిక్ లెక్చరర్- ఫిబ్రవరి 27, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్/ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్- ఫిబ్రవరి 08, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్- ఫిబ్రవరి 12.
వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

బార్క్‌లో మెడికల్ పోస్టులు

ముంబయిలోని బాబా అణు పరిశోధన కేంద్రం కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు-ఖాళీలు:** మెడికల్/ సైంటిఫిక్ ఆఫీసర్(విభాగాలు- డెంటల్ సర్జన్, సైకియాట్రి, జీడీఎంవో)- 08, సైంటిఫిక్ అసిస్టెంట్(మెడికల్ సోషల్ వర్కర్)- 01, ఫార్మాసిస్ట్- 02, టెక్నీషియన్(సీఎస్ఎస్‌డీ, ఎక్స్-రే/ రేడియోగ్రఫీ)- 02. **అర్హత:** పోస్టును బట్టి హెచ్ఎస్సీ, సంబంధిత విభాగంలో ట్రేడ్ సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ, ఎంబీబీఎస్, ఎండీఎస్, ఎండీ/ డీఎన్‌బీ ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ తేదీలు:** 02.01.2019 నుంచి 25.01.2019. www.barc.gov.in

ప్రవేశాలు

నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ 2019

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్, యూనివర్సిటీ ఆఫ్ ముంబయి-డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్ సంస్థల్లో బేసిక్ సైన్సెస్ (బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్) సబ్జెక్టుల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ప్రోగ్రాం ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్) 2019 ప్రకటన విడుదలైంది. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ తేదీలు:** 07.01.2019 నుంచి 11.03.2019 వరకు. **ప్రవేశ పరీక్ష తేది:** 01.06.2019. **వెబ్‌సైట్:** www.nestexam.in

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం- దూరవిద్యా విధానంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **కోర్సులు:** పీజీ- ఎంఎస్సీ(మ్యాథ్స్, జువాలజీ), ఎంఏ(కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎకనామిక్స్, ఇంగ్లిష్, తెలుగు, మ్యూజిక్, ఉమెన్ స్టడీస్), ఎంకాం, పీజీ డిప్లొమా(ఫ్యామిలీ అండ్ హెల్త్ కౌన్సెలింగ్, ప్రీస్కూల్ ఎడ్యుకేషన్, పబ్లిక్ రిలేషన్స్), డిప్లొమా(మ్యూజిక్). **అర్హత:** కోర్సులను బట్టి పదోతరగతి, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సు, సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 31.03.2019.
వెబ్‌సైట్: www.spmvv.ac.in

భారం మోపలేదు...

ప్రజలకు మేం దూరం కాలేదు

కొత్త సంవత్సరం తొలి రోజున ప్రధాని నరేంద్రమోదీ మనసు విప్పి మాట్లాడారు. పెద్దనోట్ల రద్దు వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరింది... మెరుపు దాడులకు మన సైన్యం వెళ్లిన సమయంలో వారు తిరిగొచ్చేవరకు తానెంతో ఉత్కంఠగా గడిపానో... మునుపటి ప్రధానులకు భిన్నంగా ఎక్కువగా విదేశీ పర్యటనలకు తానెందుకు వెళ్లాల్సి వస్తోందో... వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు తమ సర్కారునే ఎందుకు ఎన్నుకోవాలో విడమరిచి చెప్పారు. కొన్ని కఠిన నిర్ణయాలు తప్పక పోయినా.. తామేమీ ప్రజలకు దూరం కాలేదని గట్టిగా సమర్థించుకున్నారు.

- ఈనాడు, దిల్లీ



మీరు అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోయారు. దీన్ని ఒక వైఫల్యంగా భావించడం లేదా?

తెలంగాణ, మిజోరంలలో భాజపా అధికారంలోకి వస్తుందని భాజపాతో సహా ఎవ్వరూ చెప్పలేదు. కనీసం అలాంటి ఊహ కూడా ఎవ్వరూ చేయలేదు. మిగతా మూడు రాష్ట్రాల విషయానికొస్తే ఛత్తీస్‌గఢ్‌లో భాజపా ఓడిపోయింది. మిగిలిన రెండు రాష్ట్రాల్లో హంగ్ ఏర్పడింది. మాలో ఉన్న లోపాల గురించి చర్చించుకుంటున్నాం. వాటిని అధిగమించడానికి ప్రణాళికలు కూడా రూపొందించుకుంటున్నాం.

మీరు ప్రచారం చేసిన చోటల్లా ఓట్లు వాటా సీట్లలోకి బదిలీ కాలేదని, మీ గాలి, మ్యాజిక్ తగ్గిపోయిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు కదా?

ఇలా మాట్లాడుతున్నారంటే మోదీ మ్యాజిక్ అన్నది ఒక్కటి ఉన్నట్లే కదా? 2013-14లోనూ ఒక వర్గం మనుషులు మోదీ గాలి లేదని ప్రచారం చేశారు. ఇప్పుడు అలాంటి వారే తాము పనిచేస్తున్న వ్యక్తులకోసం ఏదో ఒకటి చేయాలి కాబట్టి ఇలాంటి ప్రచారం మొదలుపెట్టారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు మామీద ఉన్నాయి. అవే సరికొత్త వాతావరణం, ఉత్సాహాన్ని నెలకొల్పుతున్నాయి.

మీ గాలి లేకపోతే భాజపాకు వచ్చే ఎన్నికల్లో 180కి మించి సీట్లు రావంటున్నారు? దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?

వాళ్లు ఇలాంటి లెక్కలు చెప్పకపోతే వారి కూటమిలో పార్టీలు ఎలా చేరతాయి? తమను తాము రక్షించుకోవడానికి ఇలాంటి మాటలు చెబుతూ పోతున్నారు. 2019లో సామాన్యుడు ఈ ప్రభుత్వం నుంచి దూరం జరుగుతారని ఎలా అంచనా వేస్తారు? సామాన్యుడికి ఈ విషయాలన్నీ తెలుసు. నాకు ఈ దేశ ప్రజల మీద, యువత మీద భరోసా ఉంది.

పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ సరిగా అమలుచేయకపోవడంవల్లే 2019 ఎన్నికల్లో మీకు నష్టం జరుగుతుందని చెబుతున్నారు. పెద్ద నోట్ల రద్దు అవసరమేనా? అనుకున్న ప్రయోజనాలు కలిగాయా?

మన దేశంలో నల్లధనం గురించి ఎన్నో ఏళ్ల నుంచి చర్చలు నడుస్తున్నాయి. దేశంలో సమాంతర ఆర్థిక వ్యవస్థ నడుస్తోందన్న విషయాన్ని ఎవ్వరూ కాదనలేరు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, పెద్దపెద్ద అధికారుల ఇళ్లలో పరుపుల కింద నోట్లు దొరుకుతూ ఉండేవి. సంచుల్లో నిండిన నోట్లు దొరికేవి. సమాంతర ఆర్థిక వ్యవస్థ మన దేశాన్ని నాశనం చేసింది. పెద్ద నోట్ల రద్దు వల్ల దేశం భవిష్యత్తులో బలమైన ఆర్థిక వ్యవస్థగా మారనుంది. సంచుల్లో నిండిన నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయి. దీని వల్ల ఇప్పుడు జవాబుదారీతనం వచ్చింది. పన్ను పరిధిలోకి వచ్చిన వారి సంఖ్య పెరిగింది. దీని గురించి ఏమంటారు? ఇది మా విజయమంటారా? కాదా? ఇది మంచి పరిణామమా? కాదా? జీడీపీతో పోలిస్తే నగదు తగ్గుతూ పోతోంది. ఇది ఓ శుభసంకేతం.

అలాంటి కుదుపు ఇవ్వాల్సిన అవసరం ఏం వచ్చింది?

ఇది కుదుపేమీ కాదు. ఏడాది క్రితమే మేం స్వచ్ఛంద వెల్లడి పథకం పెట్టి మీ దగ్గర ఏమైనా నల్లధనం ఉంటే జమచేయండి... దానిపై మీరు ఇంతింత జరిమానా కట్టాల్సి ఉంటుందని స్పష్టంగా చెప్పాం. గత ప్రభుత్వాలను దృష్టిలో ఉంచుకొని మోదీ కూడా అలాగే ఉంటారనుకుని చాలా తక్కువ మందే ముందుకొచ్చారు. ఈ పథక ప్రయోజనాన్ని పొందండి, లేదంటే పరిస్థితిని చక్కదిద్దేందుకు మేం కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని నేను మీడియాతో పాటు, పార్లమెంటు ముందు కూడా చెప్పాను. అందువల్ల మేం రాత్రికి రాత్రి నోట్లు రద్దు చేయలేదు. ఏడాదిగా చర్యలు తీసుకుంటూ వచ్చాం. పదేపదే హెచ్చరించాం. అంతిమంగా నిర్ణయం తీసుకున్నాం. ఆ నిర్ణయం తప్పనిసరి. పట్టాలు మారేటప్పుడు రైలు వేగం ఎంతోకొంత తగ్గుతుంది. మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న సంస్కరణల కారణంగా జీడీపీ వృద్ధి 2% కంటే తక్కువకు పడిపోయింది. తర్వాత పరిస్థితి చక్కబడింది. ఈరోజు మా వృద్ధిరేటు పూర్వ స్థితికి వచ్చింది. వ్యవస్థను శుద్ధి చేయాల్సి ఉంది... దాని మేం విజయవంతంగా పూర్తిచేశాం.

ఆర్థిక నేరగాళ్లు నీరవ్‌మోదీ, విజయ్ మాల్యా, మెహుల్ ఛోక్సీలు దేశం విడిచి పారిపోయి ఇప్పటికీ తిరిగి రాలేదు. నల్ల ధనం కట్టడిపై లక్ష్యాలేమీ నెరవేరలేదు కదా?

ఇదివరకటి ప్రభుత్వమే ఉండి... అదే స్నేహం కొనసాగితే వారు దేశం విడిచి పారిపోవాల్సిన అవసరం ఉండేది కాదు. మా ప్రభుత్వంలో చట్టాన్ని గౌరవించి ప్రతి పైసాని వెనక్కు ఇవ్వాల్సి ఉంది కాబట్టే పారిపోయారు. వారిని రప్పించడానికి కొన్ని అంతర్జాతీయ చట్టాలను అనుసరించాల్సి ఉంటుంది. వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి చట్టం తీసుకొచ్చాం. ఇదివరకు పారిపోయిన వారు ఎప్పుడూ తిరిగి రాలేదు. ఈ ప్రభుత్వ హయాంలో అలాంటివారు ఎప్పుడోసారి వెనక్కు రావాల్సిందే. దానికోసం మేం దౌత్యపరంగా, చట్టపరంగా, ఆస్తులను స్వాధీనం చేసుకొనేవిధంగా ప్రయత్నాలు చేస్తున్నాం.

మీరు 2013 నుంచి 2జీ, 3జీ, సీడబ్ల్యూజీ గురించి ప్రసంగాలు ఇచ్చారు. కానీ ఇప్పటికీ ఆ కేసుల్లోని నిందితులు లోదీగార్డెన్‌లో హాయిగా వాకింగ్ చేస్తున్నారు కదా?

బెయిల్‌పై ఉన్న వారు బయట నడవొచ్చు. దశాబ్దాల తరబడి ఈ దేశాన్ని పాలించిన తొలి కుటుంబం వారు కూడా ఆర్థిక అవకతవకల కేసులో బెయిల్‌పై బయట ఉన్నారు. కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి కోర్టుల చుట్టూ తిరుగుతుండటం చిన్న విషయమేమీ కాదు. వారు భాజపా వ్యతిరేకులైనందున అలా వ్యవహరిస్తున్నామనడం సరి కాదు. మేం ఎప్పుడూ ప్రతీకారపూర్వకంగా వెళ్లలేదు. మోదీ సహా ఎవరి విషయంలోనైనా చట్టప్రకారం వెళ్లాలన్నదే మా ఉద్దేశం.

మీ ఓటర్లంతా మధ్యతరగతి, శ్రామికులు, చిన్నవ్యాపారులే. వీరికి ఏమైనా ప్రయోజనం కల్గించబోతున్నారా?

మధ్యతరగతి ప్రజలు ఎప్పుడూ ఎవరి దయా దాక్షిణ్యాలపై బతకాలనుకోరు. కిందిస్థాయి వారికి ఏదో ఒకటి అందించాలని సానుకూలంగా ఆలోచించేది మధ్యతరగతి వారే. వారి గురించి ఆలోచించడం మన బాధ్యత. ద్రవ్యోల్బణాన్ని తగ్గించగలగడంతో ధరలు అదుపులోకి వచ్చి మధ్య తరగతి వారికి ప్రత్యక్ష ప్రయోజనం కలిగింది. వైద్య సీట్ల పెంపు, విమాన టికెట్ల ధరల తగ్గింపు, గృహ నిర్మాణంపై వడ్డీరాయితీ వంటి చర్యలతో అత్యధిక ప్రయోజనం పొందింది మధ్యతరగతి వారే. ఈ ప్రభుత్వంలో గరిష్ఠంగా అన్ని పనులూ మధ్యతరగతి ప్రజల కోసమే జరిగాయి.

రాహుల్‌గాంధీ ప్రకటించిన రుణమాఫీని మీరు లాలీపాప్‌గా అభివర్ణించడం సరైనదేనా?

అబద్ధాలు చెప్పి ప్రజలను భ్రమింపజేయడాన్ని నేను లాలిపాప్‌గా చెప్పాను. అందరి రుణాలనూ మాఫీ చేశామని ఆయనన్నారు. కానీ అది నిజం కాదు. రుణమాఫీతో రైతుల ఇబ్బందులన్నీ తొలగిపోతాయనుకుంటే కచ్చితంగా చేయాల్సిందే. దేవీలాల్ హయాం నుంచి పలుసార్లు రుణమాఫీ చేసినా ఇంకా రైతులు ఎందుకు అప్పులపాలవుతున్నారు? అన్నింటి కంటే ముఖ్యంగా రైతును బలోపేతం చేయాలి. రైతులకు అప్పులు చేయని పరిస్థితి కల్పించాలి. అందుకు భూసారపరీక్ష కార్డులు, దిగుబడులకు మంచి ధరలు, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు 22 పంటలకు 50% లాభం కల్పించడం వంటి చర్యలు తీసుకుంటున్నాం.

ఈ దేశంలో ముస్లింలు సురక్షితంగా ఉన్నట్లు భావించడంలేదని నసీరుద్దీన్ షా వంటివారు అంటున్నారు. మైనార్టీల విషయంలో ఎలా వ్యవహరించాలో భారత ప్రధానికి మేం నేర్పిస్తామని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ చెబుతున్నారు?

గోవుల పేరుతో దాడులు సరికాదు. అది ఖండనీయం. ఎదుటివారి అభిప్రాయాలను గౌరవిస్తేనే మన అభిప్రాయాలకూ రక్షణ ఉంటుంది. ఈ వాతావరణ కల్పనకు బుద్ధిజీవులు తగిన పాత్ర పోషించాలి. సమాజంలో అవాంఛిత ఘటనలు జరగకూడదు. ఎన్నికల ముందు కొందరు ఇలాంటి అలజడులను సృష్టిస్తుంటారు. అలాంటి వారిని అదుపుచేయాల్సి ఉంటుంది.

అంటే 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' అమల్లో ఉందనుకోవచ్చా?

మేము అధికారంలోకి వచ్చినప్పట్నుంచి 18 వేల పల్లెలకు కరెంటిచ్చాం. ఆరు కోట్ల గ్యాస్‌స్టౌలు ఇచ్చాం. వీరు ఏ మతానికి చెందినవారన్నది చూడలేదు.

కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్‌లో రాజకీయ హింస చెలరేగింది. మీరేమంటారు?

ప్రత్యర్థుల గొంతు నులిమేసేందుకని హత్యాకాండకు పాల్పడటం దౌర్భాగ్యం. దీన్ని పూర్తిగా ఖండిస్తున్నా. పశ్చిమ బెంగాల్‌లో భాజపా ప్రజాస్వామ్యబద్ధంగా పనులు చేసుకోవడానికి వీల్లేకుండా అడ్డుకుంటున్నారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, అసోం, జమ్మూకశ్మీర్‌లోనూ మా శ్రేణులను చంపేస్తున్నారు. ఇలాంటి రాజకీయాలు భవిష్యత్తుకు మంచిదికాదు.

మీరు కూడా మీ మిత్రపక్షాలను సరిగా ఉంచుకోలేదు కదా? చౌకీదార్ చోర్‌హై అని రాహుల్ వినిపించిన నినాదాన్ని శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే వినిపిస్తున్నారు కదా?

మాకు సంపూర్ణ మెజార్టీ లభించినా కూటమి ధర్మాన్ని పాటిస్తున్నాం. కొన్నిసార్లు ఒత్తిడి తెస్తే ఏదైనా ప్రయోజనం కలుగుతుందనుకుంటే కొన్ని పార్టీలు ఆ దారిని ఎంచుకుంటుంటాయి. అందర్నీ వెంట తీసుకెళ్లడం, అందరి మాటా వినడం, సమస్యలను పరిష్కరించడంతోపాటు... ప్రాంతీయ ఆకాంక్షలకు బలం కల్పించాలన్నదే మా లక్ష్యం. అందుకు నేను కట్టుబడి ఉన్నాను.

మీరు వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి కదా?

వీటి గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేనేలేదు. ప్రధాన మంత్రి, పీఎంవోకు వ్యతిరేకంగా వాళ్లు ఎన్‌ఏసీ ఏర్పాటుచేశారు. కేబినెట్ నిర్ణయాలను విలేకర్ల సమావేశంలో ముక్కలుగా చించేసిన నేత ఏ వ్యవస్థను గౌరవించినట్లు? సీనియారిటీ ప్రకారం కాకుండా భావజాలం ఆధారంగా న్యాయమూర్తులను నియమించిన నాయకులు... వ్యవస్థల గురించి మాట్లాడుతారా? ఇదే ఆర్‌బీఐ ఎన్నోసార్లు గవర్నర్లను పదవీకాలం ముగియక ముందే తీసేసింది. ప్రణాళికా సంఘం సభ్యులను జోకర్‌గా అభివర్ణించింది ఎవరు? సీబీఐలో ఇద్దరు అధికారుల మధ్య వ్యక్తిగత స్పర్ధలు రావడంతో వారిని సెలవుపై పంపి వ్యవస్థను నిలబెట్టాం. ఆర్‌బీఐ గవర్నర్ గురించి తొలిసారి మీకు చెబుతున్నా... ఆయన వ్యక్తిగత కారణాలవల్ల రాజీనామా చేస్తానని ఆరునెలల నుంచి నిరంతరం నాతో చెబుతూ వచ్చారు. లిఖితపూర్వకంగా చెప్పారు.

ఈడీ కాస్తా 'ఎంబరాస్‌మెంట్ డైరెక్టరేట్'గా మారిపోయిందంటున్నారు...

సొహ్రాబుద్దీన్ తీర్పులో ఏం రాశారో చదవండి. వీళ్లు వ్యవస్థలను ఎలా దుర్వినియోగం చేశారో అందులో చూడండి. ఒకవైపు నేను వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని మీరు అంటున్నారు. కానీ వాళ్లు ప్రతీకారంగా దాడులు చేయిస్తున్నట్లు చెబుతున్నారు. ఈడీ వృత్తి నిబద్ధత ప్రకారం చర్యలు తీసుకుంటోంది. విదేశాల్లో ఉన్న నిందితుడిని దేశానికి రప్పిస్తే... ప్రజలుగా గర్వపడాలా? వద్దా? మిషెల్‌ను రక్షించడానికి కాంగ్రెస్ పార్టీ నేత లాయరుగా వెళ్లడం ఆందోళన కలిగించే అంశం.

రఫేల్ విషయంలో రాహుల్‌గాంధీ మీపై ఎన్నో అవినీతి ఆరోపణలు చేశారు. మీరు మాత్రం స్పష్టతనివ్వలేదు?

అది నాపై వ్యక్తిగత ఆరోపణ కాదు. ప్రభుత్వంపై ఆరోపణ. వ్యక్తిగత ఆరోపణే అయితే... ఎవరు ఎంతిచ్చారు? ఎక్కడపెట్టారు? అన్నది ఆయన వెతికి చెప్పాలి. పార్లమెంటులో దీనిపై విస్తృతంగా సమాధానం చెప్పాను. సుప్రీంకోర్టులోనూ స్పష్టత వచ్చింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు, భారత ప్రధాని దీనిపై ప్రకటనలు చేశారు. అయినా ఆయన అడుగుతూనే ఉన్నారు.

మెరుపు దాడులను భాజపా ప్రతి ఎన్నికల్లోనూ దాన్ని విజయంగా చూపి రాజకీయంగా ఉపయోగించుకొనే ప్రయత్నం చేసింది? ఇది తప్పు కాదా?

మెరుపు దాడులను రాజకీయం చేయకూడదని నేనే స్వయంగా చెప్పాను కాబట్టి దానిపై ఎలాంటి వివాదమూ లేదు. దురదృష్టవశాత్తు అదేరోజు ఓ రాజకీయ పార్టీ నాయకుడు మెరుపు దాడులపై అనుమానం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ చెప్పాల్సిన మాటలను మనవాళ్లే అన్నారు. అనుమానాలు వ్యక్తంచేయడం ద్వారా మెరుపు దాడులు, మన సైనికులను అవమానించారు.

మెరుపుదాడులు విజయవంతం కాకపోయి ఉంటే మీరు విమర్శలు మూటగట్టుకొని ఉండేవారు... ఆ సమయంలో మీ మనసులో ఏముంది?

ఉరీలో మన సైనికులను చంపేసి దహనం చేసిన ఘటన నన్ను ఎంతో కలిచివేసింది. ఎంతో కోపం వచ్చింది. సైనికాధికారులతో నిరంతరం చర్చించాను. మీకేమేం కావాలో డిజైన్ రూపొందించుకొని రమ్మని చెప్పాను. వారు ప్రణాళికతో ముందుకొచ్చారు. నేను పూర్తి స్వేచ్ఛనిచ్చాను. చివరకు తేదీ నిర్ణయించాం. అది చాలా రిస్క్‌తోకూడుకున్న ఆపరేషన్ అని నాకు తెలుసు. సైనికులకు నష్టం జరగకూడదనుకున్నా. గెలుపోటముల గురించి ఆలోచించవద్దు, కానీ సూర్యోదయానికి ముందే వాపస్ వచ్చేయాలని చెప్పాను. ఒకవేళ విఫలమైనా వెనక్కు వచ్చేయమని స్పష్టం చేశాను. సూర్యోదయ సమయంలో గంట పాటు నేను చాలా ఆందోళనకర పరిస్థితి ఎదుర్కొన్నాను. చివరివ్యక్తి కూడా వచ్చిన తర్వాత కేబినెట్ భద్రత వ్యవహారాల కమిటీ సమావేశం ఏర్పాటుచేసిన అనంతరం సైనికాధికారులు మీడియాకు ఆ విషయాలు చెప్పారు. ఆపరేషన్ స్థాయి చూసిన తర్వాత మన సైనిక శక్తి గురించి నాకు కొత్తగా తెలిసివచ్చింది. వారి శక్తి సామర్థ్యాలకు నేను తలవంచి నమస్కరిస్తాను.

ఫెడరల్ ఫ్రంట్ గురించి తెలీదు

తెలంగాణ సీఎం కేసీఆర్ ఒక కూటమిని ఏర్పాటు చేసినట్లుగానీ.. చేస్తున్నట్లుగానీ నాకు తెలియదు. నేను అజ్ఞానినైతే అది తెలిసే అవకాశం లేదు.

తెలంగాణలో ఓటమి..

తెలంగాణ, మిజోరంలలో భాజపా అధికారంలోకి వస్తుందని మా పార్టీతో సహా ఎవ్వరూ చెప్పలేదు. కనీసం అలాంటి ఊహ కూడా ఎవ్వరూ చేయలేదు.

పెద్దనోట్ల రద్దుతో ప్రయోజనం?

'పెద్దవాళ్ల' ఇళ్లలో పరుపుల కింద, సంచుల్లో ఉండిపోయిన నోట్లన్నీ బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయి. ఇది మంచి పరిణామం కాదా?

హడావుడి రద్దు ఎందుకు?

ఏడాది క్రితమే మేం స్వచ్ఛంద వెల్లడి పథకం పెట్టి మీ దగ్గర నల్ల ధనం ఏమైనా ఉంటే జమచేయండన్నాం.. రాత్రికి రాత్రి నోట్లు రద్దు చేయలేదు.

జీఎస్టీతో ఇబ్బందులు..

జీఎస్‌టీకి ముందు దేశంలో పన్ను ఎంతుండేదో తెలుసా? వస్తువులపై 30-40% పన్ను రేట్లు, సామాన్యుడికి తెలియని రహస్య పన్నులూ ఉండేవి. అవన్నీ సరి అవుతున్నాయి.

నీరవ్ మోదీ, మాల్యా పారిపోయారుగా?

మేం చట్టాలు కఠినం చేయబట్టే ఉక్కిరి బిక్కిరి అయ్యారు. కాంగ్రెస్సే అధికారంలో ఉండుంటే వాళ్లు దేశంలోనే భరోసాగా తిరుగుతుండే వాళ్లు. మేం కచ్చితంగా వాళ్లను రప్పిస్తాం.

మోదీ మ్యాజిక్ తగ్గుతోందా?

ఇలాంటి వ్యాఖ్యానాలు చేసేవారిని అభినందిస్తున్నా. ఇలా మాట్లాడుతున్నారంటే మోదీ మ్యాజిక్ అన్నది ఒకటి ఉన్నట్లే కదా? ప్రజల ఆకాంక్షలు మా మీదున్నాయి.

పొత్తుల గురించి టీవీల్లో చెబుతామా!


మీతో మాయావతి కలిసే అవకాశముందా?

ఎవరు కలుస్తారు? ఎవరు కలవరు అన్నదాని గురించి తెలివైన వారు ఇలా టీవీల ముందు చెబుతారని నేననుకోను. తెలంగాణలో కూటమి పరిస్థితి ఏమైంది? దారుణంగా మారింది కదా? కానీ దాని గురించి ఎవ్వరూ మాట్లాడుకోరు. కూటమి తొలి ప్రయోగం అక్కడ పూర్తిగా విఫలమైంది. జమ్మూ-కశ్మీర్‌లో కూటమి పార్టీలన్నీ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించాయి. కానీ ప్రజలు వారిని తిరస్కరించి 74% మంది ఓట్లు వేశారు. అసోం పంచాయతీ ఎన్నికల్లో అన్ని పార్టీలు ఒకవైపు, భాజపా ఒకవైపు ఉంటే.. అక్కడా కూటమి విఫలమైంది. త్రిపురలోనూ కూటమిని ఓడించి భాజపా 80-90% సీట్లు దక్కించుకొంది. నేతలు తమ రక్షణ కోసం చేతులు కలిపినంత మాత్రాన... ప్రజలు కలుస్తారనుకోవడానికి లేదు.

మందిరంపై ముందడుగు..

'రామ మందిరం'పై ముందుకు ఎందుకు వెళ్లలేదు? తలాక్ తరహాలోనే అత్యవసరాదేశాలు ఎందుకు తేలేకపోయారు?

ముమ్మారు తలాక్‌పై సుప్రీం తీర్పు తర్వాతే ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. ఇప్పుడు మందిర అంశం సుప్రీం కోర్టులో చివరిదశకు వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నా. కోర్టులో దీనికి వ్యతిరేకంగా కేసులు వేసేవారిని బయటకు రప్పించండి. అడ్డుకోకండి. న్యాయవాదులంతా కోర్టు ముందుకెళ్లి, ఈ సమస్యను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతున్నా.



కేసీఆర్ కూటమికి మద్దతుందా?

మీరు మహాకూటమిని ఎద్దేవా చేస్తున్నారు. మరోవైపు కేసీఆర్ తలపెట్టిన ఫెడరల్ ఫ్రంట్‌కు మోదీ మద్దతు పలుకుతున్నారని చంద్రబాబునాయుడు విమర్శిస్తున్నారు. అది నిజమేనా? కేసీఆర్ కూటమికి మీరు మద్దతు పలుకుతున్నారా?

తెలంగాణ సీఎం కేసీఆర్ ఒక కూటమిని ఏర్పాటు చేసినట్లుగానీ.. చేస్తున్నట్లుగానీ నాకు తెలియదు. నేను అజ్ఞానినైతే అది తెలిసే అవకాశం లేదు. తెలంగాణ ఎన్నికల్లో ప్రజా కూటమిని ప్రజలు చిత్తుగా ఓడించారు. ఇక దేశవ్యాప్తంగా మహా కూటమి కడుతున్న నేతలు తమ రక్షణ కోసం సాయం వెతుక్కుంటున్నారు. వారి లక్ష్యం మోదీ మాత్రమే. పత్రికల్లో పది పేజీలు చూస్తే పదింట్లోనూ కూటమి నేతలు నన్ను తిడుతూ చేసిన ప్రకటనలే ఉంటాయి. జాతీయ, రాష్ట్రస్థాయి దోపిడీదారులంతా ఒక్కటవుతున్నారు. ఈ ఎన్నికలు ప్రజలకూ.. మహా కూటమికీ మధ్య పోటీగా మారబోతున్నాయి. ఈ ఎన్నికలు ప్రజల ఆశలు, ఆకాంక్షల ఆధారంగా జరుగుతాయి.

పార్టీ మా జట్టుపైనే నడవదు!

మోదీ, అమిత్‌షా ద్వయానికి ఇప్పుడు ఓటములు ఎదురవుతున్నాయి. ఈ వైఫల్యానికి పార్టీ నాయకత్వ బాధ్యత ఉందా లేదా?

మోదీ, అమిత్‌షాల కనుసన్నల్లో భాజపా నడుస్తోందని చెప్పే వారికి భాజపా గురించి తెలియదు. ఇది ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీ. పోలింగ్‌బూత్ స్థాయి కార్యకర్తలపై ఆధారపడి నడుస్తుంది. ఒకరో, ఇద్దరో పార్టీని నడిపిస్తున్నారన్నది మా పార్టీ గురించి తెలియని వారు చెప్పే మాట.

దక్షిణాది, ఉత్తరాది తేడా లేదు

దక్షిణాదిలో మీరు ఎన్ని పర్యటనలు చేసినా మీ పరిధి పెరగలేదు...?

ఇలాంటి భ్రమలను వ్యాప్తి చేయడం మంచిది కాదు. ఇది వరకు భాజపాను ఉత్తరాది పార్టీ అని, అగ్రవర్ణాల పార్టీ అని, పట్టణాలవారి పార్టీ అని అనేవారు. కానీ, గోవా, మహారాష్ట్ర కర్ణాటకల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసాం. అంతటా విస్తరించాం. ప్రాంతీయ ఆకాంక్షలకు బలమివ్వడం మా సూత్రం.

తలాక్‌తో శబరిమలను పోల్చలేం

ఒకవైపు ముమ్మారు తలాక్ నుంచి ముస్లిం మహిళలకు విముక్తి కల్పించి, సంప్రదాయాల నుంచి వారికి రక్షణ కల్పించాలంటున్నారు. మరోవైపు శబరిమల విషయంలో మీ పార్టీ సంప్రదాయాలను గౌరవించాలని చెబుతోంది?

పాకిస్థాన్ సహా చాలా ఇస్లామిక్ దేశాలు ముమ్మారు తలాక్‌ను నిషేధించాయి. అందువల్ల అది విశ్వాసాలకు సంబంధించిన అంశం కాదు. మన దగ్గర కొన్ని ఆలయాల్లోకి పురుషులకు ప్రవేశం ఉండదు. కొన్నిచోట్ల మహిళలకు ప్రవేశం ఉండదు. దీనిపై సుప్రీంకోర్టు మహిళా జడ్జి ఇచ్చిన తీర్పును అందరూ చదవాలి.

గొంతు వినిపించేందుకే విదేశాలకు

విదేశీ పర్యటనలు ఎక్కువ, ఫలితాలు తక్కువ, మీదంతా కేవలం ఫొటో కోసమే అన్న విమర్శలున్నాయి కదా?

ప్రతి ప్రధానమంత్రి పర్యటనా దాదాపు ఇంతే స్థాయిలో ఉంటుంది. ఇప్పుడు అంతర్జాతీయ వేదికలు చాలా అయ్యాయి. అందువల్ల వాటికి వెళ్లాల్సి ఉంటుంది. ప్రధానమంత్రి కంటే కిందిస్థాయి వ్యక్తులు వెళ్తే ఆ వేదికలపై గొంతు వినిపించే అవకాశం ఇవ్వరు.

సెన్సెక్స్ ▲ 186 36255 | నిఫ్టీ ▲ 48 10910 | డోజోన్స్ 23327 ▲265 | నాస్‌డాక్ 6635 ▲ 51 | రూపాయి 69.43 ▲ 34 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 54.15 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా మంగళవారం అమెరికా మార్కెట్లు పని చేయలేదు. డోజోన్స్, నాస్‌డాక్ ముగింపులు సోమవారం నాటివి.

ఈనాడు బిజినెస్

ఘనం (+) నిఫ్టీ	1న	మార్పు%	గ్రహణం (-) నిఫ్టీ	1న	మార్పు%
BHARTI AIRTEL	319.50	2.24	M& M	773.35	-3.79
HDFC	2009.00	2.07	HINDALCO	222.75	-1.53
HPCL	256.70	1.36	WIPRO	326.65	-1.27
YES BANK	184.25	1.35	INDIABULLS HSG	844.75	-1.07
BHARTI INFRATEL	262.25	1.25	TATA STEEL	515.75	-1.02
SBI	299.60	1.25	HUL	1801.10	-1.02
HDFC BANK	2148.10	1.24	ONGC	148.50	-0.93


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	63.39	73.50	బహ్రెయిన్ దీనార్	171.56	196.29
పౌండ్ స్టెర్లింగ్	80.89	93.82	కువైట్ దీనార్	189.84	236.39
యూరో	72.67	84.29	ఒమన్ రియాల్	167.88	192.31
జపనీస్ యెన్/100	57.79	67.03	సౌదీ రియాల్	16.85	19.97
ఆస్ట్రేలియా డాలరు	44.77	51.82	యూఏఈ దిర్హమ్	17.25	20.16
సింగపూర్ డాలరు	46.53	55.12	మలేషియా రింగిట్	15.02	18.47
థాయ్ బాత్/100	196.18	234.63	చైనీస్ యువాన్	7.17	11.62

మంగళవారం నిఫ్టీ కదలికలు



చలికాలంలో లాభాల వేడి



- జనవరిపై నిఫ్టీ ఆశలు • ఫలితాలపై సానుకూల అంచనాలు • కలిసిరానున్న చమురు, రూపాయి
- ఎన్నికల తాయిలాలూ ఒక కారణమే • బ్రోకరేజీ సంస్థల అభిప్రాయాలు

కొత్త సంవత్సరం తొలి నెలలో చలి సంగతి ఏమో కానీ.. స్టాక్ మార్కెట్లో లాభాలైతే బాగానే వస్తాయని విశ్లేషకులు అంచనా కడుతున్నారు. ఓ వైపు అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం, మరో వైపు దేశీయంగా సాధారణ ఎన్నికల నుంచి కూడా కొంత సానుకూలతలు కనిపించవచ్చని భావిస్తున్నారు. ఈ రెండూ కాక.. కార్పొరేట్ ఫలితాలపై గట్టి ఆశలు ఉన్నాయి. అమెరికా, చైనాల మధ్య చర్చల్లో కొంత ప్రగతి కనిపిస్తుండడం కూడా సానుకూలతలను తీసుకురావచ్చు. ఇక ఎన్నికలకు ముందు ప్రభుత్వం పలు రంగాలకు ప్రోత్సాహకాలు అందించవచ్చన్న అంచనాలు కూడా సెంటిమెంటును పదిలంగా ఉంచుకుతున్నాయి. స్థూల ఆర్థిక సమస్యలు వెనక బెర్తుకు వెళతాయని.. కొత్త సంవత్సరానికి మొత్తం మీద సానుకూల వాతావరణం కనిపించవచ్చని చాలా వరకు విశ్లేషకులు భావిస్తున్నారు.

11,200 పాయింట్ల స్థాయికి నిఫ్టీ!

గత కొద్ది నెలలుగా ముడి చమురు ధరలు తగ్గుతూ ఉండడం; అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారక విలువ రాణిస్తుండడం; పన్ను సంబంధిత పెట్టుబడుల కారణంగా మ్యూచువల్ ఫండ్ల నుంచి అధిక పెట్టుబడులు కనిపిస్తుండడం వంటివి జనవరి నెలలో స్టాక్ మార్కెట్లు పుంజుకోవడానికి ఉపకరిస్తాయని అంచనా. ఎనిమిది బ్రోకరేజీల సగటు అంచనాల ప్రకారం.. నిఫ్టీ-50 సూచీ 11,200 పాయింట్ల వరకు దూసుకెళ్లవచ్చు. గతేడాది జనవరిలో నిఫ్టీ 11171.55 వద్ద గరిష్ఠ స్థాయిని తాకిన విషయం విదితమే. ఇక నిఫ్టీకి మద్దతు 200 రోజుల సగటు చలన స్థాయి అయిన 10700 పాయింట్ల వద్ద లభించవచ్చని అంచనా. గత పదేళ్లలో నిఫ్టీ -50 జనవరిలో అయిదు సార్లు లాభాల్లో ముగిసింది. 2012లో అత్యధికంగా 12% మేర పరుగులు తీసింది.

తక్కువ కేటాయింపులు

'ఏప్రిల్-సెప్టెంబరులో నికర లాభాలు 12% మేర పెరిగాయి. ఇది 2018-19 లాభాలను నమ్మకాన్ని ఇస్తున్నాయి. 14% మేర వృద్ధి చెందవచ్చని మేం అంచనా వేస్తున్నామ'ని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన నివేదికలో పేర్కొంది. పెద్ద స్థాయి కంపెనీలు తమ మొండి బకాయిలకు తక్కువ కేటాయింపులు చేసిన కారణంగా ఆయా కంపెనీల లాభాలు మెరుగుపడవచ్చు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి నమోదైంది.

తగ్గనున్న ఎన్‌పీఏలు

రుణ గిరాకీ పెరగడం; వార్షిక పద్ధతిన ఎన్‌పీఏలు తగ్గిన కారణంగా మార్చి చివరకు వాణిజ్య బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 10.3 శాతానికి పరిమితం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆర్‌బీఐ వెలువరచిన ఆర్థిక స్థిరత్వ నివేదిక వెల్లడిస్తోంది. సెప్టెంబరు చివరకు ఇవి 10.8 శాతంగా ఉన్నాయి.

జనవరిలో నిఫ్టీపై బ్రోకరేజీ సంస్థల అంచనాలు ఇలా..

బ్రోకరేజీ	మద్దతు	నిరోధం
యాంటిక్ స్టాక్ బ్రోకింగ్	10,700	11,200
దౌలత్ క్యాపిటల్	10,530	11,200
ట్రేడ్‌బుల్స్ సెక్యూరిటీస్	10,700	11,300
సుశీల్ ఫైనాన్స్	10,600	10,900
ఏంజెల్ బ్రోకింగ్	10,800	11,200
కోటక్ సెక్యూరిటీస్	10,650	11,300
చాయిస్ బ్రోకింగ్	10,500	11,200
నిర్మల్ బాంగ్	10,700	11,200

ఇవీ సానుకూలాంశాలు..

- ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ఆదాయాలను పెంచడం కోసం ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహకాలను ప్రకటించవచ్చు. ఇది గిరాకీని పెంచుతుంది.
- స్థిరాస్తి రంగానికి జీఎస్‌టీని తగ్గించడంతో పాటు పలు ఇతర చర్యలు తీసుకుంటుందన్న అంచనాలు కూడా.. మొత్తం మీద సెంటిమెంటును మెరుగుపరచవచ్చు.
- గతేడాదిలో వర్ధమాన దేశాల్లో భారత స్టాక్ మార్కెట్లు రాణించడంతో విదేశీ మదుపర్ల నుంచి ఈ ఏడాది ఎక్కువ పెట్టుబడులు వస్తాయన్న అంచనాలున్నాయి.

రూ. 6000 కోట్లతో విశాఖ నౌకాశ్రయం విస్తరణ

- వెలుపల అవుటర్ రింగురోడ్డు నిర్మాణం
- పోర్టు ఛైర్మన్ ఎం.టి.కృష్ణబాబు



ఈనాడు, విశాఖపట్నం: విశాఖ పోర్టు సామర్థ్యాన్ని 80 మిలియన్ టన్నుల నుంచి 130 మిలియన్ టన్నులకు విస్తరించడానికి వీలుగా భారీఎత్తున ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పోర్టు ఛైర్మన్ ఎం.టి.కృష్ణబాబు వెల్లడించారు. కొన్ని ప్రతిపాదనల అమలు ఇప్పటికే ప్రారంభంకాగా మరికొన్నింటి అమలు దశలవారీగా ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు..

- విశాఖ నౌకాశ్రయ సామర్థ్యాన్ని 2025కల్లా 130 మిలియన్ టన్నులకు విస్తరించేందుకు కొత్త సంవత్సరంలో పలు నిర్మాణ పనులు ప్రారంభించబోతున్నాం. వీటి విలువ రూ. మొత్తం రూ. 6 వేల కోట్లు. నౌకాశ్రయం విస్తరిస్తే రవాణా వాహనాల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నందున భారత్‌మాల ప్రాజెక్టు కింద నౌకాశ్రయం నుంచి జాతీయ రహదారికి, ప్రధాన రైల్వే లైనును అనుసంధించేలా అదనపు రహదారి, రైల్వేలైన్లను నిర్మించడానికి రంగం సిద్ధం చేశాం.
- పోర్టుకు వచ్చే రవాణా వాహనాల వల్ల ట్రాఫిక్‌కు ఎలాంటి అవాంతరాలు లేకుండా జ్ఞానాపురం నుంచి షీలానగర్ వరకు రూ. 150 కోట్లతో నాలుగు వరుసల రహదారిని అవుటర్ రింగురోడ్డు పేరిట నిర్మించబోతున్నాం.
- మింది రైల్వేయార్డ్ నుంచి ప్రధాన రైల్వేలైనుకు అనుసంధానించేలా మరో రైల్వేలైనును నిర్మించబోతున్నాం. ఇందుకోసం జాతీయ రహదారిపై ఒక పైవంతెన కూడా నిర్మించబోతున్నాం. మొత్తం వ్యయం రూ. 120 కోట్లు.
- విశాఖ విమానాశ్రయం ఎదురుగా ఉన్న కాంకార్ మల్టీమోడల్ లాజిస్టిక్స్‌పార్క్(ఎం.ఎం.ఎల్.పి.) నుంచి జాతీయ రహదారికి అనుసంధానం అయ్యేలా భూగర్భమార్గం(సబ్‌వే) నిర్మించాలని నిర్ణయించాం.
- కాన్వెంట్ కూడలి నుంచి షీలానగర్ వరకు ప్రస్తుతం వున్న నాలుగు వరుసల రహదారిని రూ. 200 కోట్ల వ్యయంతో ఆరు వరుసలకు విస్తరించనున్నాం. షీలానగర్ నుంచి సబ్బవరం వరకు రూ. 350 కోట్లతో నూతన రహదారిని నిర్మించి దాన్ని అనకాపల్లి - ఆనందపురం జాతీయరహదారితో అనుసంధానం చేసే పనులు ఈ సంవత్సరంలోనే ప్రారంభం కానున్నాయి.
- కంటైనర్ టెర్మినల్ నుంచి సీహార్స్ జంక్షన్ వరకు ఒక భారీ పైవంతెనను నిర్మించనున్నాం. సీహార్స్ జంక్షన్ నుంచి కాన్వెంట్ కూడలి వరకు మరో పైవంతెనను నిర్మించనున్నాం. రెండింటికీ కలిపి రూ. 220కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉంది. కాన్వెంట్ జంక్షన్లో రూ. 45 కోట్ల వ్యయంతో 'గ్రేడ్ సపరేటర్' పైవంతెన నిర్మాణం పనులు ప్రారంభించాం.
- నౌకాశ్రయంలో ఉన్న ఇ.క్యు. 2, 3, 4, 5 జెట్టీలను రూ. 200 కోట్లతో ఆధునికీకరించే పనులు కూడా ప్రారంభించాం.

అంతంత మాత్రంగానే..

- డిసెంబరులో మందకొడిగా వాహన విక్రయాలు
- మారుతీ సుజుకీ వృద్ధి స్వల్పమే • నిరాశపరచిన టాటా మోటార్స్

దిల్లీ: డిసెంబరులో దేశీయ వాహన విక్రయాలు మందకొడిగా నమోదయ్యాయి. గత నెల దేశీయ అమ్మకాల్లో మారుతీ సుజుకీ స్వల్ప వృద్ధిని నమోదు చేయగా.. హ్యుందాయ్, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా కార్స్‌లు విక్రయాల్లో ఒక అంకె వృద్ధిని నమోదు చేయగలిగాయి. టాటా మోటార్స్ అమ్మకాలు నిరాశపరిచాయి. ఆర్థిక వ్యవస్థ ప్రతికూలతలు ప్రభావం చూపాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మారుతీ సుజుకీ దేశీయ అమ్మకాలు 1,19,286 నుంచి 1.8 శాతం వృద్ధి చెంది 1,21,479కు చేరాయి. గత నెలలో ఆల్టో, వ్యాగన్‌ఆర్‌లతో కూడిన మారుతీ చిన్నకార్ల విభాగం విక్రయాలు 14 శాతం తగ్గి 27,661గా నమోదయ్యాయి. గతేడాది డిసెంబరు ఇవి 32,146గా ఉన్నాయి. స్విఫ్ట్, సెలెరియో, బాలెనో, డిజైర్ మోడళ్ల అమ్మకాలు సైతం 3.8 శాతం క్షీణించాయి. విటారా బ్రెజా, ఎస్- క్రాస్, ఎర్టిగా వంటి యుటిలిటీ వాహన విక్రయాలు 4.9 శాతం పెరిగి 20,225కు చేరాయి. టాటా మోటార్స్ అమ్మకాలు మాత్రం 8 శాతం పడ్డాయి. ఇక ద్విచక్రవాహనాల కొస్తే.. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు ఏకంగా 14 శాతం తగ్గాయి. వివిధ కంపెనీల విక్రయాల గణాంకాలు పట్టికలో..



డిసెంబరులో వాహన విక్రయాలు

కంపెనీ	2018	2017	వృద్ధి/ (క్షీణత)%లో
మారుతీ సుజుకీ	1,30,066	1,28,338	1.3
హ్యుందాయ్ మోటార్	42,093	40,158	4.6
హోండా కార్స్ ఇండియా	13,139	12,642	4
మహీంద్రా అండ్ మహీంద్రా	39,755	39,200	(1)
టాటా మోటార్స్	50,440	54,627	(8)
వాణిజ్య			
మహీంద్రా ట్రాక్టర్స్	17,404	18,488	(6)
వీఈ కమర్షియల్ వెహికల్స్	6,236	6,087	2.4
ఎస్కార్ట్స్	4,598	3,606	27.5
ద్విచక్ర			
రాయల్ ఎన్‌ఫీల్డ్	58,278	66,968	(13)

శుభారంభం

- కొత్త ఏడాది లాభాలతో మొదలు
- బ్యాంకు షేర్లకు కొనుగోళ్ల మద్దతు

సమీక్ష

స్టాక్ మార్కెట్ కొత్త ఏడాదిలో శుభారంభం చేసింది. బ్యాంకింగ్ రంగం రికవరీ దిశగా పయనిస్తోందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ చేసిన వ్యాఖ్యలతో ఆ రంగ షేర్లకు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. టెలికాం, ఐటీ, వాహన, ఔషధ రంగ షేర్లకూ గిరాకీ కనిపించింది. డాలరుతో పోలిస్తే రూపాయి 34 పైసలు లాభపడి 69.43 వద్ద ముగిసింది. ఆంగ్ల సంవత్సరాది కావడంతో పలు అంతర్జాతీయ మార్కెట్లు మంగళవారం పని చేయలేదు.

సెన్సెక్స్ ఉదయం 36,161.80 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆ తర్వాత వచ్చిన విక్రయాల ఒత్తిడితో ఒక దశలో 35,888.62 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. మధ్యాహ్నం తర్వాత కొన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో 36,284.04 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 186.24 పాయింట్ల లాభంతో 36,254.57 వద్ద ముగిసింది.

- యూకో బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలకు ప్రభుత్వం మంగళవారం రూ.10,882 కోట్ల మూలధన సాయం అందించడంతో ఈ బ్యాంకుల షేర్లు వెలుగులోకి వచ్చాయి. యూకో బ్యాంక్ ఏకంగా 12 శాతం మేర లాభపడింది. బీఎస్ఈలో 12.10 శాతం పెరిగి రూ.22.70 వద్ద ముగిసింది.
- డిసెంబరు నెలలో వాహన విక్రయాలు 4 శాతం తగ్గడంతో మహీంద్రా అండ్ మహీంద్రా షేరు బీఎస్ఈలో 3.75 శాతం నష్టపోయి రూ. 773.60 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా 2.13 శాతం లాభపడింది. హెచ్‌డీఎఫ్‌సీ 2.01%, యెస్ బ్యాంక్ 1.38%, ఎస్‌బీఐ 1.25%, యాక్సిస్ బ్యాంక్ 1.24%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.18%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.01% చొప్పున లాభపడ్డాయి. నష్టపోయిన జాబితాలో ఎంఅండ్ఎం (3.75%), టాటా స్టీల్ (1.21%) ఉన్నాయి. రంగాలవారీ సూచీలకొస్తే స్థిరాస్తి, టెలికాం, బ్యాంకింగ్, టెక్, ఆర్థికం లాభపడ్డాయి. వాహన, లోహ రంగాలు నష్టపోయాయి.

యూఎస్ మార్కెట్ నుంచి అరబిందో అధిక రక్తపోటు మాత్రలు వెనక్కి

ఈనాడు, హైదరాబాద్: హానికారక మలినాలు ఉన్నాయన్న కారణంతో అమెరికా మార్కెట్లో విడుదల చేసిన 80 లాట్ల మాత్రలను అరబిందో ఫార్మా యూఎస్ ఇంక్ వెనక్కి తీసుకుంది. అధిక రక్తపోటు, గుండెకు సంబంధించిన చికిత్సలో ఉపయోగించే అమ్లోడిపైన్ వాల్సర్టాన్, వాల్సర్టాన్ హెచ్‌సీటీజెడ్, వాల్సర్టాన్ మాత్రల అంతిమ ఉత్పత్తిలో మానవుల్లో క్యాన్సర్ కారక కలుషితాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అరబిందో ఫార్మా స్వచ్ఛందంగా ఈ ఔషధాలను వెనక్కి తీసుకోనుందని యూఎస్ ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని రకాల ఆహార పదార్థాలు, తాగునీరు, గాలి కాలుష్యం, తయారీ సమయంలో వెలువడే కలుషితాల్లాంటివి ఇందులో కనిపించినట్లు ఎఫ్‌డీఏ వెల్లడించింది. ఇవి క్యాన్సర్ కారకం అవుతాయని తెలిపింది. వెనక్కి తీసుకున్న మాత్రల వివరాలను పంపిణీదారులకు, వినియోగదార్లకు తెలియజేసినట్లు అరబిందో ప్రకటించింది.


ఎల్ఐసీ తాత్కాలిక ఛైర్మన్‌గా హేమంత్ భార్గవ

దిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) తాత్కాలిక ఛైర్మన్‌గా హేమంత్ భార్గవను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఎల్ఐసీలోనే సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా కొనసాగుతున్న ఈయన వీకే శర్మ స్థానంలో బాధ్యతలు స్వీకరించబోతున్నారు. శర్మ సోమవారం పదవీ విరమణ పొందిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే మరోవైపు కొత్త ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కోసం ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు కూడా ప్రారంభించింది. తాత్కాలిక ఛైర్మన్‌గా నియమించిన భార్గవ ఫిబ్రవరి 2017న ఎల్ఐసీలో మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈయనతోపాటు ఎల్ఐసీలో ప్రస్తుతం మరో ఇద్దరు ఎండీలు ఉన్నారు.

మార్కెట్ కబుర్లు

- కొన్ని రకాల కేన్సర్ చికిత్సలో వాడే ఇరినోటెకాన్ హెచ్‌సీఎల్ ఇంజెక్షన్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి అనుమతి లభించినట్లు **శిల్పా మెడికేర్** సంస్థ తెలిపింది.
- సివిల్ ఇంజినీరింగ్, ఈపీసీ కంపెనీ **జేఎంసీ ప్రాజెక్ట్స్ (ఇండియా)**కు రూ.596 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు లభించినట్లు కంపెనీ వెల్లడించింది.
- భారతీయ రైల్వేస్ నుంచి కేబుల్ తయారీ సంస్థ **సీఎంఐ** రూ.107 కోట్ల విలువైన కాడ్మియం వైర్ సరఫరా కాంట్రాక్టు దక్కించుకున్నట్లు తెలిపింది.
- మహారాష్ట్రలోని థానే-వడపే రహదారి ప్రాజెక్టును రూ.1,183 కోట్ల వ్యయంతో పూర్తి చేసినట్లు **ఎంఈపీ ఇన్‌ఫ్రా** వెల్లడించింది.

1న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	439	వరంగల్	441
చిల్లరగా(ఒక గుడ్డు)	5.00	విశాఖపట్నం	458
బెంగళూరు	445	చెన్నై	445
2వ తేదీకి...		చిత్తూరు	438
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	430

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 389.00 (387.70) 1233249
ASIAN PAINTS 1371.55 (1373.05) 664707
AXIS BANK LT 627.30 (619.90) 12179223
BAJAJ AUTO L 2726.65 (2720.15) 304150
BAJAJ FINANC 2656.85 (2645.15) 917872
BAJAJ FINSER 6521.95 (6476.95) 141821
BHARTI AIRTE 319.50 (312.50) 5513123
BHARTI INFRA 262.25 (259.00) 799064
BPCL 367.20 (362.75) 1552711
CIPLA 523.05 (519.50) 1361809
COAL INDIA L 241.50 (240.75) 2227003
DR. REDDYS 2607.05 (2616.50) 338757
EICHER MOTOR 23195.10 (23158.35) 44434
GAIL 362.15 (360.30) 2134503
GRASIM IND 833.50 (825.60) 463290
HCL TECH 959.85 (964.35) 358734
HDFC 2009.00 (1968.35) 1305443
HDFC BANK 2148.10 (2121.70) 1593360
HERO MOTOCOR 3127.60 (3104.25) 344239
HINDALCO IND 222.75 (226.20) 5015702
HINDUSTAN UN 1801.10 (1819.65) 807345
HPCL 256.70 (253.25) 2829660
ICICI BANK 363.75 (360.15) 7759872
INDIABULLS H 844.75 (853.85) 3102007
INDIAN OIL 137.70 (137.05) 4059229
INDUSINDBANK 1595.60 (1599.30) 4043870
INFOSYS LTD 665.05 (658.95) 2943390
ITC 282.70 (281.65) 2490548
JSW STEEL LT 303.95 (306.75) 3622654
KOTAK MAHIND 1250.45 (1256.50) 1202580
LARSEN & TOU 1441.90 (1437.55) 786846
M&M 773.35 (803.85) 3442903
MARUTI SUZIK 7476.80 (7465.50) 625360
NTPC LTD 148.70 (149.05) 3342569
ONGC 148.50 (149.90) 4496586
POWER GRID C 200.00 (198.65) 2228415
RELIANCE IND 1121.00 (1121.25) 4455850
SBI 299.60 (295.90) 11837127
SUN PHARMA 433.55 (430.50) 8487116
TATA CONSULT 1902.80 (1893.05) 1094883
TATA MOTORS 173.45 (172.70) 6715543
TATA STEEL L 515.75 (521.05) 4128173
TECH MAHINDR 719.10 (723.15) 815535
TITAN IND 928.00 (931.00) 2064502
ULTRATECH 4009.20 (3990.95) 92921
UPL LIMITED 753.50 (758.25) 1610248
VEDANTA LIMI 202.10 (202.20) 3947501
WIPRO 326.65 (330.85) 1513704
YES BANK LTD 184.25 (181.80) 24160878
ZEE ENTERTAI 480.25 (476.45) 2203533

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1319.20 (1336.75) 66089
ACC 1488.80 (1508.10) 840791
ADITYA BIRLA 100.10 (100.00) 968494
AMBUJA CEMEN 222.90 (225.10) 1594627
ASHOK LEYLAN 102.50 (102.50) 13384173
AUROBIND PHA 733.15 (732.95) 1340165
AVENUE SUPER 1590.75 (1606.65) 542359
BANDHAN BANK 556.70 (550.15) 589317
BANK OFBAROD 123.30 (118.80) 23311973
BEL 87.45 (87.95) 3492676
BHEL 73.80 (73.10) 6440421
BIOCON LTD 625.80 (629.05) 750924
BOSCH LTD 19576.50 (19611.20) 4603
BRITANNIA 3103.05 (3115.40) 140863
CADILA HEALT 350.05 (348.45) 692062
COLGATE PALM 1323.90 (1343.55) 534537
CONTAINER 685.30 (687.70) 455871
DABUR INDIA 421.85 (430.65) 1617567
DLF LIMITED 180.30 (177.55) 6246700
GENERAL INS 259.40 (259.00) 35511
GODREJ CONSU 807.35 (810.65) 297709
HAVELLS INDI 694.80 (691.50) 413338
HDFC STAND L 386.40 (387.15) 244225
HINDUSTAN ZI 277.85 (278.65) 151753
ICICI LOMBAR 873.25 (864.45) 100438
IDEA CELLULR 37.75 (37.75) 8804237
INTERGLOBE A 1165.60 (1165.05) 765951
L&TFIN.HOLD 153.15 (152.60) 3050999
LIC HOUS.FIN 486.55 (488.70) 639604
LUPIN 841.45 (844.30) 1122895
MARICO LIMIT 372.30 (373.40) 877238
MCDOWELL 621.00 (635.80) 1292037
MOTHERSON 165.45 (166.85) 1687361
MRF 66801.20 (66984.70) 4193
NHPC LTD 25.95 (26.00) 1377350
NMDC LTD 95.75 (96.85) 1265237
OIL INDIA 175.75 (174.80) 381570
ORACLE FIN S 3729.45 (3707.75) 11336
P&G HYG&HEAL 9903.75 (9884.10) 3305
PETRONET LNG 229.00 (224.15) 1537547
PIDILITE IND 1101.95 (1107.85) 191084
PIRAMAL ENTE 2395.30 (2381.75) 282866
SAIL 55.75 (56.35) 9872769
SBI LIFE INS 598.85 (597.85) 40902
SHREE CEMENT 16973.25 (17236.10) 12171
SHRIRAM TRAN 1229.75 (1239.95) 545844
SIEMENS 1062.65 (1046.90) 1089418
SUN TV LTD 607.85 (607.75) 1393145
THE NEW INDI 179.75 (179.75) 50050


బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 7.84 (7.89) 1000
AISHWARYA TE 2.67 (2.55) 5000
ALPHAGEO 479.95 (474.80) 271
AMAR RAJA BA 739.65 (742.75) 7307
ANDHRA BANK 29.75 (29.30) 64011
ANDHRA CEMEN 5.96 (5.95) 2771
ANDHRA PAPER 447.40 (444.15) 7072
ANDHRA PETRO 58.20 (57.40) 37525
ANDHRA SUGAR 340 (333.25) 709
ANJANI PORTL 130 (130) 159
ASTRA MICROW 78.55 (77.35) 26527
AUROBINDO PH 731.70 (730.95) 55537
AVANTEL SOFT 226.55 (230.25) 1960
AVANTI FEEDS 389 (385.55) 11863
AVON ORG 6.70 (6.99) 50
BALAJI AMIN 459.50 (459.35) 1958
BARTRONICS 7.22 (7.39) 856
BHAGIRA CHEM 443.70 (449.45) 1390
BHAGYA NAG 31.35 (32.30) 2663
BN RATHI SEC 27 (27.35) 100
BRILLIANT SE 1.16 (1.11) 235194
CAMBRIDGE TE 41.20 (41.60) 404
CIL SECURI 17.80 (16.50) 1023
CONT COFFEE 271.90 (270.25) 110
COROMAN FERT 450.50 (450.05) 870
CUBEX TUB 14.60 (14.50) 70
CYBERMATE 2.43 (2.33) 61646
CYIENT LIMIT 618.20 (619.05) 864
DECCAN CEMEN 400.25 (419.50) 76
DIVI'S LAB 1478.55 (1482.20) 11618
DIVYA GRANIT 90.40 (90.40) 151
DR REDDY 2610.80 (2617) 16782
FOUR SOFT 48.35 (40.30) 13219
GATI CORPN 86.30 (86.90) 36027
GAYATRI PROJ 179.05 (175.85) 6687
GMR INFRASTR 16.45 (16.40) 533265
GOLDST INFRA 230.45 (233.45) 18186
GOLDSTONE EN 16.80 (16.70) 3004
GRANULES (I) 90.80 (89.65) 44471
GSS AMERICA 132.65 (129.65) 56516
GVK POWER 8.03 (7.75) 284283
HBL NIFE POW 28.85 (28.80) 6893
HERITAGE FOO 528.75 (527.60) 1723
HIFCO MARWEL 74.20 (72.75) 83
HIL LTD 2058 (2063.70) 50
HIND FLUROCA 17.25 (17.30) 250
IDL INDUSTRS 295.95 (293.65) 183
IKF SOFT 0.31 (0.31) 35382
ILFS ENGINEE 16.25 (17.07) 1312
INCAP 43.10 (42.40) 348
IVRCL INFRAS 1.04 (1) 82115
JEEVAN SCIEN 38.25 (38) 489
KAKATIYA CEM 201.30 (202.90) 5826
KALLAM SPG 18.40 (18.20) 1351
KAVERI SEED 576.10 (574.25) 19704
KCP LTD 92 (92.35) 351
KERNEX MICRO 23.20 (23.90) 4466
KNR CONSTRUC 210.40 (213.50) 6069
KREBS BIO 109.45 (108.25) 15
LANCO INDUS 187.75 (188.55) 6698
LAURUS LABS 384 (379.70) 612
LOKESH MACH 47.45 (48.05) 3934
MADHUCON PRO 6.62 (6.66) 19164
MEDINOVA DIA 16.15 (17) 100
MEGA SOFT 8.09 (7.89) 4794
MIC ELECTRON 1.40 (1.47) 2942
MOLDTK PLA 270 (267) 12757
MSR INDIA LT 11.85 (12.35) 7290
NAGARJAGRICH 27.50 (27.70) 204
NATCO PHARMA 696.95 (680.80) 21454
NAVA BH VENT 119.95 (120.50) 7525
NCC 88.85 (88.10) 483394
NCL IND 139.05 (135.75) 829
NEHA INTER 4.68 (4.89) 5016
NETTLINX 50.70 (50) 34162
NEULAND LAB 471.90 (459) 97
NIHAR INFO 14.33 (13.65) 500
NILE 385 (385.65) 1472
NORTHGATE TE 0.94 (0.90) 105
OIL COUNTRY 17.50 (16.58) 7395
PANYAM CEMEN 13.51 (13.40) 1010
PENNER IND 36.90 (36.40) 23794
PHYTOCHEM I 48.50 (49) 1228
PIONEER DIST 172 (175.50) 1404
PITTI LAMIN 72.40 (72.85) 12905
POKARNA 163.05 (166.45) 326
PRAJAY ENGS 8.95 (8.88) 1188
PREMIER EXPL 240.80 (240.25) 866
PRISM CEMENT 89.60 (88.90) 15113
PRUDENTL PHA 3.70 (3.81) 42011
RAIN INDUSTR 135.95 (134.25) 60090
RAJ PACKAGIN 30 (28.05) 437
RAM INFORMAT 41.05 (41.55) 645
REG.CERAMIC 3.21 (3.06) 1
SAGAR CEM 695.60 (683.25) 48
SAMKRG PIST 191.70 (192.50) 3398
SATVAH. ISPA 10 (9.98) 2610
SPHERE GLOBA 18.95 (19.10) 100
SREE RAYAL A 34.55 (33.90) 48189
SRI KPR INDU 18.45 (17.60) 401
SRINIVASA SH 45 (44.90) 2952
STEEL EXCHAN 14.70 (15.40) 7995
SUJANA METAL 0.37 (0.37) 100
SUJANA UNIVE 0.34 (0.33) 10252
SURYALAKSH.C 42.55 (42.10) 57
SURYAVA SPIN 4.53 (4.53) 4989
SUVEN PHARMA 232.35 (227.35) 20795
TAJ GVK HOTE 178.50 (175.40) 2833
TANLA 30.70 (30.55) 6611
TERA SOFTWAR 39.70 (36.50) 6758
TRANS BIOTEK 3.26 (3.32) 7500
TRENDY KNIT 0.19 (0.19) 109460
VAMSHI RUBB 33.90 (31.10) 235
VBC FERRO 43.25 (45.35) 153
VICEROY HOTE 5.30 (5.15) 11164
VIJAY TEXTIL 42.90 (43.90) 1510
VIMTA LABS 319.10 (314.25) 7965
VISAKA IND 436.90 (430.20) 1071
VISTA PHARMA 29.35 (29) 3943
VIVIMED LABS 36.95 (36.85) 10399
VJIL CONSULT 41.25 (39.30) 1352
VST INDUS 3280 (3279.20) 59
XL TELENE 0.99 (0.95) 15150
YBRANT DIGIT 2.71 (2.68) 26262
ZENOTECH LAB 37.30 (37.85) 1101

ఈనాడు బిజినెస్

పెట్రోలు కంటే విమాన ఇంధనమే చౌక!

మీ స్కూటర్ నడపడం కంటే, బస్సు నిర్వహణ కంటే, విమానాన్ని ముందుకు కదిలించడమే చౌకగా మారింది.. ఇతర ఖర్చులు కాకుండా, ఇంధన వ్యయం రూపేణ మాత్రమే సుమా..



- విమాన ఇంధన ధర 14.7 శాతం తగ్గింపు
- పెట్రోలు, డీజిల్ కంటే తగ్గిన ధర
- విమానయాన సంస్థలకు భారీ ఊరట

అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడంతో, విమాన ఇంధన (ఎయిర్ టర్బైన్ ఫ్యూయల్-ఏటీఎఫ్) ధరను మంగళవారం రికార్డు స్థాయిలో 14.7 శాతం మేర తగ్గించారు. ఇందువల్ల పెట్రోలు, డీజిల్ కంటే ఏటీఎఫ్ చౌకగా మారింది.

ఏటీఎఫ్ ధరను కిలో లీటర్ (వెయ్యి లీటర్లు)కు రూ.9,990 తగ్గించి రూ.58,060.97గా చేసినట్లు ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. అంటే లీటర్ రూ.58.07 మాత్రమే. స్కూటర్, బైక్‌లలో పోసుకునే పెట్రోల్ కంటే, బస్సులు-లారీల్లో వాడే డీజిల్ కంటే కూడా ఏటీఎఫ్ ధరే చౌకగా ఉంది.

వరుసగా రెండో నెలలోనూ ఏటీఎఫ్ ధరలో కోత విధించగా, ఇంత భారీగా తగ్గించడం ఇదే తొలిసారి. డిసెంబరు 1న కూడా ఏటీఎఫ్ కిలోలీటర్ ధరను రూ.8,327.83 (10.9 శాతం) తగ్గించిన సంగతి విదితమే. ఇందువల్ల ఏడాది కాలంలో కనిష్ఠస్థాయికి ఏటీఎఫ్ ధర చేరింది. ఇందువల్ల దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ ధరల కంటే ఏటీఎఫ్ ధరే తక్కువకు చేరింది. ముంబయి వంటి ప్రాంతాల్లో రాయితీ లేకుండా లభించే కిరసనాయిలు ధర కంటే కూడా తక్కువకే ఏటీఎఫ్ లభించనుంది. అధిక చమురు ధరలకు తోడు, రూపాయి క్షీణతతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విమానయాన సంస్థలకు భారీ ఊరట కలిగించే పరిణామమిది.

ప్రధాన నగరాల్లో ఇంధన ధరలు (రూ.లలో)

	హైదరాబాద్	దిల్లీ	ముంబయి
లీటర్ పెట్రోల్	73.00	68.65	74.30
డీజిల్	68.00	62.66	65.56
ఏటీఎఫ్	59.00	58.06	58.01
కిరసనాయిలు	–	–	59.53

పెట్రోల్ ధరా దిగి వస్తోంది

ముడిచమురు ధరలకు అనుగుణంగా, పెట్రోల్-డీజిల్ ధరలు కూడా దిగి వస్తున్నాయి. మంగళవారం లీటర్ పెట్రోల్ ధరను 19 పైసలు, డీజిల్ ధరను 20 పైసల మేర తగ్గించినట్లు చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) ప్రకటించాయి.

- ★ అక్టోబరు 18 నుంచి ధరలు తగ్గుతూనే వస్తున్నాయి. ఇప్పటికి చూస్తే పెట్రోల్‌పై లీటరుకు రూ.14.18, డీజిల్‌పై లీటరుకు రూ.13.03 మేర ధర తగ్గింది.
- ★ అంతర్జాతీయ సగటు ధర, డాలరు-రూపాయి మారకపు విలువలకు అనుగుణంగా ప్రతినెలా 1వ తేదీన ఏటీఎఫ్ ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు నిర్ణయిస్తుంటాయి.
- ★ పెట్రోల్, డీజిల్ ధరలను మాత్రం ఏరోజుకారోజు సవరిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఆర్‌ఓసీ

విజయవాడలో కార్యాలయం ప్రారంభం

ఈనాడు-అమరావతి: దక్షిణాదిలో అత్యధిక కొత్త కంపెనీలు నమోదవుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందు వరసలో ఉందని ఏపీ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ) డెన్నింగ్ కె. బాబు తెలిపారు. గత మూడు నెలల వ్యవధిలో నెలకు సగటున 1,000 వరకూ కంపెనీలు ఇక్కడ ఏర్పాటవుతున్నట్లు గమనించినట్లు పేర్కొన్నారు. కొత్త రాష్ట్రం కావడం, ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందిస్తోండటంతో వివిధ రంగాల్లో పలు కంపెనీలు వస్తున్నాయని, వీటి సంఖ్య రాబోయే రోజుల్లో గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఉత్పత్తి, సేవా రంగాల్లో వస్తున్న సంస్థల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. మంగళవారం విజయవాడలో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ), ఆంధ్రప్రదేశ్ కార్యాలయం ప్రారంభం అయ్యింది. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ, హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు ఎం.పి.షా ముఖ్య అతిథిగా హాజరై, ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. తెలంగాణ ఆర్‌ఓసీ ఆర్.సీ.మిశ్రా, ఏపీ సహాయ ఆర్‌ఓసీ సాయి శంకర్ లండా, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మీనాక్షి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎం.పి.షా మాట్లాడుతూ.. కంపెనీ చట్ట పరిధిలోకి వచ్చే వ్యాపార సంస్థలకు విజయవాడ కార్యాలయం ఎంతో వెసులుబాటని చెప్పారు. నిబంధనలకు లోబడి వ్యాపారం చేస్తున్న వారందరికీ శాఖాపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన వివరించారు. అనంతరం డెన్నింగ్ కె. బాబు 'ఈనాడు'తో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ఆర్‌ఓసీ కింద 30వేల కంపెనీల వరకూ నమోదయ్యాయనీ, గడువులోగా వార్షిక నివేదికలు సమర్పించకపోవడం, ఇతర నిబంధనలు పాటించని కారణంగా ఇందులో 9,500 కంపెనీల గుర్తింపు రద్దయ్యిందని తెలిపారు. 'కొత్తగా ఏర్పాటవుతున్న కంపెనీల సరళి పరిశీలిస్తే రానున్న 10-12 నెలల్లో వీటి సంఖ్య లక్షకు చేరుకునే అవకాశం ఉంది. కంపెనీల నమోదుకు ఇప్పటికే అమలులో ఉన్న ఆన్‌లైన్ విధానమే కొనసాగుతుంది. కొత్త వాటి ఏర్పాటును స్వాగతిస్తూనే సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా? ఇతర దురుద్దేశాలతో ఏర్పాటు చేసి చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారా? అనే కోణంలోనూ పరిశీలించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తాం. అనుమానాస్పద కంపెనీల్లో ఆకస్మిక తనిఖీలు వంటివి రాబోయే రోజుల్లో ఉంటాయి. డొల్ల కంపెనీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం. సీఏలు, సీఎస్‌ల నుంచి ఈ మేరకు పూర్తి సహకారాన్ని ఆశిస్తున్నాం. కంపెనీల పనితీరుపై ఎలాంటి అనుమానం ఉన్నా ప్రజలు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి తదుపరి చర్యలు తీసుకోడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం' అని చెప్పారు. తక్కువ వ్యవధిలో ఎక్కువ వడ్డీ చెల్లిస్తామన్న సంస్థలపట్ల అప్రమత్తత అవసరమని సూచించారు. భారత కంపెనీ సెక్రటరీల ఇన్‌స్టిట్యూట్ (ఐసీఎస్ఐ), భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఏఐ) అమరావతి, విశాఖపట్నం చాప్టర్ ప్రతినిధులు హాజరయ్యారు.



విజయవాడలో కంపెనీ రిజిస్ట్రేషన్ల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హైదరాబాద్ రీజియన్ ప్రాంతీయ సంచాలకులు ఎం.పి.షా. చిత్రంలో ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ డెన్నింగ్ కె.బాబు, సహాయ ఆర్‌ఓసీ సాయి శంకర్ లండా



మౌలికానికి మళ్లీ మంచి రోజులు?

- అప్పులు తగ్గించుకుంటున్న కంపెనీలు
- కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు సంసిద్ధం
- రికార్డు స్థాయిలో కొత్త కాంట్రాక్టులు

ఈనాడు - హైదరాబాద్

దేశంలో 2006-2010 మధ్యకాలం మౌలిక సదుపాయాల రంగంలోని కంపెనీలకు స్వర్ణయుగం. భారీగా రహదార్ల నిర్మాణం, విద్యుత్తు, నీటిపారుదల ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ నిర్మాణాల కాంట్రాక్టులు లభించిన ఫలితంగా ఈ రంగంలోని వాణిజ్య సంస్థలు పెద్ద ఎత్తున ఆదాయాలు, లాభాలు ఆర్జించగలిగాయి. కానీ 2008-09లో వచ్చిన మాంద్యం ఫలితంగా మౌలిక సదుపాయాల రంగం కుప్పకూలిపోయింది. ఎన్నో కంపెనీలు అప్పుల పాలై కుంగిపోయాయి. తీసుకున్న అప్పులు తీర్చలేకపోయాయి. ఆ భారం బ్యాంకుల మీద పడింది. నిరర్థక ఆస్తులు బ్యాంకులకు తలకు మించిన భారంగా మారాయి. కొత్తగా మౌలిక సదుపాయాల కంపెనీలకు అప్పు పుట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఇలా చూస్తూ ఉండగానే ఏడెనిమిదేళ్లు గడిచిపోయాయి. ఎట్టకేలకు ఇప్పుడు మౌలిక సదుపాయాల రంగం కోలుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. గత దశాబ్దకాలంలో చేసిన తప్పుల్ని సరిదిద్దుకొని మళ్లీ కంపెనీలు కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలు... వివిధ నిర్మాణ పనులకు పెద్దఎత్తున నిధులు కేటాయించడం ఇటీవల కాలంలో కనిపిస్తోంది. దీంతో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టే కంపెనీలకు కొత్త ప్రాజెక్టులు లభించే అవకాశాలు పెరుగుతున్నట్లు అవుతోంది. దీన్ని బట్టి మౌలిక సదుపాయాల రంగానికి మంచి రోజులు రాబోతున్నాయని సంబంధిత వర్గాలు అశాభావం వ్యక్తం చేస్తున్నాయి. వచ్చే పార్లమెంటు ఎన్నికల తర్వాత కేంద్రంలో కొత్త ప్రభుత్వం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తుందని, అప్పటి నుంచి పరిస్థితులు ఇంకా అనుకూలంగా మారతాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

అప్పుల నుంచి బయటకు...

మౌలిక సదుపాయాల రంగంలోని కంపెనీలు గత కొంతకాలంగా అప్పుల చక్రబంధంలో చిక్కుకొని ఎన్నో ఇబ్బందులు పడ్డాయి. దశాబ్దాల తరబడి ఈ రంగంలో ఉన్న కంపెనీలు కూడా అప్పుల తిప్పలు తట్టుకోలేక ఖాయిలా పడ్డాయి. ఏదో విధంగా నెట్టుకొచ్చిన కంపెనీలు ఇప్పుడు మళ్లీ కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే అప్పుల భారాన్ని బాగా తగ్గించుకోవాలని భావిస్తూ, ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. కొత్త ప్రాజెక్టులు చేపట్టాలంటే కంపెనీల వద్ద ఎంతో కొంత నగదు ఉండాలి. అదే సమయంలో కొత్తగా అప్పు తీసుకోవటానికి అనువైన 'బ్యాలెన్స్ షీట్' తప్పనిసరి. మోయలేనంత రుణభారం ఉంటే కొత్త అప్పు పుట్టే అవకాశం లేదు. అందువల్ల మౌలిక సదుపాయాల రంగానికి చెందిన కంపెనీలు గత కొంతకాలంగా రుణభారాన్ని తగ్గించుకునే సన్నాహాలను ముమ్మరం చేశాయి. చేతిలో ఉన్న బీఓటీ ప్రాజెక్టులు విక్రయించటం, ఇతర రంగాల్లోని తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవటం చేస్తున్నాయి. అలా సమకూరిన సొమ్మును బ్యాంకులకు చెల్లించి రుణ భారాన్ని తగ్గించుకుంటున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌సీసీ లిమిటెడ్, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ... తదితర మౌలిక సదుపాయాల కంపెనీలు ఇటీవల కాలంలో అప్పులు కొంతమేరకు తగ్గించుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇదే పరిస్థితి దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ కనిపిస్తోంది. తద్వారా కొత్త ప్రాజెక్టులు చేపట్టగలిగే సన్నద్ధత వాటికి లభిస్తోంది.

రోడ్డు కాంట్రాక్టుల జోరు

- ★ కొత్త కాంట్రాక్టులు రావడం ఇటీవల కాలంలో పెరిగింది. కంపెనీలు సిద్ధపడాలే కానీ కాంట్రాక్టులు రాకపోవడమనే సమస్య ఉండటం లేదని మౌలిక సదుపాయాల రంగంలోని స్థానిక కంపెనీ ప్రతినిధి ఒకరు వివరించారు. అలాగని కంపెనీలు గతంలో మాదిరిగా తొందరపడి కనిపించిన ప్రతి పనీ తీసుకోవడం లేదని... నగదు లభ్యత, లాభాల మార్జిన్ చూసుకున్న తర్వాతే కాంట్రాక్టులు చేపట్టేందుకు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు.
- ★ ఎన్నో రకాల నిర్మాణ ప్రాజెక్టులు లభిస్తున్నప్పటికీ అందులో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టులు ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- ★ ఉదాహరణకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 17,000 కిలోమీటర్ల పొడవైన రోడ్డు కాంట్రాక్టులు జారీ అయ్యాయి. ఇందులో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఒక్కటే రూ.1.2 లక్షల కోట్ల విలువైన 7,400 కిలోమీటర్ల పొడవైన రోడ్డు నిర్మాణ కాంట్రాక్టులు ఇచ్చింది.
- ★ ఇంకా రూ.89,000 కోట్ల విలువైన రోడ్డు కాంట్రాక్టులు ఇవ్వటానికి ఎన్‌హెచ్ఏఐ సిద్ధమవుతోంది.
- ★ రహదార్ల నిర్మాణానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 17 శాతం అధిక నిధులు కేటాయించింది. ఈ పరిణామాలు రోడ్డు నిర్మాణ కంపెనీలకు కలిసివచ్చే విధంగా ఉన్నాయి.
- ★ 'క్రిసిల్' నివేదిక ప్రకారం రోడ్ల విభాగంలో పెట్టుబడులు 2019-23 మధ్య కాలంలో దాదాపు రూ.15 లక్షల కోట్లకు పెరిగే అవకాశం ఉంది.

ఇతర విభాగాల్లో...

భారతీయ రైల్వే భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. దీని ప్రకారం 2015-19 మధ్యకాలంలో రూ.8 లక్షల కోట్లకు పైగా వెచ్చించాల్సి ఉంది. రైల్వే లైన్ల డబ్లింగ్, ట్రాక్‌ల ఆధునికీకరణ, విద్యుద్దీకరణ, స్మార్ట్ రైల్వే స్టేషన్లు, అధునాతన కోచ్‌లు, అధిక సామర్థ్యం కల ఇంజిన్లు... ఇలా ఎన్నో రకాలైన ప్రాజెక్టులపై రైల్వే భారీగా నిధులు వెచ్చించబోతోంది. ఇవికాక దేశంలోని పలు ముఖ్య నగరాల్లో మెట్రో రైల్ ప్రాజెక్టులు వస్తున్నాయి. ఇంకా విమానాశ్రయాల నిర్మాణం-ఆధునికీకరణ, స్మార్ట్ నగరాలు, నగరాల్లో భారీ వాణిజ్య- నివాస రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు జోరందుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

పెరుగుతున్న 'ఆర్డర్ బుక్'

- ★ ఎన్‌సీసీ లిమిటెడ్‌కు ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో రూ.8,359 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. దీంతో ఈ కంపెనీ చేతిలో ఉన్న మొత్తం ఆర్డర్ల విలువ రూ.32,955 కోట్లకు పెరిగింది.
- ★ రహదార్ల నిర్మాణంలో క్రియాశీలకంగా ఉన్న దిలీప్ బిల్డ్‌కాన్‌కు రూ.23,935 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి. ఇందులో 88 శాతం రోడ్డు కాంట్రాక్టులే.
- ★ కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్‌కు రూ.1,831 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. ఈ కంపెనీ ఇటీవల దాదాపు రూ. 5,600 కోట్ల విలువైన అయిదు హామ్ (హైబ్రీడ్- యాన్యుటీ మోడల్) ప్రాజెక్టులు సంపాదించింది.
- ★ మహారాష్ట్రలోని ములంద్- థానే మధ్య రహదారి నిర్మాణ కాంట్రాక్టు జె.కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్‌కు దక్కింది. ఈ కాంట్రాక్టు విలువ రూ.275 కోట్లు. ఇదేవిధంగా ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలో కొంత భాగాన్ని నిర్మించే కాంట్రాక్టును కూడా దక్కించుకుంది. ఇది రూ.1349 కోట్ల విలువైన కాంట్రాక్టు.
- ★ ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు నాటికి హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ (హెచ్‌సీసీ)కి రూ.19,114 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. ఇందులో ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో లభించిన రూ.1,169 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.

బీఓటీ, యాన్యుటీ వద్దు, నగదు కాంట్రాక్టులే ముద్దు...

మౌలిక సదుపాయాల రంగం తొలినాళ్లలో బీఓటీ, యాన్యుటీ పద్ధతులు విస్తృతంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. భారీ ప్రాజెక్టులు చేపట్టడానికి నిధుల కొరత ఉన్నందున బిల్ట్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (బీఓటీ), నిర్మాణ వ్యయాన్ని ఏడాదికి కొంత చెల్లించే పద్ధతి (యాన్యుటీ)... వంటి విధానాలను ప్రభుత్వం, కంపెనీలు అనుసరించాయి. తొలినాళ్లలో బాగానే ఉన్నప్పటికీ ఈ పద్ధతుల వల్ల తదుపరి కంపెనీలపై ఆర్థిక భారం అనూహ్యంగా పెరిగిపోయింది. కంపెనీలు అప్పుల పాలవ్వటానికి ఇది కూడా ఒక కారణం. దీంతో కంపెనీలు ఇప్పుడు పద్ధతులు మార్చుకుంటున్నాయి. బీఓటీ, యాన్యుటీ ప్రాజెక్టులు చేపట్టేందుకు అంతగా సిద్ధపడటం లేదు. దీనికి బదులుగా నగదు కాంట్రాక్టులనే ఇష్టపడుతున్నాయి. ఇటీవల కాలంలో 'హామ్' మోడల్ వచ్చింది. ఈపీసీ, బీఓటీ-యాన్యుటీ పద్ధతుల మిశ్రమమే హామ్ పద్ధతి. ఈ విధానంలో కాంట్రాక్టులు చేపట్టేందుకు ఇన్‌ఫ్రా కంపెనీలు ముందుకు వస్తున్నాయి.

చిన్న పరిశ్రమలకు భారీ ఊరట

ఒకసారి రుణ పునర్ వ్యవస్థీకరణకు ఆర్‌బీఐ అంగీకారం

ముంబయి: నూతన సంవత్సరం ఆరంభ దినాన, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు భారీ మేలు కలిగించే నిర్ణయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తీసుకుంది. రూ.25 కోట్ల వరకు ఉన్న బకాయి ఉండి, చెల్లించలేక పోతున్న రుణాన్ని, ఒకసారి పునర్ వ్యవస్థీకరించడానికి ఆర్‌బీఐ అనుమతించింది. అయితే ఈ రుణం స్టాండర్డ్ అసెట్‌గా ఉన్నపుడు మాత్రమే ఇది సాధ్యపడుతుంది. 2016 నవంబరులో రూ.500, 1000 నోట్ల రద్దుతో పాటు 2017 జులైలో వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు వల్ల, నగదు కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ఎంఎస్ఎంఈ రంగానికి ఇందువల్ల ఊరట లభించనుంది.

ఎంఎస్ఎంఈలకు సంబంధించి, రూ.25 కోట్ల వరకు ఉన్న ఒత్తిడికి గురవుతున్న రుణాల పునర్వ్యవస్థీకరణకు పథకాన్ని పరిశీలించాలని, గత నవంబరు 19న జరిగిన ఆర్‌బీఐ బోర్డు సమావేశం, ఆర్‌బీఐకి సూచించింది. ఆయా సంస్థల ఆర్థిక స్థిరత్వానికి వీలు కల్పించేలా మాత్రమే ఈ పథకం ఉండాలని తెలిపింది. దీనికి అనుగుణంగా తాజా నిర్ణయం వెలువడింది. 2019 జనవరి 1కి రూ.25 కోట్లకు మించని, స్టాండర్డ్ అసెట్‌గా గుర్తింపు పొందిన రుణాలకు ఈ పథకాన్ని వర్తింప చేయాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. 2020 మార్చి 31లోపు పునర్ వ్యవస్థీకరణ పూర్తవ్వాలి.

- ★ ఇప్పటికే ఉన్న ప్రొవిజన్లకు అదనంగా 5 శాతం జత చేయాలి. తాజా పథకం కింద రుణ పునర్ వ్యవస్థీకరణ అమలవుతున్న ఖాతాల కోసం ఇది చూపాలి.
- ★ ఆదేశాలు అందిన నెలలోగా, ప్రతి బ్యాంక్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) కూడా తమ బోర్డు ఆమోదం ద్వారా, ఇందు కోసం ప్రత్యేక విధానాన్ని రూపొందించుకోవాలి. పునర్వ్యవస్థీకరించిన రుణాలను ఎప్పటికప్పుడు పరిశీలించే వ్యవస్థను నెలకొల్పాలి.
- ★ సంస్థ రుణం పునర్ వ్యవస్థీకరించే నాటికి, ఆ సంస్థ జీఎస్‌టీలో నమోదై ఉండాలి. అయితే జీఎస్‌టీ నమోదు అవసరం లేదని మినహాయింపు పొందిన ఎంఎస్ఎంఈలకు ఇది వర్తించదు.
- ★ నిరర్థక ఆస్తిగా గుర్తించిన ఖాతాలను కూడా పునర్వ్యవస్థీకరించవచ్చు.
- ★ ఆర్‌బీఐ, ప్రభుత్వం మధ్య వివాదం ఏర్పడటంలో, ఎంఎస్ఎంఈ పునర్ వ్యవస్థీకరణ పథకం అంశంపై భేదాభిప్రాయాలు కూడా కారణమయ్యాయి. తయారీ రంగంలో 50% వాటా కలిగిన ఎంఎస్ఎంఈలకు సహకరించాలని ప్రభుత్వం కోరుతూ వచ్చింది. వ్యవసాయం తరవాత అత్యధికంగా 12 కోట్ల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోంది కూడా.



జీఎస్‌టీ వసూళ్లు రూ.94,726 కోట్లు

- నవంబరు కంటే డిసెంబరులో తక్కువే

దిల్లీ: గత డిసెంబరులో వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు రూ.94,726 కోట్లుగా నమోదయ్యాయి. నవంబరు నాటి రూ.97,637 కోట్ల కంటే గత నెలలో వసూళ్లు తగ్గడం గమనార్హం. అయితే విక్రయాలకు సంబంధించి దాఖలయ్యే రిటర్నులు (జీఎస్‌టీఆర్-3బీ) మాత్రం 69.3 లక్షల నుంచి 72.44 లక్షలకు పెరిగాయి.

డిసెంబరు వసూళ్లలో కేంద్ర జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) రూ.16,442 కోట్లు కాగా, రాష్ట్ర జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) రూ.22,459 కోట్లు, సమ్మిళిత జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) రూ.47,936 కోట్లు, సెస్ రూ.7,888 కోట్లుగా నమోదయ్యాయి. ఐజీఎస్‌టీ నుంచి సీజీఎస్‌టీగా రూ.18,409 కోట్లు, ఎస్‌జీఎస్‌టీగా రూ.14,793 కోట్లు పరిష్కరించారు. నవంబరు నెల క్రయ, విక్రయ కార్యకలాపాలను డిసెంబరు జీఎస్‌టీ వసూళ్లు ప్రతిబింబిస్తాయి.

9 నెలల్లో రూ.8.71 లక్షల కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు జీఎస్‌టీ వసూళ్లు రూ.8.71 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఆర్థిక సంవత్సరం మొత్తానికి జీఎస్‌టీ వసూళ్లు రూ.13.48 లక్షల కోట్లకు చేరతాయన్నది బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. అంటే నెలకు సగటున రూ.1.12 లక్షల కోట్లుగా ఉండాలి. 2017 జులైలో జీఎస్‌టీ అమలు ప్రారంభం నుంచి 2018 మార్చి వరకు నెలకు సగటున రూ.89,885 కోట్లుగా ఉన్నాయి.

వసూళ్లు మరింత తగ్గుతాయా?

2019 జనవరి 1 నుంచి 23 రకాల వస్తువులపై జీఎస్‌టీ రేటును జీఎస్‌టీ మండలి తగ్గించింది. ఫలితంగా 28 శాతం జీఎస్‌టీ రేటు కింద 28 వస్తువులే మిగిలాయి. ఈ నేపథ్యంలో, రానున్న నెలల్లో జీఎస్‌టీ వసూళ్లు మరింత తగ్గుతాయనే ఆందోళనా ఉంది. ఈ తగ్గింపు ప్రభావం వల్ల ఏడాది మొత్తంమీద రూ.5,500 కోట్ల వసూళ్లు తగ్గుతాయని అంచనా. అంటే, జనవరి-మార్చిలోనే రూ.1,375 కోట్లు తగ్గొచ్చు. అయితే ప్రస్తుత వసూళ్ల స్థాయిలోనే రాబోయే నెలల్లోనూ ఉండొచ్చని, ఎన్‌ఫోర్స్‌మెంట్, పరిశోధనా కేసులు దాఖలు కావచ్చని పీడబ్ల్యూసీ జాతీయ పరోక్ష పన్నుల విభాగం నాయకుడు ప్రతీక్ జైన్ పేర్కొన్నారు.

జీఎస్‌టీ రిటర్నులపై ఆలస్య రుసుము మాఫీ

- జులై 17–సెప్టెంబరు 18 గడువుకు అమలు
- అయితే మార్చిలోగా రిటర్నులు దాఖలు చేయాలి

దిల్లీ: జులై 2017-సెప్టెంబరు 2018 గడువుకు సంబంధించి జీఎస్‌టీ రిటర్నులు సమర్పించని వారికి ఆలస్య రుసుమును మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆయా వ్యాపారులు మార్చి 31, 2019 కల్లా ఆ 15 నెలల గడువుకు సంబంధించిన రిటర్నులను దాఖలు చేయాల్సి ఉంటుందని పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర బోర్డు(సీబీఐసీ) పేర్కొంది. డిసెంబరు 22న జరిగిన జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తూ సీబీఐసీ ఆ మేరకు నోటిఫై చేసింది. ఆ గడువు కాలంలో జీఎస్‌టీఆర్-3బి, జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-4లను దాఖలు చేయని, పన్నులు కట్టకుండా ఉన్న వ్యాపారులపై ఎటువంటి ఆలస్య రుసుము వర్తించదని స్పష్టం చేసింది. సాధారణంగా కేంద్ర, రాష్ట్ర జీఎస్‌టీల కింద ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేస్తే రోజుకు రూ.25 చొప్పున ఆలస్య రుసుము వసూలు చేస్తారు. ఒక వేళ రిటర్నులలో పన్ను 'సున్నా'గా ఉంటే మాత్రం రూ.10 వర్తిస్తుంది.

వేగం.. సురక్షిత ప్రయాణం

- అధిక ఛార్జీల భారం కొద్దిమందిపైనే
- మార్చిలోగా దేశ వ్యాప్తంగా 68 రైల్వే స్టేషన్ల అభివృద్ధి
- కొత్త మార్గాల్లో తొలుత సింగిల్ లైనే, తర్వాతే రెండోది
- 'ఈనాడు' ముఖాముఖిలో రైల్వే బోర్డు నూతన ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్



సికింద్రాబాద్‌లోని జీఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న రైల్వే బోర్డు ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్

ఈనాడు - హైదరాబాద్

'రైల్వే వ్యవస్థను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు చేరువ కావడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా, వేగంగా చేర్చడం మా తదుపరి ధ్యేయం. అందులో భాగంగా రైళ్ల సగటు వేగాన్ని పెంచేందుకు కృషి చేస్తాం' అని రైల్వే బోర్డు నూతన ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. భారతీయ రైల్వేను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని, ఆ దిశగా ఇప్పటికే సాగుతున్న ప్రయత్నాలను వేగవంతం చేస్తామని చెప్పారు. రైల్వే బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన వినోద్‌కుమార్ యాదవ్ సికింద్రాబాద్ రైల్ నిలయంలోని జీఎం కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జోన్ పరిధిలోని ఆరు డివిజన్ల అధికారులతో వీడియో సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా 'ఈనాడు'తో ముఖాముఖి మాట్లాడారు.

ప్రత్యేక రైళ్లలో అధిక ఛార్జీలు, ముఖ్యంగా సువిధ ప్రత్యేక రైళ్లలో మూడు రెట్ల వరకు అదనంగా వసూలు చేయడం సమర్థనీయమని భావిస్తున్నారా?

ప్రయాణికుల అవసరాలు, గిరాకీకి అనుగుణంగా అవసరమైన మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నాం. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 100 ప్రత్యేక రైళ్లను ప్రకటించాం. అందులో సువిధ రైళ్లు తొమ్మిదే. మొత్తం రైలు ప్రయాణికుల్లో 1 శాతం మందిపైనే అధిక ఛార్జీల భారం పడుతోంది. 99 శాతం మంది సాధారణ ఛార్జీలతోనే ప్రయాణం చేస్తున్నారు. ప్రత్యేక రైళ్లు, వాటిలో వసూలు చేస్తున్న ఛార్జీలు తదితర పరిస్థితుల గురించి రైల్వే మంత్రికి ఇప్పటికే వివరించా. దీన్ని త్వరలో సమీక్షిస్తాం.

సాధారణ రైళ్లలోనూ ప్రీమియం తత్కాల్ పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు? వీటి మాటేమిటి?

చాలా రోజుల ముందుగా కాకుండా కొందరు అప్పటికప్పుడు, అత్యవసరంగా ప్రయాణం చేయాల్సిన అవసరం ఉంటుంది. అలాంటి వారి కోసం కొన్ని టికెట్లను ప్రత్యేకంగా కేటాయిస్తున్నాం. కొద్ది గంటల ముందు కూడా అందించే ఈ తరహా వాటికే ప్రత్యేక ధరలు ఉంటున్నాయి.

రైళ్ల ఆలస్యంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. రైళ్ల సగటు వేగం కూడా తక్కువే. ఈ పరిస్థితి ఎప్పుడు మారుతుంది?

రైళ్ల సమయ పాలనను క్రమంగా మెరుగుపరుస్తున్నాం. సగటు వేగాన్ని గణనీయంగా పెంచడంపై భారతీయ రైల్వే ప్రత్యేక దృష్టి సారించింది. దీని కోసమే సెమీ హైస్పీడ్, హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టులు చేపడుతున్నాం. సరకు రవాణాకు ప్రత్యేక కారిడార్ల ఏర్పాటు పనుల్ని వేగవంతం చేస్తున్నాం. అనతి కాలంలో అన్ని రైళ్ల సగటు వేగం పెరుగుతుందని ఆశిస్తున్నాం. పనిలో పనిగా దేశ వ్యాప్తంగా 68 రైల్వే స్టేషన్ల అభివృద్ధిపనులు కొనసాగుతున్నాయి. మార్చి నాటికి వాటినీ పూర్తిచేస్తాం.

ఇంజిన్ లేకుండా అత్యంత వేగంతో ప్రయాణించే ట్రైన్ 18 సేవలు ద.మ.రైల్వేకి ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి?

దిల్లీ నుంచి నడిపిన ట్రైన్ 18 ట్రయల్ రన్ విజయవంతమైంది. ఇది త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుంది. భవిష్యత్తులో ఈ వేగవంతమైన రైలు సేవల్ని ఇతర నగరాల నుంచి కూడా విస్తరిస్తాం.

సికింద్రాబాద్-చెన్నై, కాజీపేట-నాగ్‌పూర్ సెమీ హైస్పీడ్ కారిడార్ల పరిస్థితి ఏంటి?

ప్రధాన మార్గాల్లో రైళ్ల వేగం పెంచే సెమీ హైస్పీడ్ కారిడార్ల అభివృద్ధికి తొలుత ప్రాధాన్యం ఇస్తాం. ఈ రెండు ప్రాజెక్టులపైనా దృష్టి పెడతాం.

రైల్వేలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. పనిభారం పెరుగుతోందని ఉద్యోగులు అంటున్నారు? దీనికి పరిష్కారం చూపుతారా?

ఇటీవల కాలంలో రికార్డు స్థాయిలో లక్ష ఉద్యోగాల భర్తీకి భారతీయ రైల్వే ప్రకటనలు ఇచ్చింది. పలు పోస్టులకు ఇప్పటికే రాత పరీక్షలు జరిగాయి. ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఈ ఎంపిక ప్రక్రియను వీలున్నంత వేగంగా పూర్తిచేస్తాం. వాళ్లు అందుబాటులోకి వస్తే ఈ సమస్య దాదాపు పరిష్కారమవుతుంది.

అమరావతిని రైలు మార్గంతో అనుసంధానించే ప్రాజెక్టులపై వివక్ష చూపుతున్నారని, ఎర్రుపాలెం-నంబూరును సింగిల్ లైన్‌తో ప్రతిపాదించారని, మిగిలిన రెండు లైన్లను తాత్కాలికంగా పక్కన పెట్టారనే విమర్శలున్నాయి. మీరేమంటారు?

అమరావతి రైలు ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన సమగ్ర అంచనా వ్యయం తాలూకూ ప్రతిపాదనలు రైల్వేబోర్డు వద్ద ఉన్నాయి. తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కొత్త రైల్వే ప్రాజెక్టు ఏదైనా సింగిల్ లైన్‌తోనే మంజూరవుతుంది. భూసేకరణ మాత్రం రెండు లైన్లకు సరిపడా ఒకేసారి జరుగుతుంది. ప్రయాణికుల రద్దీ పెరుగుదల ఆధారంగా రెండో లైను మంజూరవుతుంది.

రైల్వే బోర్డు ఛైర్మన్‌గా మీ ప్రాధాన్యాలు ఏమిటి?

ప్రయాణికుల భద్రతకే తొలి ప్రాధాన్యం. రైలెక్కిన ప్రతి వ్యక్తినీ గమ్యస్థానానికి క్షేమంగా చేర్చే దిశగా శాఖాపరంగా అన్ని చర్యలు చేపడతాం. స్టేషన్లలో, రైళ్లలో ప్రయాణికులకు అసౌకర్యాలు లేకుండా చూస్తాం. కొన్ని మార్గాల్లో సామర్థ్యం కంటే ఎక్కువ రైళ్లు నడుస్తున్నాయి. అదనపు రైలు మార్గాలు నిర్మించడమే ఈ సమస్యకు పరిష్కారం. అందులో భాగంగా ఇలాంటి పలు మార్గాల్లో ఇప్పటికే సింగిల్ లైన్ ఉన్నచోట రెండోలైను, రెండులైన్లు ఉన్న మార్గాల్లో మూడో లైన్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ఆ పనుల్ని వేగవంతం చేస్తాం. ప్రయాణికులకు నాణ్యమైన ఆహారం అందించే దిశగా ఆహార నాణ్యత, క్యాటరింగ్ సేవలపైనా దృష్టి సారిస్తాం.

సంక్రాంతికి మరో 13 ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండగ రద్దీ నేపథ్యంలో మరో 13 ప్రత్యేక ఛార్జీల రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇందులో రెండు మినహా మిగిలినవి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ నగరాల నుంచి హైదరాబాద్‌కు పండగ తర్వాత తిరిగి వచ్చేవారిని దృష్టిలో పెట్టుకుని నడపనున్నవే. కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు ఏడు, నర్సాపూర్ నుంచి సికింద్రాబాద్‌కు మూడు, విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కు ఒకటి. . సికింద్రాబాద్ నుంచి కాకినాడకు రెండు ప్రత్యేక ఛార్జీల రైలు సర్వీసులు తిరగనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. మొత్తం 13 ప్రత్యేక రైళ్లలో 11 సర్వీసులు భారీ ఛార్జీలుండే సువిధ ప్రత్యేక రైళ్లు కావడం గమనార్హం. వీటిలో టికెట్లు అయిపోయేకొద్దీ ఛార్జీలు పెరుగుతూ ఉంటాయి. గరిష్ఠంగా మూడు రెట్ల అదనపు ఛార్జీలు ఉంటాయి.

- ◆ కాకినాడ-సికింద్రాబాద్: సువిధ రైళ్లు. 16, 17, 20 తేదీల్లో రెండేసి. 18న ఒకటి.
- ◆ నర్సాపూర్-సికింద్రాబాద్: (సువిధ) 18, 19, 20 తేదీల్లో ఒక్కోటి.
- ◆ విజయవాడ-సికింద్రాబాద్: (సువిధ) 17న ఒకటి.
- ◆ సికింద్రాబాద్-కాకినాడ: ప్రత్యేక ఛార్జీల రైళ్లు. 13, 20 తేదీల్లో ఒక్కోటి.

ద.మ. రైల్వేకి కొత్త ఇన్‌ఛార్జి జీఎం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) ఇన్‌ఛార్జి జనరల్ మేనేజర్‌గా మంగళవారం ఆర్.కె.కుల్‌శ్రేష్ఠ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు సదరన్ రైల్వే జీఎంగా ఉన్నారు. ఐఐటీ రూర్కీ నుంచి 1979లో పట్టభద్రుడైన ఆయన 1980లో భారత రైల్వే సర్వీసెస్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ విభాగంలో చేరారు. ఇంతవరకు ఎస్సీఆర్ జీఎంగా ఉన్న వినోద్‌కుమార్ యాదవ్ రైల్వే బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం విదితమే.



ఆర్.కె.కుల్‌శ్రేష్ఠ

పెండింగ్ అంశాలను పరిష్కరించండి

రైల్వే బోర్డు నూతన ఛైర్మన్‌కు ఎంపీ వినోద్ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను పరిష్కరించాలని రైల్వే బోర్డు నూతన ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్‌కు తెరాస ఎంపీ వినోద్‌కుమార్ విజ్ఞప్తిచేశారు. మంగళవారమిక్కడ యాదవ్‌తో వినోద్ కుమార్ భేటీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన యాదవ్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపీ వినోద్ మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణ మధ్య రైల్వే జీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయనకు తెలంగాణలోని పెండింగ్ అంశాలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఆయా అంశాలను మరోసారి గుర్తుచేసి.. సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని కోరానని చెప్పారు. అన్ని విధాలా సహకరిస్తానని వినోద్‌కుమార్‌యాదవ్ హామీ ఇచ్చారని ఎంపీ వినోద్ పేర్కొన్నారు.

రైల్వే అధికారిపై సీబీఐ కేసు నమోదు

ఆదాయానికి మించి ఆస్తుల విషయంలో..

ఈనాడు, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సికింద్రాబాద్ రైల్వే అధికారిపై సీబీఐ సోమవారం కేసు నమోదు చేసింది. రైల్వే ఇంజినీరింగ్ శాఖలో సికింద్రాబాద్ దక్షిణ మండలం జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న కె.వెంకటేశ్వరరావు అక్రమ ఆస్తులు కూడబెట్టారన్న విశ్వసనీయ సమాచారంపై హైదరాబాద్ సీబీఐ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో వెంకటేశ్వరరావు 2012 ఫిబ్రవరి ఒకటి, 2018 ఏప్రిల్ 28వ తేదీల మధ్య రూ.1,26,85,168 అక్రమ ఆదాయం కూడబెట్టినట్లు వెల్లడయింది. వాస్తవానికి ఈ సమయంలో ఆయన అధికారిక ఆదాయం రూ.86,27,749 మాత్రమే ఉండాలని సీబీఐ అధికారులు లెక్కగట్టారు. తన అక్రమ ఆర్జనను వెంకటేశ్వరరావు ఆయన భార్య కె.అనిత, మామ కేదారిశెట్టి వెంకటేశ్వరరావు పేర్లపై పెట్టినట్లు గుర్తించారు. దీనికి సంబంధించి సీబీఐ అధికారులు వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మలేసియాలో ఐదుగురు కార్మికులకు విముక్తి

ఎంపీ కవిత సాయంతో రాష్ట్రానికి రాక

ఈనాడు, హైదరాబాద్: ఉపాధి కోసం వెళ్లి ఏజెంట్ల మోసంతో మలేసియాలో చిక్కుకొని, ఇబ్బందులు పడుతున్న అయిదుగురు తెలంగాణ కార్మికులు నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత సాయంతో స్వరాష్ట్రానికి తిరిగి వచ్చారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం బాద్గుణ గ్రామానికి చెందిన బింగి విజయ్‌కుమార్, అల్లాడి సురేశ్, ఉమ్మెడ గ్రామానికి చెందిన బుకాపు ప్రసాద్, ఆకుల సంతోష్, మాయాపూర్‌కు చెందిన వరంగంటి బాలాగౌడ్‌లు గత ఏడాది మలేసియాలో ఉద్యోగాల కోసం ఏజెంట్లను ఆశ్రయించారు. అయిదుగురిని ఏజెంట్లు నమ్మించి సందర్శక వీసాలపై మలేసియాకు తీసుకెళ్లారు. ఆ దేశ రాజధాని కౌలాలంపూర్ చేరుకున్నాక ఏజెంట్లు అయిదుగురిని అక్కడ వదిలేసి పారిపోయారు. వీరు కంపెనీల చుట్టూ తిరిగినా ఉద్యోగాలు దొరకలేదు. వారి వీసాల గడువు తీరడంతో.. రహస్యంగా అక్కడే ఉండిపోయారు. తినడానికి తిండి లేక తీవ్ర ఇబ్బందులకు గురై తమవారికి సమాచారం అందించారు. బాధిత కుటుంబీకులంతా ఎంపీ కవితను కలిసి తమ వారి గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే కవిత మలేసియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి తమవారిని ఆదుకోవాలని సూచించారు. తెలంగాణ జాగృతి నేతలు అనధికారికంగా ఉన్న అయిదుగురి పేరిట ఉన్న జరిమానాను చెల్లించారు. వారికి తాత్కాలిక వీసాలు, పాస్‌పోర్టులు, టిక్కెట్లు సమకూర్చారు. దీంతో అయిదుగురు బాధితులు మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి వారిని జాగృతి నేతలు స్వగ్రామాలకు పంపించారు. తమను ఆదుకున్న ఎంపీ కవితకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

క్షణం తీరికలేకుండా

నూతన సంవత్సరం తొలిరోజున బిజీబిజీగా సీఎం కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: నూతన సంవత్సరం తొలిరోజైన మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ క్షణం తీరిక లేకుండా ఉదయం నుంచి రాత్రి వరకు వరుస కార్యక్రమాలు, పర్యటనల్లో పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకే ఆయన ప్రగతి భవన్ నుంచి రాజ్‌భవన్‌కు వెళ్లి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఉదయం 9:30కి హైకోర్టుకు వెళ్లి న్యాయమూర్తుల ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. 11 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి బేగంపేటకు చేరుకొని హెలికాప్టర్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనకు బయల్దేరారు. సాయంత్రం వరకు మేడిగడ్డ బ్యారేజీ, కన్నేపల్లి పంపుహౌస్ పనులను సందర్శించారు. రాత్రికి కరీంనగర్ తీగలగుట్టపల్లెకు చేరుకున్నారు. అక్కడికి పెద్దఎత్తున చేరుకున్న నేతలు, కార్యకర్తలను కలిశారు.

సీఎంకు శుభాకాంక్షలు

సీఎం కేసీఆర్‌కు మంగళవారం ఉదయం ప్రజాప్రతినిధులు, నేతలు, ఉన్నతాధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మహమూద్ అలీ, శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, సభాపతి మధుసూదనాచారి, సీఎస్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు.

38 మందికి అంతర్రాష్ట్ర బదిలీలు

ఈనాడు, అమరావతి: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య పరస్పర అంగీకారం కింద 38మంది అధ్యాపకులు, గ్రంథపాలకుల బదిలీలకు ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు, గ్రంథపాలకులు మొత్తం 40మంది దరఖాస్తు చేసుకోగా 38మంది బదిలీలకు ఆమోదం లభించింది.

జన్మభూమి- మా ఊరులో సాంస్కృతిక పోటీలు

జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై ప్రతి రోజు సాంస్కృతిక పోటీలు నిర్వహించాలని ఆదేశిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సంగీతం, చర్చలు, రంగోళి, చిత్రలేఖనం, నాట్యం, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని అందులో పేర్కొంది. ఈ పోటీలను విద్యాశాఖ నిర్వహించనుంది.

ఆహార ప్రచారంలో అబద్ధాలొద్దు

- వినియోగదారులకు సమాచారమంతా ఇవ్వాల్సిందే
- వ్యాపార సంస్థలకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్రమాణాల నిర్దేశం
- కలెక్టర్లకు ఆహార భద్రతా ప్రమాణాల అమలు అధికారం

ఈనాడు - హైదరాబాద్

ఆహార పదార్థాలు విక్రయించే, సరఫరా చేసే వ్యాపార సంస్థలన్నీ తప్పనిసరిగా కొన్ని ప్రమాణాలను పాటించాలని జాతీయ ఆహార భద్రతా ప్రమాణాల మండలి (ఎఫ్ఎస్ఎస్ఏఐ) స్పష్టం చేసింది. అసత్య ప్రకటనలతో నాణ్యత లేని, కల్తీ ఆహార పదార్థాలను ప్రజలకు అమ్మకుండా అడ్డుకునేందుకు ఆహార భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేసింది. 'సహజ, తాజా, ఫైనెస్ట్, బెస్ట్, జెన్యూన్, ప్రీమియం..' తదితర పదాలను వాణిజ్య ప్రకటనల్లో వాడకూడదు. ఆహార పదార్థాల సహజ గుణం పాడవకుండా కేవలం శుద్ధి చేసి అమ్మితేనే ఈ పదాలు వాడాలి. దాన్ని గుణం మార్చి విక్రయించేవారు ఇలాంటి పదాలతో ప్రచారం చేయకూడదు. 'శక్తినిస్తాయి' అని ప్రచారం చేసే పదార్థాలపై వాటిలో శక్తికి కారణమైన పోషక విలువలేమిటో.. కొవ్వు, ఉప్పు, చక్కెర, కొలెస్ట్రాల్, విటమిన్లు, ప్రొటీన్లు ఏ దామాషాలో ఉంటాయో ముద్రించాలి. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే ఆహార భద్రతా చట్టం కింద రూ.10 లక్షల వరకు జరిమానా వేస్తారు. పలు ఆహారోత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను సవరిస్తూ ఇటీవల మండలి వేర్వేరుగా ముసాయిదాలను విడుదల చేసింది. వీటిపై రాష్ట్రాల్లోని పలు వర్గాల అభిప్రాయాలు, సలహాలు, సూచనలను ఆహ్వానించింది. వచ్చిన అభిప్రాయాలన్నిటినీ క్రోడీకరించి, నిబంధనలను చట్టంలో పొందుపరచనుంది. ముసాయిదాల్లోని ముఖ్యాంశాలివీ..

- ◆ కేంద్రీయ లైసెన్స్ తీసుకుని కనీసం 10 అంతకన్నా ఎక్కువ చోట్ల ఆహార పదార్థాలు సరఫరా చేసే హోటల్ లేదా వ్యాపార సంస్థ సదరు ఆహార పదార్థాల్లో కేలరీల విలువల గురించి వినియోగదారులకు తెలిసేలా మెనూ కార్డులపై ముద్రించాలి. ఈ వివరాలున్న కార్డుపైనే ప్రతి మనిషికి రోజుకు 2 వేల కిలోకేలరీల శక్తి సరిపోతుందనే సూచన కూడా తప్పకుండా ఉండాలి.
- ◆ విక్రయ కేంద్రంలో నోటీసు బోర్డులపై శాకాహారమా? మాంసాహారమా? అనే వివరాలు తప్పనిసరిగా ప్రకటించాలి. సేంద్రియ పదార్థాలతో తయారు చేశారా? ఇతర పదార్థాలు ఏమేం కలిపారనే వివరాలూ ఉండాలి. ఆ పదార్థాలు తింటే ఎలర్జీ లాంటి ఇబ్బందులకు అవకాశం ఉంటే వాటినీ పేర్కొనాలి. ఆన్‌లైన్ ద్వారా ఆహార పదార్థాలు విక్రయించేవారు వారి వెబ్‌సైట్లో ఈ వివరాలన్నీ ముద్రించాలి.
- ◆ అనేక విక్రయ కేంద్రాలు నడుపుతున్నామని చెప్పేవారు వాటిలో ప్రతి కేంద్రాన్ని ఏడాదిలో 60 రోజులైనా తప్పకుండా తెరిచి ఉంచాలి.
- ◆ సెల్ఫ్ సర్వీసు పద్ధతిలో ఆహార పదార్థాలు విక్రయించే సంస్థలు సరఫరా రుసుం తీసుకోరాదు.
- ◆ కూరల్లో వాడే మసాలా పొడి తయారీదారులు ఉప్పు 5% దాటితే ఆ విషయం ప్యాకెట్‌పై ముద్రించాలి.
- ◆ మసాలా ఘాటును ఎక్కువ, మధ్యరకం, తక్కువ అనే కేటగిరీల్లో విక్రయించాలి. ఏ కేటగిరీ పొడిలోనూ తేమ 10 శాతానికి మించరాదు. భారత సుగంధ ద్రవ్యాల మండలి లేదా ఇతర సంస్థలు గుర్తించిన పదార్థాలతో వీటిని తయారుచేయాలి. సుగంధ ద్రవ్యాల శాతాలు ఎక్కువ ఘాటు కేటగిరీ పొడిలో 85, మధ్యరకంలో 40, తక్కువ రకంలో 25 చొప్పున తప్పనిసరిగా ఉండాలి.
- ◆ ఇకనుంచి రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో కలెక్టర్లే జిల్లా స్థాయిలో ఆహార భద్రతా ప్రమాణాల అమలును పర్యవేక్షించేలా మండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ కలెక్టర్లకు వీలుకాకపోతే ఆయన అక్కడి సంయుక్త కలెక్టర్లకు ఈ బాధ్యత అప్పగించవచ్చని మరో తాజా ఉత్తర్వులో తెలిపింది.



పన్నీరు పదిలం..

- ◆ పాలు, పాల ఉత్పత్తుల విభాగంలో ఇకనుంచి మేక లేదా గొర్రె పాలను సైతం చేర్చింది. వీటిని ప్రజలకు విక్రయిస్తే వాటిలో వెన్న శాతం కనిష్ఠంగా 3%, కొవ్వేతర ఘన వ్యర్థాలు 9% తప్పనిసరిగా ఉండాలి.
- ◆ రసాయనాలతో కృత్రిమ పాలు, పన్నీరు, వెన్న వంటివి తయారుచేయకుండా ప్రమాణాలను నిర్దేశించింది.
- ◆ పన్నీరు ముక్కల్లో తేమ 60 శాతానికి మించరాదు. పాలకొవ్వు కనీసం 50% ఉండాలి. కొవ్వు తక్కువగా ఉండే పన్నీరును విక్రయిస్తే గరిష్ఠంగా 15 శాతానికి మించకుండా చూడాలి. పన్నీరు ప్యాకెట్లపై ఈ వివరాల ముద్రణ తప్పనిసరి.
- ◆ పాల నుంచి తీసే వెన్న పేరుతో విక్రయిస్తే అందులో సహజ పాలకొవ్వు 33 శాతానికి తగ్గకుండా ఉండాలి.
- ◆ వీధుల్లో వెండింగ్ యంత్రాలపై తయారుచేసి, అమ్మే తీపి పదార్థాల సమాచారమంతా కప్పులపై లేబుల్ రూపంలో అంటించాలి.

కప్పు కాఫీలోనూ జాగ్రత్తలు..

- ◆ కాఫీ తయారీదారులూ కొన్ని ప్రమాణాలు పాటించాలి. కెఫిన్ రహిత కాఫీ పొడి విక్రయానికి ప్రమాణాలను నిర్దేశించారు. ఈ పొడిని సహజ ఆకుపచ్చ కాఫీ గింజలపై పొట్టు తొలగించి, వాటిని వేయించిన తరవాత తయారుచేయాలి. చికోరీ లేదా ఇతర పదార్థాలేమీ కలపకూడదు. కెఫిన్ 0.3 శాతానికి మించరాదు. తేమ 4% కంటే ఎక్కువ ఉండకూడదు. ఈ పొడిని మరిగే నీటిలో వేస్తే 30 సెకన్లలో, చల్లటి నీటిలో వేస్తే 3 నిమిషాల్లో కరిగిపోవాలి.

అంతరిక్షంలో అల్లుకుపోదాం

- 2019లో ఇస్రో 31 మిషన్లు
- ఈ నెలలో పీఎస్ఎల్వీ-సీ44, ఫిబ్రవరిలో చంద్రయాన్-2 ప్రయోగాలు!



చంద్రయాన్-2 ద్వారా పంపనున్న రోవర్ నమూనా

శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) 2019లో తీరిక లేని షెడ్యూల్‌ను రూపొందించుకుంది. 31 మిషన్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటిలో సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి 22 మిషన్లు(11 ప్రయోగాలు) చేపట్టనున్నారు. ఈ నెలలో పీఎస్ఎల్వీ-సీ44 ప్రయోగం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన అనుసంధాన కార్యక్రమాలు గత నెల 24న షార్‌లోని మొదటి ప్రయోగ వేదికపై ప్రారంభమయ్యాయి. జీఎస్ఎల్వీ-మార్క్‌3 వాహక నౌక ద్వారా చంద్రయాన్-2 ప్రయోగం చేపట్టనున్నారు. దీని అనుసంధానం పనులు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలోని వ్యాబ్‌లో చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ప్రయోగం ఫిబ్రవరిలో చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అలాగే అధిక వేగవంతమైన అంతర్జాల సేవల కోసం జీశాట్-20 ఉపగ్రహాన్ని కూడ కక్ష్యలోకి పంపనున్నారు.

చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు

చంద్రుడి ఉపరితలంపై విస్తృత పరిశోధనలు లక్ష్యంగా చంద్రయాన్-2ను ఇస్రో చేపట్టనుంది. ఇంతవరకూ ఏ దేశం చేరుకోని చంద్రుని దక్షిణ భాగం వైపు వెళ్లడానికి ఇస్రో ప్రణాళిక వేసింది. ఈ ప్రయోగం విజయవంతమయితే చంద్రునిపై వ్యర్థ రహిత అణుశక్తి మూలకాల లభ్యతపై ఇస్రో అధ్యయనం చేయనుంది. ఈ అణుశక్తి ట్రిలియన్ డాలర్ల విలువ చేయనుంది. ఇస్రో చంద్రయాన్-2లో పంపనున్న రోవర్ ద్వారా నీరు, హీలియం-3 జాడ కోసం చంద్రుని ఉపరితలంపై పలు నమూనాలను విశ్లేషించనుంది. ఆ మూలకాలను చంద్రుడి నుంచి భూమికి తీసుకురాగలిగే సామర్థ్యం ఉన్న దేశాలు ఈ ప్రక్రియను తమ చెప్పుచేతల్లో పెట్టుకొనే అవకాశం లేకపోలేదు. ఈ పరుగులో భారత స్థానాన్ని చంద్రయాన్-2 మరింత పటిష్ఠం చేయనుంది.

> "ఇస్రో 2019లో ఆరు భూ పరిశీలన ఉపగ్రహాలు, ఆరు కమ్యూనికేషన్ ఉపగ్రహాలు, రెండు స్పేస్ సైన్సు పెలోడ్‌లను నింగిలోకి పంపాలని లక్ష్యంగా పెట్టుకుంది".

> "హీలియం-3 ఐసోటోప్ లభ్యత భూమిపై పరిమితంగా ఉండగా, చంద్రునిపై సమృద్ధిగా ఉందని అంచనా. ఇది సిద్ధాంతపరంగా 250 ఏళ్లకు సరిపడా ప్రపంచ విద్యుత్తు అవసరాలను తీర్చుతుందని విశ్వసిస్తున్నారు".

> "ఇస్రో 2008 అక్టోబరులో చంద్రునిపైకి చంద్రయాన్-1ను విజయవంతంగా పంపింది. దీని ద్వారా చంద్రునిపై నీటి జాడలు ఉన్నట్లు తొలిసారిగా గుర్తించారు".

రూ.600 కోట్ల వ్యయంతో..

చంద్రునిపై ఇప్పటికే అమెరికా, చైనా, జపాన్, రష్యా దేశాలు తమ ప్రయోగాలతో పోటీ పడుతున్నాయి. ఇస్రో చంద్రయాన్-2 ద్వారా ఆర్బిటర్, లాండర్, రోవర్‌ను పంపనుంది. ఈ ప్రయోగానికి రూ.600 కోట్ల వరకు వ్యయం చేస్తున్నారు.

సత్తా చూపిన పోలీస్

- స్వల్ప వ్యవధిలో కిడ్నాప్ ఛేదన
- తల్లిదండ్రులకు చిన్నారి అప్పగింత
- ప్రశంసించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



కుమారుడిని తీసుకుని ఎస్పీ అన్బురాజన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రశాంత్, స్నేహ

తిరుపతి క్రైం, నిజామాబాద్ నేరవార్తలు, న్యూస్‌టుడే: తిరుమలలో 5 రోజుల క్రితం కిడ్నాపైన చిన్నారిని స్వల్ప వ్యవధిలో రక్షించి తిరుపతి పోలీసులు సత్తా చూపారు. సీసీ కెమెరా దృశ్యాలు, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్‌లను ఉపయోగించుకుని కిడ్నాపర్‌ను గుర్తించి చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. అతి స్వల్ప సమయంలో చిన్నారిని రక్షించిన వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించడం విశేషం. డిసెంబరు 27న రాత్రి 8 గంటల సమయంలో మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాకు చెందిన ప్రశాంత్ జి.యాదవ్, స్నేహ దంపతులు తమ కుమారుడు వీరేష్‌తో (16 నెలలు) కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. రాత్రి బస చేసేందుకు గది దొరక్కపోవడంతో మాధవ నిలయం ఎదుట మండపంలో నిద్రించారు. మరుసటి రోజు ఉదయం లేచి చూడగా కుమారుడు కనిపించలేదు. దీంతో తిరుమల టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. పోలీసులు, తితిదే విజిలెన్స్ విభాగం అధికారులు తిరుమల, తిరుపతిలోని సీసీ కెమెరాలను పరిశీలించగా అనుమానాస్పద వ్యక్తి చిన్నారిని తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. నిందితుడు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మహుర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేణుకాదేవి ఆలయం వద్ద ఆదివారం ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఓ వ్యక్తి గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మహుర్ టౌన్ పోలీసులకు సమాచారమివ్వగా వారు నిందితుడిని గుర్తించారు. తిరుమల అదనపు ఎస్పీ కె.ఎస్.మహేశ్వర్ రాజు, సీఐ రామకృష్ణ నాందేడ్ వెళ్లి చిన్నారిని గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం తిరుపతిలో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. తిరుపతిలో మంగళవారం అర్బన్ జిల్లా ఎస్పీ కె.కె.ఎన్.అన్బురాజన్ విలేకరుల సమావేశంలో కేసును పరిష్కరించిన తీరును వివరించారు. మరోవైపు కానిస్టేబుళ్లకు పదోన్నతులు ఇచ్చినందుకు సోమవారం విజయవాడలో పోలీసులు తనకు చేసిన సన్మానం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాన్ని ప్రస్తావించి పోలీసుల పనితీరును ప్రశంసించారు.

వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడని

నిందితుడు విశ్వంభర్‌ది తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా రాంనగర్ అని పోలీసు విచారణలో తేలింది. ఇతని మానసిక పరిస్థితి బాగా లేనందున పెళ్లి కాలేదు. అప్పుడప్పుడూ సొంతూరు ఎడపల్లికి వస్తూ.. నెలల తరబడి ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. దీంతో కుటుంబీకులు అతడిని వదిలేశారు. రెండు, మూడు నెలలకోసారి తిరుమలకు వస్తూ చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతుండేవాడు. తాజా కేసులోనూ తాను ఒంటరివాడిని కావడంతో వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడని బాలుడిని అపహరించినట్లు విశ్వంభర్ చెప్పాడని ఎస్పీ వెల్లడించారు.

ఛాంపియన్



పంత్.. ఆ మాటను నిజం చేశాడు

సిడ్నీ: "నువ్వు మా పిల్లల్ని ఆడించు.. నేను, నా భార్య కలిసి సినిమాకెళ్తాం".. మెల్‌బోర్న్ టెస్టులో టీమ్‌ఇండియా యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ బ్యాటింగ్ చేస్తుండగా.. ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పైన్ అతడితో అన్న మాటలివి. పంత్ ఏకాగ్రతను దెబ్బ తీసే వ్యూహంలో భాగంగా పైన్ అతడిని కవ్వించాడు. బిగ్ బాష్ లీగ్‌లో హోబర్ట్ లయన్స్‌కు ఆడాలని.. హోబర్ట్‌కు వచ్చినపుడు తన పిల్లల్ని ఆడిస్తుంటే తాను భార్యతో కలిసి సినిమాకు వెళ్తానని సరదాగా అన్నాడు పైన్. ఐతే పంత్ ఇప్పుడు ఆ మాటల్నే నిజం చేశాడు. పైన్ పిల్లల్ని ఎత్తుకుని ఆడించాడు. మంగళవారం భారత్, ఆసీస్ జట్లు.. ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్‌ను కలిశాయి. పైన్ కుటుంబంతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరు కాగా.. అతడి భార్యా పిల్లల్ని పంత్ కలిశాడు. వారితో కలిసి ఫొటో దిగాడు. ఇది సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అవుతోంది. పైన్ కవ్వింపులకు బదులుగా పంత్ సైతం అతడిని స్లెడ్జ్ చేశాడు. పైన్ బ్యాటింగ్ చేస్తుండగా.. అతను 'తాత్కాలిక కెప్టెన్' అని.. మాటలు తప్ప చేతలు ఉండవని పంత్ రెచ్చగొట్టేలా మాట్లాడాడు.



కోహ్లి అలా.. ధోని ఇలా...

ముంబయి: ప్రపంచకప్ నేపథ్యంలో టీమ్‌ఇండియా ఫాస్ట్ బౌలర్లకు ఐపీఎల్ నుంచి విశ్రాంతి నివ్వాలన్న కెప్టెన్ కోహ్లి అభిప్రాయంతో ధోని విభేదించాడు. ఐపీఎల్‌లో ఆడితే బౌలర్లకు మేలే జరుగుతుందని చెప్పాడు. "నాలుగు ఓవర్లకే బౌలర్ అలసిపోడు. నిజం చెప్పాలంటే ఆ నాలుగు ఓవర్లు బౌలర్‌ను ఉత్తమ స్థితిలో ఉంచుతాయి. యార్కర్లు వేయడం, వైవిధ్యంతో బౌలింగ్ చేయడం, ఒత్తిడిలో ఆడడం బౌలర్‌ను సన్నద్ధతతో ఉంచుతాయి. బౌలర్లు ఐపీఎల్ మొత్తం ఆడొచ్చన్నది నా అభిప్రాయం. ఐతే తిండి, నిద్ర విషయంలో జాగ్రత్తగా ఉండాలి" అని ధోని అన్నాడు. ఐపీఎల్ నుంచి ఫాస్ట్ బౌలర్లకు విశ్రాంతినివ్వాలని లేదా కొన్ని మ్యాచ్‌లకు పరిమితం చేయాలని కోహ్లి బీసీసీఐ పరిపాలకుల కమిటీ (సీఓఏ)ని కోరిన సంగతి తెలిసిందే.

2020 టీ20 ప్రపంచకప్‌కు అఫ్గాన్ అర్హత

దుబాయ్: సంచలన విజయాలతో వేగంగా ఎదుగుతున్న పసికూన అఫ్గానిస్థాన్ 2020 టీ20 ప్రపంచకప్ సూపర్-12కు అర్హత సాధించింది. మాజీ ఛాంపియన్ శ్రీలంక, బంగ్లాదేశ్ మాత్రం 12 జట్ల ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సంపాదించలేకపోయాయి. తొలి ఎనిమిది ర్యాంకుల్లో ఉన్న పాకిస్థాన్, భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్‌తో పాటు అఫ్గాన్ ప్రపంచకప్ సూపర్-12లో నేరుగా చోటు దక్కించుకున్నాయని ఐసీసీ తెలిపింది. శ్రీలంక, బంగ్లాదేశ్‌తో పాటు రెండు శాశ్వత సభ్య దేశాలైన ఐర్లాండ్, జింబాబ్వే ప్రపంచకప్‌లో ముందుగా గ్రూప్ దశలో ఆడాల్సివుంటుంది. ఈ దశలో ఈ జట్లు ఐసీసీ టీ20 ప్రపంచకప్ క్వాలిఫయర్ ద్వారా వచ్చిన జట్లతో పోటీపడాలి.



భరత్

రికీ, భరత్ సెంచరీలు

ఈనాడు, విజయనగరం: హైదరాబాద్‌తో రంజీ ట్రోఫీ గ్రూప్-బి మ్యాచ్‌లో ఆంధ్ర భారీ స్కోరు సాధించింది. రికీ భుయ్ (129; 248 బంతుల్లో 14×4, 2×6), శ్రీకర్ భరత్ (178 నాటౌట్; 277 బంతుల్లో 22×4, 2×6) సెంచరీలతో కదంతొక్కడంతో ఆంధ్ర.. 502/7 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. 231 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సంపాదించింది. హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 33 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకోవాలంటే హైదరాబాద్ మరో 198 పరుగులు సాధించాలి. బుధవారం మ్యాచ్‌కు చివరి రోజు.



ఆ అద్భుత క్షణాలు చూస్తామా!

11 సిడ్నీలో ఆస్ట్రేలియాతో భారత్ ఆడిన టెస్టులు. ఐదు మ్యాచ్‌లు ఓడి.. ఐదు డ్రా చేసుకుంది. ఒక మ్యాచ్‌లో మాత్రమే గెలిచింది. 1978లో ఆతిథ్య జట్టును భారత్ ఇన్నింగ్స్ 2 పరుగుల తేడాతో ఓడించడం విశేషం.

20 సిరీస్‌లో బుమ్రా వికెట్లు. సగటు 14.65. సిరీస్‌లో అతనే అత్యధిక వికెట్ల వీరుడు. 17 వికెట్లతో ఆసీస్ స్పిన్నర్ లైయన్ రెండో స్థానంలో ఉన్నాడు.

ఆస్ట్రేలియాలో సిరీస్ విజయం.. ఇది దశాబ్దాల కల! ప్రతిసారీ వెళ్లడం.. ఉత్త చేతులతో రావడం.. ఇదీ వరస! విజయం గురించి ఆలోచించడం ఆలోచించడం మానేసి.. సిరీస్ డ్రా చేసుకుంటేనో లేదా కొంచెం గౌరవప్రదంగా ఓడితేనో సంతృప్తి పడే పరిస్థితి. కానీ ఈసారి కథ మారింది. కంగారూ గడ్డపై చారిత్రక విజయానికి టీమ్‌ఇండియా అత్యంత చేరువగా నిలిచింది.

2-1.. ఆస్ట్రేలియాలో నాలుగు టెస్టుల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు అయ్యేసరికి భారత్ ఇలా ఆధిక్యంలో ఉండటం నమ్మశక్యం కాని విషయం! కానీ ఈసారి అది సాధ్యమైంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సిరీస్‌లో ఆధిక్యంతో చివరి టెస్టులో అడుగు పెడుతోంది టీమ్‌ఇండియా. సిడ్నీలో మ్యాచ్‌ను డ్రాగా ముగించినా.. సిరీస్ మనదే. ఐతే కోహ్లీసేన ఇప్పుడున్న ఊపులో చివరి టెస్టునూ నెగ్గి తిరుగులేని ఆధిక్యంతో చారిత్రక సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంటుందన్నది అభిమానుల ధీమా! మరి సిడ్నీ టెస్టు ముగింపులో ఆ అద్భుత క్షణాలు చూస్తామా?

గురువారం ఉదయం 5 గంటల నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

- చారిత్రక విజయంపై కోహ్లీసేన కన్ను
- రేపట్నుంచే సిడ్నీలో చివరి టెస్టు

సిడ్నీ

ఆస్ట్రేలియాపై ఆస్ట్రేలియాలో సిరీస్ విజయం సాధించే సువర్ణావకాశాన్ని సృష్టించుకున్న కోహ్లీసేన.. ఉరకలెత్తే ఉత్సాహంతో సిడ్నీ టెస్టుకు సిద్ధమైంది. నాలుగు టెస్టుల సిరీస్ చివరి మ్యాచ్ గురువారమే సిడ్నీలో ఆరంభం కాబోతోంది. అడిలైడ్‌లో విజయంతో సిరీస్‌ను గొప్పగా ఆరంభించి.. పెర్త్‌లో ఎదురు దెబ్బ తిన్నప్పటికీ.. మెల్‌బోర్న్‌లో మళ్లీ పుంజుకుని ఘనవిజయం సాధించిన భారత్.. అదే ఊపులో సిడ్నీనీ జయించాలనుకుంటోంది. గత మ్యాచ్‌లో ఇరు జట్ల ప్రదర్శన ప్రకారం చూస్తే ఈ మ్యాచ్‌లో కోహ్లీసేనే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు.

అన్నీ ఆశాజనకమే: పెర్త్ టెస్టు ఓటమి తర్వాత మెల్‌బోర్న్‌లో టీమ్‌ఇండియా పుంజుకున్న తీరు అమోఘం. ఓవైపు ఓపెనర్ల ఘోర వైఫల్యం.. మరోవైపు అశ్విన్ గాయం.. సెలక్షన్ తప్పిదాలు.. అన్నీ కలిసి రెండో టెస్టులో భారత్ కొంపముంచాయి. ఐతే మెల్‌బోర్న్ అన్నీ సర్దుకున్నాయి. అరంగేట్ర టెస్టులోనే మయాంక్ అగర్వాల్ గొప్ప ఆటతీరుతో ఓపెనింగ్ సమస్య తీర్చాడు. విహారి పెద్దగా పరుగులు చేయకున్నా.. అతడికి బాగానే సహకరించాడు. మరోవైపు పుజారా, కోహ్లి అసాధారణ పట్టుదలతో బ్యాటింగ్ చేసి భారీ స్కోరుకు బాటలు వేయగా.. రోహిత్, పంత్ సైతం తమ వంతు బాధ్యత నిర్వర్తించడంతో ఈ ఏడాది విదేశీ పర్యటనల్లో తన అత్యుత్తమ స్కోరును సాధించగలిగింది భారత్. మరోవైపు బుమ్రా సహా బౌలర్లందరూ చక్కటి ప్రదర్శన కొనసాగించి భారత్‌కు గొప్ప విజయాన్ని కట్టబెట్టారు. మెల్‌బోర్న్‌లో సమష్టి ప్రదర్శన టీమ్‌ఇండియా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసేదే. ఇదే తరహాలో అందరూ బాధ్యత తీసుకుంటే సిడ్నీలో గెలుపు కష్టమేమీ కాదు. మరోవైపు ఆస్ట్రేలియా పరిస్థితి పూర్తి భిన్నం. స్మిత్, వార్నర్ వస్తే తమ జట్టు బలోపేతం అవుతుందని కెప్టెన్ పైన్ అంటున్నాడంటే.. ఆ జట్టు ఆత్మవిశ్వాసం ఏ స్థాయికి పడిపోయిందో అర్థం చేసుకోవచ్చు. బ్యాట్స్‌మెన్ ఘోర వైఫల్యం ఆ జట్టును కలవర పెడుతోంది. ఓపెనర్లు ఫించ్, హారిస్.. మూడో నంబర్ ఆటగాడు ఖవాజాల వైఫల్యం జట్టుకు పెద్ద సమస్యగా మారింది. షాన్ మార్ష్, టిమ్ పైన్ కూడా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నారు. ఇన్నింగ్స్ బాగానే ఆరంభిస్తున్నప్పటికీ.. పెద్ద స్కోర్లు చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారు భారత బౌలర్లు. బ్యాట్స్‌మెన్ అందరూ విఫలమవుతుండటంతో ఎవరిని తీయాలో.. ఎవరిని ఉంచాలో తెలియట్లేదు. కెరీర్ అత్యుత్తమ ఫామ్ అందుకున్న బుమ్రాను ఎదుర్కోవడం కంగారూ బ్యాట్స్‌మెన్‌కు సవాలే. సిడ్నీ పిచ్ పేసర్లకు ఏమాత్రం సహకరించినా బుమ్రాను ఆపడం కష్టమే. ఐతే ఆస్ట్రేలియా బౌలింగ్ మాత్రం ఎప్పుడూ ప్రమాదకరమే కాబట్టి.. భారత బ్యాట్స్‌మెన్ మరోసారి బాధ్యతతో ఆడాలి. టాప్, మిడిలార్డర్‌లను దెబ్బ తీస్తున్న బౌలర్లు ప్రత్యర్థి తోకను తెంచే విషయంలో సరైన ప్రణాళికలతో బరిలోకి దిగాల్సి ఉంది.



ఒక్కడే వచ్చి..

గాయం కారణంగా ఆస్ట్రేలియాతో 2, 3 టెస్టులకు దూరమైన భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మళ్లీ తుది జట్టులోకి వచ్చేందుకు గట్టిగానే శ్రమిస్తున్నాడు. దాదాపుగా పూర్తి ఫిట్‌నెస్ సంతరించుకున్న అతను.. సిడ్నీ టెస్టు ముంగిట ఐచ్ఛిక సాధనలో పాల్గొన్నాడు. నూతన సంవత్సర వేడుకల్లో ఉన్న మిగతా జట్టు సభ్యులు ఈ సెషన్‌కు దూరంగా ఉన్నారు. కానీ అశ్విన్ మాత్రం ఫిజియోతో కలిసి మైదానానికి వచ్చాడు. గంటకు పైగా మైదానంలో చెమటోడ్చాడు.

ఇరు జట్లూ ఇద్దరు స్పిన్నర్లతో?: సిడ్నీ పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుందన్న అంచనాలున్నాయి. అందుకే ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌కు స్పిన్ ఆల్‌రౌండర్ మార్నస్ లబుషేన్‌ను ఎంచుకుంది. ఫించ్‌పై వేటు వేసి అతడి స్థానంలో షాన్ మార్ష్‌ను ఓపెనింగ్‌లో ఆడిస్తారంటున్నారు. ఖాళీ పడే స్థానంలోకి లబుషేన్ వస్తాడు. ఆస్ట్రేలియా ఇద్దరు స్పిన్నర్లు ఎంచుకోవడం ఖాయమైతే.. భారత్ అలాగే చేయొచ్చు. భార్య ప్రసవించడంతో స్వదేశానికి వెళ్లిన రోహిత్ స్థానంలో.. అశ్విన్ రావచ్చు. మెల్‌బోర్న్‌లో సత్తా చాటిన జడేజాతో పాటుగా అశ్విన్‌ను ఆడించొచ్చు.

నన్ను పిలవలేదు.. ఎలా వచ్చేది?



సిడ్నీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే టెస్టు సిరీస్ గెలిచిన జట్టుకు బోర్డర్-గావస్కర్ ట్రోఫీని ప్రదానం చేస్తారన్న సంగతి తెలిసిందే. సిరీస్ భారత్‌లో జరిగినా, ఆస్ట్రేలియాలో జరిగినా.. ముగింపు రోజు బహుమతి ప్రదానోత్సవానికి అలెన్ బోర్డర్, సునీల్ గావస్కర్ ఇద్దరూ వస్తారు. ఐతే ఆస్ట్రేలియాలో ప్రస్తుతం జరుగుతున్న సిరీస్ ముగింపు నాడు గావస్కర్ హాజరయ్యే అవకాశాలు కనిపించడం లేదు. క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి తనకు ఆహ్వానం అందకపోవడమే అందుక్కారణమని సన్నీ చెప్పాడు. "ఈ ట్రోఫీ ప్రదానోత్సవానికి రావడం కుదురుతుందా అని మే నెలలోనే క్రికెట్ ఆస్ట్రేలియా సీఈఓ జేమ్స్ సదర్లాండ్ అడిగాడు. సంతోషంగా వస్తా అని చెప్పా. కానీ తర్వాత సదర్లాండ్ పదవి నుంచి దిగిపోయాడు. ఆపై నన్నెవరూ సంప్రదించలేదు" అని గావస్కర్ అన్నాడు. సిడ్నీ టెస్టు గురువారమే ఆరంభం కాబోతోంది. మరి ఈ లోపు సీఏ ప్రతినిధులు గావస్కర్‌కు అధికారిక ఆహ్వానం పంపి బహుమతి ప్రదానోత్సవానికి రప్పిస్తారేమో చూడాలి. రెండేళ్ల కిందట భారత్‌లో ఆస్ట్రేలియాపై సిరీస్ గెలవడంతో బోర్డర్-గావస్కర్ ట్రోఫీ భారత్ వద్దే ఉంది. చివరి టెస్టులో ఆస్ట్రేలియా గెలిచినా సిరీస్ 2-2తో డ్రా అవుతుంది కాబట్టి ట్రోఫీ మళ్లీ భారత్‌కే సొంతం కానుంది.

సైనాపై సింధు పైచేయి

హైదరాబాద్ హంటర్స్ విజయం



పుణె: కొత్త ఏడాదిని పీవీ సింధు విజయంతో ఆరంభించింది. ఆమె సైనా నెహ్వాల్‌పై విజయం సాధించింది. సింధు జట్టు హైదరాబాద్ హంటర్స్ 5-0తో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌ను ఓడించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. పీబీఎల్‌లో హైదరాబాద్‌కు ఇది మూడో విజయం. మంగళవారం జరిగిన పోరులో మొదట మిక్స్‌డ్ డబుల్స్‌లో కిమ్ సా రంగ్, హైవన్ జోడీ 8-15, 14-15తో కిమ్ మిన్ చున్, లీ (వారియర్స్) చేతిలో ఓడిపోవడంతో హైదరాబాద్ వెనుకబడిపోయింది. ఐతే వెంటనే లీ హ్యూన్ (ట్రంప్ మ్యాచ్) 10-15, 15-13, 15-9తో సయెన్సోబూన్సక్ (వారియర్స్)పై నెగ్గడంతో ఆధిక్యం సంపాదించింది. తర్వాతి మ్యాచ్‌లో పీవీ సింధు (హైదరాబాద్) 11-15, 15-9, 15-5తో సైనాపై గెలిచింది. నాలుగో మ్యాచ్‌ను వారియర్స్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకుంది. కానీ ఓడిపోయింది. కాల్‌జౌ 15-11, 15-14తో హోవీ (వారియర్స్)పై నెగ్గి హైదరాబాద్ ఆధిక్యాన్ని పెంచాడు. చివరగా పురుషుల డబుల్స్‌లో ఇసారా- కిమ్ సా రంగ్ ద్వయం (హైదరాబాద్) 15-10, 12-15, 15-14తో సియోంగ్-చున్ జంట (వారియర్స్)పై విజయం సాధించింది.



మంగళవారం ఆస్ట్రేలియా ప్రధానమంత్రి స్కాట్ మోరిసన్‌ను కలిసిన భారత క్రికెట్ జట్టు సభ్యులు

అశ్విన్‌ను తీసుకోవాలి

వీవీఎస్ లక్ష్మణ్

బాక్సింగ్ డే టెస్టులో భారత్ అద్భుతంగా ఆడింది. పెర్త్ ఓటమి నుంచి తేరుకుని గొప్పగా పుంజుకుంది. కోహ్లి ఎంతో ముఖ్యమైన టాస్ గెలిచాడు. కానీ టాస్ ఆరంభం మాత్రమే. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆద్యంతం నియంత్రణతో ఆడింది. బౌలర్లు మరోసారి అసాధారణ ప్రదర్శన చేశారు. బుమ్రా తన పదునైన పేస్‌తో గొప్పగా బౌలింగ్ చేశాడు. టెస్టు క్రికెట్లో అతడు ఎదిగిన తీరు అద్భుతం. అతడికి ఎక్కువ వికెట్లు పడి ఉండొచ్చు

కానీ.. హవా అతడిదొక్కడిదే కాదు. మిగతా ముగ్గురు బౌలర్లు ఇషాంత్ శర్మ, షమి, జడేజా కూడా చక్కగా బౌలింగ్ చేశారు. మెల్‌బోర్న్‌లో పుజారా, కోహ్లి హీరోలే కానీ.. మయాంక్ అగర్వాల్‌ను ఎంత పొడిగినా తక్కువే. అరంగేట్రంలోనే అతడు చాలా గొప్పగా బ్యాటింగ్ చేశాడు. సిడ్నీలో టర్నింగ్ పిచ్ సిద్ధమవుతున్నట్లనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అశ్విన్‌ను తుది జట్టులోకి తీసుకుంటే స్పిన్ విభాగం బలోపేతం కావడమే కాదు.. పేస్ బౌలర్లపై పని ఒత్తిడి తగ్గుతుంది. అశ్విన్ విదేశాల్లో బ్యాటుతోనూ రాణించగలడు.

కాదు.. కుల్‌దీప్‌నే!

డీన్ జోన్స్

ఊహించినట్లే మెల్‌బోర్న్ మూడో టెస్టులో టీమ్‌ఇండియా నెగ్గింది. టెస్టు క్రికెట్ చరిత్రలో ఒక ఏడాదిలో అత్యధిక వికెట్లు తీసిన పేస్ త్రయంగా ఇషాంత్, షమి, బుమ్రా రికార్డు సృష్టించారు. టీమ్‌ఇండియా జట్టులో సగం మందికి అనుభవం లేకపోయినా సంపూర్ణ ఆధిపత్యంతో నెగ్గిన తీరు ఆకట్టుకుంది. ఆస్ట్రేలియాలో సిరీస్ విజయం ఎప్పటికీ ప్రత్యేకమే. ఆ సువర్ణా

వకాశం ఇప్పుడు విరాట్ కోహ్లి ముందుంది. సిడ్నీ పిచ్ పొడిగా ఉండి స్పిన్‌కు అనుకూలిస్తుంది. మిచెల్ మార్ష్ స్థానంలో మార్నస్‌ను ఆసీస్ ఆడిస్తుంది. ఐతే టీమ్‌ఇండియా తుదిజట్టులో మార్పులు చేస్తుందా? అన్నదే ప్రశ్న. నేనైతే జడేజా, కుల్‌దీప్‌లతో ఆడేందుకే ఇష్టపడతా. మెల్‌బోర్న్‌లో జడేజా చక్కగా బౌలింగ్ చేశాడు. ఆసీస్ బ్యాట్స్‌మెన్ లెగ్ స్పిన్‌ను కూడా సరిగా ఆడలేరు. అందుకే కుల్‌దీప్‌ను తీసుకోవాలి.

యమునా తటిపై కువకువల సవ్వడి



దిల్లీలోని యమునా నదిపై వలస పక్షులు ఇలా చూపరులను కట్టిపడేశాయి. 'గల్స్'గా పిలిచే ఈ బహుదూరపు బాటసారులు శీతాకాలంలో మధ్య ఆసియా నుంచి వస్తుంటాయి.

మరుగుదొడ్డే ఆవాసం..!



ముదిమి మీదపడిన వయసులో ఆ అభాగ్యురాలికి నిలువ నీడ లేకపోవడంతో నాలుగేళ్లుగా మరుగుదొడ్డిలోనే జీవనం సాగిస్తోంది. మధ్యప్రదేశ్ జబల్‌పుర్‌లోని నునియాకలా గ్రామానికి ఎవరు వెళ్లినా అత్యంత దుర్భర స్థితిలో ఉన్న సాతోబాయి కనిపిస్తుంది. కొన్నేళ్ల క్రితం సాతోబాయికి ఓ చిన్న ఇల్లు ఉండేది. అది కాస్తా వర్షాలకు కూలిపోవడంతో ఆ తర్వాత ఆమె కుమారుడు ఆమెను, ఊరిని వదిలేసి తనదారి తాను చూసుకున్నాడు. అప్పటి నుంచీ వానకు తడుస్తూ, చలికి వణుకుతూ సాతోబాయి ప్రభుత్వం నిర్మించిన ఓ చిన్న మరుగుదొడ్డిలోనే నివసిస్తోంది. దొరికింది తింటూ కాలం వెళ్లదీస్తోంది. తనకు సాయం చేసి ఆదుకోవాలంటూ ఆమె సర్పంచికి విన్నవించినా ఫలితం లేకపోయింది. గ్రామానికి వచ్చిపోయే వారందరికీ మొర పెట్టుకుంటున్నా ఆలకించేవారే లేరు. కాగా 'ఈటీవీ భారత్' చొరవతో సాతోబాయి కథ జబల్‌పుర్ జిల్లా కలెక్టర్ ఛవిభరద్వాజ్ దృష్టికి వెళ్లింది. బాధితురాలికి అండగా ఉంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సర్పంచి నుంచి కలెక్టర్ వరకు కీలక పదవుల్లో ఉన్నవారంతా మహిళలే. మరి సాతోబాయిని ఎలా ఆదుకుంటారో చూడాలి.

- ఈటీవీ భారత్

హస్తిన ఉక్కిరిబిక్కిరి



నూతన సంవత్సరం తొలి రోజున వాహనాలతో కిక్కిరిసిన దిల్లీలోని కనాట్ కూడలి

మానవత్వం మంట గలిసింది

కన్నకూతురుకే నిప్పంటించాడు

పాల్‌గఢ్: కన్నబిడ్డతో మాటామాటా పెరగడంతో ఆ తండ్రి విచక్షణ కోల్పోయాడు. మమకారాన్ని మరిచిపోయి కుమార్తెకు నిప్పంటించాడు. కూతురు మొబైల్‌ఫోన్‌కు బానిసగా మారిందన్న కోపంతో అతను ఈ దారుణానికి ఒడిగట్టగా ఆమె చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతోంది. మహారాష్ట్రలోని పాల్‌గఢ్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ టీనేజీ బాలిక(16) తరచూ మొబైల్ ఫోన్‌తోనే గడుపుతుండటంతో ఈ విషయమై ఆమెకు, ఆమె తండ్రి మహమ్మద్ మన్సూరీకి మధ్య వాగ్యుద్ధం జరిగింది. కోపంతో అతను ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఇరుగు పొరుగు వారు హుటాహుటిన ఆమెను ఆసుపత్రికి తరలించారు. 70 శాతం కాలిపోవడంతో ఆమె ముంబయిలోని జేజే ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు హత్యా నేరం నమోదు చేశారు.

రోగిని చెత్తకుప్పలో పడేశారు!

దిల్లీ: ఆసుపత్రి అంటే ప్రాణాలు కాపాడే ఆలయంగా అంతా భావిస్తారు. అలాంటి చోట ఓ రోగిని అమానవీయంగా చెత్తకుప్పలోకి నెట్టేసిన దారుణం బిహార్‌లో వెలుగు చూసింది. వైశాలి జిల్లాలోని హాజీపుర్ సాదర్ ఆసుపత్రిలో ఈ ఘటన చోటుచేసుకుంది. మరో ఆసుపత్రి వైద్యులు రోగిని ఇక్కడికి పంపించగా అతనికి సేవలందించాల్సింది పోయి, ఓ ఉద్యోగి అమానుషంగా వ్యవహరించాడు. కాలిన గాయాల వార్డు నుంచి వార్డుబాయ్ అతన్ని చెత్తకుప్పలోకి తోసేయడంతో నిస్సహాయంగా పడిపోయాడు. ఈ ఘటన బిహార్‌లో సంచలనం రేపింది. సుమోటోగా తీసుకున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) బిహార్ ప్రభుత్వానికి మంగళవారం నోటీసు ఇచ్చింది. 4 వారాల్లోగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఇది ఆసుపత్రి నిర్లక్ష్యమేనని ఎన్‌హెచ్ఆర్సీ మండిపడింది.



కొచ్చిలో రహదారి పక్కన మహిళలు, సామాజిక కార్యకర్తల మానవహారం

అంతరాలను తుంచి... అసమానతలను చెరిపి...

సమానత్వ సాధనకు ఎలుగెత్తిన మహిళాలోకం ● 620 కి.మీ. మేర మానవహారం

తిరువనంతపురం: స్త్రీ-పురుషుల సమానత్వానికి ప్రతీకగా పేర్కొంటూ సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం నిర్వహించిన 620 కిమీ పొడవైన మానవహారంలో లక్షలమంది మహిళలు పాల్గొన్నారు. సుమారు 50 లక్షల మంది మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె. బాలకృష్ణన్ తెలిపారు. పలుచోట్ల పెద్దఎత్తున క్రైస్తవులు, ముస్లింలు పాల్గొన్నారన్నారు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన విన్యాసాలను నమోదు చేసే విశ్వ నమోదు సంఘం(యూఆర్ఎఫ్) మాత్రం 35 లక్షలమందికి పైగా పాల్గొన్నట్లు చెబుతోంది. కేరళ ఉత్తర భాగంలోని కాసరగాడ్‌లో ప్రారంభమైన 'విమెన్ వాల్'.. దక్షిణభాగంలోని తిరువనంతపురంలో గల 'వెల్లయంబాలమ్' వరకు సముద్రతీరం వెంబడి రహదారుల మీదుగా కొనసాగింది. మహిళలతో పాటు బాలికలు సైతం మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి చేయిచేయి కలిపారు. మహిళలకు సంఘీభావంగా పలుచోట్ల పురుషులు కూడా వీరికి సమాంతరంగా మానవహారాలుగా నిల్చున్నారు. కాసరగాడ్‌లో ప్రారంభమైన మానవహారానికి కేరళ ఆరోగ్య మంత్రి కె.కె.శైలజ నేతృత్వం వహించగా, వెల్లయంబాలమ్‌లో చిట్టచివరి మహిళగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారాట్ నిల్చున్నారు. వెల్లయంబాలమ్‌లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొన్నారు. భాజపాకు గట్టి పట్టు ఉన్న చెట్టుకుండ్‌లో కొందరు భాజపా-ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు.. పోలీసులపై రాళ్లు విసరడంతో ముగ్గురు గాయపడ్డారు.

నాయర్ల సంఘం హెచ్చరిక

శబరిమల ఆలయం ఆచారాలు, సంప్రదాయాలను కాపాడటానికి ఎంతకైనా తెగిస్తామని నాయర్ సేవా సంఘం(ఎన్ఎస్ఎస్) హెచ్చరించింది. ముఖ్యమంత్రి విజయన్‌పై ధ్వజమెత్తింది. ప్రభుత్వ ఉద్యోగులను బలవంతంగా మానవహారంలో పాల్గొనేలా ఒత్తిడి చేశారని కాంగ్రెస్ ఆరోపించింది. ఇది మానవహారం కాదు.. కులగోడ అని విమర్శించింది.

2020 వరకూ గృహ రుణాలపై
వడ్డీ రాయితీ

- తొలిసారి కొనుగోలుచేసే పట్టణ వాసులకు వర్తింపు
- కేంద్రం నిర్ణయం

దిల్లీ: తొలిసారి ఇల్లు కొనుక్కొనే పట్టణ వాసులకు గృహ రుణాలపై వడ్డీ రాయితీ పథకాన్ని (సీఎల్ఎస్ఎస్‌ను) కేంద్ర ప్రభుత్వం 2020 మార్చి వరకూ పొడిగించింది. లబ్ధిదారుల వార్షికాదాయం రూ.6-18 లక్షల మధ్య ఉండేవారికి ఇది వర్తిస్తుంది. ఈ పథకం ద్వారా- ఇల్లు కొనుక్కోవడానికి, నిర్మించుకోవడానికి లేదా పాత ఫ్లాట్‌ను కొనేందుకు వారు రూ.2.5 లక్షల వరకూ ఆర్థిక సాయం అందుకోవచ్చు. కేంద్ర గృహ నిర్మాణశాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ మంగళవారమిక్కడ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటివరకూ 93 వేల మంది మధ్యతరగతి వారు సీఎల్ఎస్ఎస్ ద్వారా రూ.1,960 కోట్ల మేర గృహ రుణాలపై వడ్డీ రాయితీ పొందారని మంత్రి చెప్పారు. ఈ ఏడాది చివరినాటికి లబ్ధిదారుల సంఖ్య లక్ష వరకూ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



సుధీర్ భార్గవతో మంగళవారం ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

సీఐసీగా సుధీర్ భార్గవ ప్రమాణం

దిల్లీ: కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ)గా సుధీర్ భార్గవతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ప్రమాణం చేయించారు. కొత్తగా సమాచార కమిషనర్లుగా నియమితులైన మాజీ ఐఎఫ్ఎస్ అధికారి యశ్వర్ధన్ కుమార్ సిన్హా, మాజీ ఐఆర్ఎస్ అధికారి వనజ ఎన్ సర్నా, మాజీ ఐఏఎస్ అధికారి నీరజ్ కుమార్ గుప్తా, న్యాయశాఖ మాజీ కార్యదర్శి సురేశ్ చంద్ర కూడా రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణం చేశారు.

చంద్రయాన్-2 ప్రయోగంపై త్వరలో నిర్ణయం

బెంగళూరు: చంద్రుడి ఉపరితలంపైకి భారత్ ప్రతిష్ఠాత్మకంగా పంపుతున్న చంద్రయాన్-2 వ్యోమనౌక ప్రయోగం ముందుగా అనుకున్న విధంగా ఈ నెల 3న జరగడంలేదు. ఈ వ్యోమనౌక ప్రయోగానికి ఈ ఏడాదిలో అనువైన కాలం గురువారం మొదలవుతుంది. గత ఏడాది అనేక అంతరిక్ష ప్రయోగాలు చేపట్టాల్సి రావడం చంద్రయాన్ కసరత్తుపై ప్రభావం పడిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ కె.శివన్ తెలిపారు.



హద్దులు చెరిపిన వేడుక

నూతన సంవత్సర వేడుకలను భారత్, చైనా బలగాలు సంయుక్తంగా నిర్వహించాయి. సిక్కింలోని నాథూలా పాస్‌లో రెండు దేశాల జవాన్లు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. భారత్, చైనా సరిహద్దు భద్రతా దళాల సమావేశమూ జరిగింది. అరుణాచల్‌లోని బమ్లా వద్ద కూడా రెండు దేశాల సైనికులు వేడుకల్లో పాల్గొన్నారు.

మోదీతో దేశానికి కలిగిన లాభమేంటి?

- చర్చకు సిద్ధమని ప్రధానికి ఏపీ సీఎం చంద్రబాబు సవాల్
- మోదీ, కేసీఆర్, జగన్ మధ్యే బలమైన బంధం కనిపిస్తోందని వ్యాఖ్య
- ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడుందని ఎద్దేవా

ఈనాడు, అమరావతి: 'ప్రధాని మోదీ ఈ దేశానికి ఏం చేశారు? ఆయన ఏ విషయంలో సఫలమయ్యారు? ఆయనవల్ల ఈ దేశానికి కలిగిన లాభం ఏంటి? అనే అంశాలపై చర్చకు సిద్ధమా?' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సవాలు విసిరారు. జాతీయస్థాయిలో ప్రతిపక్షాల కూటమిని విఫల ఆలోచనగా కేంద్ర మంత్రి జైట్లీ, మహాకూటమి గురించి చర్చించాల్సిన అవసరమే లేదన్నట్లుగా ప్రధాని వ్యాఖ్యానించడం పట్ల ఆయన మండిపడ్డారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌లో మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్ భాగస్వాములన్నట్లుగా జైట్లీ చెప్పడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండవల్లిలో మంగళవారం ఆర్థిక రంగంపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా సీఎం విలేకరులతోమాట్లాడారు. 'దేశంలో రెండే కూటములున్నాయి.



వాటిలో ఒకటి భాజపా నేతృత్వంలోని ఎన్‌డీయే, రెండోది కాంగ్రెస్, ఇతర పార్టీలది. మమతా సహా మేమంతా ఈ కూటమిలోనే ఉన్నాం' అని బాబు స్పష్టం చేశారు.

ఆ ముగ్గురి మధ్యే గట్టి అనుబంధం..

మీరు మోదీ, కేసీఆర్, జగన్ గురించే మాట్లాడుతున్నారు తప్ప, పవన్ గురించి ప్రస్తావించడం లేదు. ఆయన వారికి దూరంగా ఉన్నారని భావిస్తున్నారా? అన్న ప్రశ్నకు... 'ఆయన దూరంగా ఉన్నారని నేను చెప్పడం లేదు. దూరంగా ఉన్నదీ లేనిదీ ఆయన నిరూపించుకోవాలి' అని బదులిచ్చారు. వచ్చే ఎన్నికల్లో పవన్, మీరు కలిసి పోటీ చేయబోతున్నారని వైకాపా అధ్యక్షుడు జగన్ అంటున్నారు కదా? అన్న ప్రశ్నకు... 'ఆయనకు బాధేముంది.. ఒక వేళ పోటీ చేస్తే? ముందు జగన్ భాజపాతో కలుస్తున్నాడో లేదో చెప్పాలి. సంకేతాలు చూస్తుంటే... మోదీ, కేసీఆర్, జగన్ మధ్య అనుబంధం కనిపిస్తోంది' అని చంద్రబాబు బదులిచ్చారు. పవన్ వచ్చి మీతో చేతులు కలుపుతానంటే స్వాగతిస్తారా? అన్న ప్రశ్నకు... ఊహాజనిత ప్రశ్నలకు జవాబివ్వబోనని పేర్కొన్నారు. ఫెడరల్ ఫ్రంట్‌ను మీరు గుర్తిస్తున్నారా? అన్న ప్రశ్నకు... 'అసలు ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడుంది? మోదీ, జైట్లీ దాన్ని ప్రమోట్ చేస్తున్నారు. ఫెడరల్ ఫ్రంట్‌లో చేరుతున్నట్లు మమతగానీ, నవీన్ పట్నాయక్ గానీ ఒక్క మాట మాట్లాడారా?' అని ప్రశ్నించారు.

కేసీఆర్ మిమ్మల్ని అసభ్యంగా తిట్టినా బాధలేదా?

'కేసీఆర్ అసభ్యపదజాలంతో తిట్టినా, ఫాసిస్ట్ ప్రధాని... అన్నా మీకు బాధలేదా? మేము అంటేనే బాధా? ఇది లాలూచీ కాకపోతే ఏంటి? మీరు ప్రజల్ని మోసం చేయలేరు. మోసపోయేది మీరే?' అని మోదీని ఉద్దేశించి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'మీకు అధికారమిస్తే ఏం చేశారు? దేశాన్ని భ్రష్టు పట్టించారు. దేశాన్ని, నాయకుల్ని భయభ్రాంతులకు గురిచేశారు. వ్యవస్థల్ని సర్వనాశనం చేశారు. మూడో కూటమి ఏర్పడిందని, దానిలో తృణమూల్, బీజేడీ చేరాయని చెప్పడానికి మీరెవరు? మీ నీచ రాజకీయాలకు ఇదే ఉదాహరణ' అని జైట్లీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'యూపీయే ప్రభుత్వం సరిగ్గా పని చేయలేదు సరే.. మరి మీరేం చేశారు. అప్పటికీ ఇప్పటికీ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందిందా? ఆదాయం పెరిగిందా? పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల ఏం ఒనగూరింది? బ్యాంకుల్ని నిండా ముంచి, తప్పు చేసినవాళ్లు తప్పించుకు పోతుంటే ఏం చేశారు? రఫేల్ కుంభకోణానికి బాధ్యులెవరు?' అని నిలదీశారు.

వాళ్లకు సామంత రాజులు కావాలి..

'ఈ రోజు తెలంగాణ ప్రభుత్వం ఏపీలోని దినపత్రికల మొదటి పేజీల్లో అంత పెద్ద పత్రికా ప్రకటనలు ఇవ్వడానికి సందర్భం ఏముంది? మనం ఇస్తున్న శ్వేతపత్రాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, మభ్యపెట్టేందుకే ఇవన్నీ చేస్తున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో విద్యుత్తు రంగానికి సంబంధించి మనకు ఇవ్వాల్సిన రూ.5వేల కోట్లు ఇవ్వడం లేదు గానీ, ప్రకటనలు మాత్రం ఇచ్చుకుంటున్నారు' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కావాలని రెచ్చగొట్టేందుకు, అవమానించేందుకే అలా చేస్తున్నారని విమర్శించారు.

స్నానానికి 90 రోజులు నిరీక్షించనక్కర్లేదు

- ఇక సియాచిన్‌లో సైనికులు 'స్నానం' చెయ్యొచ్చు
- అందుబాటులోకి ప్రత్యేక ఉత్పత్తులు

కోల్‌కతా: సియాచిన్ వంటి అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే సైనికులు ఇక స్నానం చేసేందుకు 90 రోజులపాటు వేచి ఉండాల్సిన అవసరం ఉండబోదు. కనీసం వారానికి రెండుసార్లు 'స్నానం' చేసేలా వారికి వీలు కల్పించే సరికొత్త ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చాయి. దిల్లీలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' దేశీయంగా వాటిని అభివృద్ధి చేసింది. సియాచిన్ హిమనీనదం మనదేశానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకం. దాన్ని రక్షించుకునేందుకు ప్రభుత్వం రోజుకు రూ.ఐదు కోట్ల నుంచి రూ.ఏడు కోట్ల మధ్య ఖర్చుచేస్తోంది. నిరంతరం మూడు వేలమంది సైనికులు ఇక్కడ విధుల్లో ఉంటారు. సియాచిన్‌లో ఉష్ణోగ్రత ఒక్కోసారి మైనస్ 60 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోతుంటుంది. ఈ హిమనీనదంపైగల 80 శాతం స్థావరాలు సముద్రమట్టానికి 16 వేల అడుగుల కంటే ఎత్తులో ఉన్నవే. 'బనా' స్థావరం 21,753 అడుగుల ఎత్తులో ఉంది. కొన్ని స్థావరాలను చేరుకునేందుకు సైనికులు ఏకంగా 28 రోజులపాటు 128 కిలోమీటర్ల మేర నడవాల్సి ఉంటుంది. ఇంతటి శీతల ప్రాంతాల్లో నీటి లభ్యత గగనం. మంచును కరిగించి నీటిని సేకరించాల్సి వస్తుంది. అందుకు చాలా ఇంధనం అవసరం. కాబట్టి సియాచిన్‌లో విధులు నిర్వర్తించే 90 రోజులపాటు సైనికులు స్నానం చేయరు. 'ఆర్మీ డిజైన్ బ్యూరో(ఏడీబీ)' నేతృత్వంలో 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' ఈ సమస్యకు తాజాగా పరిష్కారమార్గాన్ని కనుగొంది. జలరహిత పరిశుభ్రత ఉత్పత్తులను అభివృద్ధి చేసింది. కనీసం రెండు వారాలకు ఒకసారి సైనికులు వాటితో 'స్నానం' చెయ్యొచ్చు. పూర్తి శరీరాన్ని శుభ్రం చేసుకునేందుకు 20 మిల్లీలీటర్ల జెల్ సరిపోతుంది. చైనాతో సరిహద్దుల రక్షణ వ్యవహారాలు చూసుకునే తూర్పు కమాండ్ ఇప్పటికే ఈ ఉత్పత్తులను పరీక్షించింది. సైనికుల వ్యక్తిగత పరిశుభ్రతకు అవి ప్రయోజనకరమని తేలడంతో భారీగా ఆ ఉత్పత్తుల కొనుగోలుకు సిద్ధమైంది. సియాచిన్‌తోపాటు ఇతర ఎత్తైన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి వాటిని అందజేయనున్నారు.

ప్రవాహాలకు పగ్గం వేద్దాం

రాష్ట్రంలోని వాగులు, వంకలపై చెక్‌డ్యాంల నిర్మాణం

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని వాగులు, వంకల్లో లభ్యమయ్యే ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. చిన్న ప్రవాహాలను కూడా కట్టడి చేసి నీటిని నిల్వ ఉంచేందుకున్న మార్గాలపై అన్వేషణ సాగిస్తోంది. దీనికోసం ఆయకట్టు ప్రాంత అభివృద్ధి సంస్థ(కాడా) నేతృత్వంలో కసరత్తు జరుగుతోంది. కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని చిన్నచిన్న ప్రవాహాలపై ఇప్పటికే పదివేలకు పైగా చెక్‌డ్యాంలు ఉన్నాయి. వాటి ఎగువన లేదా దిగువన మరి కొన్ని నిర్మించేందుకు ప్రస్తుతం కాడా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దానికి ఇస్రో సహకారం తీసుకుంటున్నారు. కొత్తగా నిర్మించే చెక్‌డ్యాంలతో ప్రస్తుతం ఉన్న నీటివనరుల ఉనికికి ముప్పు వాటిల్లే అవకాశాలు ఏమైనా ఉన్నాయా? అనేది ఉపగ్రహ చిత్రాల ఆధారంగా అంచనా వేస్తున్నారు. అలాగే వాగులు, వంకల నీటి ప్రవాహ సామర్థ్యం ఎంత? అనే గణాంకాలు కూడా సేకరించి కొత్త చెక్‌డ్యాంలను ప్రతిపాదించనున్నారు. 'నీటి వనరుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో చెక్‌డ్యాంల నిర్మాణాలకు సంబంధించిన ప్రాథమిక కసరత్తును నీటిపారుదల శాఖ కొలిక్కితెస్తోంది. ఇందులో భాగంగా భూసేకరణ అవసరం లేకుండా నిర్మాణాలు పూర్తిచేసేందుకు అనువైన ప్రాంతాలను గుర్తిస్తున్నాం. కొత్త చెక్‌డ్యాంల నిర్మాణాలపై త్వరలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది' అని అధికారులు పేర్కొంటున్నారు.

కేంద్రీయ విద్యాలయాలకు పోటాపోటీ

- కొత్త వాటి కోసం కేంద్రానికి ప్రతిపాదనలు
- తక్కువ రుసుంతో నాణ్యమైన విద్య అందిస్తుండటమే కారణం
- కేవీలను ప్రారంభించేందుకు పోటీ పడుతున్న రాష్ట్రాలు



మిర్యాలగూడలో నిర్మాణంలో ఉన్న కేవీ భవనం

ఈనాడు, హైదరాబాద్: కేంద్రీయ విద్యాలయాలు(కేవీ)ను అధిక సంఖ్యలో దక్కించుకునేందుకు పలు రాష్ట్రాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి భారీగా ప్రతిపాదనలు సమర్పిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి సైతం నిత్యం ప్రతిపాదనలు వెళుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 1199 కేంద్రీయ విద్యాలయాలు పనిచేస్తున్నాయి. వాటిల్లో తెలంగాణలో 38, ఏపీలో 33 కేవీలున్నాయి. కేవీల్లో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌తో విద్య నందిస్తారు. నెలకు రూ.600 వరకు మాత్రమే రుసుం వసూలు చేస్తారు. అవసరమైన స్థలం కనీసం 2.5 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు కేటాయిస్తే చాలు.. ఇక మౌలిక వసతులు, సిబ్బంది వేతనాలు, నిర్వహణ వ్యయానికి అవసరమైన నిధులను కేంద్ర మానవ వనరుల శాఖే భరిస్తుంది. రాష్ట్రాలపై ఆర్థిక భారం ఉండదు. వాటికి కలెక్టర్లే ఛైర్మన్లుగా ఉంటారు. ఒక్కోదాంట్లో కనీసం 540 మందికి అవకాశం కల్పిస్తారు. డిమాండ్‌ను బట్టి సీట్ల సంఖ్యను పెంచుకోవచ్చు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో కొత్తగా ఎనిమిది కేవీలు మంజూరయ్యాయి. 2014లో మిర్యాలగూడ, 2015లో సిరిసిల్ల, బోధన్, ఝరాసంగం (సంగారెడ్డి జిల్లా), 2016లో మంచిర్యాల, 2017లో భువనగిరి, 2018లో నిజామాబాద్, సిద్దిపేటలో మంజూరయ్యాయి. ఇతర భవనాల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. వీటిలో ఎక్కడా సొంత భవనాలు ప్రారంభం కాలేదు. కొన్ని చోట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మంచిర్యాలలో ఇంకా స్థలం ఖరారు కాలేదు. ఏపీలో 2014లో తెనాలి, 2016లో రాజంపేట, కాకినాడ, 2017లో సత్తెనపల్లి, యర్రగొండపాలెంలో మంజూరయ్యాయి.

కేంద్రానికి ప్రతిపాదనలు అందినవి ఇవీ

తెలంగాణ నుంచి(3): సూర్యాపేట, ఆసిఫాబాద్, వికారాబాద్

ఏపీ నుంచి (14): ఒంగోలు, నాయుడుపేట, శ్రీకాళహస్తి, అనకాపల్లి, వెస్ట్ గూడూరు, కందుకూరు టౌన్, కావలి, కృష్ణాయపాలెం, నవులూరు, కలిచేడు, గుడిపాల, జంగాలపల్లి, ఇర్లపాడు, వెంకాయలపాడు గ్రామం.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉండాలనేం లేదు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని కేవీల విధానం వచ్చినా వారున్న చోటే ప్రారంభించాలనేం లేదు. కాకపోతే వారి పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేవీకి అనుమతి ఇస్తే వెంటనే తాత్కాలికంగా ఏదైనా భవనంలో తరగతులు ప్రారంభించుకోవచ్చు. కేవీలో చదివే విద్యార్థులు జాతీయస్థాయి కార్యక్రమాలు, పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఎక్కువ. వీటిలో శాశ్వత బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తే విద్యాబోధనలో నాణ్యత పెరుగుతుంది.

-కేవీ రంగాచార్యులు, కేవీ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి

'దీప'మే వెలుగును మింగేసింది

కన్నకొడుకును కడతేర్చిన తల్లి



మృతి చెందిన బాలుడు అంజన్న

జైపూర్, న్యూస్‌టుడే: పేగు తెంచుకొని పుట్టిన బిడ్డను తల్లి తన చేతులతోనే కడతేర్చిన ఉదంతం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కొమ్ముగూడెంలో మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పశువులను కాస్తూ జీవిస్తున్న దుర్గం శంకరయ్య-దుర్గ(దీప)లకు మూడేళ్ల కుమారుడు అంజన్న ఉన్నాడు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గతంలో కూడా భర్త మీద కోపంతో కుమారుడిని కడతేర్చాలని పలుమార్లు దీప ప్రయత్నంచేయగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దీప తన కుమారుడిని గొంతు నులిమి చంపిందని స్థానికులు తెలిపారు. సాయంత్రం ఇంటికి వచ్చిన శంకరయ్యకు కుమారుడు కనిపించకపోవడంతో దీపను నిలదీయగా అసలు విషయం బహిర్గతమైంది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00